శ్రీ గురుచరణం శరణమ్

# చాటుపద్య మణిమంజరి

## దేవతాస్తుతి స్తబకము

### పిళ్ళారప్ప

క. శ్రీకరదంతరుచిజిత సు
ధాకర మృడపార్వతీముదాకర గుణర
త్నాకర వరధీకర పర
భీకర భాగ్యముల కుప్ప పిళ్ళారప్పా!

క. ఉండ్రాళ్ళు పప్పునెయ్యిని,
బండ్రించిన చెఱకుఁబాలుఁ బడితపుటట్లున్
జుండ్రేచుపచ్చి తేనియ,
తండ్రీ వెనకయ్య! నీకుఁదదయక తెత్తున్.

క. ఓరీ బాలుఁడ నీ విటు
రారా యని నన్నుఁ బిలిచి రంజిలుదయచేఁ
గోరిక లొసగుము భువి నీ
పేరును బ్రకటించి చెప్పఁ బిళ్ళారప్పా.

క. గజముఖుని నేకదంతుని
భజియింతును వాణి గౌరిఁ బంకజనిలయన్
నిజభ క్తి బుద్ధి విద్యా
త్రిజగత్ ఖ్యాత్యాయురుదయ తేజమ్ములకై.

చం. తొలినె యవిఘ్నమ స్తనుచు ధూర్జటినందన నీకు మ్రొక్కెదన్
ఫలితముఁ జేయుమయ్య తలఁపంబడు కార్యకలాప మెల్ల నా
వలపలిచేతిగంటమున వాక్కున నెప్పుడుఁ బాయకుండుమా
తెలివి ఘటింపుమా సతము దేవ వినాయక లోకనాయకా!

క. భక్షింపుము గావలసిన
భక్షణములు నీకు నిత్తు భక్షించియు నీ
కుక్షిఁగల విద్య మాకున్
భిక్షం బిడి కావుమప్ప పిళ్ళారప్పా!

క. మల్లెలు మొల్లలు జాజులు
గొల్లలుగాఁ గోసి తెచ్చి కొనియాడి నినుం
జల్లఁగఁ బూజింతుము కృప
వెల్లువగాఁ జూడుమప్ప పిళ్ళారప్పా!

ఉ. మోదకహస్తునిన్ ధవళమూషకవాహను నేకదంతు లం
బోదరు నంబికాతనయు నూర్జితపుణ్యు గణేశు దేవతా
హ్లాదగరిష్ఠు దంతిముఖు నంచితభక్తవర ప్రదాయకున్
మోదముతోడ హస్తములు మోడ్చి భజించెద నిష్టసిద్ధికిన్!

## కదిరి వసంతా!

క. తిన్నని కస్తురినామము
సన్నపుఁదలపాగచుంగు చక్కఁదనంబున్
జెన్నలర మిమ్ముఁ గంటిమి
కన్నుల తెలి వెంత వింత కదిరి వసంతా!



## మంగళాద్రీశ్వరుడు

గీ. ఉక్కుఁగంబంబు వెడలిన చక్కనయ్య
మున్ను ప్రహ్లాదుఁగాచిన వన్నెలాఁడు
నన్ను నేలిన శృంగారనాయకుండు
హృదయమున నిల్చు మంగళాద్రీశ్వరుండు.

## కృష్ణస్తుతి

గీ. చేత వెన్నముద్ద చెంగల్వపూదండ
బంగరుమొలత్రాడు పట్టుదట్టి
సందెతాయెతులును సరిమువ్వగజ్జెలు
చిన్నికృష్ణ! నిన్నుఁజేరి కొలుతు.

క. మడువుకుఁ జని కాళిందుని
పడగలపై భరతశాస్త్రపద్ధతి వెలయన్
గడువేడుకతో నాడెడు
నడుగులు నామదిఁదలంతు నచ్యుత కృష్ణా!

క. నారాయణ నీ నామము
నారాయణ వ్రాయవయ్య నా నాలుకపై
నారాయణ నిను నమ్మితి
నారాయణ కావవయ్య నారదవరదా!

## శ్రీనారాయణ స్తుతి

మ. ధర సింహాసనమై నభంబు గొడుగై తద్దేవతల్ భృత్యులై
పరమామ్నాయము లెల్ల వందిగణమై బ్రహ్మాండ మాగారమై
సిరి భార్యామణియై విరించి కొడుకై శ్రీగంగ సత్పుత్రియై
వరుస న్నీ ఘనరాజసంబు నిజమై వర్ధిల్లు నారాయణా!

క. నిరుపమ బాలానందా
వరవనితాచిత్తచోర వరవసునందా!
గిరిధర శరణు ముకుందా
కరుణాకర నీవు నాకు గతి గోవిందా!

## ఇతర దేవతలు

చం. కమలజకృష్ణ శంకరులు కాంచననీలపటీరవర్ణు లా
గమనగచంద్రధారు లఘుకంసపురారులు హంసతార్క్ష్యగో
గమనులు జన్మ పుష్టిలయకారులు వాక్కమలాంబికేశ్వరుల్
శమకరుణావిభూతిగుణశక్తులఁ బ్రోతురు మిమ్ము నెప్పుడున్.

చం. మొదలిటి గద్దెయక్షరము మువ్వురువేల్పులలావు మేనిలో
మొదలివెలుంగు నెత్తి తుదిమోవఁగఁ జేయుట కేర్చుజంత్ర మ
ఘ్యుదిత తనూసరోజములనూనినగాడ్పుల యూటపట్టు స
మ్మదమలరారఁగాఁ బ్రణవమంత్రము మాకుఁ బ్రసన్నమయ్యెడున్.

చం. సలిలవిహారు లిద్దఱును సంతతకాననచారు లిద్దఱున్
వెలయఁగ విప్రు లిద్దఱును వీరపరాక్రమశాలు లిద్దఱున్
బొలఁతుల డాయువాఁ డొకడుఁ భూమిని బుట్టెడువాఁడు నొక్కఁడున్
జెలువుగ మీ కభీష్టఫలసిద్ధి ఘటింతు రనంతకాలమున్.

చం. అమరులు మేఘముల్ కుసుమ మాస్యము హేమము భాస్కరుండు మా
సము నురగంబు శంకరుని చాపము పంకము పాండవాగ్రజుం
డమృతకరుం డనం దగినత్ర్యక్షరసంజ్ఞల మధ్యవర్ణముల్
క్రమమున నాహ్వయంబొనరఁ గల్గిన వేలుపు మిమ్ముఁ బ్రోవుతన్.

చం. చరణము లైదు మూఁడువిలసన్మణి నేత్రయుగంబు పుచ్ఛమున్
బరువడి రెండువేలు నొక పంచకమున్ మఱి రెండునొప్పుచున్



గరములు రెండురెండ్లు ఘనకాయచతుష్కము గల్గినట్టియా
సురుచిరమైనవేల్పు మిము సుస్థితిఁ బ్రోవుత మెల్లకాలమున్.

సీ. ఆజాను దీర్ఘబాహా చతుష్కమునందు
శంఖచక్ర గదాసిశార్ఙ్గ సమితి
ధరియించి నీలాంబుదముచెంత విలసిల్లు
సౌదామినీ లతాసన్నిభముగ
వామాంకమున రమావనితశోభిల్ల ర
త్నాంచల జాంబూనదాంబరంబు
దీధితుల్ దెసలందుఁ దేజరిల్లఁగ నక్ర
కుండలదీప్తులు గండయుగళిఁ

గీ. దాండవము సల్ప నవమణిస్థగితమకుట
చారుకేయూరహారమంజీర కౌస్తు
భోజ్జ్వలప్రభ లెసఁగ సర్వోత్తముండు
విష్ణుదేవుండు నా మది వెలయుఁగాక.

సీ. పక్షవిక్షేపణ ప్రభవ ఝుంఝూమారు
తాలోల సకలకులాచలుండు
చారుజాంబూనద శైలాగ్రపూర్ణిమా
హరిణలాంఛన సన్నిభాననుండు
తారకాపథ నటత్సమయ రయభ్రామ్య
మాణ దివ్యవిమానమండలుండు
అమృతాపహృతి నిమిత్తాహవరంగని
ర్గత బాహుశౌర్యదిక్పాలకుండు

గీ. అంబుజోదరవహన మహోక్షముండు
వ(జ్రమయకాయుఁ డా(శితవత్సలుండు
భుజగభూషణుఁ డఖిలైకపూజితుండు
వైనతేయుం దొసంగు మద్వాంఛితములు.

సీ. మనము గారామునఁ బెనిచినయట్టి చ
కోరికాశిశువు లాకొనకయుండ
మన గొజ్జఁగలతోఁట మహి నిందుకాంతంపుఁ
బాదులలో నీళ్ళు పాయకుండ
మన కేళికావనమధ్యదీర్ఘికలోని
తొగ లొకయప్పుడు మొగుడకుండ
మన సరోజినిలోన మరగిన జక్కవ
దోయి నీ చనుదోయిఁదొరయకుండ

గీ. నుండుఁగాని సదాశివుండొడ్డినాఁడు
మొలకచందురు గెలువుమీ పలకననుచు
నగజచెలు లాడుమాటల కలరుశివుఁడు
మనలఁ గరుణావిధేయుఁడై మనుచుఁగాత.

సీ. కాశ్యపగో(త్రుఁడై ఘనత కెక్కినవాఁడు
ధర లక్షయోజనాంతరమువాఁడు
(గహరాజు వర్తులాకారమండలుఁడును
హేమదృష్టి కళింగభూమివిభుఁడు
మాణిక్యకుండల మకుటహారములతో
మేరుప్రదక్షిణ మెలఁగువాఁడు
సప్తాశ్వరథశంఖచ(క్రముల్ గలవాఁడు
రక్తవర్ణుఁడు సింహరాశివాఁడు



గీ. నంబుజాప్తుండు మఱియు ఛాయావిభుండు
శమనకర్ణులఁ గన్నట్టి జనకుఁడనఁగ
రాజగురుఁడైన సూర్యనారాయణుండు
మనలఁ గరుణావిధేయుఁడై మనుచుఁగాత.

సీ. పెనుఁబాపపేరు వేసిన గట్టివా, కుంభి
దైత్యావరోధ వైధవ్యదాయి
కడవన్నె బంగారు గట్టువిల్తుఁడు భక్త
రక్షణ (క్రీడాపరాయణుండు
చిగురుఁగై దువుజోదుపగతుండు పార్వతీ
వదనచకోర పార్వణవిధుండు
చేఁదు పానంబుచేసిన మొక్కలీఁడు ద
క్షాధ్వరధ్వంస దీక్షాధికారి

గీ. కలిమి గల బేరికూరిమి చెలిమికాఁడు
అంబునిధి వేష్టితోర్వీ మహారథుండు
బుదుత వెన్నెల పూమొగ్గముదుచు వేల్పు
చిర కృపాదృష్టి మనల రక్షించుఁగాత!

సీ. మొగము నెలనవ్వు మొలకరేయెండలు
గాయువాఁ డావులఁ గాయువాఁడు
పశుపాలికల మోవి బంగాళి చక్కెర
(గోలువాఁడొక పిల్లఁ (గోలువాఁడు
తిరుమేన బంగారు జరబాటు దుప్పటి
గలుగువాఁడు తనంత గలుగువాఁడు
అఖిలపావనమైన యడుగుఁ దామరతేనె
జాలువాఁ డెలమి యీఁజాలువాఁడు

గీ. శ్రవణములు వ్రేలు కర్ణికారములవాఁడు
తీర్చినట్టున్న ముక్కుము త్రియమువాఁడు
కళుకు లీనెడునెద మానికంబువాఁడు
మనలఁ గరుణావిధేయుఁడై మనుచుఁగాత!

సీ. మూడుకన్నుల వేల్పు ముంజేతికడియంబు
పఱుపు పచ్చడమునై యొఱపుమిగుల
అక్కున విలసిల్లు చక్కనిపూఁబోణి
యాలును మనుమరాలై తనర్ప
బొడ్డుదామరఁ బుట్టి పొలుపారుబిడ్డఁడం
తటికిఁ దీర్పరియుఁ దాతయునుగాఁక
పులుఁగులగమికాడు పలుదెఱంగుల దాట
గుఱ్ఱంబు బంటునై కొమరు మిగుల

గీ. ప్రాఁతచదువులు వలకాలిపసిఁడియందె
యనుఁగుఁ గూర్చుండు పలకయునగుచు మీఱ
(నందముల కెల్లయైననిన్ డెందమందుఁ)
దెల్లమిగఁ జేర్తుమోయన్న నల్లనన్న.

సీ. కందర్ప కోటిసంకాశుండు నీ పతి
భువనమోహన కళాపూర్ణ వీవు
పేదసాదులపాలి పెన్నిధి నీ స్వామి
భూమివారల కన్నపూర్ణ వీవు
సర్వలోకములకు జనకుండు నీ నాథుఁ
డెల్ల జీవులకునుఁ దల్లి వీవు
ప్రాణుల కెల్లను బ్రాణంబు నీ భర్త
మగనికిఁ బ్రాణమౌ మగువ వీవు



గీ. ధరన్నలోక గృహస్థులు దొరలు మీరు
మిమ్ము గొలిచినవారికి మేలు గలుగు
అంగయక్కణి చొక్కనాయకునిరాణి
మధురమీనాక్షి వినుతపద్మాయతాక్షి.

సీ. పూయ గంధము లేదు భూతిపూతే కాని
యెక్క గుఱ్ఱము లేదు యెద్దె కాని
త్రాగఁ గంచము లేదు తలపుఱ్ఱెయే కాని
మణులసొమ్ములు లేవు ఫణులె కాని
కొండమీఁద నెకాని యుండఁ జోటే లేదు
తలను బూవులు లేవు జడలె గాని
గజచర్మమే కాని కట్టవస్త్రము లేదు
జోగిరూపే కాని సొగసు లేదు

గీ. ఇట్టి నిరుపేదవౌట ని న్నెఱిఁగి యెఱిఁగి
భ్రాంతిపడి యెట్లు పెండ్లాడెఁ బార్వతమ్మ
యైన నీ భాగ్య మేమని యనఁగవచ్చు
భక్తజనసంగమగతేల ముక్తిలింగ.

సీ. బుడుతకల్వలవిందుఁ బోలు నెన్నొసలిపై
చెలువంపురావ్రేక చిందులాడ
మొలఁ బట్టుదట్టిపై నలువందు గంటల
బంగారు మొలత్రాడు రంగు లీన
ఎదఁ గ్రొత్త పులిగోళ్లు పొదివిన పతకంబు
చేతుల రతనంపుఁ జిల్లుటుంగరములు
మురువులు నెనలేని ముఱువుచూప

గీ. మెట్టిదంబున నందియల్ బిట్టుమొరయ
దిట్టతనమునఁ జెలరేఁగి పట్టపగలె
నెట్టుకొని యెల్ల ప్రేఁతల నట్టులందు
గుట్టు లరయుచు మెలఁగునప్పట్టి మెఱయు.

సీ. విశ్వంబు నీవయై విశ్వంబు చూచుచు
విశ్వంబు చేయుచు విశ్వమునకు
నినుఁడవై పంచభూతేంద్రి యాహంకార
ములకు మనఃప్రాణబుద్ధి చిత్త
ములకెల్ల నాత్మమై మొనసి గుణంబుల
కావృతమగు నిజాంశాంశ భూత
మగు నాత్మచయమున కనుభూతి సేయుచు
మూఁడహంకృతులచే మునుఁగువడక

గీ. నెఱి ననంతుఁడవై దర్శనీయరుచివి
గాక సూక్ష్ముండవై నిర్వికారమహిమఁ
దనరి కూటస్థుఁడన సమస్తంబు నెఱుఁగు
నీకు మ్రొక్కెద నాలింపు నిర్మలాత్మ.

సీ. మిన్నేటి పెన్నీటి మిక్కుటం బగునిట్ట
పాఁప నెట్టెపుఁజుట్ట పై ఁదెరల్ప
పొలుచుకెందామర పుప్పొడి తెట్టువ
జడలసం దొయ్యన సడలి తొరుగ
నలికంబుపైఁ గపాలావలి తూఁటుల
నొండొండ తెలినీరు నిండఁబడఁగ
తల లెత్తి నిక్కిన వెలిదమ్మి మొగడలఁ
లోనఁ దేఁటులు తేనె లాని యులియ



గీ. మస్తకము వంచి సౌభాగ్యమహిమ మించి
గౌరిపదపల్లవంబులు గారవించి
తియ్యఁబలుకుల నలుకలు దీర్చు శివుఁడు
మనలఁ గరుణావిధేయుఁడై మనుచుఁగాత.

సీ. శ్రీ పద్మవాసినీ పృథుతర కుచశాత
కుంభకుంభ విలిప్తఘుమఘుమాయ
మానచందన మృగమద సంకుమదకుంకు
మాగరుపంక సమన్వితోరు
బాహాంతరాళ విభ్రాజమానామూల్య
కౌస్తుభమణి ఘృణికలిత లలిత
మౌక్తికహార శుంభదుదర భరితలో
కనికరుండవు నీవు కనికరంబు

గీ. మీఱ భక్తజనాళి కమేయ దివ్య
భాస్వదనపాయ సకలసంపద లొసంగి
సాకికొనుమయ్య నిరతంబు సరసముగను
మదనగోపాల! గోపికాహృదయలోల!

క. శారదనీరదవర్ణా
సారసభవ చక్రపాణి శంకరవినుతా
కీరమనోహరహస్తా
భారతి! నీ పాదపద్మభజన మొనర్తున్.

సీ. పాలించవే నన్నుఁ బద్మసంభవురాణి
బహుశాస్త్ర పుస్తకపాణి వాణి!
కరుణించవే నన్నుఁ గలహంసగామినీ
కోరి మ్రొక్కెద నీకుఁ గీరవాణి

రక్షించవే నన్ను రాజబింబాననా!
దయఁ గావవే సర్వధవళవర్ణ!
మన్నించి నీవు నా మదిలోన నుండవే
మాధవుకోడలా మదనువదినె

గీ. నిన్ను నెప్పుడు సేవింతు నీలవేణి
నన్నుఁ గృపజూడు మెప్పుడు నళిననేత్రి
భారతీదేవి నా జిహ్వఁబాయకుండు
శరణు లోకైకవినుతాంబ శారదాంబ.

శా. వీణాపుస్తకపాణివై హరిశిలావేదీభవద్వేణివై
మాణిక్యోన్నత పుంజరంజితలసన్మంజు ప్రభాశ్రోణివై
స్థాణు బ్రహ్మహరీంద్ర ముఖ్యహృదయాంతర్వాణివై వాణి క
ళ్యాణీ నా రసనాగ్రమందు నిలుమీ వ్యాఖ్యానకాలంబునన్.

సీ. కదిసి యెక్కెడుగిబ్బ బెదరించు పొడలపెన్
దుప్పటంబును మీఁదఁ గప్పుకొన్న
ఉడివోని కడివోని కడవోని వింతల
ముదువని వెలిపువ్వు ముడుచుకొన్న
నూఱు నిన్నూఱు మున్నూఱు నన్నూఱు నౌ
రెట్ట నాగులపేరు పెట్టుకొన్న
ఎడవంక (సుగతితోఁ) గడుబింకముగ జింక
పఱచుదాఁటుల పిల్లఁ బట్టుకొన్న

గీ. వానిఁ దను ముట్టఁగొలిచినవానివాని
మగువయును దాను నొక్కటై మన్నవాని
మహిత వృషరాజు నెక్కిన మహిమవాని
మృదునిఁ గలఁగంటి నంతలో మేలుకొంటి.



సీ. చుక్కలకడఁబోవు నొక్కు టెక్కెమువాని
యానంబు సుతుని మేనల్లునన్న
కొడుకు తమ్ముని మేనగోడలి పెదబావ
తండ్రితండ్రి తనూజధవుని మామ
మనమున నేడింట మలయు నాతని తల్లి
సవతి తమ్మునిరొమ్ము సఱచువాని
జనకుని యిల్లాలి తనయులతోఁ బెద్ద
మొదలు ప్రసిద్ధి పెంపొదవువాని

గీ. తలమొగంబున వయ్యాళితరమువాని
స్థిరముగల దేవుఁడెపుడు సుస్థిరముగాను
సిరియు నాయువు సౌభాగ్యసిద్ధి జయము
పఱగఁజేయుత మీ సభాపతికి నెపుడు.

సీ. భానుండు తగ మీకు భవ్యతేజంబిచ్చు
కరుణఁ జంద్రుఁడు మీకుఁ గాంతి యిచ్చు
అంగారకుఁడు మీకు మంగళంబులనిచ్చు
బుధుఁడు నెమ్మది మీకు బుద్ధినిచ్చు
నెఱి బృహస్పతి మీకు నిర్మలమతి యిచ్చు
నరయ శుక్రుఁడు మీకు హర్షమిచ్చు
రాహు వెప్పుడు మీకు బాహాబలంబిచ్చు
కేతువు మీకు విఖ్యాతినిచ్చు

గీ. ఘనత కెక్కిన యీ నవగ్రహము లెపుడు
బలిమి నేకాదశస్థానఫలము లొసగఁ
బుత్ర పౌత్రాభివృద్ధిచే భూతలమున
మీరు వర్ధిల్లుఁ డాచంద్రతారకముగ.

సీ. ధరణిపుత్రుని పినతల్లి తమ్మునిసుతు
తాత యల్లుని రాణి తండ్రికొడుకు
కొడుకుతండ్రికి తండ్రి కోడలిసుతు బంటు
కరియైన వానబ్బ కగ్రసుతుని
తమ్ముని యేలిక తండ్రి వియ్యంకుని
కూతునేర్పునఁ జెరగొన్నవాని
తనయునిఁద్రుంచిన ఘనునౌషధము దెచ్చు
వానయ్య సుతుని తద్వరకుమారు

గీ. నవ్వ కోడలి కోడలి యన్న తండ్రి
భామయొద్దను కొలువున్న భామ జనకు
తనయుచేతను గూలిన ఘనుని తల్లి
ధరుఁడు మీ కిచ్చుఁబుత్ర పౌత్రాభివృద్ధి

మ. నునుమైఁగల్మిపడంతి డాకరమునందున్ బూరుగొ మ్మొండుచే
తను వేయంచులవాలు మేలొసఁగనౌడాలున్ బవల్రే యొన
ర్పను జూపున్ నెఱిచూపు లాసగొనుచూపట్టే జగాజట్టి బొ
ట్టనవ్రేలన్ వెలిబుగ్గగన్న యొడయుండా! నన్నుఁబాలింపుమా!

సీ. శృంగారరాయని చెలువుమీఱిన కొండ
ఫణిరాజు పేరిటి పసిఁడికొండ
పుష్పజాతులనెల్ల భూషింపఁగల కొండ
కల్పవృక్షము లైదుఁ గల్గు కొండ
చిలుకలు కోవెలల్ చెలఁగి కూసెడి కొండ
మృగరాజుకో ట్లెల్ల మెలఁగు కొండ



ఘోరపాపము వాపు కోనేఱు గల కొండ
తలఁచిన మోక్షంబు దగులు కొండ

గీ. అమరవరులకు వైకుంఠ మైనకొండ
ఆళువారికిఁ బ్రత్యక్ష మైన కొండ
ఆర్థి జూచిన బ్రహ్మాండ మైన కొండ
యేను గనుఁగొంటి శ్రీ వేంకటేశు కొండ.

## కృష్ణ నవరత్నములు

సీ. నరక బాణాసుర మురజరాసంధాది
పాపులచేఁ జాల బాధలఁ బడి
భూదేవి విన్నపంబులు సేయ క్షీరాబ్ధి
శాయి దయాళుఁడై జగతిమీఁద
యాదవవంశంబునందుఁ దా వసుదేవు
సూనుఁడై జన్మించి సురలు మెచ్చ
ధరణి భారముఁ బాపి దనుజులఁ బరిమార్చి
ధర్మంబు నిలిపి యధర్మ మడఁచె

ఆ. నట్టి దేవదేవు నాదినారాయణుఁ
బుండరీకనయను భుజగశయనుఁ
గమలనాభుఁ గొలిచి కల్మషంబుల నెల్లఁ
దోలువాఁడ ముక్తి నేలువాఁడ

సీ. పురుడు వెళ్ళనినాఁడె పూతనఁ బరిమార్చె
శకటాసురునిఁ గొట్టెఁ జరణహతిని
బడఁ ద్రొబ్బె మద్దులు బకునిఁ గీటడఁగించె
దావాగ్ని ద్రావి వత్సకునిఁ గూల్చె

గోవర్ధనం బెత్తి గోవుల రక్షించెఁ
గాళీయనాగంబు గర్వమడఁచె
ధేనుకాసురుఁ బట్టి తిత్తొల్చె మహిపుత్త్రుఁ
దునిమి రక్కసునిఁ దుత్తుమురు సేసె

గీ. వెలయు వనమెల్లఁ బెఱికిపో వీచె లీల
వత్సవాతూలు నా తృణావర్తుఁ గెడపె
సురుచిరాంగుండు గోపాల సుందరుండు
దనుజదమనుండు గేవలదైవ మెట్లు?

సీ. గోపాలకులతోడ గోవులఁ గాచె నా
కాళింది తటమునఁ గమలభవుఁడు
వత్సముల్ గొనిపోవ వాని రూపము దాల్చి
వనజేశునకుఁదల వంగఁజేసె
బాల్యంబునాఁడు గోపాలకులును దాను
వెన్నలు పాలును వెజ్జి యాడె
చేడెలతో జలక్రీడ లాడఁగఁ జొచ్చి
యందఱ చీరలు నపహరించె

ఆ. రహిఁ బదాఱువేల రాజకన్యకలను
నన్ని రూపులగుచు ననుభవించె
రాసకేళిఁ గూడె రామల నెల్లను
గృష్ణుమహిమ లెన్నఁ గేవలంబె.

సీ. వెలయ నక్రూరుకు విశ్వరూపము సూపె
వలువకై చాఁకలివానిఁ జంపె



మఱి కుబ్జఁ జక్కనిమానిసిగాఁ జేసెఁ
బుష్పలావి కొసంగె భూరిమహిమ
కంసుని ధేనువుల్ ఖండించి వైచెను
గువలయాపీడంబు పొవ రడంచె
చాణూరమల్లుల సమయించె భుజగర్వ
రూఢిని గంసుని రూప మణఁచె

గీ. కంసుతండ్రిని బట్టంబు గట్టి కాచె
దేవకీదేవి దైన్యంబు త్రెంచి వైచెఁ
గేలిమై శిశుపాలునిఁ గీటడంచె
భక్తవత్సలు శ్రీకృష్ణుఁ బ్రస్తుతింతు.

సీ. అరయ నిర్వదియొక్క యక్షౌహిణులతోడ
నిర్వదియొక్కమా ఱేఁగుదెంచె
మధురపై విడిసినమత్తు జరాసంధు
దునిమించె భీముచే దురమునందుఁ
గాలయవనుఁ దుగ్రగతి నెత్తిరా వాని
ముచికుందుచే మృతిఁ బొందఁజేసె
ఆ శమంతకరత్న మరుదారఁగాఁ దెచ్చె
జాంబవంతుని గెల్చె జాంబవతిని

ఆ. వేడ్క బెండ్లియాడె వెడలించె నపనింద
జగతి కెల్ల మేలు సంఘటించె
తెగి సృగాలవాసుదేవునిఁ దెగటార్చెఁ
గృష్ణుఁ డితఁడు సర్వజిష్ణుఁడితఁడు.

సీ. బదరికావనములోఁ బరగు ఘంటాకర్ణుఁ
డిచ్చుఁ గొల్చినమోక్ష మిచ్చె నం(ద్రు
కైలాసగిరిమీఁదఁ గాలకంధరముఖ
విబుధ సంస్తుతులచే వెలయునం(ద్రు
గురువు తన్ వేఁడిన గురురక్షణార్థమై
చచ్చిన సుతునిఁ దెచ్చిచ్చెనం(ద్రు
దుర్యోధనాదులు (ద్రుపదనందన వల్వ
లొలువంగ నక్షయ మొసఁగెనం(ద్రు

ఆ. కామగమన మగుచుఁ గడునొప్పు సౌంభకా
ఖ్యానపురము జలధిఁ గలపెనం(ద్రు
చరిత పుణ్యధనుఁడు భరితగోవర్ధన
కందరుండు లోకసుందరుండు.

సీ. సమరంబులో జరాసంధాదులను (ద్రోలి
(పేమతో రుక్మిణిం బెండ్లియాడె
మురదానవునిఁ గూల్చి నరకునిఁ బరిమార్చి
దివ్యకుండలములు దెచ్చుకొనియె
విబుధకన్యలఁ బదార్వేలను విడిపించి
దయఁ జూచి మణిపర్వతంబు దెచ్చె
సురలోకమున కేఁగి సురపతి నోడించి
సురభూరుహము దెచ్చె సురలు మెచ్చఁ

ఆ. బౌం(డ్ర వాసుదేవు బంధుయుక్తంబుగాఁ
(దుంచి కాశిరాజు (తుళ్ళడంచె
వాసుదేవు మహిమ వర్ణింప శక్యమే
ఫాలనే(త్రుకయిన (బహ్మ కయిన.



సీ. పరగ బాణాసురుపై నేఁగి యాతని
శోణిత పురమెల్లఁ జూఱలాడె
ఆ పురిఁ గాల్చి (తేతాగ్నులు చల్లార్చి
పురపాశములు (దెంచి మురునిఁగూల్చె
బాణాసురుని వేయుబాహులుఁ దెగనేసి
చండిక వేడినఁ జంపకునికి
శివుఁడు దాఁ గోపించి శీతజ్వరము వైవ
వైష్ణవజ్వరమును వైచె నతఁడు

గీ. జృంభకాస్త్రంబుచే సోలఁజేసె శివునిఁ
(బేమతో ననిరుద్ధునిఁ బెండ్లిచేసెఁ
గరుణ బాణునిఁ బట్టంబు గట్టె నితఁడు
మూఁడుమూర్తుల కవ్వలిమూర్తి యితఁడు.

సీ. పాండు తనూజులపక్షమై నొగ లెక్కి
రెండు సేనలయందు నిండియున్న
బంధుజనంబుల బావల మఱఁదుల
నన్నదమ్ములఁ జూచి యనికిఁ దొడఁగి
అనుకంపఁ జేసిన యార్జుని బోధించి
పార్థుకు విశ్వరూపంబు సూపె
అచ్చటఁ బదునెన్మి దక్షౌహిణులతోడ
భీష్మాదియోధుల పీఁచ మడఁచె

ఆ. ధరను మఱియుఁ బుట్టి దనుజులఁ బరిమార్చె
భూమిభార మెల్లఁ బుచ్చివైచె
నాదిదేవుఁడయిన యా కృష్ణుఁ (బార్థించు
నట్టివారు ముక్తులయినవారు.

## అష్ట దిక్పాలకులు

## దిక్పాల స్తుతి

చ. హరిశిఖి ధర్మదైత్యవరుణానిలయక్షశివుల్ గజాజకా
సరనరనక్రకైణహయశాక్వరయానులు వజ్రశక్తిము
ద్గరశరపాశకుంతసృణికార్ముక హస్తులు భోగశుద్ధిసం
గరజయశౌర్య సర్వజనకావ్యవిభూతులు మాకు నీవుతన్.

### ఇంద్రుఁడు

సీ. ఐరావతో చ్చైశ్రవోధిరూఢుడుఁ నీల
దివ్యదేహుఁడు పూర్వ దిగ్విభుండు
శతమహాధ్వరకర్త శతకోటిహస్తుండు
బహుమహాపర్వతపక్షహర్త
సౌందర్య లక్షణానంది శచీప్రియుం
డనుపమనందన వనవిహారి
శతపత్రనిభదశశతదీర్ఘ నేత్రుండు
వారివాహ సమూహ వాహనుండు

గీ. యుక్తసన్మంత్రమఖఫలభోక్త నిత్య
మభినవ సుధారసైకపానాభిరతుఁడు
విక్రమక్రమ దేవతాచక్రవర్తి
శ్రీలు మీఱంగ మిమ్ము రక్షించుఁగాత.

### అగ్ని

సీ. మేషవాహనుఁడు సుస్మితుఁడు చతుశ్శృంగ
ధరుఁడు విస్ఫురిత పక్షద్వయుండు



సప్తసంఖ్యార్చిరంచద్బాహు జిహ్వుండు
మహనీయ పాదపద్మత్రయుండు
స్వాహాస్వధాసతీ సహితపార్శ్వద్వయుం
డరుణ సువర్ణ భాస్వరతనుండు
లోహితమహితవిలోచనుఁ డాజ్యపా
త్రస్రుక్స్రువాదికో ద్యతకరుండు

గీ. అఖిలపితృదేవతార్పితహవ్యకవ్య
ధరుఁడు సర్వతోముఖుఁడు నిత్యశుచి యనలుఁ
డిహపరానందముల నిచ్చి యెల్లవేళ
నంచితోన్నతి మిమ్ము రక్షించుఁగాత.

### యముడు

సీ. మహిషవాహనుఁడు సమ్యగ్ధర్మపాలుండు
దారుణతర దీర్ఘ దండపాణి
దివ్యకాళిందీనదీ సోదరుఁడు నీల
వర్ణుండు కమలినీ వరసుతుండు
గతజన్మ కర్మసంచితఫలదుఁడు యుధి
ష్ఠిరగురుఁ డమృతనిషేచణుండు
గంధవతీ మనఃకాసార సంచార
సంగతానంద చక్రాంగవిభుఁడు

గీ. విష్ణురుద్రాది భక్తి వర్ధిష్ణుహితుఁడు
దక్షిణేశుండు ధర్మవిచక్షణుండు
శమనుఁ డనురక్తచిత్తుఁడై యమర మమ్ము
నాయురారోగ్య యుక్తులఁ జేయుగాత!

## నిరృతి

సీ. నరవాహనుండు బంధురఖడ్గహస్తుండు
వరచర్మధరుఁడు కర్బురశరీరుఁ
డతులజగద్రక్షణాంచత్కృపానిధి
చటులోగ్రయామినీసంచరుండు
సన్మార్గరోధిదుష్టనిశాచర వ్రాత
వారకుండురుబలాధారకుండు
నురుతరకుటిల నీలోన్నత కేశుండు
నికషావధూమణీ నిత్యరతుఁడు

గీ. మహితబలవై భవోద్దండమండితుండు
కింకిణీరవ భూషణాలంకృతుండు
మృదులవచనుండు నైరృతి మీకు నొసఁగు
చిరతరారూఢ భోగ విశేషములను.

## వరుణుఁడు

సీ. మహనీయ సమదోగ్ర మకరవాహనుఁడు క
చ్ఛపమీననక్రాది జంతువిభుడుఁ
పద్మినీమానస పంజరకీరంబు
ఫణగణాంచిత నాగపాశధరుఁడు
భీకరాకార గుంభితకనత్కల్లోల
వారిసంభృత వార్ధివల్లభుండు
నూత్న తృణగ్రాహి రత్నవిభూషితుం
డఖిల జగద్వర్ష హర్షదాత



గీ. దుష్టనిగ్రహకారి యుత్కృష్టమహిముఁ
డభయహస్తుఁడు కరుణారసార్ద్రహృదయుఁ
డమృతజీవన మొనగూర్చి యన్వహంబు
వరుణదేవుండు మిమ్ముఁ గాపాడుఁగాత.

## వాయువు

సీ. సకలభూత వ్రాత సంజీవనఖ్యాత
ముఖ్య మహాప్రాణ మూర్తిధరుఁడు
కర్పూర కస్తూరికా చందనాగరు
ధూపాది పరిమళవ్యాపకుండు
ఆత్మానుకూల మహావేగ మృగవాహ
నారూఢుఁ డఖిల విశ్వాభియాయి
వైశ్వానర ప్రభుశాశ్వతసహవాసి
భీమాంజనేయుల ప్రియజనకుఁడు

గీ. పశ్చిమోత్తరమధ్య దిగ్భాగ నిరత
పాలనోద్యోగి దేవతాప్రముఖుఁడెపుడు
వాయుదేవుండు చిరముగా నాయు విచ్చి
మంచి యారోగ్యమున మమ్ము మంచుఁగాత

## కుబేరుఁడు

చం. ఉనికట వెండికొండఁ దనయుండట రంభకు యక్షరాజు నా
ధనపుఁ డనన్ బ్రసిద్ధుఁడట దానవిభుండట పుష్పకంబుపైఁ
జనునట పార్వతీపతికి సంగడికాఁడట యాత్మసంపదల్
పెనుపుగ నిచ్చి హెచ్చుగఁ గుబేరుఁడు మిమ్ము ననుగ్రహించుతన్.

## ఈశానుఁడు

సీ. హిమశైల శిఖరోన్నత వృషభవాహ
నాధిరోహణుఁడు విశ్వాధినేత
నిరతార్ధగాత్ర సన్నిహిత పర్వతరాజ
పుత్రీద్వితీయానుభూతిరతుఁడు
కైలాస పర్వతాగ్రనివాస పరితోషి
వరవీరగణవార పరివృతుండు
సర్వభూత వ్రాత సర్వవిద్యాజాత
నిర్ణేత మహితదృక్కర్ణభూషుఁ

గీ. డిష్టసఖుఁడు కుబేరుని కిందుధరుఁడు
గగనకేశుఁ డతిస్వచ్ఛ కాంతితనుఁడు
ఈశ్వరుండు మహానటుం డెల్ల వేళ
సర్వసౌఖ్యంబు లిడి మమ్ము సాఁకుఁగాక!

## మరిడీదేవత

మ. హరియైనా హరుఁడైన నింద్రుఁడయినా అబ్జాసనుండైన ని
న్నెఱుఁగంజాలరు నీ మహామహిమ మా కెంచంగ శక్యంబటే
పరదేవీ విషజాతమారుత వలత్పాదద్వయా దూరమై
మరిడీదేవత మమ్ముఁ బ్రోవఁగదవమ్మా! పొమ్మ! మా యమ్మవై.

## వటమూలమందిరా!

ఉ. చూపులు రెండు ముక్కుతుదఁ జొన్పియుఁ జూచినచూపు వెంటనే
లోపలఁ జూచి చండకరులో శశిఁగూర్చి చతుర్దళంబుపై
దీపము వెట్టి దాని తుదితేజము దానయి విశ్వమంతయున్
వ్యాపకుఁడైన పుణ్యుడు మహాత్ముడగున్ వటమూలమందిరా!



ఉ. కన్నులు మూసి నాదుమది కన్ను త్రికోణమునందుఁ జొన్పి లో
సన్నపు దిడ్డి దూర్చి జలజంబులనిచ్చెన యెక్కి మింటిపై
వెన్నెలరాజుఁ జేరి సుఖవేళలయందును నీవు నేనయై
యున్నను గాని నా హృదయ ముబ్బదయా వటమూలమందిరా!

ఉ. గట్టిగ వేధలార్గురను ఖండనసేయక యేదుచింతలన్
గొట్టక మూఁడ్గురిండ్లు చెడఁగూల్పక (నీ పద) మబ్బునా భువిన్
బొట్టును బోనమున్ దపము పోకులు బూడిదపూఁత లూరకే
పెట్టును గాని నీదు దయఁబేర్పడునా వటమూలమందిరా!

ఉ. వాలిన యింద్రియాలయ కవాటములన్నియు మూసి నెమ్మదిన్
దాళమువెట్టి లోవెలుఁగు తత్త్వము గన్గొని తట్టి సుందరిన్
లాలిత నాగకన్య నుపలాలనచేసినవాఁడె యోగియౌ
మాలిన వేషముల్ జముని మార్కొనునే వటమూలమందిరా!

ఉ. సాగిన కోపవహ్ని నిజశాంతిజలంబునఁ జల్లనార్చి యా
శాగిరులన్ నివృత్తికులిశాహతి నుగ్గుగఁ జేసి యత్తమో
నాగవిభున్ వివేకమృగనాయకుచే నణఁగించి లోన సం
యోగవియోగముల్ విడువ యోగియగున్ వటమూలమందిరా!

ఉ. వాలిన యింద్రియంపుఁ బెనువాతులకున్ మృదుగానమందవా
తూలవిలాసి నీ కుసుమతోయగుణంబులు వచ్చి చొచ్చినన్
గ్రోలఁగనీక నెమ్మనము కుత్తుకవట్టి నినుందలంచి యీఁ
జాలినఁగాక మాటలఁబ్రసాదములే వటమూలమందిరా!

## రామచంద్రుండు...

సీ. సీతావధూమణి మా తల్లి భృగురామ
గర్వాపహారి మా కన్నతండ్రి

దశరథాత్మజుఁడు మా దాత విశ్వామిత్ర
మఘరక్షణచణుండు మాకుఁ గర్త
మారీచదమనుండు మా యిలువేలుపు
కోదండపాణి మా కులగురుండు
జనకజానేత మా నెనరైన చుట్టంబు
రావణహంత మా జీవధనము

గీ. కైక యాప్పితకారుండు మాకు హితుఁడు
హేమమృగ చర్మశాయి మా స్వామి జలధి
బంధనుఁడు మాకు సంసారభారవహుఁడు
రామచంద్రుండు మాకు సర్వస్వ మరయ.

సీ. వనరాశిఁ దన యంపమొనకుఁ దెప్పించిన
కోదండధరుఁడు మా కులగురుండు
తారక బ్రహ్మవిద్యాస్వరూపం బైన
వేదవేద్యుండు మా విమలవిద్య
దండకాంతరమౌని మండలిఁ గాంచిన
మనువంశ తిలకుండు మాకుఁబ్రాపు
పగవాని తమ్మునిఁ బట్టంబు గట్టిన
కరుణాపయోధి మా పరమదాత

గీ. శబరి యొసఁగిన ఫలములు చవులు గొన్న
భక్తి మాత్రైకదర్శి మా పాలివిందు
కఠినదశకంఠభుజగర్వ గౌరవంబు
మట్టు పెట్టిన విలుకాఁడు మా బలంబు.



## రామా! ఆర్త రక్షామణీ!

మ. శర ణన్నన్ గరుణింతు వన్న బిరుదుల్ జాలంబులే చాలునో
శర ణోహో యన రా వదేమి వినవో సంసారతాపత్రయం
బెరుగన్నీయదొ యిందు లేవో చెపుమా యీ నిర్దయాబుద్ధి నే
మతితే ముందు విభీషణాదులకు రామా! ఆర్త రక్షామణీ!

మ. పరులన్ శిష్యుందల్లిఁదండ్రి గురులన్ భ్రాత్రాదులన్ మిత్రులన్
శర ణన్నంతనె యాపదల్ పరిహరించన్ రాముఁడుండంగ నే
వెర పేలంచును బిన్న పెద్దలు బుధుల్ వేదాంత శాస్త్రంబులున్
మతియుం బల్కెడుపల్కు నమ్మితిని రామా! ఆర్త రక్షామణి!

మ. పరుగై రావదె త్రోవ గానవొ సురల్ ప్రార్థించిరో సామగా
నరుచిం జొక్కితో యాంజనేయుని వడిన్ రావించితో జానకీ
చరణాబ్జంబులు నొచ్చెనో యితరదేశ ప్రాణి సంరక్ష నే
మతితో జాల మిదేలనయ్య రఘురామా! ఆర్తరక్షామణీ!

మ. శర ణన్న క్షణమే విభీషణున కాచంద్రార్కమైనట్టిదే
వర లంకాపురి ధారవోసి తనుచున్ వాల్మీకి రామాయణా
ది రహస్యంబులు తెల్పుటల్ నిజములైతే నన్ను రక్షింపుమీ
మఱుమాటాడగ నింక నాన సుమి రామా! ఆర్త రక్షామణీ!

## శివస్తుతి

చ. భసితము కన్నులం బడినఁ బాములు బుస్సనఁగంట మంట పె
ల్లెసఁగి విధుండు గంద నొకయింత గజాసురుచర్మ మూఁగినన్
గసరుచు నల్లపెద్దపులి గాండ్రన గిత్తయుఁ దత్తరిల్లఁ జేఁ
బొసఁగినలేడి కుందువడ భూతభయంబున గౌరి లేవ న
వ్వెసఁగఁగ సంతరించుకొను నీశ్వరుఁ డిచ్చుత మీ కభీష్టముల్.

సీ. సర్వసర్వంసహాసముదయంబు రథంబు
రథమధ్యమున నున్నరాయి విల్లు
విల్లువెంబడిఁ దిర్గు వెలుఁగులు చక్రాలు
చక్రాలకును వైరి చారునారి
నారిఁబట్టుక తిర్గునాగరకుఁడు గరి
గరిమీఁద విహరించు ఘనుఁడు శరము
శరము నాభిక నున్న శతవృద్ధు సారథి
సారథిమాటలు సైంధవములు

గీ. గాఁగ నేగుదెంచి కణఁకతోఁ బురములు
గెలిచినట్టి ఘనుఁడు గిరిజతోడఁ
గలసి యుండునట్టి కరుణాసముద్రుండు
నిష్టసిద్ధు లొసఁగు నెలమి మనకు.

సీ. తారకాసురభుజాదర్పంబు దెగటార్చు
ఘనుఁగన్నతండ్రి మా యనుఁగు వేల్పు
కుండలిజ్యావల్లి కొండవింటను గూర్చు
విలుకాండ్రమేటి మా కులగురుండు
తలిరాకుబాకు గద్దరివజీరుని క్రొవ్వు
మట్టుపెట్టినదిట్ట మాకుఁ బ్రాపు
హత్తితెల్లనిగిత్తకత్తలాణము నెక్కి
మహి మించునెఱకాఁడు మా ధనంబు

గీ. జాటజూటాగ్రవీథిని జహ్నుకన్య
మమత నిడుకొన్న వగకాఁడు మా బలంబు
పార్వతీసాధ్వి సామేనఁ బాదుకొల్పి
వెలయుపటుశీలి మా పాలివేల్పు మొదవు



## మృదునిఁ గనుగొంటి

సీ. అర్ధంబు సత్పురుషాకృతిగాంచిన
వెండిచాయల పెద్దకొండఁ గంటి
ఆ కొండపార్శ్వమందంటి పాయఁగలేక
సగమైన యొక మహాశక్తిఁ గంటి
ఆ శక్తికుడివంక నద్రిశృంగముమీఁద
నద్భుతంబైన కాఱడవిఁ గంటి
అక్కానలోఁ గంటి నరుదైన యొక యేఱు
నయ్యేటిదరులయందమృత మొలుక

గీ. పాఱి తడుపారు నొక పాలపాఁపఁ గంటి
యదియు నదియును నదియును నదియు నదియు
హరిశిరోజూటగంగాబ్జు లగుట గంటి
మృదునిఁగనుఁగొంటి నంతట మేలుకొంటి.

సీ. శీతాద్రియామ్యదిక్సీమభూములు గంటిఁ
జెలువైనకేదారశిఖరిఁ గంటి
ఉగ్రుని నిజకాంత నుమఁ జెంతఁ గనుఁగొంటి
మధుమాధవుని దైత్యమథనుఁ గంటి
కంటి విఘ్నేశ్వరు గణనాథుఁ గనుఁగొంటిఁ
జండభైరవుని గోస్వామిఁ గంటి
ఉత్తమసంస్తుత్యు నుత్తరార్కునిఁ గంటిఁ
గాలభైరవు ఛన్నఘంటఁ గంటి

గీ. కంటి వటవృక్ష మాదిమగంగఁ గంటిఁ
గంటిఁ గేదారకుండోదకములు గ్రోలి

మహితవృషరాజు నెక్కినమహిమవాని
మృదుని గనుఁగొంటి నంతట మేలుకొంటి.

సీ. ఆలపోతులతేని నాతని పగవానిఁ
బెంపగఁ జంపంగఁ బెంపు గలిగి
హాలాహలపుమందు హల్లకములవిందుఁ
గుడువంగ ముడువంగఁ గోర్కి గల్గి
ఎడమదిక్కువధూటి జడలమక్కువబోటిఁ
బొలపింప వలపింపఁ బొందు గలిగి
పచ్చియేనికతోలు ప్రాఁకంగటికాలు
గట్టంగఁ బట్టంగఁ గణఁక గల్గి

గీ. ఎసఁగి లోకంబు లీరేడు నేలువాని
మిగులఁ బొడవైన తెల్లనిమేనువాని
మహితవృషరాజు నెక్కినమహిమవాని
మృదునిఁ గనుఁగొంటి నంతట మేలుకొంటి.

## అంబికా !

ఉ. భారతివై సరోజభవుపాల వసించి రమావధూటివై
నీరజనాభుఁ జెంది ధరణీధరనందనవై మహేశ్వరుం
గోరి వరించితమ్మ నినుఁ గొల్వక యూరక యేల కల్గు సం
సారసుఖంబు లీ మనుజసంతతికిం దలపోయ నంబికా!

ఉ. కూడెడి వెన్ద్రుకల్ నిడుదకూఁకటఁ బ్రోవుగ బొడ్డుపై వళుల్
జాడలు దోపఁ గ్రొమ్మొలక చన్నులు మించుదొలంక సిగ్గునం
జూడఁగ నేరముల్ మెఱుఁగుఁజూపుల నీవు హిమాద్రియింట నీ
వాడుట శూలికిన్ మనము వాడుట గాదె తలంప నంబికా!



ఉ. వాలికకన్ను ముంగురులు వాతెఱ కెంపుమెఱుంగుఁ బంటిపైఁ
గ్రాలెడుతారహారమును గంకణచారుకరంబు డాపలం
దూలుచునున్న పయ్యెదయుఁదోచిన కన్నులు మోడ్చి మోడ్చి నీ
పాలగునీశుమేను సగపాలు మనంబునఁ జేర్తు నంబికా!

ఉ. లాచి వరాంగనల్ వరవిలాసమనోహర విభ్రమంబులన్
జూచినఁ జూడఁడుత్తముఁడు, చూచినఁ జూచును మధ్యముండు, దాఁ
జూచినఁ జూడకుండిననుఁ జూచుచు నీచుఁడు, నన్ను వీరిలో
జూచినఁ జూడకుండు గుణిఁజూచిన చూపునఁజూడు మంబికా!

చ. బెడఁ గగు రత్నదర్పణముఁ బేరిన వెన్నెల వోసి నిచ్చలుం
దుడువఁగఁ బాలసంద్రమునఁ దోఁచి సుధాకరుమేనికందు వోఁ
గడుగఁగ, నేరెటేట సితకంజము ముంపఁగ, నైజకాంతితోఁ
దొడరినతల్లి! నీ మొగముతో సరివోల్పఁగఁ జాలు నంబికా!

ఉ. ఆదిమశక్తి యీ తరుణి యాద్యకుటుంబిని యీ కుమారి ము
త్తైదువ యీ తలోదరి చిదాత్మక యీ సతి విశ్వమాత యీ
పైదలి సర్వలోకగురుభామిని యీ చపలాక్షి యంచు బ్ర
హ్మాదులు వచ్చి నిచ్చలు హిమాద్రికి నిన్నెఱిఁగింతు రంబికా!

## రఘురాముడు

సీ. బల్‌జరీయంచు చల్వసఫేదు చీరపై
లాల్ పావడా డాల్ విలాస మెసగ
ఒనరు నీరా నమో జూదాబగష్టు కం
చుకముపై గుబ్బచన్సొగసు లొల్క
వగగుల్కు తగజిల్కు జిగితళ్కు కరినమౌ
సొగసుకీల్జడకుచ్చు లొగి నటింప

నిగనిగ దగు మోము నొగిబాగు కస్తురి
వగచుక్కబొట్టు ఠీవై చెలంగ

గీ. సరస మలరంగ తొలకరి మెఱుపనంగ
నలరు సీతాంగనను గూడి తౌననంగ
పృథ్వీజారామ బుట్టయపేట హేమ
సౌధనిజధామ రఘురామసార్వభౌమ!

చం. గరుడుని నెక్కి హేమపటకంకణరత్నకిరీటకుండలా
భరణము లెల్లఁ దాల్చి కరపద్మయుగంబున శంఖచక్రముల్
మెఱయఁగ నింద్రనీలమణిమేచకకాంతుల దివ్యమూర్తితోఁ
బరగెడివేల్పు రామజనపాలుఁడు మాకు సహాయమయ్యెడిన్.

## శతకరత్నములు

శా. శ్రీనాథాంబుజ సంభవార్చిత నిజ శ్రీపాదపద్మద్వయున్
నానాదేవమునీంద్ర బృందకృతపుణ్యస్తోత్రపాత్రక్రియా
నూనైశ్వర్యవిరాజితున్ భుజగకేయూరాంకితున్ భక్తలో
కానీకైకశరణ్యుఁ గొల్తు నిను దాక్షారామ భీమేశ్వరా!

భీమేశ్వరశతకము.

ఉ. గుండయ నుత్తమోత్తమునిఁ గూటికిఁ గప్పెరయై కడంగి యొం
డొండుగ నాటియంగడికి నూరక తెచ్చితి తెచ్చియత్తటిన్
నిండినవారిలోన నతనిన్ గడుఁబిన్నఁదనంబు సేర్చితే
మండుము నీదు పెద్దతనమా యిది కొట్టయశంకరేశ్వరా!

కస్తూరి భట్టురాజు.



మ. ధరలో నుద్ధురలోభులన్ ధనముచింతం గాంచి కాసంత వే
సరితిం గేసరి తీవ్రరోగహతి నష్టంబైనరీతిన్ మదు
ద్ధరణం బాదరణంబున న్నిలుపవే తాపత్రయాగ్ని స్ఫుర
ద్గరిమార్చిన్ బరిమార్చి భక్తసులభా గౌరీమనోవల్లభా!

గౌరీమనోవల్లభ శతకము.

ఉ. ప్రాణు నపానుఁ గూర్చి యలపాము గదల్చి తదూర్ధ్వకీలితో
ద్యాణము నొత్తి మేను దృఢమై నిగుడన్ బిగియించి దృష్టులన్
ఘోణముఁజేర్చి యా ప్రణవఘోషణమున్ విని యందు మానస
క్షీణము చేసినన్ బవనసిద్ధుఁడనా శివదేవధీమణీ!

శివదేవశతకము.

ఉ. వారక కాశిలో నిలిచి వర్ధిలు పుణ్యులు చచ్చి పుట్టఁగా
నేరరుగాని నేరుతురు నెన్నుదుటం గనుచూపనైన దు
ర్వారవిషోరగేంద్రము శిరంబునఁ జుట్టఁగ నైన మ్రింగి సొం
పారఁ గళప్రదేశమున నాగఁగ నైనను గాలకూటమున్.

కాశీశతకము.

తో. చెలువార గజాజినచేలముతో
గళనీలిమతో నహికంకణుఁడై
తలఁ జంద్రకళంగలదైవము మా
కులదైవము దైవతకోటులలోన్.

ఉపవాసము లెల్లను నుండుట నీ
కృప వచ్చుటకా యిది రిత్త సుమీ
అపవిత్రుని పుల్లని యంబలికై
సుపవిత్రునిఁ జేయుట శుద్ధి గదా!

రంగనాధుని తోటకములు.

ఉ. లోకము లెల్ల నీ తనువులోనివ నీవట యెంత గల్గదో
నాకపపద్మసంభవజనార్దను లాదిగ నెల్లవారలున్
నీ కొలఁదింతయంత యననేరక మ్రొక్కఁ దొడంగి రన్న ని
న్నేకరణిన్ నుతింతుఁ బరమేశ్వర! శ్రీగిరిమల్లికార్జునా
**పండితారాధ్య దేవర.**

మ. నిను సేవించినఁ గల్గు మానవులకున్ వీటీవధూటీ ఘటీ
ఘనకోటీ శకటీ కటీతటిపటీ గంధేభవాటీపటీ
ర నటీహారిపటీ సువర్ణమకుటీ ప్రచ్ఛోటికాపేటికల్
కనదామ్నాయమహాతురంగ శివలింగా! నీలకంఠేశ్వరా!
**ఎఱ్ఱాప్రెగ్గడ**

ఉ. తల్లి సతీమతల్లి పదతామరసాశ్రితకల్పవల్లి భా
స్వల్లలితాంగవల్లి రతివల్లభుతల్లి కృపారసంబు పైఁ
జల్లి నిరంతరంబు మముఁ జల్లనిచూపులఁ జూచి నీవు మా
యిల్లను పాలవెల్లి వసియింపఁగదే జగదంబ భార్గవీ!
**గొట్టిముక్కుల నరసింహరాజుగారు.**

## కార్తవీర్యార్జునా!

శా. శ్రీరాజిల్లఁగఁ బ్రోజ్జ్వలన్మణిగణశ్రీ మించు సింహాసనం
బారూఢస్థితిచే వహించు ఘనభూపాలంకరిష్ణుండవై
రారాజుల్ వినుతింపగా భువనముల్ రక్షించు మీ రాజసం
బారాధించి నుతింతు మేరునగధైర్యా! కార్తవీర్యార్జునా!

మ. లలితేంద్రోపలనీల భక్తజనపాలా సద్దయావాల ని
శ్చలసంధ్యారుణచేల సుందరతరశ్యామాయుతాలోల ని
స్తులశుంభద్గుణజాల సంతతఘనస్తుత్యైకభూపాల య
త్యలఘుప్రాభవశీల మేరునగధైర్యా! కార్తవీర్యార్జునా!



మ. నవరత్నోజ్జ్వలదివ్యభూష నతనానాభక్తపోషా మహా
హవసంరంభవిజృంభమాణరిపు బాహాటోపశోషా జన
స్తవనీయోజ్జ్వలభాష దీనజనదోష ద్వేష లావణ్య గౌ
రవసంమోహనవేష మేరునగధైర్యా! కార్తవీర్యార్జునా!

మ. గ్రహసందర్శన మైనచోట భయముల్ కన్పించుచోటన్ దురా
గ్రహవృత్తిన్ రిపు లేచుచోట నిదుమల్ గారించుచోటన్ నవ
గ్రహవేధల్ ఘనమైనచో దమసుమంత్రంబే సదా ద్రవ్యసం
గ్రహమై భక్తులఁ బ్రోచు మేరునగధైర్యా! కార్తవీర్యార్జునా!

శా. నీలేందీవరదివ్యకాయ సురమౌనిశ్రేణిసంస్తుత్యాయ భ
క్తాళీమానవసంవిధేయ కురణాధౌరేయ విద్విణ్మదో
త్తాల స్తంభనసాంపరాయ విలసద్ గ్రైవేయ కళ్యాణ భ
వ్యాలంకారనికాయ మేరునగధైర్యా! కార్తవీర్యార్జునా!

మ. కరుణాపాంగ నవాతసీకుసుమరంగత్కోమలాంగ ప్రబా
కరనీకాశకనద్రథాంగ రణరంగస్థైర్య శౌర్యక్షపా
చరసందోహతమఃపతంగ మకుటస్ఫారో త్తమాంగారి సం
హరదోర్దండభుజంగ మేరునగధైర్యా! కార్తవీర్యార్జునా!

మ. సరసీజాక్ష విశాలవక్ష భవశిక్షాదుష్టచోరారికుం
జరహర్యక్ష కృపాకటాక్ష బలదక్షా చక్రసంరక్ష భూ
భరణాధ్యక్ష మహోరగాది మృగకృద్బాధాపహారేక్ష ని
ర్జరమౌనివ్రజపక్ష మేరునగధైర్యా! కార్తవీర్యార్జునా!

మ. పటుదీర్ఘాంచిత బాహుదండ సమరప్రారంభ శుంభన్మదో
త్కటకోదండ ప్రచండకాండనతహృత్కంజాతమార్తాండ ది

క్షతవిద్యోతితదానశౌండ హిమరుద్గండద్వయోద్దండ దు
ర్ఘటదేవారివిఖండ మేరునగధైర్యా! కార్తవీర్యార్జునా!

మ. గిరిదుర్గాటవి దుర్గమస్థల జలాగ్ని క్రూరపైశాచ చో
ర రిపువ్యాఘ్రులులాయ సూకరమృగేంద్ర వ్యాళవై హంగ వా
శ్చర వర్షాతపశీతవాత ఘననాశం బిష్టసంధాన ము
ర్వర నీ మంత్రబలంబు మేరునగధైర్యా! కార్తవీర్యార్జునా!

మ. గరిమ న్నీదుషికారు వైభవము వక్కాణించగా శక్యమా
వరభేరీపటహాది ధంధణధణధ్వానంబులున్ డిండిమో
త్కరడిండిండిమ డిండిమారవము లుద్యత్తూర్యనాదంబులు
ర్వరలో దుర్భరమౌర మేరునగధైర్యా! కార్తవీర్యార్జునా!

మ. తురికీరాణి తురాణ్యరబ్బిహయముల్ దూకించి శాబాసు బా
పురెయంచున్ మెడలప్పళించి హవుసింపొందంగ తేగాను రే
తరవారుల్ ఝుళిపించగన్ బగలు సర్దార్ ఘూర్నిషుల్ సేయనీ
హరువౌ దౌలతు నెంతు మేరునగధైర్యా! కార్తవీర్యార్జునా!

శా. దాటున్గుల్కెడు కళ్లెమున్ పసిడిగండాపట్టు కింఖాపు చే
వాటంబై తగుజీనుపోషు మణిరవ్వల్ జుగ్గగాయించుదు
చ్చీటంగున్ బిరుదందియల్ కలుగు తేజిన్ స్వారియై లీలఁ
ర్లాటం బాడెద వౌర మేరునగధైర్యా! కార్తవీర్యార్జునా!

శా. జంగోష్పేషు జగా జిరాసరిఫెనల్ జామాతుమాంపట్టుక
మ్మిరు పేటీమొకమాలు రంచికిలిదమ్మీమోరు షంషేదుదు
స్తురుమాల్ కస్తురిబొట్టు సిస్తుగులుకన్ తుర్కీహయంబెక్కి వా
హ్వారె నీ వేఁగెదు స్వామి మేరునగధైర్యా! కార్తవీర్యార్జునా!



## బ్రహ్మబిల పంచరత్నములు

సీ. నీలతోయద మధ్య నీవారశూకవ
త్పరిపూర్ణ కాంతితోఁ బ్రబలుచుండు
శంపాలతలభాతిఁ జటుల ప్రకాశమై
చంచరీకమురీతి జరగుచుండు
కరికుంభమధ్యస్థ ఘనమౌక్తికద్యుతి
ప్రబలప్రకాశమై పరగుచుండు
శరదిందుచంద్రికాస్వచ్ఛ విద్యోతమై
యాహ్లాదజనకమై యలరుచుండు

గీ. పద్మగర్భోద్భవము గొల్పు భానుపగిదిఁ
బటిమ దీపించుఁ జటులహృత్పద్మమందుఁ
బరమహంసవిహార చిత్ప్రణవధార
పదుల నైదింట శోభిల్లు బ్రహ్మబిలము.

సీ. కరతలంబున నొ ప్పలరు నిష్టలింగంబు
నయనస్థలంబున ననువుపఱచి
నయనస్థలంబున నలరు సత్ప్రాణంబు
హృదయస్థలంబున గుదురుపఱచి
హృదయస్థలంబునఁ బొదలు సద్భావంబు
మంత్రస్థలంబున మరులుకొలిపి
మంత్రస్థలంబున మరులందు చిద్బిందు
కూటత్రయంబునఁ బాటుపఱచి

గీ. పాటకూటత్రయంబులో ప్రణవతేజ
తేజతేజోలయవ్యాప్త తేజమగుచు

మర్మవర్మాది కర్మముల్ మర్మమగుచు
బదులనైదింట శోభిల్లు బ్రహ్మబిలము

సీ. ప్రణవకుండలి శిరోమణి మండలంబున
మండలత్రయమున మాటుపఱచి
మండలత్రయమున మాటుపడున్నట్టి
అఉమక్షరత్రయం బనువు తెలిసి
అ,ఉ,మాక్షరత్రయం బనువు తెల్సిన చోట
నంగలింగ జ్ఞానసంగ మెఱిగి
యంగలింగజ్ఞానసంగ స్థలంబున
నలబిందు పంచకం బైక్యపఱచి

గీ. పరచిదానందషట్కోశపద్మ మొంది
మందిరాంతరచిత్కళా మండలముల
నంబుజానంద మణితేజకంద మగుచు
పదులనైదింట శోభిల్లు బ్రహ్మబిలము

సీ. పద్మకాశద్యుతి ప్రతికాశమై చన
పావకస్థానంబుపైఁ దనర్చు
ప్రాణలీలాపాన పరిపూర్ణ సంచార
కుంభక స్థాన తత్కుహరమందు
తాలుమూలాంతర ద్వాదశస్థానమౌ
పరనాళవీథుల బ్రబలఁదెలిసి
లింగాంగసంధాన లీలానుకూలమౌ
హంసాక్షరద్వయం బాశ్రయించి



గీ. ఉర్విపర్ణద్వయంబున కూర్ధ్వమైన
వర్ణభేదంబు లన లేనివనిత గనుచు
వనితకనుచూపులో నున్న వర్ణమగుచుఁ
బదులనైదింట శోభిల్లు బ్రహ్మబిలము

సీ. కదలక యాధారకమలంబులో నున్న
భుజగకన్యకఁ గూర్చి పొదలఁదీర్చి
సమమైన మలకలు చక్కఁగా సవరించి
షణ్మండలంబులు సంధిపఱచి
పరిమిత షట్చక్ర పద్మాంతములయందు
పరిపూర్ణ బంధముల్ పరగ నునిచి
ప్రాణవాయుస్థానపటుకళా సంపూర్ణ
ఘంటానినాదంబు కలయఁదెలిసి

గీ. తెలిసి విధుమండలంబులఁ దేటపడగ
పడగలాఱింటఁ బవనంబు ప్రణవనాద
నాదపరిపూర్ణ చిత్కళానంద మగుచు
పదులనైదింట శోభిల్లు బ్రహ్మబిలము.

## షట్చక్ర నిర్ణయము

సీ. ఆధారచక్రంబునందు భక్త్యంగంబు
వసుధాంశచౌదళ వారిజంబు
పీతవర్ణము క్రియాభిధ గల్గినది శక్తి
ధాత పూజారియై తనరు నచట
నాల్గక్షరంబులు నమరుబీజంబులై
పరమును జిత్తంబు పరగెనందు

నాసంబు ముఖము నౌ వాసనద్రవ్యంబు
పదపదార్థంబుగాఁ బక్వశుద్ధి

గీ. యొనర నైష్ఠికసద్భక్తి యుక్తముగను
లీల వర్ధిల్లు నాచారలింగమునకుఁ
గోరి యర్పించి శేషంబుఁ గొన్నయట్టి
భక్తలింగంబు నిరతంబు ప్రస్తుతింతు.

సీ. స్వాధిష్ఠచక్రాన సలిలాంశమగు నాఱు
దళముల పద్మంబు దనరుచుండు
నందుఁబాయకయుండు నాఱక్షరంబులు
శ్వేతవర్ణంబని చెప్పనొప్పు
పూని మహేశ్వరస్థానంబు నిజమది
పూజారి విష్ణుండు పొదలు జ్ఞాన
శక్తి యటమెలంగు చామముఖంబగు
పాణిసుబుద్ధియై పరగుచుండు

గీ. చాల యవధానభక్తిచే మేలురసము
లలమి చేకూర్చి సుగురులింగార్పితంబు
చేసి శేషంబుభోగించి చెలగునట్టి
పరమమాహేశ్వరుల నేను బ్రస్తుతింతు.

సీ. మణిపూరమును చక్రమం దనలాంశంబు
పరికింప దశదళ పద్మమచట
నరుణవర్ణము పదియక్షరంబులునందు
రుద్రుండు పూజారి రూఢినిచ్చ



శక్తినివాసంబు చక్షులే వదనంబు
యదిప్రసాదిక మార్గ మనగనొప్పె
నల నిరహంకారహస్త పద్మంబున
రూపద్రవ్యంబు లారూఢముగను

గీ. పక్వమొనరించి యవధాన భక్తియుక్తి
యరయఁ జేకూర్చి లింగసమర్పితంబుఁ
గొన్న శేషంబు భోగించి కుశలుఁడైన
యా ప్రసాదిని వినుతింతు ననుదినంబు

సీ. సత్య మనాహతచక్ర ప్రభావంబు
పదిరెండురేకుల పద్మమునికి
యనిలాంశమగు ద్వాదశాక్షరంబులుకూడి
హరితవర్ణంబుచే నలరియుండు
నరయనీశ్వరుఁడు పూజారియై చెలువొందు
నాదిశక్తియు నందు మోదమలరు
సరవి ముఖమును త్వక్సుర్శయే ద్రవ్యంబు
నిత్యమానసహస్త నియతిఁబూని

గీ. లీల శోధించి సుచరాఖ్యలింగమునకు
యుక్తమొనగూడ ననుభావ భక్తికతన
నర్పితముచేసి స్వీకార మందినట్టి
ప్రాణలింగిని నిరతంబు ప్రణుతిఁజేతు.

సీ. స్వచ్ఛమైనవిశుద్ధ చక్రంబునందున
పదియాఱు దళములపద్మ మరయ

నందు పదాఱవు నక్షరంబులు గల్గి
యంబరాంశంబందు నతిశయిల్లు
నింద్రనీలచ్ఛాయ నెనయు పరాశక్తి
యల సదాశివుఁడు పూజారిఁ దలఁప
కర్ణదేశంబును వర్ణింప ముఖసీమ
జ్ఞానహస్తంబును పూనిశబ్ద.

గీ. పదపదార్థము నానందభక్తి గూర్చి
సారమైనట్టి నిత్యప్రసాదనామ
లింగమునకిచ్చి శేషంబు లెస్స గొన్న
శరణులగునట్టి ఘనుల నే సన్ను తింతు.

సీ. సలిలతమా జ్ఞేయ చక్రధర్మంబది
ద్విదళపద్మముకాంతి తేజరిల్లు
ప్రణవాంశమగు దాన ప్రకటింపశక్యమే
అందుల రెండు బీజాక్షరములు
యందుబాయకయుండు నమ్మహాచిచ్ఛక్తి
పూజారిపరశివుఁడూర్జితముగ
నిర్ణయింపఁ గపోతవర్ణ మచ్చోటను
హృదయంబు ముఖపద్మ మది దలంప

గీ. పరిణయంబను ద్రవ్యమే భావహస్త
మునను జేకూర్చి మహలింగమునకుఁ దృప్తి
యవును సమరసభక్తిచే నలరి లింగ
మైక్య సుస్థలవర్తుల నభినుతింతు



## యోగపంచరత్నాలు

సీ. అష్టాంగ యోగరహస్యంబు లొనఁగూర్చి
బంధత్రయంబు నభ్యాసపఱిచి
కేవలకుంభకక్రియఁ బవను మరల్చి
కుండలీశక్తి మేల్కొనఁగదల్చి
నాదంబు బ్రహ్మరంధ్రమున మ్రోవఁగఁజేసి
ముక్తి సింహాసనమునకు వచ్చి
పాంచభౌతికమైన బ్రహ్మాండ పిండాండ
కరణముల్ సాంఖ్యమార్గమునఁదెలిసి

గీ. ఆత్మలింగంబు నేత్రమధ్యమునఁ జూచి
రాజయోగంబు గన్న ధీరాగ్రగణ్య
ప్రణవ సంధాన తారకపదనిధాన
యోగబలసాంద్ర శ్రీగురుయోగిచంద్ర

సీ. అంఘ్రిమూలం బొకటడ్డము పదము మ
ధ్యమునఁ గట్టిగ బిగియంగఁ బన్ని
కడమపాద మవలితొడ పిక్కసందుగా
నునిచి యాకుంచనంబునను మెఱసి
కడు పక్కళించి శీఘ్రంబుగా రొమ్మున
గడ్డ మానించి వే కరయుగంబు
ఊరుద్వయంబున నూనిచి కాయంబు
నివిడి ప్రాణు నపాను నెయ్యపఱిచి

గీ. మనసు పవనంబు గూర్చి భ్రూమధ్యదృష్టి
నిలుపుబంధ త్రయాభ్యాస నిరుపమాధ్య

ప్రణవసంధాన తారకపథనిధాన
యోగబలసాంద్ర! శ్రీగురుయోగిచంద్ర!

సీ. ఆధారమున నుండి యాకుంచనంబున
బ్రహ్మనాళంబులో బాటపఱిచి
వదనం బొకించుక వంచి దంతంబుల
మధ్యను రసనంబు మాటుచేసి
నడుము నిక్కించుక కడు పక్కళించుక
యోష్ఠముల్ రెండును నొయ్య మూసి
యంగుళద్వయమునఁ బింగళాశశినాడు
లంటి పూరకగతి నంటఁబట్టి

గీ. గంధవహుని సహస్రారకమలమందుఁ
గూర్చితిరి కేవలంబైన కుంభకమున
ప్రణవసంధాన తారకపథనిధాన
యోగబలసాంద్ర! శ్రీగురుయోగిచంద్ర!

సీ. తారకయోగవిద్యారహస్యంబు శీ
లించి శిరంబు నిల్లింత వంచి
పూర్ణిమాదృష్టిని బొమలు మీఁదికి నెత్తి
మనసుచేతను బిందు వనుసరించి
మండలత్రయములమధ్య నంతర్లక్ష్య
ముద్రనీలజ్యోతి మొనకుఁ జేర్చి
కంటిరెప్పలు రెండు నంటకుండఁగ వ్రాల్చి
లోచూపు కనుగంట లోనుపఱిచి



గీ. దివ్యతేజంబు చూచి మూర్తీభవించి
యాత్మలింగంబు గనుఁగొంటి వనుభవమున
ప్రణవసంధాన తారకపథనిధాన
యోగబలసాంద్ర! శ్రీ గురుయోగిచంద్ర!

సీ. పంచీకృతంబైన పంచమహాభూత
కార్యముల్ కల్లలుగాఁగఁజేసి
కామంబు క్రోధంబు కడు లోభమోహంబు
మదము మత్సరమును వదలఁజేసి
సంసారమున నుండి సంగి యయ్యునుగాక
బురదలో కుమ్మరపురువువలెను
శమదమంబులఁ జిత్త మమతల గాలించి
బ్రహ్మంబు నిలుకడపఱిచి వేగ

గీ. సత్తుచిత్తును నానందసరళి నగుచు
లోనవెలిఁ బూర్ణముననుంటి లీనమునను
ప్రణవసంధాన తారకపథనిధాన
యోగబలసాంద్ర! శ్రీ గురుయోగిచంద్ర!

సీ. శ్రుతులు దెమ్మని వేఁడఁ జతురాననుఁడఁగాను
నమృత మిమ్మన హరిహయుఁడఁగాను
తనునెత్తుకొను మన ధాత్రిని గాను గం
బమునఁ బుట్టుమన డింభకుఁడఁగాను
ఆత్మజుఁగాఁ గోర నదితిని గాను భూ
స్థలి దానమడుగఁ గశ్యపుఁడఁగాను
బ్రహ్మత్వ మర్థింపఁ బవనాత్మజుఁడఁగాను
హరులఁ ద్రోలుమనంగ నరుఁడఁగాను

శరరూప మగుమనఁ బురదాహకుఁడఁగాను
కలి ద్రుంచుమన మౌనిగణముగాను

గీ. పదవులను గోర నీ పదపంకజాత
జాతమకరందపాన ప్రశాంతచిత్త
బింబిత స్వప్రకాశకాభిన్న రూప
తత్పదార్థైక సుజ్ఞానధారదక్క.

సీ. శరధిఁ జొచ్చుట గాదు గిరిధరించుట గాదు
ధరణినెత్తుట గాదు నరమృగేంద్ర
తనువుదాల్చుట గాదు దైత్యువేఁడుట గాదు
రాజవీరుల రణరంగమందు
దునిమివైచుట గాదు వనధిఁ గట్టుట గాదు
హలముఁబూనుట గాదు హరిమహీజ
మవనిఁజేర్చుట గాదు హరశరం బగుటగా
దశ్వవాహనముగా దస్మదీయ

గీ. మానసాంభోజకర్ణికా మధ్యసీమ
నిరుపమానందసంస దున్మేషవేష
తరుణతావక దాంపత్య చిరవిలాస
గరిమ కరుణించుటెంతటి కార్యమభవ!

## రామ నవరత్నములు

సీ. శ్రీజానకీదేవి చెలువుగా వామాంక
తలమున ముద్దులు గులుకుచుండ
నగ్రభాగంబున నాంజనేయుఁడు నిల్చి
పాదంబు లొత్తుచు భక్తి నెఱప



వెనుక నెమ్మనమున వినయంబు తనరార
సౌమిత్రి మౌక్తికచ్ఛత్ర మూన
నుభయపార్శ్వంబుల నొదిఁగి వింజామరల్
భరతశత్రుఘ్నులు పట్టి కొలువ

గీ. దండ సుగ్రీవుఁడు విభీషణుండు నవల
నంగదుండును జాంబవదాదు లుండఁ
దల్లి చల్లగఁ జూడఁగ నల్లనికళ
లలరునినుఁ గొల్తు నెపుడుఁ బట్టాభిరామ!

సీ. శ్రీవసిష్ఠాదు లాశీర్వాదములు సేయఁ
గల్యాణవాద్యముల్ కదిసి మ్రోయ
సరసపుణ్యాంగనాజనము పాటలు పాడ
నప్సరస్త్రీలు నృత్యంబులాడ
దశరథజనకాదిధరణీశు లలరంగ
బాంధవుల్ మోదసంపదఁ దగంగ
కౌసల్య మొదలగుకాంత లానందింప
నిరువైపులను జెలు లెచ్చరింప

గీ. మిథిల శుభవేది నొండొరుమీఁదఁ గదిసి
పోసఁగి ముత్యాల తలఁబ్రాలు పోసికొనెడు
రమ్యమూర్తులు జానకీరామచంద్రు
లాత్మలో నుండి నను బ్రోతు రనుదినంబు.

సీ. కౌశికుయజ్ఞంబు గాచిన జయశాలి
యల యహల్యను బ్రోచినట్టి ఘనుఁడు

కాకాసురుని తప్పు గాచిన సదయుండు
మౌనిరక్షా ప్రతిజ్ఞానిపుణుఁడు
శబరికోరికఁ దీర్చు చల్లనిదేవుండు
హనుమంతు నేలిన ఘనయశుండు
సుగ్రీవు వేగ ననుగ్రహించిన మేటి
దయ విభీషణుఁ బ్రోచు ధర్మమూర్తి

గీ. ఆర్తరక్షణబిరుదాంకుఁ డైన స్వామి
వేడుకలు మీఱ సీతమ్మతోడఁ గూడి
రామచంద్రుఁడు మమ్ము నిరంతరమ్ము
చింత లెడఁబాపి కరుణ రక్షించుఁగాత.

సీ. శ్యామలకోమలజలదకాయమువాని
కమలసుందర లోచనములవాని
భానుకోటిప్రభాభరిత తేజమువాని
జిలుఁగుబంగరువల్వ గలుగువాని
నవ్యకిరీట సుందరహారములవాని
నునుమానికపు మొలనూలువాని
మణికంకణాంకితమంజీరములవాని
ఘనదీర్ఘబాహుయుగంబువాని

గీ. మందహాసంబువాని సమగ్రవేద
శాస్త్రముఖసర్వవిద్యలు చదువువాని
ఘనతపోజ్ఞేయమాహాత్మ్యకళలవాని
నిఖిలయోగీంద్రుఁడగువాని నేఁదలంతు.



సీ. శ్రీకరంబైనట్టి సాకేతపురములో
మాణిక్యమండపమధ్యసీమ
మందారతరుమూల సుందరమణిజాల
సింహాసనంబున జీవరత్న
కలితమౌ దివ్యాష్టదళపద్మమునఁ దండ్రి
తొడను గూర్చుండి ముద్దుగనువాని
లలితేంద్రనీలకోమలశరీరమువాని
కమలవిశాలనేత్రములవాని

గీ. సోదరత్రయసహవాససుఖమువాని
నతుల మకుటాదిభూషితుండైనవాని
కనకమయచేలుఁ గౌసల్య కన్నకొడుకు
ధ్యాన మొనరింతు సేవింతు నభినుతింతు.

సీ. అందంపుఁజుంచుతో నాణిముత్తెమ్ముల
జోకైన నెఱరావిరేకతోడ
నిద్దంపువజ్రాలమద్దికాయలతోడ
మురువైన చిఱునవ్వుమొగముతోడ
బొజ్జపై నటియించు పులిగోరుతాళితో
రమణీయమణికంకణములతోడ
నవరత్నఖచితఘంటలమొలనూలితో
నీటైన గిలుకుటందియలతోడ

గీ. తోడ లక్ష్మణభరతశత్రుఘ్ను లాడఁ
బరుగులెత్తఁగ వెనువెంట బరుగులెత్తి
తల్లికౌసల్య రార నా తండ్రి యనుచు
నెత్తి ముద్దాడు శ్రీరాము నే భజింతు.

సీ. దశరథసుతుడవై తాటకం బరిమార్చి
మఘపోషివై శిల మగువఁజేసి
శర్వుని విలుఁద్రుంచి జానకిఁ బెండ్లాడి
పరశురాము జయించి గురువునాజ్ఞ
వని కేఁగి ఖరుఁద్రుంచి కనకమృగం బేసి
యినజుని గూడి వాలిని వధించి
వనధి బంధించి రావణుఁ గీటడంగించి
సీతతోడ నయోధ్యఁ జెలగుచుండి

గీ. తల్లులును దమ్ములును బ్రమోదమునఁ బొదల
నాంజనేయాదిసహితుఁడవై సమస్త
రాజ్యమేలెడు పట్టాభిరామమూర్తి!
క్షేమ మొనగూర్చి మమ్ము రక్షింపవయ్య.

సీ. దశరథరామ నీ దయకుఁ బాత్రుఁడనయ్య
రక్షించు జానకీరామచంద్ర
కౌసల్యరామ చక్కఁగ నేలుకోవయ్య
దరిఁజేర్చవయ్య కోదండరామ
జయరామ నేను నీ శరణొందినానయ్య
రఘురామ నాపైఁ బరాకటయ్య
సాకేతరామ నా సన్నుతి వినవయ్య
పట్టాభిరామ చేపట్టవయ్య

గీ. అన్న మన్నించు చిన్న రామన్న నన్నుఁ
గన్న తండ్రివి మాకు నీకన్న నెవరు?
శీఘ్రముగ మాకభీష్టసంసిద్ధిఁ జేయు
రామ శ్రీరామ కల్యాణరామ రామ.



సీ. నా చిన్న రామన్న ననుఁగన్న తండ్రి రా
నన్నేలునయ్య నా యన్న రార
నా ముద్దులయ్య నా సామి రాఁగదవోయి
అప్ప చక్కదనాలకుప్ప రార
నా పెన్నిధాన మా నా పుణ్యమూర్తిరా
నా యింద్రనీలరత్నంబ రార
బంగారుకొండ నా పాలిభాగ్యమ రార
అమృతంపుఁ జెలమ రా మయ్య రార

గీ. చూత మెవ్వరు వత్తురో చూత మనుచుఁ
దల్లి పిలువంగ నందియల్ ఘల్లుమనఁగ
నవ్వి చెలరేఁగి గునగున నడచివచ్చు
నట్టి కౌసల్యగారాపుఁబట్టిఁ దలఁతు.

సీ. శ్రీరామచంద్రుని పేర నంకితమయి
నవరత్న నామసుందరము నయిన
నవపద్యనవక మే నరుఁడైన భక్తితో
వ్రాసినఁ జదివిన వరుసతోడ
సంగ్రహించిన విన్న సకలఫలంబులు
శ్రీరాము లిచ్చును సిద్ధ మెప్పు
డాయురారోగ్యంబు లైశ్వర్యమును గల్గు
నిష్టసంసిద్ధియు నెల్లవేళ

గీ. ప్రతిదినంబును మానక పరమనియతి
వినెడు పురుషుఁడు ధర సర్వజనులలోన

నుత్తమోత్తముఁడగు వేదవేత్తలయిన
వానితో సాటిగారు భూవలయమునను.

## దశసీసములు

సీ. పాలమున్నీటిలో ఫణిరాజశయ్యపై
యోగనిద్రాసక్తి నున్నవాని
కోటిసూర్యప్రభల్ మీటుకిరీటముల్
వేయుమస్తకముల వెలయువాని
కౌస్తుభమణియును గర్ణకుండలములుఁ
గమలనేత్రంబులుఁ గలుగువాని
సిరియును భూదేవిచరణంబు లొత్తంగఁ
గరుణారసము చాలఁ గలుగువాని

గీ. దలఁతు నుతియింతు ధ్యానింతుఁ దగ భజింతు
నన్నుఁ గృపతోడఁ బ్రోవు మనాథనాథ!
శ్రీమనోనాథ! మాధవ! శ్రీయనంత
పద్మనాభ! దయానిధీ! పరమపురుష!

సీ. కౌండిన్యసతినోము కానుక సోలెఁడు
నూకలిచ్చిన మెచ్చి సాకినావు
కోరి కుచేలుఁడు కొణిదెఁడడ్కులు దెచ్చి
యిచ్చిన సంపద లిచ్చినావు
పాంచాలియును మీకు బలుసుకూరయు నీళ్లు
బోసినఁ గృపతోడఁ బ్రోచినావు
సగ మొగిఁగొఱికి యా శబరి యిచ్చిన పండ్లు
భక్షించి యామెఁ గాపాడినావు



గీ. భక్తవత్సల వరపంచభక్ష్యములను
నా కొసంగిన నర్పింతు నీకు నెపుడు
శ్రీమనోనాథ! మాధవ! శ్రీయనంత
పద్మనాభ! దయానిధీ! పరమపురుష!

సీ. ఆదినారాయణ! ఆత్మపరాయణ!
కేశవాచ్యుత! హరి! వాసుదేవ!
శ్యామలాంబుదవర్ణ! కామితార్థ ప్రద!
సామగానప్రియ! సదయహృదయ!
భక్త రక్షామణీ! పరమాత్మ! పరమేశ!
దేవ! జగన్నాథ! దేవవంద్య!
శర్వాణిసన్నుత! గీర్వాణవందిత!
నీరజలోచన! నిగమవినుత!

గీ. లోకనాయక! సద్భక్తలోకవరద!
పుండరీకాక్ష! మము వేగఁ బ్రోవుమయ్య
శ్రీమనోనాథ! మాధవ! శ్రీయనంత
పద్మనాభ! దయానిధీ! పరమపురుష!

సీ గ్రాహంబుచేఁ జిక్కి కరి డస్సి మొఱవెట్ట
గజరాజునాపదఁ గడపినావు
తండ్రిబాధకునోపి తగ మిమ్ము నుతియింపఁ
గరుణతోఁ బ్రహ్లాదుఁ గాచినావు
ఆపన్నుఁడై వేఁడ నా విభీషణునకు
మెచ్చి లంకారాజ్య మిచ్చినావు
కట్టినపుట్టముల్ కౌరవు లొల్వంగఁ
బాంచాలి దురవస్థఁ బాపినావు

గీ. కాన శరణంబు వేఁడెదఁ గమలనాభ
అభయదానమ్ము మాకిమ్ము సుభగచరిత
శ్రీమనోనాథ! మాధవ! శ్రీయనంత
పద్మనాభ! దయానిధీ! పరమపురుష!

సీ. దేవ జనార్దన దివ్యగోవర్ధన
ఖగరాజవాహన కలుషదహన
వసుదేవనందన వాణీశవందన
కాశియమర్దన కంసహరణ
పంకజలోచన భవబంధమోచన
దారిద్ర్యభంజన దైత్యదమన
సన్మునిపాలన సద్ధర్మశీలన
కరిశాపనాశన యురగశయన

గీ. పరమపావన త్రిభువనపారిజాత
దీనమందార ననుఁబ్రోవ దిక్కు నీవె
శ్రీమనోనాథ! మాధవ! శ్రీయనంత
పద్మనాభ! దయానిధీ! పరమపురుష!

సీ. దాతవు తల్లివి తండ్రివి భ్రాతవు
హితుఁడవు బంధుఁడ వీవ మాకు
కావంగఁ బ్రోవంగఁ గర్తవు భోక్తవు
పెన్నిధి వని నమ్మి యున్నవాఁడ
నన్ను నేరమెంచక యనుకంప గనుపింప
దీనరక్షామణి దిక్కు నూపు
వేయు మోములు రెండువేలు జిహ్వలు గల
శేషుండు మిము నుతి సేయలేఁడు.



గీ. ఇట్టి మిమ్ము నుతింప నే నెంతవాఁడఁ
బాపకర్ముండఁ బాపుండఁ బాపమతిని
శ్రీమనోనాథ! మాధవ! శ్రీయనంత
పద్మనాభ! దయానిధీ! పరమపురుష!

సీ. ఉదయాస్తమానమ్ము నుడుగక నేనాడు
మాటలే మీ నామమంత్రజపము
బాహుయుగ్మంబున బహువిధంబులఁ జేయు
పనులె మీ శ్రీదివ్యపాదపూజ
ఎడపక పుడమిపై నిడెడు నా యడుగులు
తగ మీకుఁజేయు ప్రదక్షిణములు
శయ్యపై వేడ్కల శయనించు టెల్లను
ధరఁజాగి సాష్టాంగదండ మిడుట.

గీ. గాఁ దలంపుము ననుఁ జాలఁ గరుణఁ బ్రోవు
నాదు కోర్కుల నీడేర్చు యాదవేంద్ర
శ్రీమనోనాథ! మాధవ! శ్రీయనంత
పద్మనాభ! దయానిధీ! పరమపురుష!

సీ. ప్రహ్లాద నారద బక దాల్భ్య శ్రీశుక
కశ్యప గౌతమ కణ్వ కుత్స
కపిల వేదవ్యాస కౌశిక మాండవ్య
బలి విభీషణ భృగు పరశురామ
జాంబవ ద్రుక్మాంగ దాంబరీషార్జున
వామదేవ వసిష్ఠ వైనతేయ
మాండవ్య విదుర మార్కండేయ గాంగేయ
శౌనక బృహదశ్వ సదృశులైన

గీ. నిన్ను వర్ణింప నేర్తురే నీరజాక్ష
నన్నుఁ గృపతోడఁ జూడుమనాథనాథ!
శ్రీమనోనాథ! మాధవ! శ్రీయనంత
పద్మనాభ! దయానిధీ! పరమపురుష!

సీ. మాధవ! మీ కథామాధురిఁ గ్రోలు నా
నాల్క దుష్కథల ననంగ నియకు
వైకుంఠనిలయ! మీ వర్ణనల్ విను నాదు
వీనులఁ బెఱకథల్ వనఁగనియకు
కమలాక్ష! మీ పాదకమలంబు సూచు నా
కన్నులఁ బరసతికాంక్ష యిడకు
శౌరి! నీ నిలయంబు చేరఁగోరెడు నాదు
చిత్తంబునకుఁ బరచింత యిడకు

గీ. ఘోరదురితంబు లెటు నన్నుఁ జేరనియకు
మాయురభివృద్ధి కృపసేయమయ్య నాకు
శ్రీమనోనాథ! మాధవ! శ్రీయనంత!
పద్మనాభ! దయానిధీ! పరమపురుష!

సీ. విన్నపం బవధారు విశ్వేశ యీ పది
సీసముల్ చెప్పితిఁ జిత్తగించు
మిది కడుభక్తితో నేప్రొద్దు నుతిసేయు
పఠనసేయు మహానుభావులకును
నాయురైశ్వర్యంబు లతిశుభప్రదములు
విష్ణుకీర్తనములు వినుట బుద్ధి
కోరినకోరికల్ కొనసాగఁగాఁజేసి
ధనధాన్యపుత్త్రపౌత్త్రాభివృద్ధి



గీ. సకలసంపద్విశేషముల్ సౌఖ్యములును
గలుగఁజేసి దృఢాంగులుగా నొనర్చు
శ్రీమనోనాథ! మాధవ! శ్రీయనంత
పద్మనాభ! దయానిధీ! పరమపురుష!

## శ్రీరంగనాథస్తుతి

సీ. మంచినీలపుఁజాయ మించు దేహమువానిఁ
గాచు చల్లనిచూడ్కిఁజూచువాని
ఉరగేంద్రశయనుఁడై యొప్పుచుండెడువాని
మేలైన పచ్చులతాళివాని
కులుకునెమ్మోమున మొలకనవ్వులవాని
దంబైన మణికిరీటంబువాని
గుఱుతైన నవరత్నకుండలంబులవాని
పొసగిన కస్తూరిబొట్టువాని

గీ. ఆదిలక్ష్మికిఁ బ్రాణేశుఁ డైనవాని
మీనకేతనజనకుఁడై మెఱయువాని
నుభయకావేరి మధ్యమందున్నవాని
రంగనాథునిఁ బొడగంటిఁ బొంగుచుండి.

సీ. శ్రీరమా హృత్సంగ చిరకౌతుకోత్తుంగ
హస్తాగ్రకలిత రథాంగరంగ
కవిహృద్వనజభృంగ కలుష తమ పతంగ
కనదంఘ్రి సంభూత గంగ రంగ
అక్షయోగ్రనిషంగ రాక్షసమదభంగ
అంగజకోటి సమాంగరంగ

విమలకీర్తితరంగ విహగరాజతురంగ
మకుటసంఘటితోత్త మాంగ రంగ!

గీ. చిరతరామ్నాయ పర్వత శృంగరంగ
పరమకారుణ్య రసమయాపాంగ రంగ
రక్షితానూన భద్రసారంగరంగ
భూరి నిగమాంతరంగ! కస్తూరిరంగ!

ఉ. సింగపుమోమువాఁడు తులసీదళదామమువాఁడు కామినీ
రంగదురంబువాఁడు వలరాయనిఁ గాంచినవాఁడు భక్తి కు
ప్పొంగెడువాఁడు దానవుల పొంక మడంచెడువాఁడు నేఁడు శ్రీ
బంగరురంగశాయి మనపాలఁ గలండు విచార మేటికిన్.

## "కలగంటి నంతటమేలుకొంటి"

సీ. పానుపు పెనుబాము పడగలు నిగిడించి
చల్లని గాడ్పుల చవులు గ్రోల
కౌస్తుభరోచులు కల్లోలపరిధూత
విద్రుమలతలతో వియ్యమంద
కదలుచున్నప్పుడు కనువిచ్చి చనువిచ్చి
యిందిర తన వక్షమందు నొదుఁగ
నాభిపద్మములోని నలువ యొక్కొకమాఱు
జలపక్షిరవముల కులికిపడఁగ

గీ. కన్ను మోడ్చినయపుడ పాల్కడలిలోన
నుల్లమున లోకములఁ జూచుచున్నవాని
వారిజోదరు నీరజచారునయను
మెలఁత! కలఁగంటి నంతట మేలుకొంటి.



సీ. నాలుగు మోములబాలునితోఁ దన
బొడ్డున బాలెంతపూవు దనర
అడుగుఁగెందామరఁ బొడమిన తేనియ
ముల్లోకములమీఁద వెల్లిగొలుప
ఉరమున నున్న యిందిర చేతి కమలంబు
మెలఁగుతుమ్మెదల కామెతలు గొలుపఁ
గరమున నొక మనోహరతరశంఖంబు
పొలివోని నిండువెన్నెలలు గాయఁ

గీ. బాలమున్నీటికరడు లుయ్యాలలూఁప
ముదురునాగువుపైఁ గనుమోడ్చి యున్న
వాని లోకంబు లేలెడు వరుసవాని
మెలఁత! కలగంటి నంతట మేలుకొంటి.

సీ. తనకు ఫణావళి తలయంపిగాఁ జేసి
పాన్పైనవాఁ డొక్క పాఁపఱేఁడు
తన నాభిఁబూచినతామరఁ జదువులు
చదివెడు నొక ముదిచదువువాఁడు
తన వక్షమున మనోజయంబునఁ(?) గ్రాలెడు
పుణ్యంపుఁ జూడ్కుల పువ్వుఁబోణి
తన మ్రోల మత్స్యావతారాది లీలలు
తగిలి పాడెడు నొక్క దండెతపసి

గీ. సకలవేదాంతములుఁ దన జాడ వెదక
నుదధి పెన్నీఁటిపైఁ దేలుచున్నవాని
మేఘసంకాశ రుచిగల మేనివాని
మెలఁత! కలఁగంటి నంతట మేలుకొంటి.

సీ. కాటుకకొండపైఁ గాయురేయెండకుఁ
జెలువైన పచ్చని వలువవాని
గగనోదరంబున నెగడుచందురునకుఁ
గవయైన నాభిపంకజమువాని
పొడుపుగుబ్బలిమీఁది బ్రొద్దుచందంబున
బొడవైన రత్నంబుఁదొడవువాని
తరఁగలఁదోఁతెంచు నురుగులకాంతికి
గరుసైన ధవళ శంఖంబువాని

గీ. తెల్లదామరవిరిమీఁదఁ దేఁటివోలెఁ
బాలమున్నీటిలోపలఁ బవ్వళించి
యోగనిద్రావిలోలుఁడై యున్నవాని
మేలఁత! కలఁగంటి నంతట మేలుకొంటి.

సీ. శ్రీరామచంద్రుచేఁ జెలఁగి పూజలుగొన్న
పరమేశుఁ డా రంగపతి యితండు
ఏడుకోటలలోన వేడుక విహరించు
కపటనాటకుఁడైన ఘనుఁడితండు
బ్రహ్మరుద్రామర ప్రముఖులకెల్లను
నాదిమూలంబైన యతఁడితండు
వైనతేయుని నెక్కి వరుస దానవకోటిఁ
బరిమార్చు శ్రీజగత్పతి యితండు

గీ. విశ్వరూపంబు చూపిన వేల్పితండు
విశ్వ ముదరంబునం గల విభుఁడితండు
అట్టి శ్రీరంగశాయి నా యాత్మయందు
మేలఁత! కలఁగంటి నంతట మేలుకొంటి.



సీ. మున్నీఁటితరగలు మోచినచాడ్పునఁ
బులకాంకురంబులు మొలకలెత్త
ప్రిదిలినకౌఁగిలి బిగియించు సిరిచేతి
కంకణ ఝుణఝుణాత్కార మెసఁగ
జలజాసనుఁడు లోన మెలఁగెడు పొక్కిలి
తమ్మిపైఁ దేంట్లు జుంజుమ్మ రనఁగ
గంధర్వగానంబు కన్నులఁ జికిలినఁ
బర్యంకనాగంబు పడగలెత్త

గీ. అల్ల నరకన్ను విచ్చి యింద్రాదిసురుల
విన్నపము లోలి నాలించుచున్నవాని
వెడఁదకన్నుల నల్లనియొడలివాని
మేలఁత! కలఁగంటి నంతట మేలుకొంటి.

సీ. శ్రీకరరత్న శింజితనూపురస్ఫుర
త్పాదపద్మంబులు పరగువాని
కాంచీకలాప సంఘటిత దుకూలంబు
కాంచనచేలంబు గలుగువాని
గ్రైవేయకంబులు కమనీయహారముల్
కంకణాంగదములు గలుగువాని
మకరకుండలరత్న మహనీయమకుట స
న్మందహాసవిలాస మహిమవాని

గీ. భరత లక్ష్మణశత్రుఘ్న పవనసుతులు
గొలువ జానకితోఁగూడి కొమరుమిగులు
నట్టి యయోధ్యరాము నే నాత్మలోన
మేలఁత! కలఁగంటి నంతట మేలుకొంటి

సీ. ఇంద్రనీల సమూహసాంద్రఘనాఘనో
జ్జ్వలమైన దేహంబు గలుగువాని
సత్యప్రధానమౌ సాధుభావంబున
సజ్జనరక్షణ సలుపువాని
మేరుమహీధరభూరి ధైర్యంబున
నబ్ధిగభీరత నలరువాని

గీ. భరత లక్ష్మణ శత్రుఘ్న పవనసుతులు
గొలువ జానకితోఁగూడి కొమరు మిగులు
నట్టి యయోధ్యరాము నే నాత్మలోన
మెలఁత! కలఁగంటి నంతట మేలుకొంటి. 1.

సీ. శతకోటికందర్ప సమజగన్మోహన
భూరిసౌందర్యవిస్ఫూర్తివాని
త్రిభువన కోదండ దీక్షాగురుండన
బిరుదువిఖ్యాతిఁ బెంపెసఁగువాని
చండభండనధరాస్థలి దివ్యమేఘంబు
వలె శరలాఘవంబలరువాని
సింధుబంధురగర్వ సింధురక్రమకళా
సింహవిక్రమకేళిఁ జెలఁగువాని

గీ. భరత లక్ష్మణ శత్రుఘ్న పవనసుతులు
గొలువఁ బేరోలగంబునఁ జెలువ మలరు
నట్టి పట్టాభిరాము నే నాత్మలోన
మెలఁత! కలఁగంటి నంతట మేలుకొంటి.

1. ఈ సీసపద్యంలో పూర్వప్రతులలో మూడుపాదములే ఉన్నాయి.



సీ. నీలమేఘచ్ఛాయ నెగడెడు తిరుమేన
మెండుగాఁ గస్తురి మెత్తినాఁడు
ధగధగద్ధగ యను తళుకుబిళ్లయు లెస్స
కటితటి దిండుగాఁ గట్టినాఁడు
కోటిసూర్యులకాంతి కుదురైన రత్నంబు
ఘనకిరీటము తలఁ గలిగినాఁడు
కలుముల నీనెడుకాంతిచే నొఱపైన
యురమునఁ గౌస్తుభ మూనినాఁడు

గీ. విరజ కావేరి మధ్యను వెలసినాఁడు
ఎలమి భక్తుల కోర్కులనిచ్చినాఁడు
అట్టి శ్రీరంగశాయి నే నాత్మలోన
మెలఁత! కలఁగంటి నంతట మేలుకొంటి.

సీ. సుర లర్థిఁ గల్పప్రసూనముల్ వర్షింప
నప్సరోవనితలు నాట్యమాడ
దుందుభిధ్వానముల్ తుములంబులై మ్రోయఁ
దూర్యఘోషంబులు తొంగలింపఁ
జేరి వసిష్ఠుఁ డాశీర్వాద మొనరింప
నల యరుంధతి శోభనంబు పాడ
వరగుణంబులనెల్ల వాల్మీకి నుతియింప
నారదమౌని గానం బొనర్పఁ

గీ. జెలఁగి సింహాసనంబున సీతతోడ
రమణఁ గూర్చుండి రాజ్యపాలనము సేయు
నట్టి యయోధ్యరాము నే నాత్మలోన
మెలఁత! కలఁగంటి నంతట మేలుకొంటి.

సీ. సౌమిత్రి వేడుక ఛత్రంబు దాల్పంగఁ
బాదుకల్ భరతుండు భక్తి నిడఁగ
శత్రుఘ్నుఁడంతలోఁ జామరంబును వీవ
సుగ్రీవుఁడర్థితో సురఁటివీవ
అంగదుం డంతంత నడపంబు పట్టంగ
సరస ఖడ్గము విభీషణుఁడు తాల్ప
సామీరి మతిమీఱి సన్నుతిఁ గావింప
జాంబవంతుండు హెచ్చరిక దెల్ప

గీ. అవనిజనుగూడి భద్రసింహాసనమున
రమణఁ గూర్చుండి రాజ్యపాలనము సేయు
నట్టి కోదండరాము నే నాత్మలోన
మెలఁత! కలఁగంటి నంతట మేలుకొంటి.

సీ. అలోలకల్లోల మగు మాలికావలి
విలసితంబగుపాలవెల్లిఁ గంటి
నందు రత్నాంకితంబౌ పెక్కుపడగలఁ
బ్రజ్వరిల్లెడు పెనుఁబాముఁగంటి
దానిపై సుఖలీలఁ దగిలి నిద్రించెడు
పరమాత్ము నొకదివ్యపురుషుఁ గంటి
నా భవ్య నురమున ననిశంబు రత్నంపుఁ
బ్రతిమఁ బోలెడు దివ్యభామఁగంటి.

ఆ.వె. నా లతాంగిమేని యందొక్క కళయు నా
సొబగువక్త్రమందుఁ జొరఁగఁ గంటి
నంతఁ బుణ్య పాతకాకీర్ణనాదస
మ్మిళితవిహగరుతుల మేలుకొంటి.



## – ఆర్తజన రక్షణోపాయ! ఆంజనేయ! –

సీ. శరధి లంఘించి దాశరథి యిచ్చిన భూష
ణము సీత కొసఁగిననాఁటి రూపు
లంకారమాముఖాలంకార మాగ్రహో
న్నతి నీఱుచేసిన నాటిరూపు
నీ వాలమునఁ జుట్టి వాలమున దైత్య
నాథులఁ బొరిగన్న నాటిరూపు
మరుదీశసుతుడ నా మరుదీశ సుతుకేత
నంబెక్కి తోడైన నాఁటిరూపు

గీ. తలఁచువారికి నాపదల్ తొలుఁగు టరుదె
నీ కృపాస్ఫూర్తి నీ కీర్తి నిస్సమములు
మహిత శ్రీరామపదభక్తి మద్విధేయ
ఆర్తజనరక్షణోపాయ! ఆంజనేయ!

సీ. శ్రీరాము నాత్మలోఁ జేర్చుకొన్న మహాత్మ!
చిత్తంబులోన వసింపు మయ్య
కడులావుమైఁ జౌటికడలి దాటిన ధీర!
కడలేని భవవార్ధిఁ గడపు మయ్య
ధవుని సేమంబు సీతకు నొసంగినమేటి!
పరిణామ మొసగి చేపట్టు మయ్య
ధట్టించి మందులగట్టుఁ దెచ్చిన దేవ!
జీవనౌషధ మిచ్చి ప్రోవు మయ్య

గీ. హనుమ నీవు సమర్థుడవయ్య యిపుడు
నింత నన్ను నుపేక్షసేయింప దగునె

మహిత శ్రీరామ పదభక్తి మద్విధేయ
ఆర్తజనరక్షణోపాయ! ఆంజనేయ!

సీ. లవణవారాశి కోలకుఁ దెచ్చి నీ రాజు
నగుచు నంబుధి దాఁటినాఁడ వీవు
రాతి నాతిగఁ జేసి రక్షించె నీ రాజు
మకరి నంగనఁ జేసి మంచి తీవు
మాయలమారీచు మడియించె నీరాజు
చెడుకాలనేమి నుక్కడిఁచి తీవు
లంకేశుఁ ద్రుంచె నాలములోన నీ రాజు
వెస లంక నీఱుగావించి తీవు

గీ. ఆశ్రితావనుఁడగు రామునంత రాజు
పతిహితుండగు నీవంటి బంటుగలఁడె
మహిత శ్రీరామ పదభక్తి మద్విధేయ
ఆర్తజనరక్షణోపాయ! ఆంజనేయ!

సీ. పుట్టినాఁడితఁడు శంభుని యమోఘంబైన
శక్తిచేఁబార్వతీజఠరముననను
పట్టినాఁడితఁడు చేపట్టుఁగొమ్మగఁబంటి
చవిఁజిన్ననాఁడె హస్తముల రవిని
కొట్టినాఁడితఁడు గగ్గోలుగా లంకలో
వెన్నాడి యక్షాదివీరవరుల
చుట్టినాఁడితఁ డాజిఁబెట్టని కోటగా
వాలంబు కపిసేన వలగొనంగ



గీ. ఇతఁడు దైవంబు పటుతేజుఁ డితఁడు సరస
బాహు బలవంతుఁ డితఁడు నాఁ బరగి తౌర
మహిత శ్రీరామ పదభక్తి మద్విధేయ
ఆర్తజనరక్షణోపాయ! ఆంజనేయ!

సీ. రాలవే యుడులు ప్రేలాలపోలిక నీవు
వాల మల్లార్చిన వానరేంద్ర!
తూలవే గిరులు బంతులతెఱంగున నీవు
హస్తముల్ సాచిన నలఘుతేజ!
పగులదే మిన్నంటిపంటికైవడి
పెళ పెళ నార్చిన భీతిరహిత!
తిరుగదే ధరణి కుమ్మరిసారెవలె నీవు
కుప్పించి యెగసినఁ గులిశదేహ!

గీ. దేవదానవమానవాధిపులలోన
నిన్ను వర్ణింపఁ దరమె నిర్నిద్రశౌర్య!
మహితశ్రీరామ పదభక్తి మద్విధేయ
ఆర్తజనరక్షణోపాయ! ఆంజనేయ!

సీ. స్తంభసంభూతావసర ఘోరతరనర
పంచాస్యకహకహార్భటులఁ దెగడి
శాకినీడాకినీసంతత లయకాల
భైరవకిలకిలార్భటులఁ దెగడి
సంవర్తసమయప్రచండ దండధరారి
భర్గకోలాహలార్భటులఁ దెగడి
దక్షాధ్వరధ్వంసకాక్షుద్రబలవీర
భద్రహూహూక్రియార్భటులఁ దెగడి

గీ. పొలుచు భవదట్టహాసంబు చెలఁగఁ బంక్తి
ముఖుని రొమ్ము పగుల్పవే ముష్టిహతిని,
మహిత శ్రీరామపదభక్తి మద్విధేయ
ఆర్తజనరక్షణోపాయ! ఆంజనేయ!

సీ. నిడుదవాలంబుతో నిలువునామంబుతో
నిగనిగమెఱయ నెమ్మొగముతోడ
సహజవర్ణంబుతో సవరనిమౌంజితో
సలిలపూరిత కమండలముతోడ
పసిఁడియందియలతోఁ బట్టుజన్నిదముతోఁ
బాటలలోచనాబ్జములతోడ
కరములమోడ్పుతోఁ గటి హేమపటముతోఁ
గమనీయకుండలకాంతితోడ

గీ. కరుణ గల మూర్తితోడ సాక్షాత్కరించి
నిండువేడుక నా మది నుండు మెపుడు
మహిత శ్రీరామపదభక్తి మద్విధేయ
ఆర్తజనరక్షణోపాయ! ఆంజనేయ!

## రక్షణపరాయణుండ! నారాయణుండ!

### – గునుగు సీసములు –

(ఈ పద్యములు సత్యవోలు భగవత్కవి రచించినవియట.)

సీ. వదనభుజోరొంఘ్రివలన విప్రక్షత్ర
వైశ్యశూద్రులు మదివలనఁ జంద్ర
ముఁడుఁజూపువలన సూర్యుఁడు మోమువలన మ
రుత్పతి వీతిహోత్రులును బ్రాణ



మువలన వాయువు బొడ్డువలన నాక
సము శిరమువలన స్వర్గము పద
మువలన భువి చెవులవలన దిశలును
నుదరమువలన హేమోదరాండ

తే. చయము జని వృద్ధి లయ మంద సలుపు నీవు
నా హృదయపీఠి నుండు మామ్నాయసుప్ర
సిద్ధ! వైకుంఠనాథ! లక్ష్మీసనాథ!
రక్షణపరాయణుండ! నారాయణుండ!

సీ. విరజానదీ పరివృతసప్తసాలా
తపరమాభాగవతసదనపద
వైకుంఠభువనభవనసదనానుకృ
తసవీసపవనాదతల్పమున జ
గత్కల్పనాకల్పికల్పుండవై కుడి
కాలు వంచి యెడమకాలు సాఁచి
కుడిచే యనంతుని యొడలిపై నెడమచే
యిని జానునందున నిడి వెనుకటి

గీ. కరయుగంబుల శంఖచక్రములు మెఱయ
సిరియు భువి నీళ గొలువ భాసిల్లు నిను భ
జింతు వైకుంఠనాథ! లక్ష్మీసనాథ!
రక్షణపరాయణుండ! నారాయణుండ!

సీ. శ్రీదేవి భూదేవి సేవింపఁ గస్తూరి
తిలకము మాణిక్యములుఁ గిరీట
ము మకరకుండలములుఁ గౌస్తుభమణి తా
ళీలు లక్ష్మీకుచాలేపము వన

మాలశ్రీ వత్సము మంచిసాలు భుజకీ
ర్తులు, బాజుబందులు, గొలుసులు, మురు
గులు, బటువులు, ముద్రికలు, శంఖచక్రాది
పంచాయుధములు సుభద్రసూత్ర

గీ. కలితపీతాంబరంబు గజ్జెలు వెలుంగ
నా హృదయపీఠి నుండు మామ్నాయసుప్ర
సిద్ధ వైకుంఠనాథ! లక్ష్మీసనాథ!
రక్షణపరాయణుండ! నారాయణుండ!

## దశావతార స్తవము

సీ. మహనీయ మత్స్య కూర్మవరాహనరసింహ
వామనభృగురామరామరామ
బుద్ధకలికి రూపములు నారదకపిల
వ్యాసదత్తాత్రేయు లాదిగా న
నంతరూపము లయ్యు "నత్యతిష్ఠద్దశాం
గుల" మని బ్రహ్మాండకోటి యేక
పాద్విభూతి త్రిపాద్భాతిగను పరమ
పదముగ నీ స్వరూపము దెలిసిన

గీ. తత్త్వవేత్తలు పురుషసూక్తమున నిన్నుఁ
బొగడ నెగడితి వౌ విరాట్పురుష! సుప్ర
సిద్ధ వైకుంఠనాథ! లక్ష్మీసనాథ!
రక్షణపరాయణుండ! నారాయణుండ!

సీ. మొగము శంఖము మీసము ల్గదాఖడ్గము
ల్పొలను చక్రము వాలమును సుశార్ఙ్గ



మునుబూని మగమీనమూర్తివై మెఱసి పా
తాళ మొఱసి తటస్థలి దొఱసి య
రసి "స్వయం తీర్ణః పరాంస్తారయతి" యను
నోజ గా నీతి "యత్యుగ్రయః ప
తనహేతు"వని సోమకునకుఁ దెల్ప గుభాల్గు
భాల్గుభాల్న నెగసి పడచుఁగడలిఁ

గీ. గ్రచ్చుకొని వచ్చు ముచ్చుమై వ్రచ్చి శ్రుతులు
దెచ్చి విధి కిచ్చినట్టి నీ హెచ్చు వినుతి
సేతు వైకుంఠనాథ! లక్ష్మీసనాథ!
రక్షణపరాయణుండ! నారాయణుండ!

సీ. అమృతవారాశి ఘటము మందరముఁ గవ్వ
ము ఫణి రజ్జువుఁ జేసి పూర్వదేవ
తలు దేవతలుఁబట్టి తరువఁగా ఘుమఘుమ
ధ్వనుల బ్రహ్మాండము తల్లడపడ
నపుడు "పరోపకారార్థ మిదం శరీర
ర"మని కూర్మావతారమునఁ గ్రుంగి
న గిరిక్రింద నిలిచి "నాన్నోదకసమం
దాన" మని సురలకమృతమిచ్చి (?)

గీ. నిరుపమాన లక్ష్మీరమణీమణీమ
ణులు గొలువ విలసిల్ల తౌ నలఘు దాన
శీల! వైకుంఠనాథ! లక్ష్మీసనాథ!
రక్షణపరాయణుండ! నారాయణుండ!

సీ. హిమగిరిఁ గేరుదేహము వజ్రముల తీరు
  రోమములుఁ బ్రళయార్కులసరి కను
గవయు బ్రహ్మాండముఁ గబళించు ముట్టె పా
  తాళముఁ బెకలించు దంష్ట్ర యొప్పఁ
గ వరాహమూర్తివై కదిసి హిరణ్యాక్ష
  గర్భనిర్భేదివై భూర్భువస్సు
వర్భయచ్ఛేదివై వారాశిమగ్న భు
  గ్న వసుంధరోద్ధరణ ప్రమోది

గీ. వై జగతి "యతో ధర్మస్తతో జయ" యను
వచనము నిజముఁ జేసిన వర్ధమాన
కీర్తి! వైకుంఠనాథ! లక్ష్మీసనాథ!
రక్షణ పరాయణుండ! నారాయణుండ!

సీ. ఎంతఁ జదివిన రవంత కులాచార
  ధర్మ మెఱుంగడ తన కుమార
కుఁడయిన ప్రహ్లాదు నొడిసి పట్టి నఱుక
  రహి వచ్చినట్టి హిరణ్యకశిపు
కట్టెదుట నినుపకంబము పటపటఁ
  బగులఁ బొగ లెగయ భగభగ మను
పెనుమంటఁ జిటజిట మనుమిడుఁగురులు బ్ర
  హ్మాండము నిండ బ్రహ్మాదులు గడ

గీ. గడ వడఁక నల్లడ లడల వెడలి కెవ్వు
నార్చి రిపు నేర్చి వటు నేలినట్టి శ్రీ నృ
సింహ! వైకుంఠనాథ! లక్ష్మీసనాథ!
రక్షణ పరాయణుండ! నారాయణుండ!



సీ. అదితి కశ్యపునకు "నంగుష్ఠమాత్రః పు
  రుష" యను వచనము రూఢిసేయ
వామనమూర్తి నవతరించి వడుగవై
  గొడుగు జందెముఁ బచ్చగోఁచిపంచె
పంచశిఖలు మౌంజి పాలాశదండము
  కృష్ణాజినము చెంబు నిట్టి వేష
మమర "నణోరణీయా న్మహతో మహీ
  యా" నన్న వేదవాక్యము ప్రసిద్ధి

గీ. పద బలికడను బుడమి మూఁడడుగు లడిగి
త్రిభువనము లాక్రమించు వర్ధిష్ణు వని భ
జింతు వైకుంఠనాథ! లక్ష్మీసనాథ!
రక్షణపరాయణుండ! నారాయణుండ!

సీ. జమదగ్ని గర్భవాసమునఁబుట్టి వివిధ
  విద్యాతపోధనుర్విద్య లధిక
పతివై ప్రబలి "ఇదం బ్రాహ్మ్య మిదం క్షాత్ర"
  మని మునిరాజచిహ్నముల శాప
చాపనైపుణిఁ జూపి పాపభూపతుల శ
  రారికఠోరకుఠారధార
నస్రధారాప్రవాహములుగా శతధా స
  హస్రధా ఖండించి యా నదులను

గీ. దర్పణము భూమిదేవతాతర్పణముగఁ
జేసిన పరశురామవేషి వని నిను భ
జింతు వైకుంఠనాథ! లక్ష్మీసనాథ!
రక్షణపరాయణుడ! నారాయణుండ!

సీ. సూర్యవంశము పరిశుద్ధ మని దశర
థుఁడు నతులమనోరథుఁ డని భరత
లక్ష్మణశత్రుఘ్నులకు నన్నవై పుట్టి
సౌందర్యచాతుర్యసౌకుమార్య
శౌర్యధైర్యౌదార్యవీర్యసత్యౌచిత్య
గాంభీర్యకర్తుమక ర్తుమన్య
థాకర్తు మతిసమర్థత్వసత్వాఘట
ఘటనాపటీయస్త్వఘనయశ స్త్వ

గీ. సౌఖ్యసఖ్యదయాముఖ్యశాలి వైన
రాముని సరాముని దయాభిరాము నిను భ
జింతు వైకుంఠనాథ! లక్ష్మీసనాథ!
రక్షణ పరాయణుండ! నారాయణుండ!

సీ. బ్రహ్మను గన్న పరబ్రహ్మమూర్తివై
యాద్యంతశూన్యుండ వయ్యు "ధర్మ
సంస్థాపనార్థాయ సంభవామి యుగే యు
గే" యటంచును దేవకీతనయుఁడ
వయి బలరామసహాయుఁడవై శిష్ట
రక్షణమును దుష్టశిక్షణమును
సలుపుచు రుక్మిణి సత్యభామ సుదంత
భద్ర కాళింది జాంబవతి మిత్ర

గీ. వింద లక్షణయును బదార్వేలనూర్వు
రంగనలు గొల్వ వెలయు కృష్ణాహ్వయ ప్ర
సిద్ధ! వైకుంఠనాథ! లక్ష్మీసనాథ!
రక్షణ పరాయణుండ! నారాయణుండ!



సీ. త్రిపుర దైత్యులను మిత్తికి బుత్తెఁ జేయఁ ద
లఁచి తదీయాంగనల యతిజృంభ
కుచకుంభపరిరంభగుంభనరంభాత
రుస్తంభశుంభదూరుఘనజఘన
బింబబింబాధరపీడనతాడన
దంతక్షత నఖక్షత ప్రముఖర
తుల నతులగతులఁగలసి మెలసివిల
సిత తద్వ్రతక్షతిఁ జేసి చేసి

గీ. కంటిగొంటమ్మువై మింట గంటక త్రి
పురచరులఁ గాల్చి కాల్చిన బుద్ధ! గుణస
మృద్ధ! వైకుంఠనాథ! లక్ష్మీసనాథ!
రక్షణపరాయణుండ! నారాయణుండ!

సీ. కలియుగాంతమున దుష్కరముష్కరతురుష్క
చండాలపతితపాషండమండ
లీమండితాఖండభూమండలముఁ జూచి
కమ్రామ్రపర్ణార్ణతామ్రపర్ణి
తటమున బ్రహ్మవిద్బ్రాహ్మణునకుఁ బట్టి
వై పుట్టి యుత్తమాశ్వాధిరూఢుఁ
డవయి జోడుఁ దొడిగి డాలు కత్తికమానుఁ
బూని పూనిక మీఱఁ బుడమిఁ బుట్టి

గీ. నట్టి దుష్టులఁ బుడమిఁ జెండాడ నున్న
కలికిమూర్తి! గుణస్ఫూర్తి ! కలితశౌర్య
కీర్తి! వైకుంఠనాథ! లక్ష్మీసనాథ!
రక్షణపరాయణుండ! నారాయణుండ!

ఈ క్రింది దశావతారస్తుతి పద్యము లెలకూచి బాలసరస్వతీ మహోపాధ్యాయుఁడు రచియించెను.

## ౧ మత్స్యావతారము

శా. సాధీయోముఖపూరితోద్వమితతాసత్యోర్ధ్వగోదన్వ ద
ర్ణోధారాంతరట త్తిమింగిలగిల ప్రోద్ధాననిధ్యానల
బ్ధాధీశ ప్రభుతా స్వభాగహరణార్థాయాయినాథానుజ
ప్రాధాన్యాం కవిలోలవాగ్ధ్రుగబట బ్రహ్మంస్తుమస్త్వా మనున్.

## ౨ కూర్మావతారము

శా. ద్యూత్తంభద్గిరి కల్పతావతరణద్యోవాహినీ సంగ మో
పాత్తేందూదయనిష్పిత్యూణ జలధి ప్రారబ్ధపుత్రోత్సవో
దాత్తత్వాత్తగజాశ్వవన్యశనకన్యాగోమణీదాన సం
పత్తి ప్రీణితదేవధుల్యధిపతి బ్రహ్మంస్తుమస్త్వా మనున్.

## ౩ వరాహావతారము

శా. ఆద్యాలోకన భక్తిసంభ్రమదనేహః పూరుషత్యక్త స
త్పాద్యాంభస్తులసీభ్రమ ప్రదఖుర ప్రక్షాళనామాత్ర జా
గ్రద్యోగాంబుధి దంష్ట్రికాగ్రరిపుహృత్కాలామిషప్రాయశుం
భద్యాదోనిధిసప్తకీస్థలికిటి బ్రహ్మంస్తుమస్త్వామనున్

## ౪ నరసింహావతారము

శా. డింభద్రోహివధోత్కటోత్క్రమణరుష్టిక్లిష్టతారోమ కూ
పాంభోజ ప్రభవాండభాండదళనోద్యద్ధ్వానధీకృత్సభా
స్తంభాంతస్ఫుటనాస్ఫురత్పట పటధ్వన్యాస్త నిశ్చేష్ట ని
ర్దంభోద్యోగదిశావశాపనృహరి బ్రహ్మంస్తుమస్త్వా మనున్.



## ౫ వామనావతారము

స్వతలస్వచ్ఛ తరారుణత్వరచితస్వస్తిః పరేద్భ్రాంతి వా
క్ప్రతికూలత్వ దశానుకారిగళ గాద్గద్యక్షమాం భోజ భూ
నుతిహాసన్నఖరోర్ధ్వసారిత పదార్ణోరుద్గగంగాసవ
ప్రతిమాళీశకపర్దమండలవటు బ్రహ్మంస్తుమస్త్వా మనున్.

## ౬ పరశురామావతారము

శా. ఆజిప్రౌఢిమదుర్జయార్జున గళోదగ్రాసృగాస్వాదన
వ్యాజాపోశనభాక్తదస్వపహృతి ప్రాణాహుతి ప్రస్ఫుర
ద్రాజాళీదివ సావసానవిఘసప్రాయేందువేలాయితా
భ్రాజాధ్యక్షకుఠార ధారిభృగురాడ్బ్రహ్మంస్తుమస్త్వా మనున్.

## ౭ శ్రీరామావతారము

శా. చాపచ్ఛాత్రనిషంగ భంగకుపిత క్ష్మాభృద్ధనుః పంచవ
క్త్రీపంచాళికదృఙ్నియుక్తహుత భుగ్గ్రీవాద్వయీ పంచక
వ్యాపార భ్రమకారి పంక్తిగళగళ్యాఖండనాఖండదో
ర్నైపుణ్యప్రదరౌఘురాఘవపరం బ్రహ్మంస్తుమస్త్వా మనున్.

## ౮ బలరామావతారము

మ. కరిపూరుద్ధరణేద్ధలాంగలవిభగ్న క్ష్మాభరాదక్షది
క్కరిపాద ప్రహతిస్ఫుట స్ఫుటితభాగవ్యాపృతగ్రీవసూ
కరపీఠీకృత పృష్ఠతాహిత మహాగాఢాది కూర్మాధిరా
ట్పరిక్లుప్త ప్రళయాంబు గాహనహలి బ్రహ్మంస్తుమస్త్వా మనున్.

## ౯ శ్రీకృష్ణావతారము

మ. అతిదోఃపీడన కర్కరీ ఫలితకంఠాభత్వదుత్తర్తుధూ
ర్తతృణావర్త దృఢాంగ పాతహతగోత్రా భర్తృకోత్పాదిత
క్రతుభుగ్రాడ్గహణా గ్రహోన్ముఖశతారధ్వస్తమైనాకని
ష్పతనభ్రాంతిక నందగోపకసుత బ్రహ్మంస్తుమస్త్వా మనున్.

## ౧౦ బౌద్ధావతారము

మ. గిరియుష్మద్ధనురస్త్రతా ప్రభృతిమోఘీకృద్వధూశీలవి
స్ఫురణావర్మభి దార్ఢ్యదార్ఢ్యసఫలీ భూతత్రి పూతత్రిపూ
ర్వరదై తేయజిఘాంసు శాసనపరోగ్ర ప్రాప్యసారూప్యని
ర్భరదైతేయతథాగతాంగక పరబ్రహ్మంస్తుమస్త్వా మనున్.

## ౧౧ కల్క్యవతారము

మ. స్వమహాబాహు కృపాణకృత్త గళతుచ్ఛమ్లేచ్ఛవీరచ్ఛటో
త్క్రమదాపాదిత పద్మినీరమణ మధ్యచ్ఛిద్రఖస్వామికా
గమనానాస్రపయఃపరాగ మథితక్ష్మాసార గంగానదీ
భ్రమకృత్కీర్తిక కల్కిమూర్తిక పరబ్రహ్మంస్తుమస్త్వా మనున్.

## కంచి వరదరాజస్వామి

సీ. చేతిలో వెనముద్ద చెంగల్వపూబంతి
 రంగైన ముత్యాల రావిరేక
పచ్చలు దాఁపిన పతకంబు పులిగోరు
 మేలైన ముత్యాల మేలుసరము
నీలాలప్రోఁగులు నిగ్గులు మెఱయంగఁ
 దీరు గైకొన్న కస్తూరిబొట్టు



ధగధగద్ధగకాంతి మిగులురత్న కిరీట
 మలరారు పసిఁడి దువ్వలువచెలువ

గీ. మాస లూరింప వైశాఖమాసమందు
బసిఁడిరథ మెక్కి తిరువీథి బయలువెడలు
నిన్నుఁగంటి నా కోర్కు లన్నియును గంటి
వరగుణసమాజ! శ్రీ కంచివరదరాజ!

## ధరణి

సీ. కుహనాకిటీంద్రునికోఱ సోఁకిన భామ
 కలిమిచూపులసింధుకన్య సవతి
అంభోజవర్ణునకైన శృంగారిణి
 తాలిమికెల్లను దానకంబు
గజకుంభములమీఁదఁ గాపున్న దేవత
 రాజశేఖరుమనోరథము రథము
పెనువేల్పుఁ గోర్కులఁ బిదికెడి ధేనువు
 మెట్టపట్టులకును బుట్టినిల్లు

గీ. హరుని యష్టాంగములకును నాదివేల్పు
కడఁగి రత్నాదివస్తువుల్ గలుగు పెట్టె
యల్ల వలయాద్రిక్రిందటి యంటుబిళ్ల
భవ్యగంధాదిగుణముల భరణి ధరణి.

## వేంకటనగాధ్యక్షా జగద్రక్షకా!

శా. ఓహో పిల్చినఁ బల్కవేమి దయ లేదో కాక దిక్పాల సం
దోహస్తోత్రమహార్భటిన్ వినగరాదో కాక ప్రాంతప్పులం

దూహల్ సేయుచు వడ్డికాసులకునై యూరూరవర్తించెదో
ఆహా మేలు మఱేమి వేంకటనగాధ్యక్షా జగద్రక్షకా!

మ. కుడిహస్తం బిటు చూపుచందమిది వైకుంఠం బనేయందమో
జడధివ్రాతపరీత భూభువన రక్షాదక్షిణంబైన నీ
యడుగుల్ చూడుమనేవొ కాక యొక యొయ్యారంబొ సందేహమై
యడిగే, నానతియిమ్ము వేంకటనగాధ్యక్షా జగద్రక్షకా!

మ. గతమే వింటిని నీ చరిత్రములు లెక్కంజాల మా యయ్య యా
శ్రితరక్షామణి నీవె కావె మఱి వేఱేలేదు నీ పాదమే
గతి లోకంబుల కాదివంద్యమసగ్రవ్యగ్రమాయామయో
ద్ధతభూతాళికి రక్ష వేంకటనగాధ్యక్షా జగద్రక్షకా!

సా. ఆ నీ బంగరుపచ్చడంబువలెవా టాశంఖచక్రాది సం
ధానానూనవిలాస మా ఘనఘనోద్యత్సత్వ మా లోకర
క్షానామం బణిమాదిభాసుర పదాబ్జద్వంద్వ మజ్ఝారె నే
త్రానందమ్ముగఁ గంటి వేంకటనగాధ్యక్షా జగద్రక్షకా!

## వేంకటాచలపతీ! కలశాంబుధి కన్యకాపతీ!

ఉ. శ్రీయలమేలుమంగ కుచసీమలనుంచిన కుంకుమాంకసు
శ్రీయురమందు నేత్రములఁ జెక్కుల విభ్రమముల్ ఘటింపఁగాఁ
బాయక శేషశైలమునఁ బాల్పడ నిల్చిన తండ్రి కావవే
ధీయుత వేంకటాచలపతీ కలశాంబుధికన్యకాపతీ!

ఉ. కంటిని శంఖచక్రములు కంటిని మీ పులుకాపుతీర్థ ని
ష్కంటకవాసనారుచులు గంటిని మీ చరణాంబుజాతముల్
తొంటి నిరూఢపాపములఁ దూలుచు మీ మధురప్రసాదముల్
తింటిని వేంకటాచలపతీ కలశాంబుధికన్యకాపతీ!



ఉ. నీవు త్రిలోకకర్తవని నే శిలనీటను వేసి తేల్తు స
త్పావని నీవెకాని మఱి దైవము లేదని మడ్డుదూతు స
ర్వావళిఁ బట్టి యంఘ్రితలమంటుదుఁ జూడుము బంటుశక్తులన్
దేవర వేంకటాచలపతీ కలశాంబుధికన్యకాపతీ!

ఉ. నీ పదభక్తి నా హృదయనిర్మలపీఠిక నిల్చె నా భవం
బేపు వహించె నా సుకృత మేర్పడె నేఁడుగదయ్య తండ్రి హృ
త్పాపసముద్ర ముద్దవిడి దాటుట మీ కరుణాకటాక్షపున్
దేపను వేంకటాచలపతీ కలశాంబుధి కన్యకాపతీ!

చం. నిద్దపుటాస్యరంగమున నిల్పి ప్రబోధపుఁగాసెగట్టి యే
ప్రొద్దును వెంటఁదంబురను బూనిచి తాత్త్వికనాట్యశాస్త్రపున్
బుద్ధులు సెప్పి నా హృదయపుత్రిక మీకును మేలు పాడఁగా
దిద్దితి వేంకటాచలపతీ కలశాంబుధికన్యకాపతీ!

చం. గురుపదసాధనంబు లివిగో భవదంకము లుండుఁ జూడవో
సిరి దళుకొత్తుచున్నయవి శ్రీ తులసీవనమాలికావళుల్
మురిపెపు శంఖుచక్రములు ముద్రలు మీ తిరుచూర్ణరేఖలున్
దిరుమణి వేంకటాచలపతీ కలశాంబుధి కన్యకాపతీ!

ఉ. అక్షముఁడైన నేర కెదురాడిన దుర్జనుఁడైన తండ్రి సం
రక్షణ లేక బిడ్డఁడు సురక్షితుఁడై మనునే జగత్త్రయా
ధ్యక్షుఁడ వీవు దాసజనదక్షసురక్షణదక్షిణక్షమా
దీక్షిత వేంకటాచలపతీ కలశాంబుధికన్యకాపతీ!

## అలమేలుమంగాస్తవము

సిరి నెఱి నీలపురంగుబెడంగుల – చిన్నరి పొన్నరి పెన్నెఱితురుమును
మురువగు పాపటచుక్కను చుక్కను – మొత్తపుముత్తెపు సరిసిం దురమును

సుదయారుణకరబింబ ప్రతిబిం – బోద్యద్ధగధగితశిరోమణియును
ముదురరచందురు నుదురు చలములన్–మొలచెనొాయనజనుముఖతిరుమణియును
పచ్చలరచ్చల బొగడల మొగడల – పజ్జలసజ్జల వజ్రపుమురువును
విచ్చలవిడివిడి కెంపులమంపుల– విరివినెరవుకొనుబరిరెలహరువును
మగరా కమ్మలకళ్కులతళ్కుల–మలచిన చక్కని చెక్కుల పెక్కును
పగడపు జగడపు మోవిసుపాణియు–పసిమి మిసిమిగల ముక్కరనిక్కును
చంపకసుమపరిహాసిక నాసిక – చక్కందనముల నింపగు సొంపును
యొరపుగఁబరపుగ దయకుదయంబై–యొలపుసొలపుదగు చూపులకోపులు
మురిపెపు ముచ్చట ముసిముసినగవుల– మొలచిన చిలుకలకలుకుల ప్రోవులు
కులుకు  కలికివాలుందెలి గన్నుల – కొమరుల మరుతామర నగుమోమును
అల చిందము చందము గలగళమున– నమరిన మంగళసూత్రపు గోమును
తుదలమొదల సిరిమేలగు జతనల–దొల్కుకళ్కుకుతికంటుత్తండలు
ఉదిరిపసిఁడి మొగ్గలనిగ్గుల జ–గ్గొందగ  బొందగు సందిటిదండలు
వలయపు సొలపుల ఝణఝణరవముల–వలనవలనమగుశ్రీహస్తమ్మును
జక్కవనడకలచన్నుంగవపై–సొరై తీరై తగు హారమ్ములు
చిక్కఁగ జక్కఁగ మేనంబూసిన – సిస్తగు కస్తురి గంబూరంబును
నవనిధులును గల శ్రీవర్ణనక–ర్ణముల నెదుర్కొను మణిభుజకీర్తులు
సవరణజల్‌తార్ రైకనలుపు పై–చాందిన చక్కని పతిమలమూర్తులు
చివ్వున నాభిబిలమ్మున వెడలిన – చీమలచాలనఁదగు నూఁగారును
చివ్వకు నాకొ నీకొ నని బలు–సింగముఁ జెనకెడు కౌనుందీరును
మెచ్చుల కుచ్చెల నెరిపై నొరపై– మెలఁగిచెలఁగు మణికాంచీదామము
గ్రుచ్చుకొనఁగ మానికమున్ జెక్కిన – కొలుకుల యొద్యాణపుబలుసీమము
కిసమసనిసుమున్ దీవులలీవులఁ– గేరు తీరుపిరుదరుదు నొయారము
మినుకుమినుకుమని కదలిన మెరసెడు – మెఱుఁగుటొయారపు టూరులబీరము
నందంబు హళాహళికాహళి యఱ– పఱఁదఱమిన జిగిబిగి చిఱుఁదొడలును



కెందామరలన్ గని తా మరలన్ – గెలిచిన మృదుపదముల నిలుకడలును
చిటిపొటివ్రేళ్లన్ జిటుకుపొటుకుమనఁ –జిటికెడు మట్టపు మట్టెలభంగులు
పెటుకున జిలిబిలి గలిబిలిగల బొ – బ్బిలి కాయల నిబ్బరపు టెలుంగులు
బడిబడి గలుగలు గల్లన మొరసెడి – బంగరుటందియకవసింగారము
నడుగులపైఁబడు బడుగులగాచుట – కయిపెట్టిన గండర పెండారము
శతకోటిరతి ప్రతిభాభాసుర – సౌందర్యపుఁ దిరుమేని విలాసము
సతతానత సంరక్షణదీక్షా – సంరంభ సమగ్రసముల్లాసము
కలిగిచెలఁగు శ్రీ వేంకటనిలయుని – ఘనవక్షస్థల సింహాసనమున
నెలకొని యలమేల్మంగాదివ్య వి – నిర్మల నామమునందగు ప్రియమునఁ
సకలజగమ్ముల బొజ్జను నిడికొని – సాకిన తల్లిని నినుఁగొనియాడెద
ముకుళితకరకమలుఁడనై నీకున్ – మ్రొక్కెద నిఁక నా లేములు వీడెద
మాం దీన మనాథం పాహి రమే – మకుటాలంకృతకల్పకకుసుమే
మాం దేవి కృతార్థం కురు పరమే – మంజులచంద్రస్ఫురదురుసుషమే
తుభ్యం మంగళ మధిగతపుణ్యే – తుభ్యం మంగళ మతిలావణ్యే
తుభ్యం మంగళ మార్తశరణ్యే – తుభ్యం మంగళ మభిజనగణ్యే
శ్రీ వరలక్ష్మీ జనని నమస్తే – క్షీరాంబుధిసజ్జనని నమస్తే
భావభవాబ్జజ జనని నమస్తే – పాహిమాం జగజ్జనని నమస్తే.

## నవ శేషాచలనాథ నమస్తే

శ్రీ వేంకటగిరిదేవ నమస్తే – నవశేషాచలనాథ నమస్తే
భూవినుత మహాపురుష నమస్తే – మీనశరీరము పూని సోమకుని
చానడంచియును జదువులు ధాతకు – దయచేసిన మాధవుఁడ నమస్తే
శరనిధి మంధరగిరి మునిఁగినచో – గురు కమఠాకృతి  గుధరంబెత్తియు
సురలకు నమృతము సూరగనిచ్చిన – పరమాత్మ దయాపరుఁడ నమస్తే
ధరచుట్టుకొనుచు దానవుఁబొలిగొని – కిరిరూపంబున మెరసి లోకముల

నలరించిన దైత్యారి నమస్తే – హరిఁజూపర వోరని బాలునిపై
చురచురజూచెదు సురవైరిని నర – హరివై కంభమునందు జనించియుఁ
బరిమార్చిన ఘనబలుఁడ నమస్తే – బలి నణఁగించెదు తలపున వటువై
యిల మూఁ డడుగుల నిమ్మని వేడియు – పుడమియుదివి రెం డడుగులఁ
కడుశూర త్రివిక్రముఁడ నమస్తే – ధరణీవరులతి దర్పంబున మై గ్రొలిచిన
మరచిన వారల మర్దించుటకై – జమదగ్ని మునీశ్వరురాముఁడ వగు
నమిత మహాసత్వాఢ్య నమస్తే – రవికులమున దశరథరాముఁడవై
దివిజవైరిఁబం క్తిముఖునిఁ గూల్చిన – మునిజనావనామోద నమస్తే
ధరణీభారము పరిహరించుటకు – అరయఁగ వసుదేవాత్మజుండవై
కంసాది మహాగర్వాంధుల వడి – హింసించిన లోకేశ నమస్తే
త్రిపురరాక్షసస్త్రీల మానములు – నిపుణతఁ జెఱపగ నీవు బుద్ధవై
హరుచాపమ్మున శరమై నిల్చిన – సురలోకస్తుత సుగుణ నమస్తే
తురగారోహణ మొనరంజేయుచు – మెరయు కల్కివయి తిరిగి జగమ్ముల
నిరవుకొల్పు దేవేశ నమస్తే – పరగ ననంతాంతర రూపమ్ములు
ధరియించి విరాట్పురుషుఁడు నీవై – పరమానందం బలరఁగ సుస్థిర
పరుఁడగు శ్రీగోపాల నమస్తే – అపరాధసహస్రానీకమ్ముల
నపరబుద్ధియుతుఁడై నే జేసిన – గృపతోడుత రక్షింపగవలయును
విపులబుద్ధియును విమలజ్ఞానము – భవదంఘ్రిద్వయభక్తియు నొసగుచు
భువనపావనాంబుజ భవవందిత – మతి మీ గుణగరిమంబుల నొప్పెడి
వరమంజరి యెవ్వరు పఠియించిన – వ్రాసిన విన్నను వరసౌఖ్యమ్ములు
దాసీసుత మిత్రామోదమ్ములు – ధనకనక సమస్తైశ్వర్యమ్ములు
ఆయుష్యములు చిరారోగ్యమ్ములు – చారురూపములు సకల విద్యలను
ఘనసద్గుణముల పెనుపొందుదు రిల – నీ కృతివసుమతి నినచంద్రాదులు
భూమీధరములు పొలుపగుతారలు – నెన్నివత్సరము లిరవైయుండెడు
నన్ని హాయనము లతి విలసితమై – యుండగ రక్షణ మొనరంజేయుము



పాండవపాలన పరమదయానిధి – తవ దాసోహం తవ దాసోహం
నవశేషాచలనాథ నమస్తే – నవశేషాచలనాథ నమస్తే.

## కందుకూరి జనార్దనాష్టకము

సిరులు మించిన పసిమిబంగరు జిలుగుదుప్పటి జారగా
చరణపద్మముమీద దేహము చంద్రకాంతులు దేరగా
మురువు చూపగ వచ్చినావో మోహనాకృతి మీరగా
గరుడవాహన దనుజమర్దన కందుకూరి జనార్దనా! 212

ఆనపెట్టిన రాకపోతివి ఆయెబో అటుమొన్ననూ
పూనిపిలువగ వినకపోతివి పొంచిపోవుచు మొన్ననూ
నేను చూడగ గడచిపోతివి నీటు చేసుకు నిన్ననూ
కానిలేరా! దనుజమర్దన కందుకూరి జనార్దనా! 213

నిన్నరాతిరి చవికలోపల నీవు చెలి కూడుంటిరా
ఉన్నమార్గము లన్నియును నే నొకతెచేతను వింటిరా
విన్నమాత్రము గాదురా నిను వీథిలో కనుగొంటిరా
కన్నులారా దనుజమర్దన కందుకూరి జనార్దనా! 214

బిత్తరంబున మొలకకెంపులు పెదవి నెవ్వతె ఉంచెరా
గుత్తమైన మిటారిగుబ్బలగుమ్మ యెవ్వతె మెచ్చెరా
చిత్తగించక జీరువారను చెక్కిలెవ్వతె నొక్కెరా
కత్తిగోరుల దనుజమర్దన కందుకూరిజనార్దనా! 215

దబ్బులన్నియు తెలుసుకుంటిని తప్పుబాసలు సేయకూ
మబ్బుదేరెడి కన్నుగవతో మాటిమాటికి డాయకూ

ఉబ్బుచేసుక తత్తరంబున నొడలిపై చెయివేయకూ
గబ్బితనమున దనుజమర్దన కందుకూరి జనార్దనా! 216

అండబాయక కూడియుంటివి ఆయె బోయెను నాటికి
ఖండి మండిపడంగనేటికి కదలు మెప్పటిచోటికి
ఉండరా నీ మాటలకు నేనోర్వజాలను మాటికి
గండిదొంగవు దనుజమర్దన కందుకూరి జనార్దనా! 217

అలుకలన్నియు దీర నివు నా అండ కెప్పుడు వస్తివి
పిలిచి నవరత్నాలసొమ్ములు ప్రేమతో నెపుడిస్తివి
వలచి వలపించియును గూరిమి వదల కెప్పుడు మెస్తివి
కలసి వేడుక దనుజమర్దన కందుకూరి జనార్దనా! 218

కొదవలన్నియు దీర్చుకొంటివి గుణము వెరిగీ శయ్యను
అద నెరిగి నన్నేలితివి విరవాదివూవులశయ్యను
మదనకేళికి నీవె జాణవు మారుతాపము మాన్పరా
కదియ రారా దనుజమర్దన కందుకూరిజనార్దనా! 219

## నయన రగడ (శివభక్తి దీపిక)

శ్రీ పార్వతీశుఁ జూడక
పాపాత్ముఁడ నగుచుఁబోవఁ బథమునఁజక్షుల్
దీపించు దృష్టి తొలఁగిన
శ్రీపతి నడుగంగఁగర్త శివుఁడని చెప్పెన్. 220

శ్రీశైలవల్లభుని శిఖరంబుఁబొడగంటి
కాశీపురాధీశు గౌరీశుఁబొడగంటి
సర్వలోకేశ్వరుని సర్వేశుఁబొడగంటి
సర్వసంరక్షకుని సర్వంబుఁబొడగంటి



పరమాత్ము నీశానుఁ బరమేశుఁబొడగంటి!
పరమ యోగీంద్ర హృత్పదనిలయుఁబొడగంటి
చంద్రార్క శతకోటి సంకాశుఁబొడగంటి
చంద్రార్క శిఖినేత్రు శంకరునిఁబొడగంటి
రూపింపఁ బ్రకటస్వరూపంబుఁబొడగంటి
నాపరంజ్యోతియై యమరు దేవునిఁగంటి
వేదంబు లీశ్వరుని వినుతింపఁబొడగంటి
నాదిదేవుడుఁ రుద్రుఁడని శ్రుతులఁబొడగంటి
శ్రుతి 'యేక ఏవ రుద్రో' యనఁగఁబొడగంటి
శ్రుతి 'పరంబ్రహ్మ' మని శూలిఁబల్కుటఁగంటి
ముక్కంటికై శ్రుతుల్ మ్రొక్కఁగాఁబొడగంటి
ముక్కంటిలీలచే మ్రోయుచుండఁగఁగంటి
భర్గుఁడే తత్పరాత్పరుఁడనఁగఁబొడగంటి
భర్గుఁ డర్కునిలోనఁ బ్రభ వెలుంగుటఁగంటి
బ్రహ్మాండముల కోట్లు భర్గులోఁబొడగంటి
బ్రహ్మాండమాలికా భరణభూషితుఁగంటి
విశ్వరూపంబైన విశ్వేశు బొడగంటి
విశ్వచక్షుని విశ్వవేద్యు నభవునిఁగంటి
మూఁడు మూర్తుల కాదిమూర్తి దేవునిఁగంటి
మూఁడు మూర్తులలోన ముక్కంటిఁబొడగంటి
నష్టమూర్తుల కీర్తు లమరంగఁబొడగంటి
నిష్టభోగములెల్ల నిచ్చు వేల్పని కంటి
నజ్ఞానతిమిరసంహారసూర్యునిఁగంటి
సుజ్ఞాన సంశీల సులభ మోక్షముఁగంటి
నక్షరత్రయరూప మక్షయునిఁబొడగంటి

దక్షాధ్వర ధ్వంస ధన్యవేషునిఁగంటి
విమలాత్ము నాద్యంతవిరహితునిఁబొడగంటిఁ
గమలలోచన నయనకమల పూజితుఁగంటి
వృషభేంద్రవాహనుని విషకంఠుఁబొడగంటి
వృషభధ్వజుండైన వేదవేద్యునిఁగంటి
ధవళసంకాశంబు దశబాహుఁబొడగంటి
భవదుఃఖ సంహారుఁ బంచవదనుని గంటి
పురవైరి నంధకాసురవైరిఁ బొడగంటి
కరివైరి గంకాళకరధాముఁబొడగంటిఁ
గారుణ్య సాగరునిఁ గల్యాణుఁబొడగంటి
నారాయణప్రియుని నాగకంకణుఁగంటి
మహినొప్పు శ్రీశైల మహిమ నేఁబొడగంటి
బహువేదశాస్త్రముల్ ప్రణుతి సేయుటఁగంటి
భూలోక కైలాసపుర మనఁదగఁబొడగంటి
ఫాలాక్షుఁడచ్చోటఁ బాయకుండుటఁగంటి
ధృతిఁ దూర్పు మొగసాల త్రిపురాంతకముఁగంటి
నతులజ్యోతిర్లింగ మట యామ్యమునఁగంటిఁ
బలు పశ్చిమద్వార బ్రహ్మేశ్వరముఁగంటి
జెలువొందు నుత్తర శ్రీమహేశ్వరుఁగంటి
క్షితి లక్షకోట్లకును శివతీర్థములుగంటి
చతురొప్పఁ బదికోట్ల శక్తిరూపులఁగంటి
దివ్యస్థలంబులను దివ్యులను బొడగంటి
దివ్యయోగీంద్రులను దివ్యమహిమలఁగంటి
రంగొందు పాతాళగంగ నేఁబొడగంటి
గంగపాతాళంబు గంగఁ గలియుటఁగంటి



గంగలోఁ ద్రిజగముల్ గదలకుండుటఁగంటి
గంగలో సురమునులు గదలకుండుటఁగంటిఁ
బుణ్య కుండము లెల్లఁ బొలుపారు నని కంటిఁ
బుణ్యజలములతోడఁ బొసఁగ ధారలు గంటి
సరి నొప్పు బంగారు శైలంబుఁబొడగంటిఁ
బరికింప నవరత్న పర్వతంబులు గంటి
నెనసి యోగస్థలము లెల్లచోఁబొడగంటి
ఘనబిలంబులు గుహలు గహ్వరంబులు గంటి
కామరూపుల గిరులఁ గణఁ కతోఁబొడగంటి
కామరూపుల నున్న కల్పతరువులఁగంటిఁ
జరపర్వతంబులును జరవృక్షములు గంటి
ధరణిఁ బ్రొద్దొకచాయ తరులు గిరులును గంటి
గిరులు నీడలు లేక క్రిక్కిఱియఁబొడగంటి
తరులు నీడలు లేక తనరుచుండుటఁగంటి
నీడ దిరుగని శైలనికరంబుఁ బొడగంటి
నీడ దిరుగని తరులు నియతి నుండుటఁగంటి
వృక్ష మొక్కటి సర్వ వృక్ష ఫలములు గంటి
వృక్ష మొక్కటి సర్వ వృక్షజాతులు గంటి
నగపక్షి మృగతరులు నాట్యమాడుటఁగంటి
నగపక్షి మృగతరులు నాథుఁ గొల్చుటఁగంటి
నరసురాసురు లుమానాథుఁ గొల్చుటఁగంటి
హరివిధీంద్రాదు లట నభవుఁ గొల్చుటఁగంటి
రుద్రుఁగొల్చిన పెక్కు రుద్రులను బొడగంటి
రుద్రగణముల వివిధరూపధారులఁగంటి
ఋషి తపములు సేయు ఋషులనేఁ బొడగంటి

కూడి మ్రోసెడు వేదఘోషంబుఁబొడగంటి
సురదుందుభుల మ్రోఁత సొంపారఁబొడగంటి
సురసతులు నాట్యంబు సొరిది నాడుటఁగంటి
నాంగికమ్ముక నాడు భృంగీశుఁబొడగంటి
సంగీతనాదములు సకలదిక్కులఁగంటిఁ
బరగ శ్రీశైలంబు భావమునఁబొడగంటి
దురితంబు లన్నియును దొలఁగి పోవుటఁగంటి
శ్రీపర్వతేంద్రంబు శిఖరంబుఁబొడగంటి
శ్రీపార్వతీనాథుఁ జేరికొల్చుటఁగంటి
నా దివ్యలింగంబు నర్చింపఁబొడగంటి
మోదమున సాయుజ్య ముక్తి నీయఁగఁగంటిఁ
బర్వతలింగంబుఁ బ్రాణేశుఁడని కంటిఁ
బర్వతేశ్వరుహృదయ పద్మనిలయునిఁగంటి
శ్రీకంఠు శ్రుతివచ శ్శితికంఠుఁబొడగంటి
లోకేశు నిజభక్త లోకేశుఁబొడగంటి
నజు నజరు నమరు నవ్యయు నీశుఁబొడగంటి
గజకృత్తిధరు దయాకరు జగద్గురుఁ గంటిఁ
గ్రతువైరిఁ బురవైరి  గామారిఁబొడగంటిఁ
బతి నుమాపతి నాదిపతి లోకపతిఁగంటిఁ
బతి సర్వపతి దేవపతి యీశుఁడని కంటి
బతిభక్తులకు నాదిపతి శంభుఁడని కంటి
నతికాముఁ బ్రతికాము ననిలోముఁబొడగంటి
నతిశుద్ధు నతిబుద్ధు నతిబౌద్ధుఁ బొడగంటి
శివకథామర్మములు శివధర్మములు గంటి
శివమూల మంత్రము శివతంత్రములు గంటి



తారకబ్రహ్మంబు తత్త్వంబుఁబొడగంటి
హారకర్పూర నీహారాద్రి నిభుఁగంటి
నిర్వాణ నిస్సీమ నిష్పాపరుచిఁగంటి
దుర్వార దుస్సార దుర్భేదహరుఁగంటి
ప్రణవాది మంత్రప్రపంచంబుఁబొడగంటి
నణిమాది గుణదూరమగువీథిఁబొడగంటి
షట్తర్క షట్కర్మ షట్చక్ర గతిఁగంటి
షట్త్రింశ దుస్తర స్థల లక్షణముఁగంటి
అక్షరత్రయరూపమగు నబ్ధిఁబొడగంటి
నక్షరాంబుధిలోన నమృతంబుఁ బొడగంటి
నక్షరగ్రామంబు లందైదు బొడగంటి
నక్షరపు లక్షణము లన్నియును బొడగంటి
నమితశబ్దబ్రహ్మమంతయును బొడగంటి
విమలశబ్దబ్రహ్మ విభవ మేర్పడఁగంటి
చొర నవసరము లేక శ్రుతు లున్కిఁబొడగంటి
హరతత్త్వ నిరతులై యతులున్కిఁ బొడగంటిఁ
గర్మంబు లందు డగ్గఱరామిఁబొడగంటి
ధర్మముల్ తమత్రోవ తలపింపఁబొడగంటి
శివభక్తి సంసార సీమదాఁటుటఁగంటి
నవివేకులకు భక్తి యలవికాదని కంటి
నొగి నభవులో లోక ముదయింపఁబొడగంటి
నగణిత క్రమశైవ మది దైవమని కంటి
నిరవొప్ప హరతత్త్వమే యందమని కంటి
హరతత్త్వమక్షీణ మానందమనికంటి
ఋషు లెల్ల శైవ స్వరూపులని పొడగంటి

విస మమృతమును జేయు విమలచిత్తులఁ గంటి
బసవన్న నన్నేలు భర్తగాఁ బొడగంటి
బసవన్న మా పాలిపరమేశుఁడని కంటి
బసవాక్షరత్రయము పావనం బని కంటి
బసవన్న భక్తులకుఁ బరుసవే దని కంటి
బసవా యనినఁ బాయుఁ బాపంబు లని కంటి
బసవా యనిన మోక్షపద మబ్బునని కంటి
కడఁగి కన్నపఁ డీశుఁ గాలఁ దన్నుటఁ గంటి
జడలతో గండూషజలము లుమియుటఁగంటి
మిఱుమిండఁ డెంతయును మేటియని పొడగంటి
గఱకంఠుపైఁ గినిసి గంటివేయుట గంటి
ధరణి వేశ్యయు నంబి తర్కింపఁ బొడగంటి
నిరువురకుఁ బరమేశుఁ డెదుర నిల్చుటఁగంటి
గొడుకుఁ జంపినఁ గాని కుడువ నను పతి గంటిఁ
గొడుకుఁ జంపించియును కుడువ నను పతి గంటి
నెదరు దిరిగిన కంచి యేడు వాడలు గంటిఁ
గొడుకుతోడనె కూడికొనిపోవఁ బొడగంటి
భల్లాణుపత్నిఁ దాపసుఁడు వేఁడుటఁ గంటి
నిల్లాలి భల్లాణుఁ డిచ్చి మ్రొక్కుటఁ గంటి
గఱకంఠునకు నక్కగారు దక్కుటఁ గంటి
నెఱుకమై శ్రీశైల మెక్కుడిగ్గమిఁ గంటి
మతిమంతు మడివాలు మాచధీమణిఁ గంటిఁ
జతురుఁడై యేనుఁగును జావ నుదుకుటఁ గంటి
భక్తులప్రతిహత ప్రథిత మతులని కంటి
భక్తులకుఁ బ్రత్యర్థిపరులు లేరని కంటి



భక్తులకు నెందు నాపదలు లేవని కంటి
భక్తు లాపదలచేఁ బట్టువడరని కంటి
భక్తు లహి కేయూర పద బద్ధులని కంటి
భక్తులతి నిర్వాణ పదసిద్ధులని కంటి
భక్తులు జగత్త్రాణ పదలోలురని కంటి
భక్తులు సదానంద పదశీలు రని కంటి
భక్తులే పదవులును బడయ నొల్లమిఁ గంటి
భక్తులకు నేరుచల్ భక్తిఁ బోలమిఁ గంటి
భక్తులద్భుత కర్మ పారీణులని కంటి
భక్తు లద్భుత పుణ్యఫలభాగులని కంటి
భక్తుల కుమాభర్త ప్రాణంబులని కంటి
భక్తులుద్ధృట దోషభవ ముక్తులని కంటి
భక్తు లసదృశ భోగ భాగ్యైకు లని కంటి
భక్తు లిహపర భోగ భాగ్యైకులని కంటి
శివభక్తు లక్షర శ్రీకరములని కంటి
శివభక్తు లాచారశేఖరములని కంటి
శివభక్తి దూషకులు చిరపాపులని కంటి
శివభక్తి దూషకులు చెడిపోదురని కంటి
శివభక్తి కల్యాణసీమ దాఁటుట గంటి
శివభక్తి యభిమత స్థితికర్తయని కంటి
శివభక్తి శత్రులకు శివము లేదని కంటి
శివభక్తి మిత్రులకు శివసౌఖ్యమని కంటి
నిశ్చలము భక్తులకు నెఱయఁ జేకుఱఁ గంటి
దుశ్చరిత భక్తులకుఁ దొలఁగించునని కంటి
త్రిభువనము భక్తులకుఁ దృణకణములని కంటి

సభలందు భక్తులకు జయవాదమని కంటి
భక్తియే వేదములు పడయలే వని కంటి
భక్తి యే వాదముల్ పడయలేవని కంటి
భక్తి యింద్రాదులును బడయలేరని కంటి
భక్తి సూర్యాదులును బడయలేరని కంటి
భక్తి బ్రహ్మాదులును బడయలేరని కంటి
భక్తి విష్ణ్వాదులును బడయలేరని కంటి
భక్తి సత్యముచేతఁ బ్రభవించునని కంటి
భక్తిరుచి సద్గుణ ప్రారంభమని కంటి
భక్తి గురుకారుణ్య ఫలమూలమని కంటి
భక్తిచాతుర్వర్గఫలదాయియని కంటి
భస్మధారికిఁగాని భక్తిలేదని కంటి
భస్మంబు భక్తియును బావనంబని కంటి
భస్మముత్తమలోక పాథేయమని కంటి
భస్మ త్రిపుండ్రంబు పరమార్థమని కంటి
భస్మంబు శ్రుతులెల్లఁ బాటించునని కంటి
భస్మంబు యోగసంపద మూలమని కంటి
భస్మంబు సర్వసంపత్కరంబని కంటి
భస్మంబు శివయోగి ఫలవృక్షమని కంటి
భస్మ మిహపరములకుఁ బట్టుఁగొమ్మని కంటి
భస్మంబు మా పాలి పరమేశుఁడని కంటి
భస్మంబు త్రైలోక్య పావనంబని కంటి
భస్మంబు కర్మాబ్ధిబాడబంబని కంటి
భస్మంబు ఋషులెల్ల భక్తిఁదాల్చుటఁ గంటి
భస్మంబు హర్యజులు భక్తిఁదాల్చుటఁ గంటి



రుద్రాక్ష రుద్రనేత్రోద్భవంబని కంటి
రుద్రాక్ష రుద్రస్వరూపమని పొడగంటి
రుద్రాక్ష వేదముల రూపు బల్కుట గంటి
రుద్రాక్ష బ్రహ్మాది ఋషులు గట్టుటఁగంటి
రుద్రాక్ష భవగజము ద్రుంచునని పొడగంటి
రుద్రాక్ష పాపములు రోలఁ దోలుటఁ గంటి
రుద్రాక్ష పుణ్యములు రొక్క మిచ్చుటఁ గంటి
రుద్రాక్ష జపమునకు రుద్రుఁడౌనని కంటి
రుద్రాక్ష ధరుఁడు శ్రీరుద్రుఁడౌనని కంటి
రుద్రాక్ష ఫలమహిమ రుద్రుఁడౌనని కంటి
సకల నిష్కళమంత్ర సంబంధమనికంటి
నకలంక మగుమంత్ర మపవర్గమని కంటి
పాదతీర్థముఁ ద్రావ బాపహర మని కంటిఁ
పాదతీర్థముఁ ద్రావ ప్రాణరక్షని కంటి
పాదతీర్థముఁజిల్కఁ బసిడియౌ నని కంటి
పాదతీర్థము... ప్రమదరస మని కంటి
బాదతీర్థముఁ ద్రావ ఫల మెక్కుడని కంటిఁ
బాదతీర్థము వేదభక్తిరసమని కంటిఁ
బాదతీర్థము తీర్థఫల సారమని కంటిఁ
బాదతీర్థముఁ ద్రావ భవహరంబని కంటి
ధరఁ బ్రసాదస్థలము తలఁపలేనని కంటి
సరిఁ బ్రసాదస్థలము చవి యెఱుంగుటఁ గంటి
నెలకొని ప్రసాదంబు నిలుపరాదని కంటి
మలసి ప్రసాదంబు మలహరంబని కంటి
గొనకొని ప్రసాదంబు కుడువవలె నని కంటి

పనిగొని ప్రసాదంబు భవహరంబని కంటిఁ
గుమన తి ప్రసాదంబు కుడువరాదని కంటి
విమల ప్రసాదంబు విడువరా దని కంటిఁ
దెలియరు ప్రసాదంబు తెఱఁ గజ్ఞులని కంటి
మలదేహికిఁ బ్రసాదమలవి కాదని కంటి
మునుకొని ప్రసాదంబు ముట్టరాదని కంటిఁ
దనియరు ప్రసాదంబు తత్త్వజ్ఞులని కంటి
నెనయ రుచు లీశునకు నీవలయునని కంటి
గొనకొనక నిల్చి మఱి కొనవలయునని కంటి
ననుదినము నర్పించు నాతఁ డతఁ డని కంటిఁ
బెనఁగి ప్రసాదంబుఁ బెట్టరా దని కంటి
భర్గోపకృతులు సద్భక్తులని పొడగంటి
స్వర్గాది భోగముల్ సరకుగావని కంటి
గలదు లేదనరాదు కైవల్యమని కంటిఁ
గలదన్న చోటనే కలఁ డీశుఁడని కంటి
తత్త్వంబు లా రుద్రుఁ దడవలేవని కంటి
సత్త్వాది గుణకోటి సంఖ్య కేమని కంటి
నఖిలేశునకు నాది యరయరాదని కంటి
నఖిలైక్యునకు నంత్యమరయరాదని కంటి
నఖిలేశునకు నెక్కు డరయ లేదని కంటి
నఖిలాండనాయకుం డాదియని పొడగంటి
నఖిలంబుఁ బుట్టించు నభవుఁడని పొడగంటి
నఖిలంబు హరునందు నణఁగునని పొడగంటి
సంసారహరమైన సర్వేశుఁ బొడగంటి
హింసకులు వడయలే రిహపరములని కంటి



సచరాచరానేక జగదుద్భవముఁ గంటి
నచరంబున జగమ్ము లన్నియును బొడగంటి
కా దహంకారమమకారంబుఁ బొడగంటి
లే దితర పరతత్త్వ లేశంబుఁ బొడగంటి
నత్యద్భుతాకార మాకారమని కంటి
ప్రత్యక్ష మానంద పాకంబుఁ బొడగంటిఁ
బుణ్యపాపము లీశుఁ బొందనేరమిఁ గంటి
గణ్యముల్ శ్రుతు లీశుఁ గాననేరమిఁ గంటి
వేదము లుమానాథు వెదకి కానమిఁ గంటి
నాదిదేవుఁడు శంభుఁడని శ్రుతులం బొడగంటిఁ
బంచవింశతిమీఁదఁ బతి రుద్రుఁడని కంటిఁ
బంచాశదక్షర ప్రభవంబుఁ బొడగంటి
నీ లోకనిర్వాహ మీశానుఁడని కంటి
నీ లోకసన్నాహ మీశానుఁడని కంటి
నీ లోకనిస్తార మీశానుఁడని కంటి
నీ లోకనిర్వాణ మీశానుఁడని కంటి
బ్రహ్మాది సురలెల్లఁ బశువు లని పొడగంటి
బ్రహ్మ విష్ణ్వాదులకుఁ బతి రుద్రుఁడని కంటి
బ్రహ్మ విష్ణువుల కౌ వాదంబుఁ బొడగంటి
బ్రహ్మపద మిద్దఱును బడసి కానమిఁ గంటి
నంత లోకప్రభువు నరచేతిలోఁగంటి
జింతించు భక్తులకు శివుడులోనని కంటి
శివభక్తి తుదముట్టఁ జేరఁగాదని కంటి
శివభక్తి తుదిముట్టఁ జేరలేనని కంటి
శివభక్తి శ్రుతుల కాశ్రితమగుట పొడగంటి

శివభక్తి నతుల కాశీర్వాదమని కంటి
నాసనన్యాస కరుణాతీతుఁ బొడగంటి
దాసోహ మనుత్రోవ తలనున్న శివుఁగంటి
ద్రోహు లద్వైతులకుఁ దొలఁగి పోవుటఁగంటి
దేహదోషాతీత దివ్యభోగముఁ గంటి
సుఖదుఃఖములు శివుని సోఁకనేరమిఁ గంటి
నఖిలబీజములు సోమాదిత్యులని కంటి
నా రెండు వెలుఁగులే హరుకన్నులని కంటి
గౌరీశుఁడే సర్వకర్త యనఁగాఁ గంటిఁ
....          ......          ......
గారుణ్యమున శివుఁడు కనుపించెనని కంటి
కఱకుమాటల భక్తి గలుగు నేరమిఁ గంటి
నెఱుఁగరా దెవ్వరికి నీశానునని కంటి
మనదధీచుని దక్ష మఖమునను బొడగంటిఁ
బెనుపొంద శ్రుతుల శాపించి విడుచుటఁ గంటిఁ
బరగ శివమంత్రంబు ప్రబలి పొందుటఁ గంటిఁ
బరికింప శివభక్తి పదమెక్కు డని కంటి
శరధిఁ దరువఁగ సద్విషాగ్ని పొంగుటఁ గంటి
సురలెల్ల గరళంబుఁ జూచి పాఱుటఁ గంటి
గరళ మప్పుడు లోకకర్త మ్రింగుటఁ గంటి
గరకంఠనామంబు గణుతి కెక్కఁగఁ గంటి
క్షేమదస్ఫుట సౌఖ్యఖేటంబు బొడగంటి
సోమ ఖండాఖండ జూటంబుఁ బొడగంటి
భరిత నయనాభీల భాలంబుఁ బొడగంటి
సురచిర స్ఫుటజైత్ర శూలంబుఁ బొడగంటి
క్రతుహరుని శుద్ధ కంకాళంబుఁ బొడగంటి



జితగజాజిన మహాచేలంబునఁ బొడగంటి
గురుమౌళి సురసరిత్కూలంబుఁ బొడగంటి
గిరిసుతా తనుబాగకీలంబుఁ బొడగంటి
నతిసుందరాకార మాదివృషభునిఁ గంటి
రతిరాగ భస్మాంగరాగంబుఁ బొడగంటి
గురుకుచము కచము ననుకూలంబుఁ బొడగంటి
హరినేత్ర పూజితుని నాదిమూలముఁ గంటిఁ
బరికింప నాలోని పాపంబు కడగంటి
నరసిపాపము నన్ను నంటరాదని కంటి
బహుపాపధరుఁ డేల భక్తుఁడౌనని కంటి
బహుపాపములు నన్నుఁ బట్టి విడుచుటఁ గంటి
నయముగా నయనములు నాకీయఁ బొడగంటి
భయభక్తు లీ భర్గు పాదములు పొడగంటి
నిది పుణ్యమని కంటి నిది గణ్యమని కంటి
నిది యోగమని కంటి నిది భోగమని కంటి
నిది ధర్మమని కంటి నిది మర్మమని కంటి
నిది నిత్యమని కంటి నిది సత్యమని కంటి
నిది పుణ్యములకెల్ల నెక్కుడని పొడగంటి
నిది గణ్యములకెల్ల నెక్కుడని పొడగంటి
నిది యోగములకెల్ల నెక్కుడని పొడగంటి
నిది భోగములకెల్ల నెక్కుడని పొడగంటి
నిది ధర్మములకెల్ల నెక్కుడని పొడగంటి
నిది మర్మములకెల్ల నెక్కుడని పొడగంటి
నిది నిత్యములకెల్ల నెక్కుడని పొడగంటి
నిది సత్యములకెల్ల నెక్కుడని పొడగంటి

గణగిసంసారంబు కడగంటినని కంటి
గణఁగి శ్రీగిరి చెన్ను కారుణ్యమని కంటి
ఘనుఁడు రంగన దూషకరగండఁడని కంటి
జనకల్పతరులలో జయశాలి యని కంటిఁ
దవిలి రంగనమంత్రి ధన్యకృతి యని కంటి
భువిలోనఁ బ్రోలాంబ పుణ్యవతి యని కంటి
నింక శ్రీగిరిఁ జేర నేఁ గందు నని కంటి
శంకరుని కృప వడయ సమయమిది యని కంటి
నిఁకను నాయెత్తు కృతు లిత్తునని పొడగంటి
నిఁకఁ గృతుల్ చెప్పనా కేమి భయమని కంటి
వడిఁ గృతుల్ నాయెత్తు వచ్చునని పొడగంటి
మృడుఁ డింక నాకృతుల్ మెచ్చునని పొడగంటిఁ
దనర శ్రీరంగకవి దాత యని పొడగంటి
...... ...... ......
భువిలోపలఁ బ్రసిద్ధ పుణ్యుఁడనఁగాఁ గంటి
శివభక్తి దీపికా శీతాంశువని కంటి
శ్రీగిరీశునకు నర్పింతు నని పొడగంటి
శ్రీగిరీశ్వరుని కృప చెన్నలరునని కంటి. 221

## నమశ్శివాయ రగడ (శివమంత్ర వర్ణనము)

కII శ్రీకాము లతులకీర్తి
శ్రీకాము లుమాధినాథ చిత్తానంద
శ్రీకాములు సద్భక్తిం
జేకొనుఁడు 'నమశ్శివాయ' చెప్పెద మీకున్. 222



## నమశ్శివాయ

శ్రీగిరీశ వశ్యమంత్ర సేకరము నమశ్శివాయ
ఆగమోపదిష్ట విధి మహాకరము నమశ్శివాయ
పంచవర్ణ పంచరూప భాసురము నమశ్శివాయ
అంచితానురక్త జిత గజాసురము నమశ్శివాయ
సునిశితోపనిష దధీత సుస్వరము నమశ్శివాయ
కనదనూన భక్తిరస వికస్వరము నమశ్శివాయ
పారలౌకిక ప్రధాన భాషణము నమశ్శివాయ
భూరిపుణ్య హేతుభూత భూషణము నమశ్శివాయ
సతత జన్మ దాహ దగ్ధ చందనము నమశ్శివాయ
నత విశిష్ట భక్తబృంద నందనము నమశ్శివాయ
శ్రుతిశిర స్సహస్ర రత్న సుందరము నమశ్శివాయ
మత కుతర్క శరధి మథన మందరము నమశ్శివాయ
దారువన మునీంద్ర ముఖ్యధర్మము నమశ్శివాయ
దూర దూర హత నికృష్ట దుర్మదము నమశ్శివాయ
తరుణ చంద్ర జూట దర్పదర్పణము నమశ్శివాయ
హరణ భరణశక్తి కృత సమర్పణము నమశ్శివాయ
పరమభక్త మహిత హిత విభావనము నమశ్శివాయ
చిరతరప్రభావ భావజీవనము నమశ్శివాయ
వామదేవ తత్త్వ లేశ వాచకము నమశ్శివాయ
సోమపాన ఫల సహస్ర సూచకము నమశ్శివాయ
నరకహర విశిష్టమంత్ర నాయకము నమశ్శివాయ
ధరణిసుర సుధీ విధా విధాయకము నమశ్శివాయ
దారుణాధి జలధిమగ్న తారకము నమశ్శివాయ
కారణ ప్రధాన వస్తుకారకము నమశ్శివాయ

బాధపాప ఘోరకృత్య పాచకము నమశ్శివాయ
మూఢ గూఢ మోహబంధ మోచకము నమశ్శివాయ
పారుఘోరకృత్యపాచకము నమశ్శివాయ
కర్మదోష హరవిచార కారణము నమశ్శివాయ
ధర్మ మర్మ మూలమంత్ర ధారణము నమశ్శివాయ
ప్రస్తవ ప్రశస్త భరణ పండితము నమశ్శివాయ
మస్తకాయమాన విభవమండితము నమశ్శివాయ
రక్త భక్త నిత్య సత్య రక్షణము నమశ్శివాయ
భక్తలోక హృదయశోక భక్షణము నమశ్శివాయ
భజనధన్య సుజన వజ్రపంజరము నమశ్శివాయ
కుజనదృష్టి దోషకంజ కుంజరము నమశ్శివాయ
సర్గదుష్ట దుష్టచిత్తశాసకము నమశ్శివాయ
భర్గరూప దుర్గలసదుపాసకము నమశ్శివాయ
పురభి దభిమతానురక్త పోషకము నమశ్శివాయ
సురభవన కళంకపంక శోషకము నమశ్శివాయ
పాశుపత పథ ప్రవృద్ధ పాలనము నమశ్శివాయ
క్లేశ పాశ వలన దళన ఖేలనము నమశ్శివాయ
యోగిహృదయ సదయ జల పయోధరము నమశ్శివాయ
భోగిభూష పక్షవిభవ భూధరము నమశ్శివాయ
దురితహత నికృష్టదుష్ట దుర్భరము నమశ్శివాయ
నిరతిశయ దయాశమాది నిర్భరము నమశ్శివాయ
భవవిపినాపౌక్ష దహన పాటవము నమశ్శివాయ
కవిముఖప్రసిద్ధ నియమ కాటవము నమశ్శివాయ
నికటపుణ్య తంత్రనిచయ నిశ్చయము నమశ్శివాయ
ప్రకటధీర భావభర తపశ్చయము నమశ్శివాయ



భూతనాథ చరణకమల పూజనము నమశ్శివాయ
ప్రాతతప్రశస్త వస్తుభావజనము నమశ్శివాయ
శోషణాది శుద్ధికరణ శోధితము నమశ్శివాయ
పోషితాగమ ప్రమేయ బోధితము నమశ్శివాయ
ప్రసవశరవికార భావభంజనము నమశ్శివాయ
రసికభక్త రాజలోకరంజనము నమశ్శివాయ
కలుషగజనికాయ సింహగర్జనము నమశ్శివాయ
వలభిదాది చపలభజన వర్జనము నమశ్శివాయ
శరణగణ గణాధినాథ శాతనము నమశ్శివాయ
నరసురేశవినుతనత సనాతనము నమశ్శివాయ
ఘనఘనాఘచండ విపినఖండనము నమశ్శివాయ
మనన మథిత శివరహస్యమండనము నమశ్శివాయ
కుతలజాత భర్గరూపగురువనము నమశ్శివాయ
తతఫలప్రదాన కల్పతరువనము నమశ్శివాయ
మారమథన పరులలోని మంతనము నమశ్శివాయ
చేరి శివునిఁగొలుచువారి చింతనము నమశ్శివాయ
కలయ వెదకి శ్రుతులు దొలుతఁ గన్నయది నమశ్శివాయ
ఒలసి మంత్రకోటి గొలువ నున్న యది నమశ్శివాయ
నరకలోకవాసికైన నాకదము నమశ్శివాయ
విరసమతికి నైన నురువివేకదము నమశ్శివాయ
అల్ప పుణ్యమతుల కెందు నందనిది నమశ్శివాయ
కల్ప కోటిశతములందుఁ గందనిది నమశ్శివాయ
పురహరునకు మొదలఁ మొదలఁ బుట్టినది నమశ్శివాయ
పరమధర్మ నిరతు లర్థిఁ బట్టినది నమశ్శివాయ
శివుఁ డజాది సురల కెల్లఁ జెప్పినది నమశ్శివాయ

కవసి వాసవాది సతులఁ గప్పినది నమశ్శివాయ
దురితహరుఁడు దొడవుగాఁగఁ దొడిగెడిది నమశ్శివాయ
కరణదుఃఖ మలిన హతులఁ గడిగెడిది నమశ్శివాయ
ఓరవోక సర్ప సమితి నుండెడి నమశ్శివాయ
పారిజాతఫల సమృద్ధిఁ బండెడిది నమశ్శివాయ
దురితవితతిఁ దూరుపాఱఁ దోలెడిది నమశ్శివాయ
వరము లోలి నిచ్చుచోట వ్రాలెడిది నమశ్శివాయ
మునులు ఘనులు మించి తలఁచి మ్రొక్కెడిది నమశ్శివాయ
ఇన శశి శిఖినయనవీథి నెక్కెడిది నమశ్శివాయ
ఓట లేక పుణ్యపథము లూఁతెడిది నమశ్శివాయ
మేటిసుకృతకోటి నెల్ల మీఁటెడిది నమశ్శివాయ
తిర మిడుకొని విబుధవరులఁ ద్రిప్పెడిది నమశ్శివాయ
గురుముఖ ప్రదత్తమగుచుఁ గ్రొప్పెడిది నమశ్శివాయ
బహువిధ ప్రమాదములను బాపెడిది నమశ్శివాయ
సుహితపుణ్య భోగపంక్తిఁ జూపెడిది నమశ్శివాయ
మూల మీ నమశ్శివాయ ముఖ్య మీ నమశ్శివాయ
శీల మీ నమశ్శివాయ శిఖఱ మీ నమశ్శివాయ
సుపథ మీ నమశ్శివాయ శుద్ధ మీ నమశ్శివాయ
నిపుణ మీ నమశ్శివాయ నిత్య మీ నమశ్శివాయ
గగన మీ నమశ్శివాయ గర్త మీ నమశ్శివాయ
నిగమ మీ నమశ్శివాయ నిఖిల మీ నమశ్శివాయ
వీర మీ నమశ్శివాయ విమల మీ నమశ్శివాయ
సార మీ నమశ్శివాయ సౌఖ్య మీ నమశ్శివాయ
ధనద మీ నమశ్శివాయ ధన్య మీ నమశ్శివాయ
జనన మీ నమశ్శివాయ జన్య మీ నమశ్శివాయ



యోగ మీ నమశ్శివాయ యోగ్య మీ నమశ్శివాయ
భోగ మీ నమశ్శివాయ భోగ్య మీ నమశ్శివాయ
సరస మీ నమశ్శివాయ సత్య మీ నమశ్శివాయ
పరమ మీ నమశ్శివాయ బ్రహ్మ మీ నమశ్శివాయ 223

కం. ఈ యష్టోత్తరశతమును
బాయక పఠియించునతఁడు పరమానంద
శ్రీయుక్తుఁడు రై యుక్తుఁడు
ధీయుక్తుఁడునై తనర్చు దివ్యమహత్తన్. 224

చం. అని మన రంగనాథుఁడు దయానిధి శ్రీగిరినాథుమీఁద జె
ప్పిన శివమంత్రవర్ణనము చిత్తసముద్గత భక్తియుక్తి వ్రా
సినఁ గొనియాడినన్ వినినఁ జెల్వెసలారఁ బఠించినన్ జగ
జ్జనులకుఁ బుణ్యసంపద లసంఖ్యములై సమకూరు నిమ్మహిన్. 225

## రంగనాథుని శివకవిత్వము

రంగనాథుఁడను కవీశ్వరునిఁగూర్చి యిటీవల చెలరేగిన వాద దావాగ్నిలోఁ జిక్కువడి నే నొడలు కాల్చుకొనఁజాలను. ప్రాచీన కావ్య లక్షణ శాస్త్ర కవిచరిత్రాది పరిజ్ఞానము గొల్పుటలో నాకుఁ బ్రాచీన లక్షణ గ్రంథకర్తలు పితృతుల్యులు. ఉ ప్వాని యువ్వెత్తున వారి పరిజ్ఞానము నుత్తుత్తి దానిఁగా నే నూఁదివేయఁజాలను. వారు భ్రమ ప్రమాదములు లేనివారనఁ గాదు. ప్రబల ప్రమాణములచే నట్టి వట్టిసరకును నిరూపించి కొట్టివేయుట లగ్గు. రంగనాథుని గూర్చి యుపలబ్ధాంశముల నెత్తి చూపుటకే నా యీ యుపక్రమము. ఇందు ప్రామాణ్య చర్చను ప్రాజ్ఞులు కావింపఁగలరు గాక!

i

కర్ణాటక కవియగు తోంటెదార్యకవి 'పాల్కురికి సోమేశ్వర పురాణము'న రంగనాథుని విషయము నిట్లు చెప్పినాఁడు. చక్రపాణి రంగనాథుఁడను వైష్ణవునితో సోమనాథునకు మతవిషయమునఁ దగవు వాటిల్లెను. ఆ శైవుని దర్పింపఁడుగాన

సోమనాథుఁడు తెరచాటున నుండి వాదముచేయ నంగీకరించెను. కాని యా వైష్ణవుని జయించుటకు సోమనాథుని పుత్రుఁడగు చతుర్ముఖబసవేశ్వరుఁడే తలపడెను. వారిర్వురకు గొప్ప వాదము జరిగెను. రంగనాథుఁడోడి పోయెను. పరాజయ దుఃఖముతో నా రంగనాథుడుఁ శ్రీశైలమార్గముననే తిరిగి పోయెను. శ్రీశైల మల్లికార్జునిఁజూడక ద్వేషబుద్ధితోనే యరిగెను. ఆ శివద్వేషముచే నాతనికిఁ గన్నులు గ్రుడ్డివయ్యెను. అహోబలమున కరిగి యాతఁడు నరసింహస్వామిని బ్రార్థించెను. ఆ స్వామి వలన స్వప్నమున శివాధిక్యబోధమును బడసి లజ్జితుఁడై తిరిగి శ్రీశైలమునకు వచ్చి మల్లికార్జునుని బహువిధములఁ బ్రస్తుతించెను. ఒక కన్ను వచ్చెను. పదపడి పాలుకురికికి వచ్చి సోమనాథునిఁ దర్శించి యపచారము క్షమింపఁ ప్రార్థించెను. సోమనాథుఁడనుగ్రహించెను. రెండవ కన్నును వచ్చెను. రంగనాథుఁడు శైవదీక్ష నొసఁగుమని సోమనాథునిఁబ్రార్థించెను. పుత్రుఁడగు చతుర్ముఖ బసవేశ్వరునిచేత సోమనాథుఁడాతని శివ దీక్షితుని జేయించెను. రంగనాథుఁడప్పుడు వీరభద్రవిజయ శరభచరిత్రాదులను రచియించి గురుపాదముల కర్పించెను".

ii

పాల్కురికి సోమనాథపురాణమే కాక కర్ణాటకకృతి యగు గురురాజ చరిత్రము గూడా నీ చక్రపాణి రంగనాథుని చరిత్రమును జెప్పుచున్నది. తొంటె దార్యకవి చెప్పినట్టే యా గురురాజ చరిత్రకర్త సిద్ధనంజేశకవియు రంగనాథుని యోటమిని జెప్పినాఁడు. 'వీరభద్ర విజయము' 'శరభలీల' యను గ్రంథములనే కాక యాతఁడు శ్రీగిరినాథవిక్రమమని యేనూఱు సీసపద్యముల తెలుఁగు గ్రంథమును గూడ రచించెనట! దానినే సంస్కృతమునఁగూడ రచించెనట! ఆ కవి యిట్లు చెప్పుచున్నాఁడు.

'శ్రీ శైలభర్తకును సీసంగ ళేనూఱు
లే సప్ప పద్యంగ ళెంటు సావిరగళుం
భాసురద దండకం సాహస్ర తారావళియు నాల్కు లయగ్రాహియు
ఆ శతక వృత్తగళు దోధకం సావిరవు
భాసురద తోటకం నూఱు రగళెగ ళేడు
భాషిసిద మత్తకోకిల మూఱుసాసిరం గీతియం తాఱునూఱు

సరస మంజెర వెంటు కందంగ ళైనూఱు
విరచిసిద కృతియు మూవత్తాఱు గద్యగళు
నిరువ మూవత్తాఱు వుభయశతకం వొప్పు మిగిలు సర్వేశనిమగె 226

ఇందు 'శ్రీగిరినాథ విక్రమము' అనుపేర శ్రీశైల మల్లికార్జునిపై నైదువందల సీసపద్యములను, నెనిమిదివేల పద్యములుగల మరొక గ్రంథమును, వేయిపాదములు గల దండకమును, నొక తారావళిని, నాలుగు లయగ్రాహులను, నొక వృత్త శతకమును, వేయి దోధకవృత్తములను, నూఱు తోటక వృత్తములను, నేఁడు రగడలను, మూఁడువేల మత్తకోకిలలను, నాఱు వందల గీత పద్యములను, నెనిమిది మంజరులను, నైనూఱు కందములను, ముప్పదియాఱు గద్యములను, ముప్పదియాఱు ఉభయశతకములను చెప్పినట్లు ఈ పద్యమునందున్నది. ఇతని యీ కృతులెల్ల నిప్పుడు మనకు గానరావు.

iii

కాని శివదూషణచేఁ గన్నులుపోఁగా శివస్తుతిచేఁ గన్నులు తెచ్చికొన్నట్లుగా రంగనకవి రచించినట్లుగా శ్రీగిరిమల్లికార్జుననిమీఁద రగడ యొకటి యున్నది. 'శివభక్తిదీపిక' యని దానికిఁబేరు. దానికే 'నయనరగడ' యని నామాంతరము.

iv

నేఁడు శివమంత్రవర్ణనము అను పేర మఱియొక రగడ రంగనాథుఁడు రచించినదిగానే దొరకినది. నమశ్శివాయరగడ యని దీనికి నామాంతరము. దీని కడపట నీ క్రింది పద్యమున్నది.

'అని మన? (మును?)రంగనాథుఁడు దయానిధి శ్రీ గిరినాథుమీఁద జె

ప్పిన శివమంత్రవర్ణనము చిత్తసముద్గత భక్తియుక్తి వ్రా
సినఁ గొనియాడినన్ వినినఁ జెల్వెసలారఁ బఠించినన్ జగ
జ్జనులకుఁ బుణ్యసంపద లసంఖ్యములై సమకూఱు నిమ్మహిన్. 227

ఈ పద్యమును రంగనాథుఁడే రచించెనో లేక తర్వాతికాలమున నితరుఁడే రచించెనో? ఈ రెండు రగడల నిప్పుడిక్కడ బ్రకటించినాఁడను. సిద్ధ నంజేశ కవి పద్యములో లెక్కింపఁబడిన రంగనాథుని రగడ లేడింటిలో నిప్పటికి రెండు రగడలు దొరకిన వనవచ్చును. 1. శివభక్తిదీపిక యను నయనరగడ 2. శివమంత్రవర్ణన మను నీ నమశ్శివాయ రగడ.

v

శివభక్తిదీపిక వ్రాఁతప్రతిలో కడపట నిట్లున్నది.

'వైష్ణవ చక్రపాణి రంగనాథుఁడు శైవ దీక్షాధారణమైన తర్వాతను చేసిన నయనరగడ'

vi

'ఏకశిలానగర వృత్తాంతము'లో రంగనాథుని గూర్చి యిట్లున్నది.

'రంగనాథుఁడు ఆందోళికపై నెక్కి చనుదెంచునప్పుడు త్రిపురాంతక దేవుని గోపురంబు జూచి 'అది యేమి' యని యడిగిన నా వివరాలు త్రిపురాంతక గోపురంబని పలుకుటయు నా శివభవనంబు జూడనొల్లక మైనపుజడ్లు కప్పించు కొనియె. అప్పుడు రంగనాథుని నేత్రంబులు గానరాక జాత్యంధుని వలెనే మగిడి శ్రీరంగానకు పోయి యద్దేవుని బ్రసన్నుని జేసికొని నేత్రంబులు పోయెనని మొఱయాడుటయు, నద్దేవుండు కరుణించి త్రిపురాంతక దేవుణ్ణి వేడుకొమ్మనుటయు రంగనాథుండు మళ్ళీ త్రిపురాంతకమున కేతెంచి యద్దేవునకు నమస్కరించి తనయెత్తుకృతులు సమర్పింతునని వ్రతంబుచేసి భక్తిమయంబగు రగడ చెప్పిన నద్దేవుండు ప్రసన్నుండై రంగనాథునకు నిరుకన్నుల నొసగుటయు, రంగనాథుఁడు పాలకుర్తికిం జని సోమనాథునిచే శివదీక్షగైకొనియె. ఆ యయ్య వద్ద



శైవరహస్యంబులు తెలిసికొనుచుండె. అంత నిక్కడ ప్రతాపరుద్రుండు రంగనాథుని ప్రభావంబు విని యాశ్చర్యంబు నొందెను'. రంగనాథుని గూర్చిన పై కథ నిన్ననో నేఁడో యెవరో సృష్టించిరని యుజ్జగింప వీలులేనిది.

vii

శ్రీనాథుని సమకాలపువాఁడగు కొలని గణపతిదేవుఁడు తన 'శివయోగ సారము'న చక్రపాణి రంగనకవి నిట్లు స్తుతించినాఁడు.

'అసమ శివభక్తి రసమా
నసునిం బాల్కురికి సోమనాథుని, గవిరా
జ సమున్నతయశు సద్యః
ప్రసాది యగు చక్రపాణి రంగనఁ గొలుతున్' 228

viii

గురురాజకవి పద్యమున రంగనాథుఁడు నూఱు తోటక వృత్తములను గూడ రచించినట్లు కలదు. ఛందో గ్రంథములలో రంగనాథుని తోటకము లివి రెండు కానవచ్చినవి.

బాలబోధచ్ఛందస్సులో –

తోటకము. ఉపవాసము లెల్లను నుండుట నీ
కృప వచ్చుటకా యది రిత్త సుమీ
యపవిత్రునిఁ బుల్లని యంబలికై
సుపవిత్రునిఁ జేయుట సుద్ది గదే. 229

హనుమచ్ఛందస్సులో –

తోటకము. చెలువార గజాజినచేలముతో
గళనీలిమతో నహికంకణుఁడై
తలఁ జంద్రకళం గల దైవము మా

కులదైవము దైవతకోటులలోన్. 230

వీనినిబట్టి సిద్ధనంజేశకవి చెప్పిన తోటకవృత్తములను రంగనాథుఁడు రచించుట సమర్థిత మగుచున్నది.

రంగనాథుని యనుకరణము కావచ్చును, కాశీఖండమున శ్రీనాథుఁడు కూడ తోటకవృత్తరచనము చేసినాడు[1].

ix

బాలబోధచ్ఛందమున రంగనాథునిదిగా నీ క్రింది కందపద్యము కలదు.

క ॥ ఫాలతల భస్మరేఖలు. 231

ఇది సమగ్రముగా లేదు. ఇది సిద్ధనంజేశకవి పేర్కొన్న నూఱు కందములలోఁ జేరినదేమో!

x

ప్రయోగరత్నాకరములో రంగనాథుని మిత్రవిందా పరిణయము లోనిదిగా నీ క్రింది పద్యభాగమున్నది.

"వనమాలి గొలుచు నందుననె యెల్లప్పుడు" 233

xi

పలువురు శివకవులు కవిస్తుతిలో రంగనాథుని శివకవినిగా స్తుతించినారు. మచ్చునకు ఒకటి.

భద్రకవి లింగకవి రంగనాథ ప్రశంస.

1. ఈ పట్టున శ్రీ ప్రభాకరుల నోట్సులో క్రింది యంశము కలదు.
"ఎఱ్ఱాప్రెగడ – వనక్రీడపట్టు.
తోటకం. "తాలిమి దూలిన తాపసపత్నుల్
వ్రీళమనంబున వీడ్కొని చేరన్
లోలమదాలసలోచన పంక్తిన్
జాలఁగ నొప్పెను శంకరలీలన్



'దండితోఁ బండితత్రయముఁ గీర్తించి
సకలవేదపురాణశాస్త్రేతిహాస
నికరార్థములు ప్రమాణించి సద్భక్తి
శ్రీమతి నుద్ధరించిన పాలకుఱికి
సోమనాథేశ్వరు సొంపుతోఁ గొలిచి
రంగద్విశాలాంతరంగంబునందు
రంగనాథునిఁ గవిరాజన్యుఁ దలఁచి
యసమానచరితుఁ బ్రత్య గ్రకల్యాణ
బసవేశుఁ బిడుపర్తి బసవేశుఁ గొలిచి (సానందోపాఖ్యానము) 234

xii

వైష్ణవుఁడైన చక్రపాణి రంగనాథుఁడు శైవుఁడై రంగనకవి యయినాఁడు. ఇట్లే శైవుఁడైన తెనాలిరామలింగకవి వైష్ణవుఁడై రామకృష్ణుఁడయినాఁడు.

xiii

రంగనాథుని పద్యములుగా ప్రబంధరత్నావళిలో నీ పద్యములున్నవి. ఇవి కూడ (శ్రీశైలమల్లికార్జున) శివస్తవపరములేకాన, పయి రంగనాథుని రచన ములే యగుట సుస్పష్ట మయినది.

అదలని తేరు తేరికిని నాదరువై తగు విల్లు వింటికిం
గుదురగు నారి నారిపయిఁ గూన్కు శరంబు శరంబు బొద్దునం
బొదలిన యంత యంతముఖముల్ నిజవాసములైన గుఱ్ఱముల్
చెదరక నీకు నెట్టి పని సేయు నయా! గిరిజాధినాయకా! 235

ఓజు చేముట్టుక యొగ్గానఁ బట్టక
చక్కఁగా దివిఁ బాఱు చక్రములును
లాయానఁ గట్టక లలి మేఁత వెట్టక
వర్ణహీనంబైన వారువములు

తపనవెట్టక జీవితము కాసు ముట్టక
సత్త్వసంపదఁ జూపు సారథియును
కడచీలఁ దట్టక ఘనముగా మెట్టక
గంభీరసంపద గలుగునిరుసుఁ

గలిగి తనరారునరదంబుఁ గడఁక నెక్కి
త్రిపురవిజయంబుఁ జేకొన్న దేవదేవుఁ
డిందుశేఖరుఁ డానందమందిరుండు
మనలఁ గరుణావిధేయుఁడై మనుచుఁగాత! 236

గోశతపంచవార్ధులును గోయుగవార్ధులు గోత్రివార్ధులున్
గోశరవార్ధులున్ విదితగోశర (వార్ధులు) పంచవార్ధు లా
కేశవతల్ప పద్మభవ కేకిపవాహన దానవేశ దే
వేశుల కిచ్చునట్టి పరమేశ్వరుఁ డీవుత మా కభీష్టముల్. 237

xiv

పొత్తపి వెంకటరమణకవి రచించిన లక్షణశిరోమణి యను లక్షణ గ్రంథములో 'అచ్చవెల్లి రంగన్న గారు' అను పేర రంగనాథ రామాయణ ద్విపదలుదాహరింపఁబడినవి. 'అచ్చవెల్లి' యను గ్రామము నేఁడు కడపజిల్లా పులివెందుల తాలూకాలో నున్నది.

xv

ఒకానొక లక్షణ గ్రంథమున నిట్లున్నది.

రంగనాథ పద్యము –

ఉ. మంచెన చూచితే శివసమాహితచిత్తులు పద్మవాసనా
కుంచనచంచదున్మిషితకోమలమూల సరోజకర్ణికా
భ్యంచితబిందునాదరసభవ్యనిరంతరశబ్దవల్లి శీ
లించుతెఱంగు శ్రీగిరిఁ జలింపని మర్త్యనిలింపు లింపునన్. 238

# పండిత-కవి-ప్రశంసా స్తబకము

## సంస్కృత కవులు

### బిల్హణుఁడు

ఈతఁడు కాశ్మీర దేశమువాఁడు. ఆంధ్రదేశమున క్రీ॥ పదవ శతాబ్ది నాఁట చాళుక్యరాజగు సోమేశ్వరుని యాస్థానమునఁ బెక్కేండ్లు కవీశ్వరుఁడుగా నుండి యా రాజు చరిత్రమునే విక్రమాంకదేవచరిత్ర మనుపేరఁ బ్రశస్త కావ్యముగా రచించినాఁడు. ఏదో కోపమువచ్చి తుదకు విక్రమాంకదేవుఁ డీతని సర్వస్వమును హరించి దేశమునుండి వెడలఁగొట్టఁగాఁ జెప్పిన శ్లోకము :–

శ్లో ॥ సర్వస్వం గృహవర్తి కుంతలపతి ర్గృహ్ణాతు త న్మే పున
ర్భాండాగార మఖండ మేవ హృదయే జాగర్తి సారస్వతమ్
రే! క్షుద్రాః! త్యజత ప్రమోద మధునా ప్యాయాంతి మన్మందిరం
హేలాందోళిత కర్ణతాళకరటి స్కంధాదిరూఢాః శ్రియః 239

తొలుత రాజాస్థానమునఁ బ్రవేశము కలుగకపోఁగా నందుకై పండితుల వెంట రాజద్వారాశ్రయము జరుపునాళ్ళలో నాతఁడు చెప్పికొన్నది.

శ్లో॥ రాజద్వారే స్మరాగారే విశంతి ప్రవిశంతి చ
దండవ త్పండితా స్సర్వే బిల్హణో వృషణాయతే. 240

అతనివైదుష్య దర్పము :–

శ్లో॥ బిందుద్వంద్వతరంగితాగ్రసరణిః కర్తా శిరోబిందుకం
కర్మేతి క్రమశిక్షితాన్వయకలా యే కేపి తేభ్యోంజలిః
యే తు గ్రన్థసహస్రశాణకషణత్రుట్యత్కలంకైర్గిరా
ముల్లాసైః కవయంతి బిల్హణకవి స్తేష్వేవ సన్నహ్యతి. 241

రాజద్వారము నాశ్రయించి చెడిన బిల్హణాదులఁగూర్చి యెవరో చెప్పిన శ్లోకము :-

శ్లో ॥ జీవన్నేవ పిశాచతా ముపగతఃఖ్యాతః కవి ర్బిల్హణః
ఛందోగోయ మితి ప్రభాకరగురు ర్దేశా త్సముత్సారితః
మాతంగత్వ ముపేయివాన్ వరరుచిః ప్రఖ్యాతనామాపిసన్
రాజద్వార ముపాశ్రితైః ఖలు జనైః కిం కిం న సంభావ్యతే ॥ 242

## పెద్దిభట్టు

ఈతఁడు వెలుగోటి సింగభూపాలునినాఁటివాఁడు. మల్లినాథుని పేర నీతఁడే గ్రంథములు రచించెనని ప్రతీతి. అందు కీ యైతిహ్య మున్నది. మల్లి నాథుఁడును బెద్దిభట్టు నన్నదమ్ములు. మల్లినాథుఁడు మందబుద్ధి గలవాఁడు. పెద్దిభట్టు పెద్దబుద్ధి గలవాఁడు. వీరు నివసించు గ్రామము చేరువ నడవిలో నొక యోగీశ్వరుఁడు తపస్సు చేసికొనుచుండెను. మందబుద్ధి యగు మల్లి నాథుఁడు తత్పరతతో నా యోగీశ్వరుని శుశ్రూషించుచుండెను. పెద్దిభట్టును సకృత్తుగా సందర్శించుచుండెడివాఁడు. మల్లినాథుఁ డొకప్పుడు కార్యవశమున గ్రామాంతరమున కరిగెను. అన్నగారిచే నాజ్ఞప్తుఁడై యప్పుడు పెద్దిభట్టాయోగి నారాధించుచుండెను. అది యా యోగికి నిర్యాణకాల మయ్యెను. మల్లినాథుఁడు దగ్గఱ లేఁడయ్యెను. తన కిన్నినాళ్ళు చేసిన శుశ్రూషకై యా యోగి మల్లినాథునకు సారస్వతము నుపదేశించి యుద్ధరింపఁ దలఁచెను. కాని యట్లు తటస్థింపదయ్యెను. అప్పుడు సేవించుచుఁ జెంతనున్న పెద్దిభట్టును జూచి మీ యన్నకుఁజేయఁదలంచుకొన్న యుపదేశము నాతని యసన్నిధిచే నీకుఁ జేయుచున్నాను. దీని ఫలము మీ యన్నగారికే చెందఁజేయుదువు గాక యని యొక మంత్ర ముపదేశించి యా యోగి సిద్ధిపొందెను. పెద్దిభట్టంతతో మహోపాధ్యాయుఁడయ్యెను. గుర్వాజ్ఞ చొప్పున నాతఁడు తాను రచించిన గ్రంథముల నన్నింటిని నన్నగారగు మల్లినాథుని పేరనే ప్రకటించెను.



## మల్లినాథుని వైదుష్యము

గ్రంథములందు మల్లినాథుఁడని పేరున్నది. కావున నా పేరే పేర్కొని యెదను. ఈయన స్వతంత్ర గ్రంథము లంతగా రచించినట్టు కానరాదు. హెచ్చుగా వ్యాఖ్యాన గ్రంథములే యగపడుచున్నవి. రఘువంశ, కుమారసంభవ, మేఘసందేశ కిరాతార్జునీయ, శిశుపాలవధములకుఁ బంచకావ్యములన్న పేరుగల్గుటయును, సంస్కృత భాష నభ్యసించు విద్యార్థు లీ గ్రంథములనే ప్రధానముగా నారంభించి చదువుటయును, సుగమములైన మల్లినాథ వ్యాఖ్యలు వెలసిన తర్వాతనే యేర్పడిన దని కొందఱు తలంచుట కలదు. కాని తార్కిక రక్షటీకలో మల్లినాథుఁడే "స్ఫుటీకృతం చైత దస్మాభిః పంచ కావ్యటీకాసు" అనుటవలన నాయననాఁటికే యీ గ్రంథములకుఁ బంచకావ్యసంజ్ఞ కలదని యేర్పడుచున్నది. ప్రధానముగా విద్యార్థు లా గ్రంథములనే చదువుటకుఁ గారణము మల్లినాథ వ్యాఖ్యలు కావచ్చును. రఘువంశాది కావ్యములకు మల్లినాథునకుఁ బూర్వకాలమందే పదులకొలఁది వ్యాఖ్య లున్నవి. కాని ఈయన వ్యాఖ్యలు వెలసిన తర్వాత వానికిఁ బ్రచారము తగ్గినది. ముద్రణాది సౌకర్యము లేని యాకాలముననే మన మల్లినాథుని గ్రంథము లాసేతుశీతాచలము వ్యాపించినవి. ఇట్టి వ్యాప్తికి వాని ఘనతయే కారణము.

మల్లినాథుఁడు రచియించిన గ్రంథము లివి తెలియవచ్చుచున్నవి. రఘువంశ, కుమారసంభవ, మేఘసందేశ, కిరాతార్జునీయ, శిశుపాలవధము లను పంచకావ్యములకు వ్యాఖ్యలు, నైషధవ్యాఖ్య, భట్టికావ్యవ్యాఖ్య, ఏకావళివ్యాఖ్య, తంత్రవార్తికటీక, స్వరమంజరీవ్యాఖ్య (పరిమళము), తార్కిక రక్షటీక, జ్యౌతిష గ్రంథము, రఘువీర చరితము – ఇది మల్లినాథకృతి యగునో కాదో!

పెద్దిభట్టు సింగభూపతి కాలమున నున్న వాఁడనుటకు సాధకముగా నీ క్రింది శ్లోకము దొరికినది. తర్వాత దీనిని చమత్కార చంద్రికలో చూచితిని.

శ్లో ॥ కిం వాససా చీకరిబాకిరేణ కిం దారుణా వంకరటింకరేణ
శ్రీసింగభూపాల విలోకనార్థం వైదుష్య మేకం విదుషాం సహాయమ్. 243

పెద్దిభట్టొకనాడు చీఁకిరి బాఁకిరి చినుఁగుల ప్రాంతఁ కట్టుకొని, వంకర టింకర కఱ్ఱ చేతఁబట్టుకొని సింగభూపతి విద్వత్సభకుఁబోవుచుండఁ ద్రోవలో నెవరో యడిగిరటఁ "తాతగారూ! రాజసభ కిట్టి వేషముతోఁబోవుచున్నారే" మని. అప్పుడాయన పై శ్లోకము చెప్పెనట!

రెండవ యర్థము – పల్లకీ లేకపోయిన నేమి యని, పల్లకికి చీకిరి బాకిరి కుచ్చులు, వంకర టింకర బొంగు ఉండును. మఱియుఁ బెద్దిభట్టు గణాధిప ప్రసాదము గలవాఁడని చంపూరామాయణవ్యాఖ్యాది శ్లోకములందున్నది. రఘువంశాది వ్యాఖ్యలందుఁ బ్రధానముగాఁ జేసిన గణపతి స్తుతిశ్లోకములున్నవి.

పెద్దిభట్టు పేర నీ క్రింది కథలను గొందఱు చెప్పుచున్నారు. "పెద్దిభట్టు తోడల్లుఁడు ఘనాంతము వేదవిద్య నేర్చినవాఁడు. మంచి కండపుష్టి కలవాఁడు. పెద్దిభట్టు మంచి సంస్కృత సాహిత్యము, శాస్త్రపాండిత్యముఁ గలవాఁడుగదా! పెద్దయల్లుఁడగు నా వేదముగ్ధుఁడును చిన్న యల్లుఁడగు నీ శాస్త్రచతురుఁడును నత్తవారింటి కేక కాలమున నొకప్పుడేతెంచిరి. అత్తమామ లా పెద్ద యల్లు నలక్ష్యముతో నగౌరవముతోను, నీ పిన్న యల్లుని మన్నన మర్యాదల తోను జూడసాగిరి. అతని వేదవైదుష్యమును వెక్కిరించి యాతని శాస్త్ర చాతుర్యమును సన్నుతించిరి.అతనికి నడవలోఁ జాఁపమీఁదను, నీతనికిఁ బడుక గదిలోఁ బట్టెమంచముమీఁదను శయనవిధాన మేర్పఱచిరి. పెద్దాతఁడు కోపమునఁ గుములుచుండెను. పిన్నాతఁ డుత్సాహమున నుప్పొంగుచుండెను. పడుక గది నుండి రాత్రి లఘుశంకకు బయలి కేఁగుచు నీ పిన్నాతఁడు త్రోవలో నడవలోఁ బండుకొనియున్న తోడియల్లు నొకతన్ను తన్ని యెఱఁగక ప్రమాదమునఁ దన్నినట్లు రెణ్ణాళ్లాయెను. అనుదినము నట్లే తన్నుచు "క్షమధ్వమ్" చెప్పుచుండ సాగించెను. ఒకనాఁడు రెణ్ణాళ్లోర్చుకొనెను. కాని పెద్దయాతఁడా మీఁద నాఁగఁజాలఁడయ్యెను. మూఁడవనాఁడు నట్లే యాతఁడు తన్ని "క్షమధ్వము" చెప్పెను. కోపాటోపముతో లేచి యా పెద్దయాతఁడీ చిన్న యాతని సిగపట్టుకొని వంగలాగి "పొగరుబోతా!



ప్రతిదినముఁ దన్నుచు నొకటే క్షమధ్వము చెప్పసాగించితివి. నీకొక క్షమధ్వము వచ్చిన నాకు ముప్పది రెండు శ్రయధ్వములు వచ్చును. ఏమనుకొన్నావో నా దెబ్బ చూచికొ"మ్మని ప్రథమా ద్వితీయేషు శ్రయధ్వం, ద్వితీయాస్తృతీయేషు శ్రయధ్వం, తృతీయా శ్చతుర్థేషు శ్రయధ్వం (ఇట్లు ముప్పది రెండు శ్రయధ్వములు గల వేదమంత్ర మున్నది) అని సస్వరముగాఁ జదువుచు నొక్కక గ్రుద్దు చొప్పున ముప్పది రెండు గ్రుద్దులు వెన్నెముకలు విఱుగునట్లు వీఁపుమీదఁదగిలించెను. అవమానితుఁడై పిన్న యల్లు డడఁగి యుండెను. అనేకులీకథను బెద్దిభట్టు పేరఁజెప్పెదురు. తన్నులు తగిలినవనుటకు శ్రయధ్వములయిన వనుట పారిభాషికముగా వైదికుల వాడుకలో నున్నది.

ఎల్లప్పుడును సుకవి సూక్తి రసాస్వాదన తత్పరుఁడుగా నుండు నీ పెద్ది భట్టు స్త్రీ వర్ణనమున మంచి మంచి శ్లోకములను జదువుచుఁడఁగా వినుచున్నదై యాతని యిల్లా లొకనాఁడిట్లు వేఁడికొన్నదట. "వారిని వారిని వర్ణించిన శ్లోకములను జదువుదురే గాని నన్నొకనాఁడైన వర్ణింపరైతిరి గదా!" యని. నాఁడిట్లు వర్ణించినాఁడు పెద్దిభట్టు.

శ్లో ॥ మేరుమందర సమానమధ్యమా తింత్రిణీదళవిశాలలోచనా
అర్క శుష్క ఫలకోమలస్తనీ పెద్దిభట్ట గృహిణీ విరాజతే. 244

గ్రంథ వ్యాఖ్యానదీక్షతోఁ గాలమెల్లఁ గడుపుచుఁ బెద్ది భట్టింటిపని నంటించుకొనకుండెను. ఇత్యర్థః, ఇతిభావః అనుచు నీయన కూరుచుండుట వలన నిల్లాలికి గృహనిర్వాహము దుష్కర మగుచుండెను. ఒకనాఁ డొక యాప్తవిద్వాంసు డతిథియై యింటికి రాఁగా నేఁడేమి కూరగాయలు వండెదవని పెద్దిభట్టుభార్య నడిగెను. వమె యిట్లు బదులు చెప్పెను. "ఇత్యర్థముల కూర–ఇతిభావముల పులుసు వండెదను మీరింటి నిండ నించుచున్న పదార్థము లివే కదా!".

ఈతఁడు శ్రీహర్షనైషధమునకు వార్ధక్యమున వ్యాఖ్య గావింపనారంభించెను. జీవిత సంశయముఁ దొందర తొందరగా రచించుట చేత నా వ్యాఖ్య యపర్యాప్తముగా

నుండెను. అది చూచి యొక పండితుఁడింత లఘువుగా రచించుచున్నారేమని యడుఁగగా "మాఘే మేఘే గతం వయః" (మాఘమున, మేఘ సందేశమున వయస్సు కడచెను) అని పెద్దిభట్టు బదులు చెప్పెను. ఇట్టి కథలు మఱికొన్ని యున్నవి.

## బాణుఁడు

ఈతఁడు క్రీ. 8వ శతాబ్దినాఁడు హర్షవర్ధనుఁడను రాజునాస్థానమున నుండి కాదంబర్యాది దివ్య గ్రంథముల రచించిన మహా కవి. ఈతఁడు మరణింపఁగా నీతని మిత్రుఁడింకొక కవీశ్వరుడుఁ చెప్పిన శ్లోకము.

శ్లో ॥ ధ్వస్తః కావ్యోరుమేరుః కవివిపణి మహారత్న రాశి ర్విశీర్ణః
శుష్కశ్శబ్దౌఘసింధుః ప్రళయ ముపగతో వాక్యమాణిక్యకోశః
దివ్యోక్తీనాం నిధానం నిధన ముపగతం హా హతా దివ్యవాణీ
బాణే గీర్వాణవాణీ ప్రణయిని విధినా శాయితే దీర్ఘనిద్రామ్. 245

## కపర్దిస్వామి

ఈతడు మల్లినాథుని వంశమునఁ బూర్వుడట.

శ్లో ॥ అంబా కుప్యతి న మయా
న స్నుషయా సాపి నాంబయా నమయా
అహమపి నతయా నతయా
వద రాజన్ కస్య దోషో యమ్. 246

## శాకల్య మల్లుభట్టు

ఈతఁడు రామాయణ యుద్ధకాండ శేషమును పూరించిన యయ్యలార్యుని బంధువు. విద్యానగరపు హరిహరరాయల సమకాలపువాఁడు.



శ్లో ॥ ఏకోఽ భూ త్పులినా త్తతస్తు నలినా చ్చాన్యేఽ పి నాకోరభూత్
ప్రాచ్యాస్తే త్రయఏవ దివ్యకవయో దీవ్యన్తు దేవ్యా గిరా
అర్వాంచో యది గద్యపద్యరచనా చాతుర్యవాగుద్ధతా
స్తాన్సర్వా నతిశయ్య ఖేలతితరాం శాకల్యమల్లః కవిః 247

ఆహెూ నారద శక్ర కిం క్వను గతో భూలోక మాలోకితుం
కో రాజా భువి విక్రమీ హరిహరో ధత్తే కియన్మండలమ్
ఆపూర్వార్ణవ మాపరార్ణవ .... .....
పూర్ణ స్తత్కవయో గజేంద్రవిజయీ శాకల్యమల్లః కవిః. 248

అభ్యుద్ధృతా వసుమతీ దళితోఽ రివర్గః
క్రోడీకృతా బలవతా బలిరాజలక్ష్మీః
ఏకత్ర జన్మని కృతం యదనేన యూనా
జన్మత్రయే తదకరోత్ పురుషః పురాణః 249

## లొల్లవారు

వీరిలోఁ గడపటివాఁడగు లక్ష్మీధరుఁడు బహు మహా గ్రంథకర్త. గజపతి ప్రతాపరుద్రునియు శ్రీకృష్ణదేవరాయలయు నాస్థానములలో విద్వత్కవిగా నుండినవాఁడు.

శ్లో ॥ శేషాశేషోక్తిభూషాః కణచరణ చణగ్రంథ సౌగంధ్య జిఘ్రా
భట్టోక్తి ప్రౌఢిలీఢా గురుగురుతరగీ ర్గుంభశుంభద్విజృంభాః
నిశ్శంకాశ్శంకరోక్తౌ పశుపతిమతనిర్వాహకా స్సాంఖ్యసఖ్యా
యస్స శ్రీలొల్లలక్ష్మీధర విబుధమణే ర్భాంతి వాచాం నిగుంభాః 250

శ్లో ॥ వయమిహ పదవిద్యాం మంత్ర మాన్వీక్షకీం వా
యది పథి విపథే వా వర్తయామ స్సపంథాః
ఉదయతి దిశి యస్యాం భానుమాన్ సైవ పూర్వా
నహి తరణి రుదీతే దిక్పరాధీనవృత్తిః 251

శ్లో ॥ సాయం సంపుల్లమల్లీ సుమసురభిసుధా మాధురీ సాధురీతిః
ప్రేంఖత్పుంఖానుపుంఖ స్ఫురదమరసరి ద్వీచివాచాలవాచః
లొల్ల శ్రీలక్ష్మణాఖ్యో గుణమణిజలధి ర్భాసతే భూసురాళీ
కేళీనాళీకపాళీ దశశతకిరణో విద్వదగ్రేసరోఽసౌ. 252

శ్లో॥ యః కర్ణాటవసుంధరాధిపమహాస్థానే సువర్ణాయితో
యో విద్వన్నికషాయితో నృపగృహే వేమాఖ్య పృథ్వీశితుః
శ్రీమల్లొల్లటభట్టశిష్య ఇతి యో లొల్లాఖ్యయా శ్రూయతే
శ్రీశేషాన్వయశేఖర స్స హి మహాదేవో విపశ్చిన్మహాన్. 253

శ్లో ॥ నికషాయితు మీహే వా సువర్ణాయితు మేవ వా
సువర్ణాయితు మేవే హే నికషో న హ్యలంక్రియా 254

శ్లో ॥ తర్కన్యక్కృత వావదూకనిచయం వాదిత్వ మాస్తాం మమ
వ్యాఖ్యాతృత్వ ముదారశిష్యనివహశ్లాఘ్యం తథా తిష్ఠతు
స్వర్లోకాచ్ చ్యవమానసిద్ధతటినీ కల్లోలసల్లాపినా
ముల్లాసా వచసాం న కస్య మనసాంమత్కా శ్చమత్కారిణః 255

శ్లో ॥ గతోయం శంకరాచార్యో వీరమాహేశ్వరో గతః
షట్చక్రభేదనే కో వా జానీతే మత్పరిశ్రమమ్. 256

## జగన్నాథ పండితరాయలు

ఈతఁడు క్రీ. 1650 ప్రాంతము వాఁడు.

శ్లో ॥ కవయతి పండితరాజే కవయ స్త్వన్యేఽపి విద్వాంసః
నృత్యతి పినాకపాణౌ నృత్య న్త్యన్యేపి భూతవేతాళాః 257

శ్లో ॥ మాధుర్యై రపి ధుర్యై ర్ద్రాక్షా క్షీరేక్షుమాక్షి కాదీనామ్
వన్ద్యైవ మాధురీయం పండితరాజస్య కవితాయాః 258



శ్లో ॥ గిరాం దేవీ వీణాగుణరణనహీనాదరకరా
యదీయానాం వాచా మమృతమయమాచామతి రసమ్
వచస్తస్యాకర్ణ్య శ్రవణసుభగం పండితపతే
రధున్వ న్మూర్ధానం నృపశు రథ వాయం పశుపతిః ॥ 259

శ్లో ॥ మధుద్రాక్షా సాక్షాదమృత మథ వామాధరసుధా
కదాచిత్కేషాంచిత్ఖలు హి విదధీరన్న పి ముదమ్
ధ్రువం తే జీవన్తోఽప్యహహ మృతకామన్దమతయో
న యేషా మానన్దం జనయతి జగన్నాథభణితిః ॥ 260

శ్లో ॥ ఢిల్లీశ్వరో వా జగదీశ్వరో వా
మనోరథాన్ పూరయితుం సమర్థః
అన్యైర్నృపాలైః పరిదీయమానం
శాకాయ వా స్యాత్ లవణాయ వా స్యాత్ ॥ 261

శ్లో ॥ నిర్మాణే యది మార్మికోసి నితరా మత్యంతపాకద్రవన్
మృద్వీకా మధుమాధురీ మధుపరీ హారోద్ధురాణాం గిరామ్
కావ్యం తర్హి సఖే సుఖేన కథయ త్వం సమ్ముఖే మాదృశాం
నోచేద్దుష్కృత మాత్మనాకృతమివ స్వాంతాద్బహి ర్మా కృథాః ॥ 262

శ్లో ॥ యవనీ నవనీతకోమలాంగీ
శయనీయం యది యాతి చే త్కదాచిత్
అవనీతలమేవ సాధు మన్యే
న వనీ మాఘవనీ వినోదహేతుః ॥ 263

శ్లో ॥ న యాచే గజాళిం న వా వాజిరాజిం
న విత్తేషు చిత్తం న మే కించిదస్తి
ఇయం సుస్తనీ మస్తకన్యస్త హస్తా
లవంగీ కురంగీ దృగంగీకరోతు. 264

## సుసర్ల బ్రహ్మన్న శాస్త్రి

**ఈతఁడు కృష్ణామండలమున పెదకళ్లేపల్లి వాస్తవ్యుఁడు.**

శ్లో ॥ క్షేత్రం దాశరథిః ఖిలం నిజపదస్పర్శేన దోషోజ్ఝితం
తర్కజ్ఞస్య హి గౌతమీతటజుషో విప్రస్య స ప్రత్యదాత్
గోదాసప్తకతీరసంస్థితిజుషాం షడ్దర్శనీ దర్శినాం
శ్రీతిమ్మక్షితిపోఽ ఖిలం తదకర స్పర్శం విధత్తేఽ ధునాః ॥ 265

శ్లో ॥ తద్ధిత స్తద్ధిత స్త్వద్ధిత స్త్వద్ధితః
సద్ధిత స్సద్ధితో మద్ధితో మద్ధితః
ఏక ఏవ హ్యసౌ తిమ్మ రాజప్రభు
స్తద్ధిత స్త్వద్ధిత స్సద్ధితో మద్ధితః ॥ 266

## నడిమింటి మంగళేశ్వరశాస్త్రులు

విశాఖపట్టణంజిల్లా పార్వతీపురము తాలూకాలోని నాగూరను నగ్రహారమున మీఁదఁ బేర్కొన్న నడిమింటి మంగళేశ్వర శాస్త్రులను నుద్దండ విద్వాంసుఁడు జన్మించెను. ఇప్పటికి నెనుబది యేండ్ల క్రిందటి వఱకు నీతఁడు జీవించియుండెను. విశాఖపట్టణ మండల మందేగాక సర్వాంధ్రదేశమందును నీ పండిత ప్రకాండునిపేరు ప్రఖ్యాతమయినది. వ్యాకరణశాస్త్రమం దీయన మహాపండితుఁడు. తెనాలి రామలింగనివిధము వాఁడు. సుకవి. సంస్కృత భాషాపరిచయము గోరు బాలురకయి సమాసకుసుమావళి యనుపేర నీయన రచించిన లఘుగ్రంథము మన దేశమున బహువ్యాప్తికలది. సంస్కృతభాషా భ్యాసము సేయు ప్రతివిద్యార్థియు నా గ్రంథప్రతిని జదువుచున్నాఁడు.

1. బొబ్బిలి సంస్థానమునకు వీరి యగ్రహారము చేరువనున్నది. ఆ కారణమున బొబ్బిలి ప్రభువులతో నీయనకుఁ దఱచుగా సమాగమము కల్గు



చుండెడిది. నక్క యెడమ వైపు నుండి కుడి వైపునకుఁ బోయిన మంచిదా? కుడివైపు నుండి యెడమవైపునకుఁబోయిన మంచిదా? యని యొకనాఁడు బొబ్బిలి రాజుగారు విద్వద్గోష్ఠిలో మంగళేశ్వర శాస్త్రులుగారి నడిగిరి. శాస్త్రులుగా రిట్లు బదులు చెప్పిరి! అది కఱవలేదుకదా!! కఱవకుండ నెటుపోయినను మంచిదే.

2. బొబ్బిలి రాజుగారు మీకు ఊరు + ఇచ్చెద మనుచున్నారని తదాస్థానో ద్యోగియగు తన మిత్రుఁడొకఁడు చెప్పఁగా దాని తత్త్వ మెఱిఁగిన యాయన యిట్లు బదులు చెప్పెను. "మీరాజుగా రెప్పుడూ ఊరిస్తూనే వుంటారులెండి"....

3. బొబ్బిలిరాజుగారు సీతారామపురమను పేరుగల తమ సంస్థాన గ్రామమున వేంచేసియున్న గోపాలస్వామియే యజమానుడుగా నొకప్పుడు యజ్ఞము చేయించినారట. ఆ యజ్ఞమునకు విచ్చేయను మన మంగళేశ్వర శాస్త్రులుగారికిని ఆహ్వానపత్రిక వచ్చెను. దాని కీయన యిట్లు బదులు వ్రాసి పుచ్చెను. 'ప్రభూ! శ్రీవేణుగోపాలస్వామివారు స్వయముగాఁ జేయుచున్న యజ్ఞమును దర్శింప నేను దప్పక రావలసినవాఁడనే కాని నాకిక్కడ నొక్క చిక్కు తటస్థించినది. మా గ్రామమున రేగాలమ్మయని గ్రామదేవత కలదు. ఆమెను మా యూరనె నెలకొనియున్న పోతురాజును దేవరకిచ్చి పెద్దలు పెండ్లి చేసినారు. రేగాలమ్మ యెన్నాళ్ళకును సమర్తాడదయ్యెను. పోతురాజు బ్రహ్మచర్యమున నిల్వఁజాలక తనకిట్టి యసందర్భ వివాహ మేల చేయవలెనని మా గ్రామమువారిమీఁద మహాగ్రహావిష్టుఁడై యున్నాఁడు. మేమందఱము పోతురాజుగారివలన భీతిగొనియున్నాము. మా యదృష్టవశమున నీనాటికి రేగాలమ్మ పెద్దమనుష్యురాలయినది. మీరు శ్రీవేణుగోపాలస్వామి వారి యజ్ఞమునకుఁ బెట్టించిన సుముహూర్తము చాల దొడ్డదగుటచే మేము నదే సుముహూర్తమున సౌభాగ్యవతియగు రేగాలమ్మకు గర్భాధానమంగళము జరిపింప నిదివఱకే నిర్ణయించి పోతురాజుగారి నాశ్వాసపఱచే ప్రయత్నములు జరుపుచున్నాము. గ్రామమునఁ బెద్దవాఁడనగుటచే నే నా శుభకార్యమున కుండితీరవలయును. అప్పుడుండ కున్నను, సుముహూర్తము మార్చినను బోతురాజుగారికి మహాగ్రహము

వచ్చును. ఈ కారణమున శ్రీస్వామి వారి యజ్ఞమునకు రాజాలనందుకు నన్ను క్షమింప వేడెదను.

4. బొబ్బిలిసంస్థాన గ్రామ వాస్తవ్యులగు నొకరియింటఁ గొంత సొమ్ము దొంగలు దోచుకొని పోయిరట. దానిని విచారింప రాజుగారి కా యింటియతఁడు విన్నవించుకొనెను. కన్నము త్రవ్వక చేసిన దొంగతికము విచారింప సాధ్యము కానిదనియు నట్టి దొంగతికములను గూర్చి యింకమీఁద దమకు విన్నపము లంపుకొనరాదనియు ద్రోసిపుచ్చి యట్లే దండూరా వేయించిరట. దానీఁమీద నీ కవి చెప్పిన శ్లోకము :

శ్లో ॥ చోరస్సద్మోర్ధ్వ భేదాదర రవిఘటనా త్తత్రఘూణా ప్రఘానా,
దేదూకచ్ఛేదనాద్వావిశతి యది గృహం తత్ర నో నో విచారః,
కింత్వస్మాకం సురంగాకలనయితి పురే ఘోషయామాస యస్మా
త్తస్మాదేతత్సుగాధిప ఇతి బిరుదం ప్రోచురేతత్పురస్థాః. 267

5. తురుష్కులను గూర్చి యీయన యీ క్రింది శ్లోకమును జెప్పెనట!

శ్లో ॥ తురకః కరకశ్చైవ ద్వావేతౌ మలమోచకౌ,
తురకో దర్శనాదేవ కరకస్తు నిషేవణాత్. 268

6. ఈయనకు రుక్మేశ్వరశాస్త్రులను అన్నగారు గొప్ప విద్వాంసుఁడుండెను. వీరిరువురును రాజకార్యవశమున నొకప్పుడు విశాఖపట్టణము వచ్చి యక్కడ శిష్యులతో స్వయంపాకము చేసికొనుచుండిరి. ఒకనాఁడు రుక్మేశ్వర శాస్త్రులు తమ్మునితో నిట్లనియె. "అబ్బీ, కూరగాయలకై బాజారునకు వెళ్లు చున్నాను. నే నేకూర తెచ్చినను యేదో యాక్షేపము చేయుచుందువు. నీకు సరిపడు పదార్థములు నాకు తెలియకున్నవి, నేడేమి తెమ్మందువో చెప్పుము" అనెను. మంగళేశ్వర శాస్త్రులు కోపముతో నేతెమ్మన్నది తెచ్చెదరేని మాణిక్యము తెండు, అనెను. రుక్మేశ్వరశాస్త్రులు చెప్పిన శ్లోకము :-



శ్లో ॥ మాణిక్యక్రయణం లోకే మంగళాయ భవేత్కిల,
మంగళే సహజేఽస్మాకం మాణిక్యాత్కిం ప్రయోజనమ్. 269

7. మంగళేశ్వరశాస్త్రిగారికి గోపాలశాస్త్రియను కుమారుఁడు ప్రయోజకుఁడు విద్వాంసుఁడుండెను. తండ్రి జీవించియుండగానే యాతఁడు చనిపోయెను. ఎప్పుడును ఎల్లరను వెక్కిరించు స్వభావమే కలవాడగుటచేత గ్రామస్థులందరు నీయనను లోలోన ద్వేషించుచుండిరి. ఈయనను సాధింప వారికెన్నడును తఱి దొరకకుండెను. ఇప్పుడురా సమయ మనుకొని వారెవ్వరును శవమును మోయరారైరి. అట్టి దుఃఖసమయమందు కూడ యీతని చాతుర్యము కుంఠితము కాలేదు. ఇట్లనెనట – కొడుకు గోపాలశాస్త్రి బ్రతికి నిర్వాహకుఁడే. చచ్చీ నిర్వాహకుఁడే యైనాడే – ఈ కథను విశ్వగుణాదర్శాది గ్రంథకర్త శ్లేషయమక చక్రవర్తి అర్యాణిపాలెం వేంకటాచార్యుల పేరఁ గొందరు చెప్పుచున్నారు.

8. విజయనగర ప్రభువైన నారాయణగజపతి సన్నిధానమునకు సమ్మానము వడయుటకై యొకప్పు డొక మాధ్వ పండితుఁడు వచ్చెనట. రాజుగా రాయన వైదుష్యోన్మేషమును బరీక్షింపను బండితసభ కూర్పించిరి. ఎందరో పండితులందు వచ్చి యుండిరి. మంగళేశ్వర శాస్త్రులును బ్రచ్ఛనముగా నచ్చటికి వచ్చియుండెను. మాధ్వ పండితుఁడు మతవిషయోపన్యాసమును చేయ ననుజ్ఞగొని యద్వైతవిశిష్టాద్వైతములను ఖండింప నారంభించెను. అద్వైతము శాబ్దప్రమాణ బాధితమని చెప్పుచు "భిదాసత్యం భిదాసత్యం భిదాసత్యమ్" అని శ్రుతి వాక్యమున్నట్టు వైదికస్వరముతోఁ బల్కెనట. తోడనే మంగళేశ్వర శాస్త్రులు "భిదాసత్యమితి యోవదతి స చండాలో భవతి స చండాలో భవతి స చండాలో భవతి" యని యంతకంటె రంజకముగా నుచ్చస్వరముతో శ్రుతిరీతిని బఠించెనట! అందఱు నబ్రపడి యీయన కేసి చూచిరి. రాజుగా రభిముఖులైరి. ఎక్కడిదీ శ్రుతివాక్య మని యడిగిరి. మంగళేశ్వరశాస్త్రు లిట్లు పలికెను. 'ప్రభూ! మన మధ్వాచార్యులుగారు సెలవిచ్చిన శ్రుతివాక్యము పూర్వపక్షవాక్యము. ఇది సిద్ధాంతవాక్యము. రెండును ఒక

యనువాకమందలివే. తొమ్మిదవ యష్టకమున నున్నవి. వారు పూర్వపక్ష గ్రంథము వఱకే చదువుకొన్నారు కాఁబోలును! కనుక నీ గ్రంథము వారుదాహరింపఁజాలక పోయినారు. నేను తొమ్మిదవ యష్టకమును బూర్ణముగా నేకరువుపెట్టఁగల్గుదును, అనెను. మధ్వాచార్యులుగారి ముఖము మకమక లాడెను. అంతకుముందు ప్రఖ్యాతినిబట్టి వినుకలి మాత్రమే కలిగియున్న మంగళేశ్వరశాస్త్రుల నప్పుడు కనుకలి కలిగినందులకు సంతోషించి నారాయణగజపతి చేరికయొఁసగి గౌరవించెను. అప్పుడు మంగళేశ్వర శాస్త్రు లీ శ్లోకముతో రాజు నాశీర్వదించెను.

శ్లో ॥ పూషవాడాన్వయాబ్ధీందో । స్వస్తి నారాయణప్రభో ।
నేత్రే గాత్రే తథాశ్రోత్రే । వక్త్రే పుష్పేషు శోభతే । 270

9. ఈ శ్లోకమందలి గుట్టును చక్కని సంస్కృత సాహిత్యము గలవారు గుర్తింపగఁగల్గుదురు శ్లోకచాతుర్యమునకు మెచ్చి రాజీయనను మిక్కిలి సమ్మానించెను. ఆ సందర్భమందే "శాస్త్రులుగారూ మీ పాండిత్యమునకునుఁ, జాతుర్యమునకును దగినట్టుగా లేదండీ ఇంటి పేరు, నడిమింటివారు. మొదటింటి వారుగాక నడిమింటివారయితిరి" అనెనట. రాజుకు ఈయన పల్కిన బదులు, "ప్రభూ! ఏ యిల్లయినను బూసపాటి చేయదా?"

10. మంగళేశ్వరశాస్త్రు లొకప్పుడు తమ యూర నౌకరి యింట వివాహముహూర్తము జరుగుచుండఁగాఁ దాంబూలమునకు వెళ్లెను. మంగళసూత్ర ధారణ సమయమునఁ బురోహితుఁడు వరునిచే "మాంగల్యతంతునా నేన మమజీవన హేతునా! కంఠే బధ్నామి సుభగే త్వం జీవ శరదాం శతమ్" అన్న శ్లోకమును బఠింపించుచుండెను. మంగళేశ్వరశాస్త్రులు పెదదిరిగి యక్కడ నున్నవారితో మీ కీ శ్లోకమున కర్థము తెలిసినదా యనెను. ఏదో కొంటెతన ముందుననుకొని వారు తెలియలేదు సెలవిండని కోరిరి. శాస్త్రులుగారు చేసిన యనర్థమిది. మాంగల్యతంతు-న ఇది మాంగల్యతంతువుకాదు. నేను ముసలి ముండకొడుకును.



ఇట్టినాకింక నెక్కడిమాంగల్యమనిభావము. అనేన మమ- జీవనహేతు. న (నా?) దీనిచే నా బ్రతుకుఁదెరువును జెడినది. రెండెకరాలో మూఁడెకరాలో ఉన్న యాస్తి కాస్త తెగ నమ్ముకొన్నాను. జీవనోపాధి పోయినదని భావము. కంఠే-బధ్నామి, నీ కుత్తికకు త్రాడుకట్టుచున్నాను. నావల్ల నీకు సౌఖ్యములేదు సరికదా ఇదొక నిర్బంధముకూడా నీకు కల్గినది అని భావము. సుభగే-సుభగులారా! (పరికరాలంకారము) త్వం- నీవు. సుభగురాలవు గనుక, శరదాంశతమ్ = నూఱేండ్లపాటు జీవ = జీవించుము.

11. విజయనగరసంస్థానమున అనంతరావను దూబాసియుండెను. ఏదో పనియుండి మంగళేశ్వరశాస్త్రు లాయనదగ్గఱ కేఁగెను. కుమార సంభవము చదువుచున్న శిష్యుఁడు వెంటనుండెను. అనంతరావుగారు పండితులచేఁబొగ డించుకొనఁ గోరికకలవాఁడని యీయన యెఱిఁగెను. ప్రాచీనశ్లోకములకు సందర్భానుసారముగా నానార్థములను జెప్పు చాతుర్యము మంగళేశ్వరశాస్త్రులు గారికిఁ గలదని విని యనంతరావుగారు గోరిరి. ఏదేని శ్లోకమునకు వింత యర్థమును సెలవిండని - మంగళేశ్వరశాస్త్రులును వెంటనున్న శిష్యుఁడు చదువుచున్న కుమారసంభవశ్లోకము నెత్తుకొని యర్థముచెప్పెను.

శ్లో ॥ అనంతరత్న ప్రభవస్య యస్య!
హిమంన సౌభాగ్యవిలోపి జాతమ్.
ఏకో హి దోషో గుణసన్నిపాతే
నిమజ్జతీందోః కిరణేష్వివాంకః. 271

అర్థమిది : హే అనంతరత్న = రత్నమువంటి ఓయనంతరాయా! హి = ఎందువలన, జాతమ్ = (నీయొక్క) పుట్టుక, మన్నసౌభాగ్యవిలోపి = నా (మంగళేశ్వరశాస్త్రుల) యిబ్బందిని తీర్చునది (నఞర్థక న శబ్దముతో సుప్సుపా, అన్న విధినే సమాసము) యైనదో, అందువలన, అయస్య = శుభకర్మమునకు,

ప్రభవసి = తగుచున్నావు (కాని) ఏకః = ఒక్కటి, అహిదోషః = సర్పదోషము, (కలదు). అనఁగా సర్పమునకు రెండు నాల్కలుండును. అట్లే, నీవు రెండు భాషలాడుదువు. (దుబాసి, ద్విభాషి), ఇది గుణసన్నిపాతే = గుణసమూహమున, నిమజ్జతి = మునుఁగుచున్నది. ఇందోఃకిరణేషు = చంద్రకిరణములందు, అంక ఇవ = కళంకమువలె.

12. మంగళేశ్వరశాస్త్రులుగారు జగన్నాథస్వామిని సేవింపఁగోరి యొకతూరి పూరి (జగన్నాథక్షేత్రము) కరిగిరట! పాండిత్య ప్రఖ్యాతిని విని యక్కడి యోఢ్ర విద్వాంసులు వీరిని దర్శింప నరుగుదెంచిరి. అప్పుడీయన మంచి నిడువును వెడలుపును గల మఱ్ఱియాకులను కోసికొని వచ్చి విస్తళ్లు కుట్టుచుండెను. జగన్నాథక్షేత్రమున కరిగిన వారెవరును మఱ్ఱియాకు విస్తరిలో భుజింపరు. తర్వాతఁగూడ భుజింప రనఁగా నక్కడ నున్నప్పుడది యత్యంతము నిషిద్ధమే యగును గదా! ఈ కారణముచే నా క్షేత్రమున మఱ్ఱిచెట్లు చక్కఁగా బెరిగి మంచియాకులతో నుండును. విలక్షణప్రతిభ గలవాఁడగుటచే నీయన యా యాకులను కోసికొనివచ్చి విస్తళ్ళుకుట్ట నారంభించెను. ఆ యోఢ్రపండితు లది చూచి శాస్త్రులుగారి నాక్షేపించిరి. "అయ్యా! మఱ్ఱియాకులో భుజించుట నిషిద్ధము. అందును జగన్నాథ క్షేత్రమున భుజించుట యత్యంత నిషిద్ధము. అనుకరణీయమగు వర్తనముతో నుండవలసిన మీరిట్లు చేయుట పాడికాదు" అన శాస్త్రులుగారు మఱ్ఱియాకులో భుజించుట యేల నిషిద్ధమయ్యెనని వారి నడిగిరి. "శ్రీనారాయణ మూర్తి వటపత్రశాయి. స్వామివారికి శయ్యగా నగుటచే నత్యంత పూజ్యమయిన వటపత్రమున భుజించుట నిషిద్ధమగును. ఈ క్షేత్రము స్వామివారి యవతార క్షేత్రము. ఇక్కడ భుజించుట యత్యంత నిషిద్ధము" అని వారు బదులు చెప్పిరి. శాస్త్రులుగారు వెడనవ్వు నవ్వి యిట్లనిరి, "ఇట్టి యవతార క్షేత్రమున శ్రీ స్వామివారి యవతారమూర్తులనే మడమడాయించి యాహారించుచున్న మీ కాయన శయ్యయైన వటపత్రమున



భోజనము నిషిద్ధమాయెనా! సెబాసు"! - ఓఢ్రులు మత్స్యభుక్కులు. శ్రీనారాయణమూర్తి మత్స్యావతారము నెత్తెను. కావున వారు శ్రీనారాయణుని యవతారమూర్తులనే యారగించువారగుదురు - శ్రీశాస్త్రులగారి బెట్టిదవు సమాధానమునకు వారు నిట్టూర్పు పుచ్చి యూరకుండిరి.

13. మంగళేశ్వరశాస్త్రులుగారి నొకప్పు డధికారగర్వితుఁడగు నొక యభ్యున్నతుఁడు చేయెత్తక 'నమస్కారమండీ' యనెనట. శాస్త్రులుగారు "దీర్ఘమాయురస్తు" అని యాశీర్వదించిరి. దీర్ఘమ్- ఆయుః-మాయుః అస్తు అనియు నిక్కడ రెండు దెఱఁగుల ఛేదముగల్గును. మొదటి విధమునకు దీర్ఘాయుష్మంతుఁడ వగుమని యర్థము. రెండవ విధమునకు నీకు గొప్ప పైత్యము కల్గుగాక యని యర్థము. శాస్త్రులగారి శబ్దోచ్చారము ద్వితీయార్థస్ఫోరకము గానే యుండెను.

14. అట్లే మఱొకప్పు డొక యుద్యోగి యీయన గుమ్మము దాఁటి లోనికిఁ బోవుచుండఁగాఁబరిహాసపూర్వకముగా 'దండాలండీ' అనెనట! మాటాడక శాస్త్రులుగారు లోనికరిగి కొంతసేపటికిఁ దిరిగి వచ్చిరి. ఆ యుద్యోగి యడిగెను! "శాస్త్రులుగారూ! మీరు విశేషజ్ఞులు. నమస్కరించినపుడు ప్రత్యభివాదము చేయవలదా" యని. కోపము చిప్పిలఁగా నీతఁడిట్లు బదులుచెప్పెను. అయ్యా, మీరు గుమ్మమున కావల నొక కాలు, ఈవలనొక కాలు నుండఁగా నడుమ నమస్కరించితిరి. దానికి నేనేమి ప్రత్యభివాదము చేయుదును! ఇందు జుగుప్సిత మగునర్థ మున్నది. ఇట్టిదే యింకొకటి.

15. మంగళేశ్వరశాస్త్రులుగారు కుమార్తె నత్తవారింటికిఁ బంపవలసి యుండెను. ఈ సందర్భము విని బొబ్బిలిరాజుగారు వారిని సత్కరింపవలసినదిగా రాజపురుషుని కాజ్ఞాపించిరి. రాజాజ్ఞానుసార మాతఁడేదో యీయవలసినది యిచ్చి పంపక వీరిని వికటముగాఁ బ్రశ్నించెను. 'అయ్యా, మీరు కుమార్తె నత్తవారింటికిఁ బంపునప్పుడేమి పెట్టిపంపెదరండీ!' అని. ఈయన బదులు -

'చిత్తము! మేము బీద బ్రాహ్మణులము! ఏమున్నది! ఇంత పసుపు కుంకుమ చీర రవిక యిచ్చి పంపెదము. తమవలె మేమేమి రాజాశ్రయసంపన్నులమా వేలుపెట్టి పంపుటకు?'.

**16. నరసరాజును నాతనిమీఁద జెప్పిన శ్లోకము –**

శ్లో ॥ యాగక్రియార్థం ఖలు వృక్షరాజో వర్ణక్రియార్థం ఖలు భృంగరాజః
తులాక్రియార్థం ఖలు విత్త రాజో న కించిదర్థం భువి నర్సరాజః 272

**17. దక్షిణామూర్తివిగ్రహమును స్వర్ణకాఁరుడు హరింపఁగాఁ జెప్పినది–**

శ్లో ॥ భూత్వా పౌల్కసకాత్ ప్రపద్య రజకానాభాష్య పౌరాణికాన్
గానస్థానముపేత్య చాశుకరణానాలింగ్య నత్వా కవీన్,
వేశ్యాసద్మని సంప్రవిశ్య చ గతా వైద్యస్య పాణిగ్రహం
భూయో హంత సువర్ణకారసదనే సానందమాస్తే మృషా ॥ 273

"శాకల్యమల్లస్య...

దేవ త్వద్యశ ఏవ కిం సితసితం రామే శశాంకే మరు
ద్వాహే స్వర్గగజే హరే ఫణిపతౌ వాణ్యాం వృషేభేరుచిః
అన్యేషాం తు తదంబరే తదుదరే తద్వ్యఞ్జనే తన్మదే
తత్కంఠే చ తదీక్షణే తదలకే తత్పోత్రకే తత్పథి! " 274

---

శ్రీ ప్రభాకరుల నోట్సు నెం. 20 పుట 95లో ఈ క్రింది శ్లోకమున్నది. ఇందు పుట 110లో దీనిని చేర్చి చదువదగును.



# తెలుగు కవులు

## వేములవాడ భీమకవి

ఈ కవీశ్వరుఁడు పండ్రెండవ శతాబ్ది పూర్వార్థమున నున్నవాఁడగును. 'లేములవాడ భీమకవి' యను పేరు కొన్ని పద్యముల యతిస్థానస్థాపితమై కలదు. ఆతఁడు నీతఁడును వేఱో! ఒక్కరో! ఈతఁడాంధ్రకర్ణాటభాషలలో గొప్ప కవి.

సీ. గడియలోపలఁ దాడి కడగి ముత్తునియగాఁ
దిట్టిన మేధావిభట్టుకంటె
రెండుగడెల బ్రహ్మదండిముండ్లన్నియు
దుల్లఁ దిట్టిన కవిమల్లుకంటె
మూఁడుగడెలకుఁ దా మొనసి యత్తినగండి
పగులఁ దిట్టినకవిభానుకంటె
అఱజాములోపలఁ జెఱువు నీళ్ఇంకంగఁ
దిట్టిన బడబాగ్నిభట్టుకంటె

ఆ.వె. ఉగ్రకోపి నేను నోపుదు శపియింపఁ
గ్రమ్మఱింప శక్తి గలదు నాకు
వట్టిమానఁ జిగురు పుట్టింప గిట్టింప
బిరుదులేములాడ భీమకవిని. 275

ఈతఁడు శైవుఁడు. పాల్కురికి సోమనాథుఁడాంధ్రమున రచియించిన బసవపురాణము నీతఁడు కన్నడించెను. "సోమగురు వాక్యములు సొన్పి భీమసుకవి, గరిమబసవపురాణంబు కన్నడించె" – తెలుఁగున నృసింహపురాణమును రచించెనట! కవిజనాశ్రయము కూడ నీతనిదే యందురు. ఈతని నివాసము దాక్షారామముగాక నైజాంరాష్ట్రమందలి వేములవాడ గ్రామమని కొందఱందురు. అది చింత్యము. నృసింహపురాణమందలిదని యీ పద్యము లక్షణ గ్రంథములం దుదాహరింపఁబడెను.

క. ఈ క్షితికి వచ్చి ముందుగ
దాక్షారామమున వారతరుణులనృత్యం
బీక్షించి యంతకంటెను
తత్క్షణమున నేర్చి రంభ తగ వేర్పడఁగన్. 276

## నృసింహపురాణమున –

క. కెంజిగురునకుం గఱినత
వంజకుఁబాల్ పిచ్చుగుంటువానికిఁ బరువున్
నంజుడుకుఁ గమ్మఁ దావియు
లంజెకు మే లెందు లేదురా విటరాయా? 277

## కోమట్ల నీతఁడు తిట్టెను

చ. గొనకొని మర్త్యలోకమునఁ గోమటి పుట్టఁగఁ బుట్టెఁ దోన బొం
కును గపటంబు లాలనయుఁ గుత్సితబుద్ధియు రిత్తభక్తియున్
ననువరిమాటలున్ బరధనంబును గ్రక్కున మెక్కఁ జూచుటల్
కొనుటలు నమ్ముటల్ మిగులఁ గొంటుఁదనంబును మూర్ఖవాదమున్. 278

ఉ. కోమటి కొక్క టిచ్చి పది గొన్నను దోసము లేదు, యింటికిన్
సేమ మెఱింగి చిచ్చిడినఁ జెందద పాపము, వాని నెప్పుడే
నేమరుపాటున న్మఱియు నేమియొనర్చిన లేద దోస మా
భీముని లింగమాన! కవిభీముని పల్కులు నమ్మి యుండుఁడీ! 279

ఉ. వేములవాడభీమ! భళిరే! కవిశేఖర సార్వభౌమ! నీ
వేమనిఁ యానతిచ్చితివి యిమ్ములఁ గోమటిపక్షపాతివై
కోమటి కొక్క టిచ్చి పదిగొన్నను దోసములే దటంటివా
కోమటి కొక్క టీక పదిగొన్నను ధర్మము ధర్మపద్ధతిన్. 280



భీమకవి యొకప్పుడు గుడిమెట్టయను గ్రామమున కరిగెనట! సాగి పోతురాజను రాజాతని గుఱ్ఱము నక్కడఁ దన సాహిణమునఁ గట్టిపెట్టించి యాతఁడు వేఁడినను విడిపింపఁ డయ్యెనట, దాని పైఁగోపించి భీమకవి చెప్పిన పద్యము –

చ. హయ మది సీత, పోతవసుధాధిపుఁ డారయ రావణుండు, ని
శ్చయముగ నేను రాఘవుఁడ, సహ్యజ వారిధి, మారుఁడంజనా
ప్రియతనయుండు, లచ్చన విభీషణుఁ, డా గుడిమెట్ట లంక, నా
జయమును బోతరక్కసునిచావును నేడవనాఁడు చూడుఁడీ! 281

సాహిణిమారుఁడను దండనాథుఁడు చాళుక్యచొక్క భూపతి నెదిరించెనట! భీమకవి యామారుని శపించి చొక్కభూపతికే జయము చేకూర్చెనట.

ఉ. చక్కఁదనంబుదీవియగు సాహిణిమారుఁడు మారుకై వడిన్
బొక్కి పడంగలండు చలమున్ బలమున్ గల యా చళుక్యపుం
జొక్కనృపాలుఁ డుగ్రుఁడయి చూడ్కులమంటలు రాలఁజూచినన్
మిక్కిలి రాజశేఖరునిమీఁదికి వచ్చిన రిత్తవోవునే! 281

చాళుక్యచొక్క భూపాలుఁడొకప్పుడు భీమకవిమాహాత్మ్యమును బ్రత్యక్షముగా నెఱుఁగఁగోరి “స్వామీ! మీరాడినది యాట పాడినది పాట యగునందురు. వినోదార్థము కొండొకటి ప్రదర్శింప వేఁడెదను” అనఁగా భీమకవి నీ యభీష్టమే మని యడిగి తెలిసికొని యచ్చటి మల్లెసాలనున్న స్తంభము చివుళ్ళతో జొంపములతో వృక్ష మగున ట్లీ క్రిందిపద్యము చెప్పెను.

శా. ఆ నీతాభ్యుపదానశృంఖళకరాభ్యాలంబిత స్తంభమా!
నేనే వేములవాడభీమకవినేనిన్ జిత్రకూటంబులో
భూనవ్యాపృతపల్లవోపలతికాపుష్పోపగుచ్ఛంబులన్
నానాపుష్పఫలప్రదాయివగుమా నా కల్పవృక్షాకృతిన్. 282

అట్లే యా స్తంభము పుష్పఫలభరితమగు వృక్షమయ్యెనట! మరల దాని నీ క్రింది పద్యముఁజెప్పి తొంటిరీతికిఁ దెచ్చెనట!

ఉ. శంభువరప్రసాది కవిజాలవరేణ్యుఁడనైన నా వచో
గుంభన మాలకించి యనుకూలత నొంది తనూనభావనన్
గుంభినిఁ జొక్కనామనృపకుంజరుపందిటిమల్లెసాలకున్
స్తంభమురీతి నీ తనువు దాలిచి యెప్పటియట్ల యుండుమా! 284

భీమకవి తెలుంగాధీశునిఁ (కళింగాధీశుఁ డని కొన్ని ప్రతులు,) గస్తూరి యాచించుచుఁజెప్పిన పద్యము.

మ. ఘనుఁడన్ వేములవాడవంశజుఁడ దాక్షారామభీమేశనం
దనుఁడన్ దివ్యవిషామృతప్రకట నాకావ్యధుర్యుండ భీ
మన నా పేరు వినంగఁజెప్పితిఁ దెలుం (గళిం) గాధీశ! కస్తూరికా
ఘనసారాదిసుగంధవస్తువులు వేగం దెచ్చి లాలింపురా? 285

చోడగంగుపైఁ జెప్పిన పద్యములు....

చ. అని మొనఁజోడగంగఁడు మురారి బకారి నరుండు మాద్రిజుం
డన ఘనచక్రతోమరశరాసనకుంతము లల్కఁబూని ప్రే
యను వడి డాయ నేయఁబొడువన్ గళమస్తకవత్సమర్మముల్
తునియవె నుగ్గుగావె యెదఁదూఱవె నాటవె వైరివీరులన్. 286

ఉ. భోజుఁడు మంకు ధర్మజుఁడు బొంకు శచీపతి రంకు కల్పపూ
రాజు కళంకు దైవతధరాజము డొంకు పయోధి యింకు నం
భోజభవుండు పంకు పణిభూషణదేవుఁడు సంకు పద్మినీ
రాజహితుండు క్రుంకు సరి రారు గుణంబుల నీకు ధారుణిన్. 287



భీమకవి మైలమభీమనిమీఁదఁ జెప్పిన పద్యములు...

చ. గరళపుముద్ద లోహ మవగాఢమహాశనికోట్లు సమ్మెటల్
హరునయనాగ్ని కొల్మి యురగాధిపుకోఱలు పట్టుకార్లు ది
క్కరటిశిరంబు దాయ లయకాలుఁడు కమ్మరి వైరివీరసం
హరణగుణాభిరాముఁ డగు మైలమభీముని ఖడ్గసృష్టికిన్. 288

ఉ. ఏఱువభీమ! నీ పగతు లెక్కనికొండలు చంచలాత్ములై
దూఱనియట్టి ఘోరవనదుర్గములున్ వనితావియోగులై
పాఱనిత్రోవలుం దిననిపండ్లును నాఁకటఁగూర లుప్పగా
నేఱని కట్టులుంగలవె యీ లవణాంబుధివేష్టితావనిన్? 289

కళింగగంగునాస్థానమునకు భీమకవి యరుగఁగా నాతఁడ నాదరమున నిది సమయముకాదు పొమ్మనెనట! దానిపై భీమన కోపించి శాపమిట్లొసఁగెను...

ఉ. వేములవాడభీమకవి వేగమె చూచి కళింగగంగు తా
సామము మాని కోపమున సందడిదీఱిన రమ్ము పొమ్మనెన్
మోమును జూడ దోస మిఁక ముప్పది రెండుదినంబులావలన్
జామున కర్థమం దతని సంపద శత్రులపాలు గావుతన్. 290

శాపము ఫలించెను. రాజకళింగగంగు గర్భదరిద్రుఁడై పరుల కెఱుక పడకుండఁ బ్రచ్ఛన్నవేషము దాల్చి తిరిపమెత్తుచుఁ బొట్టగడపుకొనుచుండెను. భీమకవి యొకనాఁడు రాత్రి పల్లకి నెక్కి దివటీలతో నెక్కడకో పోవుచుండగా నాతఁడు త్రోవ నేఁగుచుఁ జీకటిలో నొక గోతఁగూలి 'అయ్యో! కాలిదివటీయైన లే దయ్యెఁగదా' యనుకొని చింతిల్లెనట! అది భీమకవి విని నీ వెవ్వండవని యడుగ 'భీమకవిగారిచే జోగిచేయఁబడిన వాఁడ' ననెనట! భీమకవి 'రాజకళింగ గంగవా! యనఁగా నాతఁడు కేల్మోడ్చి రక్షింపుఁ డనెనట! అంతట –

ఉ ॥ వేయుగజంబు లుండఁ బదివేలు తురంగములుండ నాజిలో
రాయల గెల్చి సజ్జనగరంబునఁ బట్టముగట్టుకో వడిన్
రాయకళింగగంగు కవిరాజ భయంకరమూర్తిఁజూడఁగాఁ
బోయెను మీనమాసమునఁ బున్నమవోయిన షష్ఠినాఁటికిన్. 291

అని యాశీర్వదించి తిరిగి లబ్ధరాజ్యునిఁ జేసెనట!

ఉ॥. రామునమోఘబాణమును రాజశిఖామణికంటిమంటయున్
భీము గదావిజృంభణ ముపేంద్రుని వజ్రము చక్రిచక్రమున్
దామరచూలివ్రాఁతయును దారకవిద్విషు ఘోరశక్తియున్
(వే) లేములవాడ భీమకవి లేశము తిట్టిన రిత్తవోవునే 292

ఒక బ్రాహ్మణుని దొడ్డిలోని పేరాముదపాకులు భీకమవి తాలూకు నౌకరొకఁడు మందుకని కోసికొనఁబోగా నా యింటి బ్రాహ్మణుఁ డా నౌకరును బారతోఁగొట్టెనఁట! ఆ బ్రాహ్మణుఁ డడఁగారునట్లు భీమకవి శపించెను.

క ॥ కూరడుగము కాయడుగము
నారయఁగా నుల్లి బచ్చ లల్ల మడుగ మా
పేరాముదపా కడిగినఁ
బారమ్మున నేసె నట్టె బాపఁడు ద్రెళ్లన్. 293

అనుగ్రహించి భీమకవి జన్నమాంబయను నామెకు గండమాలావ్యాధిని పద్యరచనచే గుదిర్చెను.

క ॥ ఘనరోగంబుల బలమా
కనుగొనఁగా జన్నమాంబ కర్మపు ఫలమా
నినుఁ బ్రార్థించెద వినుమా
మునుకొని యో గండమాల! మునుగకు జనుమా! 294



కొన్నాళ్ళ కామెమీఁద మరలఁగోపించి శపించి మరల నా వ్యాధి నామెకే వచ్చునట్లు చేసెనట. ఈతని పద్యములు పెక్కులు. 'మైలమ భీమన' మీఁదివి. అక్కడ చూచునది[1].

## కవిసార్వభౌముఁడు శ్రీనాథుఁడు

క్రీ.శ. 1380 ప్రాంతమున జనియించి 1450 తర్వాత వఱకు జీవించి పూర్ణపురుషాయుషజీవియై యనేక సుకవిరాజసమ్మానములఁగాంచి యాంధ్ర కవిమండలియం దనన్యసామాన్యమైన సుప్రతిష్ఠనంది మహాభోగముల ననుభవించుటయగాక తుదకుఁ గష్టములఁగూడఁ జవిసూచి బృహస్పతికి సయితము గుండియలు దిగ్గురనునట్లు స్వర్గమున కరిగిన యీ యుద్ధండపండితకవిని దెల్గుదేశమున మాతృభాషాభిమానులలో నెఱుంగః వారుండరు. ఈ మహాకవిచే శృంగారనైషధాదులగు ప్రబంధములేకాక యింక ననేకములగు చాటుపద్యములును రచియింప బడినవి. అందు రసోత్తరము లిందుదాహరింపఁబడును.

శ్రీనాథుఁడు కర్ణాటాంధ్రరాజ్యాధీశ్వరుఁడగు సంబురాయని తెలుంగు రాయలయొద్ద కరిగి యాతని నాశీర్వదించినది.

శా. ధాటీఘోటకరత్న ఘట్టనమిళద్ధ్రాఘిష్ఠకల్యాణఘం
టాటంకారవిలుంఠలుంఠిమహౌన్నత్యాహితక్షోణిభృ
త్కోటీరాంకితకుంభినీధరసముత్కూటాటవీఝూట క
ర్ణాటాంధ్రాధిప! సాంపరాయని తెలుంగా! నీకు బ్రహ్మాయువౌ. 295

ఆ నృపాలునిఁ గస్తూరి యాచించుచుఁ జెప్పిన పద్యము...

1. చాటుపద్యమణిమంజరి-ప్రభు-మంత్రి ప్రశంసాస్తబకమున ఈ విషయము చూడఁదగును. మఱియు భీమకవిని గూర్చిన మరికొన్ని వివరములకు వేటూరివారి ప్రబంధరత్నావళి, మీగడతఱకలు చూడఁదగును.

శా. అక్షయ్యంబుగ సాంపరాయని తెలుంగాధీశ! కస్తూరికా
భిక్షాదానము సేయురా సుకవిరాడ్బృందారక శ్రేణికిన్
దాక్షారామచళుక్యభీమవరగంధర్వాప్సరోభామినీ
వక్షోజద్వయకుంభికుంభములపై వాసించుఁదద్వాసనల్. 296

వెల్గోటిరాజును బండితకవియునగు సర్వజ్ఞ సింగభూపాలు నాస్థానము నకుఁబోయి యా నృపాలుని కొల్వుకూటమునకుముందుఁ బూజింపఁబడుచుండెడు శారదావిగ్రహమును గాంచి యాతఁడు చెప్పినపద్యము.

సీ. దీనారటంకాలఁ దీర్థమాడించితి
దక్షిణాధీశు ముత్యాలశాల
పలుకుఁదోడైతాంధ్రభాషామహాకావ్య
నైషధగ్రంథసందర్భమునకు
పగులఁగొట్టించి తుద్భటవివాద ప్రౌఢి
గౌడడిండిమభట్టు కంచుఢక్క
చంద్రభూషణక్రియాశక్తి రాయలయొద్దఁ
బాదుకొల్పితి సార్వభౌమబిరుద

గీ. మెటులు మెప్పించెదో నన్ను నింకమీఁద
రావుసింగమహీపాలు ధీవిశాలు
నిండుకొలువున నెలకొనియుండి నీవు
సరససద్గుణనికురుంబ! శారదాంబ!

సింగభూపాలుపైఁ జెప్పినది 297

క. సర్వజ్ఞ నామధేయము
శర్వునకే రావుసింగజనపాలునకే
యుర్విం జెల్లును దక్కొరు
సర్వజ్ఞుం డనుట కుక్క సామజ మనుటే. 298



ఆ యాస్థానమున నొక భట్టుకవి యిచ్చిన సమస్య. – "కుక్కవొ నక్కవో ఫణివొ క్రోఁతివొ పిల్లివొ బూతపిల్లివో". కవి సార్వభౌముని పూరణము.

ఉ. తక్కిన రావుసింగవసుధావరుఁడర్థుల కర్థ మిచ్చుచో
దిక్కులలేనికర్ణుని దధీచిని ఖేచరు వేల్పు ప్రూనుఁ బెం
పెక్కిన కామధేనువు శిబీంద్రుని నెన్నుదు భట్ట! దిట్టవై
కుక్కవొ! నక్కవో! ఫణివొ! క్రోఁతివొ! పిల్లివొ! బూతపిల్లివో! 299

శ్రీనాథుఁడు రెడ్లయాస్థానకవి. రెడ్లకు వెల్గోటివారికి వైరము. ఈతఁడు తిరిగి రెడ్లయాస్థానమునకుఁ బోఁగాఁ దమ శత్రువగు సింగమనేని నట్లు పొగడి నందుకు వారు కుపితులై యిచ్చకాలమారివని చుల్కనచేసి పల్కిరట! నే నా పద్యమున నాతని గూఢముగా వెక్కిరించితినేగాని పొగడలేదని శ్రీనాథుఁడిట్లా పద్యమున కన్వయమును చెప్పెనట! "సర్వజ్ఞనామధేయము శర్వునకే. రావు సింగజనపాలునకే యుర్విం జెల్లును? (శివునిఁగాక) తక్కొరు సర్వజ్ఞుండనుట కుక్క సామజ మనుటే.

వేఱొకప్పుడు వెల్గోటి మదయలింగమనేఁడు రెడ్లకఠారిని గైకొనఁగా నా కఠారిని దిరిగి రెడ్లకడకుఁ జేర్చుటకై శ్రీనాథుఁడాతనికడ కరిగి పొగడిన పొగడ్త.

సీ. జగనొబ్బగండాంక సంగ్రామనిశ్శంక
జగతీశ రాయవేశ్యాభుజంగ
అఖిల కోటలగొంగ యరిరాయమదభంగ
మే లందు ధరణీశమీనజాల
మూరురాయరగండ మఱియు రాజులమిండ
యభివృద్ధి మీరు చౌహత్తమల్ల
ఘనగాయగోవాలకామినీ పాంచాల
బ్రహ్మాయు శశివంశ పరశురామ

గీ. దండిబిరుదుల సరతాణిగుండెదిగుల
బళిర యల్లయవేముని పగరమిండ

రమణమించిన మేదిని రావుబిరుద
సంగరాటోప! మాదయలింగ భూప! 300

కర్ణాట రాజ్యమున కరిగినప్పు డా రాజు మీ వాసస్థల మెట్టిదనఁగాఁ జెప్పినది –

సీ. పరరాజ్య పరదుర్గ పరవైభవ శ్రీలఁ
గొనకొని విడనాడు కొండవీడు
పరిపంథిరాజన్యబలముల బంధించు
కొమరు మించినబోడు కొండవీడు
ముగురు రాజులకును మోహంబు పుట్టించు
గుఱుతైన యుఱిత్రాడు కొండవీడు
చటులవిక్రమ కళాసాహసం బొనరించు
కుటిలాత్ములకు గాడ్పు కొండవీడు

గీ ॥ జవనఘోటక సామంతసరసవీర
భట నటానేక హాటక ప్రకటగంధ
సింధురారవమోహన శ్రీలఁదనరు
కూర్మి నమరావతికి జోడు కొండవీడు. 301

అక్కడ రాజసమ్మానమునకుఁ గాలయాపనము కొంత సంభవింపఁగా నా దేశపు విధము తనకు సరిపడక కర్ణాట రాజ్యలక్ష్మిం బ్రార్థించుచుఁ జెప్పిన పద్యము.

శా ॥ కుల్లా యుంచితిఁ గోఁకసుట్టితి మహాకూర్పాసముం దొడ్గితిన్
వెల్లుల్లిం దిలపిష్టమున్ మెసవితిన్ విశ్వస్త వడ్డింపఁగా
సల్లా నంబలి ద్రావితిన్ రుచులు దోసంబంచుఁ బోనాడితిం
దల్లీ! కన్నడరాజ్యలక్ష్మి! దయ లేదా నేను శ్రీనాథుఁడన్. 302



తొలుత నీఁతడు కొండవీటిరెడ్లయాస్థానకవి. ఆ రాజ్య మంతరించిన తర్వాత రాజమహేంద్రవరమున రాజ్యమేలు నల్లయవేమ వీరభద్రారెడ్లయొద్దఁ జేరెను. వేముని వర్ణించిన వర్ణనము.

సీ ॥ రాజనందనరాజరాజాత్మజులు సాటి
తలఁప నల్లయవేమధరణిపతికి
రాజనందనరాజరాజాత్మజులు సాటి
తలఁప నల్లయవేమధరణిపతికి
రాజనందనరాజరాజాత్మజులు సాటి
తలఁప నల్లయవేమధరణిపతికి
రాజనందనరాజరాజాత్మజులు సాటి
తలఁప నల్లయవేమధరణిపతికి

గీ॥ భావభవభోగ సత్కళాభావములను
భావభవభోగ సత్కళాభావములను
భావభవభోగ సత్కళాభావములను
భావభవభోగ సత్కళాభావములను

ఉ ॥ వీరరసాతిరేక రణవిశ్రుత వేమనరేంద్ర! నీ యశం
బారభమానతారకరహారవిలాసము నీ భుజామహం
బారభమానతారకరహారవిలాసము నీ పరాక్రమం
బారభమానతారకరహారవిలాసము చిత్రమారయన్.

వేమ వీరభద్రారెడ్లు ప్రతివర్షమును సింహాచలపు నృసింహస్వామికిఁ దిరునాళ్లు జరిపించుచుండెడివారు. శ్రీనాథుఁడును వారితో నచ్చుటికరిగెడు వాఁడు. ఆ పర్వతముమీఁదికి యాత్రార్థము వచ్చు నానా స్త్రీలను జూచి యాతఁడు వర్ణించిన వర్ణనము.

సీ ॥ హరినీలములకప్పు లఱఁగించు నునుగొప్పు
విడఁ బువ్వుఁదండ తా వీడఁబాఱ
కోటిచందురుడాలు గోటిమీటఁగఁజాలు
మొగముఁగుంకుమచుక్క సొగసుగుల్క
అల జక్కవలటెక్కు లఱఁగఁద్రొక్కఁగ నిక్కు
పాలిండ్లపై నాఁచుపైఁట జాఱ
ఇసుకదిన్నెలమెట్టు పసిఁడిచెంపలఁ గొట్టు
పిఱుఁదుపై మొలనూలు బెళుకుదేర

గీ ॥ చిగురుఁగెమ్మోవిఁబగడంపుజిగియు మెఱయ
మాటలాడఁగఁ గనుదోయితేట లమరఁ
జెమట లూరంగ సింహాద్రి చేరవచ్చె
భోగగుణధామ యాంధ్రనియోగిభామ. 305

సీ ॥ విడినకొప్పున జాజివిరు లొప్పుగా రాలఁ
జిట్టికుంకుమచుక్క బొట్టు చెదర
చక్కఁగాఁ బటువారుసందెడుకుచ్చెళ్ళు
చెలఁగు మెట్టియలపైఁ జిందులాడ
కొదమగుబ్బలఁ బైఁటకొంగు సయ్యన జాఱ
ముక్కునత్తొకవింతముద్దు గుల్క
మొలగంట లిమ్మగు మ్రోఁతతో రంజిల్లఁ
గనకంపుటందియల్ ఘల్లు రనఁగఁ

గీ. బొసఁగఁ గప్రంపువీడెముల్ పొందుపఱిచి
యనుఁగుఁజేడెలతో ముచ్చ టాడికొనుచు
నలరుసింహాద్రిపై కెక్కి హర్షమునను
వచ్చెఁ గలకంఠి వేపారిమచ్చెకంటి. 306



శా. రా పాడంగల గుబ్బచన్నుఁగవతో రాకేందుబింబంబు పైఁ
దూ పేయంగల ముద్దునెమ్మొగముతోఁ దోరంపుమైచాయతోఁ
జూపున్ఁ ముద్దుల బాలసంఘములతో సొంపారులేనవ్వుతో
వేపార్యంగన వచ్చెఁగాసెబిగితో వేణీభరచ్ఛాయతోన్. 307

సీ. పలు తెఱంగులరంగు పద్మరాగలవీణె
చకచకత్ప్రభల సాక్షాత్కరింప
సొంపుతో రవచెక్కడంపుముంగరచాయ
పగడంపుమోవిపైఁ బరిఢవిల్ల
విరిసి యొసరిలి క్రిక్కిఱిసిన చనుదోయి
బిగువున నెఱఱైక పిక్కటిల్ల
ఒసపరియొయ్యారిముసుఁగులో నెఱివేణి
కొమరాలిమూపున గునిసియాడ

గీ. విరుల తావియు నెమ్మేని వెనుకకచ్చ
పెళ పెళక్కను చిఱుదొడల్ బెళుకునడుము
వలుదపిఱుఁదులు కలికిచూపులబెడంగు
లొలయఁ గన్గొంటి వేపారికలువకంటి. 308

క. రంభాస్తంభము లూరువు
లంభోరుహనిభము లక్షు లతనుశరంబుల్
జంభాసురారిమదగజ
కుంభము లీ నంబివారి కోడలికుచముల్. 309

క. అద్దిర కులుకులు బెలుకులు
నిద్దంపు మెఱుంగుఁదొడలనీటులు గంటే
దిద్దుకొని యేల వచ్చును
ముద్దియ యీ నంబిపడుచు ముచ్చట దీఱన్ 309

సీ. పొలుపొందగఁ విభూతిబొట్టు నెన్నొసలిపైఁ
దళుకొత్తుచెమట కుత్తలపడంగ
సొగసుగాఁ బూదండ జోఁపినకీల్గొప్పు
జాఱఁగా నొకచేత సరుదుకొనుచు
బిగిచన్నుఁగవమీఁద బిరుసుఁబయ్యెదచెంగు
దిగజాతి శివసూత్రమగపడంగ
ముక్కున హురుమంజిముత్యాలముంగర
కమ్మవాతెఱమీఁద గంతులిడగఁ

గీ. కౌను జవ్వాడ మట్టియల్ గదిసి మ్రోయఁ
గమ్మవిలుకాని జాళువాబొమ్మ యనఁగ
మెల్ల మెల్లన సింహాద్రిమీఁది కేఁగెఁ
గన్నెపూఁబోఁడి యగసాలి వన్నెలాఁడి. 311

అక్కడఁ దంబురా చేతఁబూని గానము సేయుచు వచ్చు సాతాని వెలఁదిపైఁ జెప్పినది ....

సీ. మీఁగాళ్ళ జీరాడు మేలైన కుచ్చెళ్ల
తీరున మడిచీర తీర్చి కట్టి
బిగువుగుబ్బలమీఁద నిగనిగ ల్దళుకొత్తు
నోరపయ్యెదకొంగు జాఱవైచి
వలపల కొకవింత గలుగఁగా గొప్పలౌ
కురులు నున్నగ దువ్వి కొప్పువెట్టి
నెలవంక నామంబు సలలితంబుగ నుంచి
తిరుచూర్ణ మా మీఁదఁదీర్పుచేసి

గీ. ఓరచూపుల విటులఁదానూరడించి
గిల్కు మెట్టెల రవరవల్ గుల్కరింప



జికిలిచేసిన తామ్రంపుఁజెంబు పూని
వీధి నేతెంచె సాతానివేడ్కలాఁడి. 312

అట దుకాణమునఁ దములపాకులు కొనఁబోయి చెప్పినది –

చ. తొలకరిమించు దీవగతి తోఁప దుకాణముఁమీద నున్నఁయ
య్యలికులవేణితోఁ దములపాకుల బేరము లాడఁబోయి నే
వలచుటకేమి శంకరునివంటి మహాత్ముఁడు లింగరూపియై
కులికెడుదాని గబ్బిచనుగుబ్బలసందున నాట్య మాడఁగన్ 313

ఉ. అంగడివీథిఁ బల్లవుల కాసగ మామిడిపండు లమ్ముచున్
జంగమువారిచిన్నది పిసాళితనంబునఁ జూచెఁబో నిశా
తాంగజబాణకైరవసితాంబుజమత్త చకోరబాలసా
రంగతటిన్ని కాయముల రంతులు సేసెడు వాఁడిచూపులన్. 314

సీ. బాలేందు రేఖసంపద మించి విల్లసిల్లు
నొసటితళ్కులనీటు నూఱు సేయు
భ్రమరికాహరినీలచమరవాలములఁ బోల్
వేణీభరముచాయ వేయు సేయు
దర్పణద్విజరాజధాళధళ్యప్రభ
లపనబింబస్ఫూర్తి లక్షసేయు
కోకహాటకశైలకుంభికుంభారాతి
కుచకుంభయుగళంబు కోటిసేయు

గీ. జఘనసీమకు విలువ లెంచంగ వశమె
దీని సౌందర్యమహిమంబు దేవుఁ డెఱుఁగు
నహహ! యెబ్బంగి సాటిసేయంగవచ్చు
భావజుని కొల్వు జంగముభామచెల్వు. 315

 మ. విమలాంభోరుహపత్రజైత్రములుగాఁ బెంపారునేత్రమ్ములన్
గమనీయంబగు కజ్జలం బునిచి రేఖాసౌష్ఠవం బొప్ప నా
గముతోఁ జేసిన సింధురంబు నుదుటం గాన్పింపఁ బయ్యెంటయున్
యమునాత్రైకయు దాఁటి పూఁపచను లొయ్యారంబు సూపన్దుకా
ణముపై బొందిలి దోర్తు నిల్చె ముఖచంద్రస్ఫూర్తి శోభిల్లఁగన్. 316

నీలాటిరేవున స్నానమునకై యరిగి యచ్చటనున్న నానా వనితలఁ జూచి చెప్పిన పద్యములు...

ఉ. వీసపుముక్కునత్తు నరవీసపుమంగళసూత్ర మమ్మినన్
గాసును రాని కమ్మలరకాసునుగానివి పచ్చపూసలున్
మాసినచీర గట్టి యవమాన మెసంగఁగ నేఁడు రాఁగ నా
కాసలనాటివారి కనకాంగిని జూచితి నీళ్ళరేవునన్ 317

క. పూజారివారి కోడలు
తా జాఱఁగ బిందె జారి దబ్బునఁబడియెన్
మైజాఱుకొంగు దడిసిన
బాజారే తిరిగి చూచి పక్కున నవ్వెన్. 318

శా. పొచ్చెం బింతయులేని హంసనడతోఁ బొల్పొందులేనవ్వుతోఁ
బచ్చల్దాపిన కుల్కుముంగరలతో బాగైన కెమ్మోవితో
నచ్చంబైన ముసుంగువెట్టి చెలితో నా మాటలే యాడుచున్
వచ్చెంబో కుచకుంభముల్ గదలఁగా వామాక్షి తా నీళ్ళకున్. 319

ఉ. శ్రీకరభూషణంబులును సిబ్బెపుగుబ్బలు ముద్దుఁజెక్కులున్
గోకిలవంటిపల్కులును గొల్చినఁ జేఱలఁ గేరుకన్నులున్
బ్రాకటదేహకాంతియును బంగరుబొమ్మకు హెచ్చు వచ్చు నీ
చాకలవారిజవ్వనికి సాటికిరారిఁకఁ దొంటిజవ్వనుల్. 320



క. నీలాటిరేవులోపల
మేలిమితోఁ దీర్చినట్టు మెఱసి నిలుచుచున్
దాలిమిని వాలుఁజూపుల
బాలామణి గుట్టు బైటఁబడఁగాఁ జూచెన్. 321

కొండవీట నున్నప్పు డెడనెడఁ బల్నాటిసీమకు శ్రీనాథుఁడు పోవుచుండెడివాఁడు. పల్నాటిసీమపై నీతనికిఁగల యనాదరము ననేకపద్యములఁ బట్టి తెలిసికొననగు. పల్నాటివారికిఁ గారెమపూఁడి కాశియట.

ఉ ॥ వీరులు దివ్యలింగములు విష్ణువు చెన్నుఁడు కల్లిపోతురా
జారయఁ గాలభైరవుఁడు నంకమశక్తియ యన్నపూర్ణయున్
గేరెడుగంగధారమఁడుగే మణికర్ణిక గాఁ జెలంగు నీ
కారెమపూఁడిపట్టణము కాశిగదా పలినాటివారికిన్. 322

పల్నాటిసీమపై నీతనికిఁ గల యనాదరము –

క ॥ రసికుఁడు పోవఁడు పల్నా
డెసఁగంగా రంభయైన నేకులె వడుకున్
వసుధేశుఁడైన దున్నును
గుసుమాస్త్రుం డైన జొన్నకూడే కుడుచున్. 323

పల్నాటిసీమలో నెంతోలోఁతు త్రవ్వినఁగాని నీళ్ళూరవు. అక్కడి చేఁత్రాళ్ళు కొండవీటిచేఁత్రాళ్లకు ద్విగుణితములై యుండవలయును. అంతలోఁతు త్రవ్వినను గొన్నిచోట్ల నీరూరక రాతిచట్టు వచ్చును. కాన, నీళ్ళకై యెంతో సొమ్ము భంగపడవలసి వచ్చుచుండును. ఈ విషయమునఁ జెప్పినపద్యము.

ఉ ॥ అంగడి యూరలేదు వరియన్నము లేదు శుచిత్వమేమి లే
దంగన లింపులేరు ప్రియమైన వనంబులులేవు నీటికై
భంగపడంగఁ బాల్పడు కృపాపరు లెవ్వరు లేరు దాత లె
న్నంగను సున్న గాన పలినాటికిఁ మాటికిఁ బోవ నేటికిన్? 324

పల్నాటి ప్రాంతములందు గ్రామమున కెవ్వరేని పెద్దలు వచ్చిన గ్రామ పురోహితునింట విడిదల సేయింతురు. శ్రీనాథుఁ డొక పురోహితునింట విడిసి యచ్చటి రోఁత నిట్లు వర్ణించె. (ఆ వైపులఁ బురోహితు లూరిలోని తమయాశ్రితుల యిండ్ల కనుదినమును విస్తళ్ళు కుట్టియిచ్చుచుండవలెనఁట! దానికై నిల్వ చేసి యుంచుకొన్న విస్తరాకులు గలవు.)

ఉ॥ దోసెఁడుకొంపలోఁ బసులత్రొక్కిడి మంచము దూడరేణమున్
బాసినవంటకంబు పసిబాలుర శౌచము విస్తరాకులున్
మాసినగుడ్డలున్ దలకుమాసినముండలు వంటకుండలున్
రాసెడుకట్టెలుం దలఁపరాదు పురోహితులింటికృత్యముల్. 325

గీ॥ చిన్న చిన్న రాళ్ళు చిల్లరదేవుళ్ళు
నాగులేటినీళ్ళు నాఁపరాళ్ళు
సజ్జజొన్న కూళ్ళు సర్పంబులును దేళ్లు.
పల్లెనాటిసీమ పల్లెటూళ్ళు. 326

క॥ జొన్నకలి జొన్నయంబలి
జొన్నన్నము జొన్నపిసరు జొన్నలె తప్పన్
సన్నన్నము సున్న సుమీ
పన్నుగఁ బల్నాటిసీమ ప్రజలందఱకున్ 327

త్రోవను మంచి నీరు దొరకక చెప్పినది –

క॥ సిరిగలవానికిఁ జెల్లును
దరుణులు పదియాఱువేలఁదగ బెండ్లాడన్
దిరిపెమున కిద్దఱాండ్రా
పరమేశా! గంగ విడుము పార్వతి చాలున్. 328

ఒకప్పుడు పల్నాటిలో నొకరింట నీతనికి జొన్నకూడును, జింత చిగురును ()బచ్చలియాకును గల్పివండినయుడుకుఁగూరయు, వడ్డింపఁగా జెప్పిన పద్యము.



ఉ. ఫుల్లసరోజనేత్ర! యల పూతనచన్నులచేఁదు ద్రావి నాఁ
డల్లఁ దవాగ్ని మ్రింగితి నటంచును నిక్కెదవేల తింత్రిణీ
పల్లవయుక్తమౌ నుడుకుబచ్చలిశాకము జొన్నకూటితో
మెల్లన యొక్క ముద్ద దిగ మ్రింగుము! నీ పస కాననయ్యెడిన్. 329

గురిజాల సీమను గల పులిపాడనుగ్రామమునకు శ్రీనాథుఁడు పోఁగా నాతని యెడ నచ్చటి శేషయ్య యనుకరణమును హనుమయ్య యను కాఁపును పుల్లయ్య యను రెడ్డియును ననాదరము చూపిరట! దానిపై నాతఁడు చెప్పిన పద్యము.

గీ. ఊరు వ్యాఘ్రనగర మురగంబు కరణంబు
కాఁపు కపివరుండు కసవు నేఁడు
గుంపు గాఁగ నిచట గురిజాలసీమలో
నోగు లెల్లఁ గూడి రొక్క చోట! 330

నెమలూరుపైఁ జెప్పినది.

క. నెమలిపురి యమపురముగా
యముఁడాయెను బసివిరెడ్డి యంతకు మిగులన్
యమదూతలైరి కాఁపులు
క్రమ మెఱుఁగని దున్నలైరి కరణా లెల్లన్! 331

అడిగొప్పులపై జెప్పినది.

క. గుడిమీఁదిక్రోఁతితోడను
గుడిలోపలి నంబివారి కోడలితోడన్
నడివీథిలంజెతోడను
నడిగొప్పులయోరుగాలి నడిగితి ననుమీ! 332

మనర (?) రాజ్యముపైఁ జెప్పిన పద్యములు –

ఉ. గొంగడి మేలుపచ్చడము కుంపటి నల్లులు కుక్కి మంచమున్
జెంగట వాయుతైలము లజీర్ణపుమందులు నుల్లిపాయలున్

ముంగిట వంటకట్టియల మోపులు దోమలు చీఱపోతులున్
రంగ! వివేకి కీ మసరరాజ్యముకాఁపుర మెంత రోఁతరా! 333

ఉ. వంకరపాగలున్ నడుమువంగినకత్తులు మైలకోఁకలున్
సంకటిముద్దలుం జనుపశాకములుం బలుపచ్చడంబులుం
దెం కగు నోరచూపులును దేఁకువ దప్పిన యేసబాసలున్
అంకుల బ్రహ్మ యీ మసరరాజ్యము నెట్లు సృజించె? నక్కటా! 334

ఉ. ఆదరణంబు సున్న, వినయంబు హితంబును బొంకు, సత్యమా
లేదు, దయారసం బది హుళక్కి పసాపడువేళ పఙ్క్తిలో
భేదపుఁబెట్టు దిట్టబలిభిక్షముఁ ......................త
త్వాదులఁ బుట్టఁజేసిన విధాత ప్రజాపతి గాకయుండునే! 335

రేనాటిని గూర్చి –

క. గరళము మ్రింగితి నంచుం
బురహర! గర్వింపఁబోకు పో! పో!పో! నీ
బిరు దింకఁ గానవచ్చెడి
మెఱసెడి రేనాటిజొన్న మెదుకులు తినుమీ! 336

పడమటిసీమ వ్యాపారులపైఁ జెప్పిన పద్యము –

శా. దస్త్రాలున్ మసిబుఱ్ఱలుం గలములుం దార్కొన్న చింతంబళుల్
పుస్తుల్ గారెడుదుస్తులుం జెమటకంపుం గొట్టు నీర్కావులుం
అస్తవ్యస్తపుఁగన్నడంబును భయంబై తోఁచుగడ్డంబులున్
'వస్తూ చూస్తిమి రోస్తిమిన్' బడమటన్ వ్యాపారులం గ్రూరులన్. 337

శబరకాంతలు –

క. గిటగిటనగు నెన్నడుముల
పుటపుటనగు చన్నుఁగవలు పున్నమనెలతో



జిటపొటలాడెడు మొగములు
కటితటముల కొమరు శబరకాంతలకమరున్. 338

గీ. వీనులకు విందులై తేనెసోన లెనయ
ముందురాగంబునను జగన్మోహనముగ
పాడె నొక జాలరిమిటారి యీడులేని
కాకలీనాదమున నోడగడపుపాట! 339

శ్రీనాథుఁడు పద్మసాలె మిటారిపైఁ జెప్పినపద్యము.

సీ. పడుగేరుచోఁజూచుఁ గుడియెడమల యందు
సంచరించెడి విటసముదయములఁ
బోగులు గట్టుచో బొరుగిండ్ల చిన్న ప్రా
యపుటింతులకు నుపాయములు గఱపుఁ
గండెలుచుట్టుచోఁ గన్బొమసైఁగతో
సొగసుకాండ్రకుఁ డెంకిచోటుఁజూపు
అచ్చువేయదుకుచో హాస్యరసంబునఁ
జెలికత్తెలను మాఱుపలుకరించు

గీ. నావలీవలి సతులతో హాస్యమాడు
మోకు బిగియించుచోఁ బతి మోసపుచ్చుఁ
గుంచెపిడి పట్టి యీడ్చుచుఁ గొమరు మిగులు
పద్మసాలెది వగఁదేఱి బలుమిటారి! 340

జంగమురాలిమీఁదఁ జెప్పినది

క. చెవి నివి నీలపురాలా
యువిదరొ నిను రతులఁదనుప నొకని తరాలా

యివి రుద్రాక్షసరాలా
జవరాల మహాత్మురాల జంగమురాలా! 341

ఒకప్పుడు ధనలబ్ధి తనకు లేకపోఁగాఁ జెప్పినది –

మ. కవితల్ సెప్పినఁ బాడనేర్చిన వృథాకష్టంబె యీ భోగపుం
జవరాండ్రే కద భాగ్యశాలినులు పుంస్త్వంబేల పో పోఁచకా
సవరంగా సొగసిచ్చి మేల్ యువతివేషం బిచ్చి పుట్టింతువే
నెవరున్ మెచ్చి ధనంబు లిచ్చెదరు గాదే పాపపుందైవమా! 342

రాజమహేంద్రవరమున శాస్త్రపండితులతో వివాదపడి చెప్పిన పద్యములలో నొకటి –

మ. శ్రుతిశాస్త్రస్మృతు లభ్యసించుకొని విప్రుం డంత నానాధ్వర
వ్రతుఁడై పోయి కనున్ బురందరపురారామద్రుమానల్పక
ల్పతరుప్రాంతలతాకుడుంగసుఖసుప్తప్రాప్తరంభాంగనా
ప్రతి... ంకురపాటక్రమకళా పాండిత్యశౌండీర్యముల్. 343

ఒకనాఁడొకవనిత తన్నుఁ గికురింపఁగాఁ జెప్పినది –

ఉ. హా జలజాక్షి! హా కిసలయాధర! హా హరిమధ్య! హా శర
ద్రాజనిభాస్య! హా ప్రమదతంత్రకళానిధి! యెందుఁ బోయితే
రాజమహేంద్రవీథిఁ గవిరాజు ననుం గికురించి భర్గకం
ఠాజితకాలకూటఘుటికాంచితమైన యమాసచీఁకటిన్? 344

కడిదిపురమున కరిగి చెప్పినవి –

క. ముదివిటులు విధవలంజెలు
పదకవితలు మాఱుబాసబాఁపనవారల్
చదువని పండితవర్యులు
కదనాస్థిరవీరవరులు కడిదిపురమునన్. 345



ఉ. చీరయు ముక్కుముంగరయుఁ జెంపలగంధముఁ జుక్కబొట్టు మం
జీరఝుణంఝుణారవముఁ జేతులఁ గంకణనిక్వణంబు నొ
య్యారపుజాఱుకొప్పును గయాళితనంబును గాని లోన శృం
గార మొకింతలే దనుట గంటిని యీ పురివారకాంతలన్. 346

రాచవీటి కరిగినప్పుడు చెప్పికొన్న పద్యము –

చ. పస గల ముద్దుమోవి బిగివట్రువగుబ్బలు మందహాసమున్
నొసట విభూతిరేఖయుఁ బిసుంగునతావి మిటారిచూపులున్
రసికులు మేలు మేలు భళిరా యని మెచ్చఁగ రాచవీటిలోఁ
బసిఁడిసలాకవంటి యొక బల్జవధూటిని గంటి వేడుకన్. 347

దక్షిణదేశమున కరిగినప్పుడు చెప్పినవి –

గీ. మేఁతఁ గరిపిల్ల పోరున మేఁకపిల్ల
పారుఁబోతుతనంబునఁ బందిపిల్ల
ఎల్లపనులను జెఱుపంగఁ బిల్లిపిల్ల
అందమునఁ గ్రోఁతిపిల్ల యీ యఱవపిల్ల. 348

సీ. కూడు తలఁపఁ జోళ్ళు కూర కారామళ్ళు
చెవులంత వ్రేలాళ్ళు చేలు మళ్ళు
దుత్తెఁడే నాగళ్ళు దున్నపోతులయేళ్ళు
కలవు మాపటివేళ గంజినీళ్ళు
మాటమాటకు ముళ్ళు మఱి దొంగదేవళ్ళు
చేఁదైనపచ్చళ్ళు చెఱకునీళ్ళు
వంటపిడ్కలదాళ్ళు వాడనూతులనీళ్ళు
విన విరుద్ధపుఁ బేళ్ళు వెడఁదనోళ్ళు
సఖుల చన్నులబైళ్ళు చల్లనిమామిళ్ళు
పరుపైన వావిళ్ళు పచ్చపళ్ళు

గీ ॥ దళమయినయట్టికంబళ్లు తలలు బోళ్లు
పయిఁడికిని జూడఁ బయిఁడెత్తు ప్రత్తివిళ్లు
చలముకొని వెదకిన లేవు చల్లనీళ్లు
చూడవలసెను ద్రావిళ్ల కీడుమేళ్లు. 349

సీ ॥ తొలుతనే వడ్డింత్రు దొడ్డమిర్యపుఁజారు
చెవులలోఁ బొగవెళ్లి చిమ్మిరేఁగఁ
పలుతెఱంగులతోడఁ బచ్చళ్లు చవిగొన్న
బ్రహ్మరంధ్రముదాఁకఁబారు నావ
యవిసాకు వేఁచిన నార్నెల్లు ససి లేదు
పరిమళ మెంచినఁ బండ్లు సొగచు
వేపాకునెండించి వేసినపొళ్లను
గంచానఁగాంచినఁ గ్రక్కు వచ్చు

కీ ॥ నఱవవారింటి విందెల్ల నాగడంబు
చెప్పవత్తురు తమ తీరు సిగ్గులేక
..............................
చూడవలసెను ద్రావిళ్ల కీడుమేళ్లు.

శ్రీరంగక్షేత్రమున కరిగి యచ్చట నొక బిత్తరిపైఁజెప్పినది –

సీ ॥ ఒకచెంప కోరగా నొనగూర్చి దిద్దిన
తుఱుమున నుండి క్రొవ్విరులు రాల
రాతిరి నిదురఁ గూరమిఁజేసి ముడివడు
బడలిక నడుగులు తడఁబడంగ
వింతవారలఁ జూచి వెసనవ్వు నెడఁ గప్పు
గల దంతముల కాంతి వెలికిఁబాఱ



చిడిముడినడచుటఁ జెలరేఁగు గుబ్బల
పైఁ దాఁకి యొక్కింత పైఁట జాఱ

గీ ॥ చెమటచేఁ దిరునామంబు చెమ్మగిల్ల
హొళి డాచేత విడియంబు గీలుకొల్పి
రంగపురిరాజవీథిఁ గానంగనయ్యె
నాదు మదిఁ గోర్కులూర వైష్ణవవధూటి 351

మారెళ్లసీమ కరిగినప్పుడు చెప్పినవానిలో నొకటి –

సీ ॥ నడివీథిలో రాళ్లు నాగులే దేవళ్లు
పరగట సావిళ్లు పాడుగుళ్లు
ఐదువన్నెలకూళ్లు నంబటికావిళ్లు
నూరూర జిల్లేళ్లు నూటనీళ్లు
నడుముకు వడదోళ్లు నడువీథిఁ కల్‌రోళ్లు
కరణాలవడిసెళ్లు కాఁపుముళ్లు
........................................
...............................

గీ ॥ ........................ నేరేళ్ల వాగునీళ్లు
సిరులఁ జెలువొందు మారెళ్ల సీమయందు. 353

రెడ్ల ప్రాచీనరాజధానియగు నద్దంకి కరిగినప్పుడు చెప్పినది.

సీ ॥ తళ్కుతళ్కనుకాంతి బెళ్కు కెంపులముంగ
రందమై కెమ్మోవియందుఁ గుల్క
ధగధగద్ధగలచేఁ దనరారు బంగారు
గొలుసులింగపుఁగాయ కొమరు మిగుల

నిగనిగన్నిగలచే నెగడు చెల్వపుగుబ్బ
దోయి యొండొంటితో రాయిడింప
రాజహంసవిలాసరాజితం బగుయాన
మందు మెట్టెలు రెండు సందడింప

గీ. సరసదృక్కుల విటులను గరఁగ జూచి
పొందికైనట్టి మోమున భూతిరేఖ
రాజకళ లొప్ప నద్దంకిరాజవీథిఁ
బొలిచె నొక కొమ్మ గాజులముద్దుగుమ్మ. 353

ఉ. గండము దప్పె నాంధ్రకవిగానికి నిన్నటి రేయిఁ బుప్పకో
దండుని గారవింపకయ తద్దయు నిల్చితిఁగాని యయ్యయో!
బండరువారిపాపికిని బైటిపసారమె యట్టె మైమయిం
బుండయి యెల్లవంకఁ జెడిపోవుదుగా! యటువోయియుండినన్. 354

మఱికొన్ని పద్యములు –

ఉ. వాలగుకన్నుదోయి బిగివట్రువగుబ్బలు కాఱుచీఁకటిం
జాల హసించుకొప్పుజిగి సారసము న్నగుమోము గల్గు నా
బాలికఁ గూలి కమ్ముకొన బట్టలు నేసెడువానికిచ్చె హా
సాలెత గాదురా కుసుమసాయకుపట్టపుదంతి! యింతియే! 355

ఉ. కుమ్మరవారి బాలిక చకోరవిలోచన ముద్దుగుమ్మ యా
వమ్ముదరిన్ రసామలినవస్త్రము చుంగులుజాఱఁ గట్టి తాఁ
గమ్మనిమ్రోతఁతోఁ గరనఖమ్ముల భాండము లంగజాస్త్రపా
తమ్మనఁ ద్రోవు దీసె విటతండము గుండియ లార విచ్చఁగన్. 356

క ॥ ఆకదురునఁ బికరవమున్
ఆకదురున భృంగరవము నాత్మరవంబున్



ఏకీకృతముగ నేకు ల
నేకులు విన వడికె ముదిత యేకులముదిరా! 357

ఉ ॥ గుబ్బలగుమ్మ లేఁజిగురుఁగొమ్మ సువర్ణపుఁగీలుబొమ్మ బల్
గబ్బిమిటారి చూపులది కాఁపుది దానికిఁనేల యొక్క నిం
బెబ్బులి నంటఁగట్టితివి పెద్దవు నిన్ననరాదు రోరి దా
నబ్బ! పయోజగర్భ! మగనాలికి నింతవిలాసమేటికిన్? 358

శా ॥ దాయాదుల్వలె గుబ్బచన్ను లొఱయన్ ధావళ్య నేత్రాంబుజ
చ్ఛాయల్ తాండవమాడఁ గేరి పురుషస్వాంతమ్మునన్ మన్మథుం
డేయం జంగమువారి చంద్రముఖి విశ్వేశార్చనా వేళలన్
వాయించెం గిరిగిండ్లు బాహుకుశలవ్యాపార పారీణతన్. 359

ఉ ॥ పువ్వులు కొప్పునం దురిమి ముందుగఁ గొ నసియాడుచుండఁగా
జెవ్వనఁ జంగసాఁచి యొకచేతను రోఁకలిపూని యొయ్యనన్
నవ్వుముఖంబుతోడఁ దన నందనుఁ బాడుచు నాథుఁజూచుచున్.[1] 360

సీ ॥ బొమవింటఁ దొడిగినపూవింటి దొరముల్కి
పోల్కిఁగస్తురి సోఁగబొట్టు దిద్ది
చకచక లీను తారకల రేకలువోలెఁ
గొలుకులు వెడలఁగజ్జలము దీర్చి
పొడుపుగుబ్బలిమీఁద బొడము నీరెండ నా
రంగుచందురుకావి రైక దొడిగి
పిఱుఁదు పొక్కిలి యను మెఱక పల్లము గప్పఁ
బాల వెల్లువవంటి చేల గట్టి.

గీ ॥ అంచగొదమలగమి బెదరించుపోల్కి
నందెచప్పుళ్ళు ఘల్లు ఘల్లనుచు మొరయ

1. పూర్వప్రతులలో మూడు పాదములే ఉన్నవి.

నడుము జవజవలాడఁ గీల్జడ ఘటించి
వచ్చె ముక్కంటిసేవకు మచ్చెకంటి. 361

సీ ॥ తాటంకయుగధగద్ధగితకాంతిచ్ఛటల్
చెక్కుటద్దములపై జీరువార
నిటలేందుహరినీల కుటిలకుంతలములు
చిన్నారిమోమునఁ జిందు ద్రొక్క
బంధురమౌక్తిక ప్రకటహారావళుల్
గుబ్బచన్నులమీఁద గునిసియాడ
కరకంకణక్వణక్వణనిక్వణంబులు
పలుమాఱు రాతిపైఁ బరిఢవిల్ల

గీ ॥ ఓరచూపుల విటచిత్త మూఁగులాడ
బాహుకుశలతఁ జక్కని మోహనాంగి
పాటఁబాడుచుఁ గూర్చుండి రోటిమీఁదఁ
బిండి రుబ్బంగఁ గన్నులపండు వయ్యె. 362

సీ ॥ శ్రీరస్తు భవదంఘ్రిచికురంబులకు మహా
భూర్యబ్దములు సితాంభోజనయన!
వరకాంతిరస్తు తావకముఖనఖముల
కాచంద్ర తారకం బబ్జవదన!
మహిమాస్తు నీకటిమధ్యంబులకు మన్ను
మిన్ను గలన్నాళ్లు మించుబోఁడి!
విజయోஉస్తు నీగానవీక్షలకానీల
కంఠ హరి స్థాయిగా లతాంగి!

గీ ॥ కుశల మస్తు లసచ్ఛాతకుంభకుంభ
జంభభిత్కుంభికుంభాభిజృంభమాణ



భూరిభవదీయవక్షోజములకు మేరు
మందరము లుండుపర్యంత మిందువదన! 363

సీ ॥ చక్కని నీ ముఖచంద్ర బింబమునకుఁ
గళ్యాణ మస్తు బంగారుబొమ్మ!
నిద్దంపు నీ చెక్కుటద్దంపురేకకు
నైశ్వర్య మస్తు నెయ్యంపుదీవి!
మీటినఁ బగులు నీ మెఱుఁగుఁబాలిండ్లకు
సౌభాగ్య మస్తు భద్రేభయాన!
వలపులు గులుకు నీ వాలుఁగన్నులకు న
త్యధికభోగోஉస్తు పద్మాయతాక్షి!

గీ ॥ మధురిమము లొల్కు నీ ముద్దుమాటలకును
వైభవోన్నతిరస్తు లావణ్యసీమ!
వన్నెచిన్నెలు గల్గు నీ మన్ననలకు
శాశ్వతస్థితిరస్తు యోషాలలామ! 364

సీ ॥ సొగసుకీల్జడదాన! సోగకన్నులదాన!
వజ్రాలవంటి పల్వరుసదాన!
బంగారుజిగిదాన! పటువుగుబ్బలదాన!
నయమైన యొయ్యారి నడకదాన!
తోరంపుఁగటిదాన! తొడల నిగ్గులదాన!
పిడికిటనడఁగు నెన్నడుముదాన!
తళుకుఁజెక్కులదాన! బెళుకుముక్కరదాన!
సింగాణికనుబొమ చెలువుదాన!

గీ ॥ మేలిమిపసిండిరవకడియాలదాన!
మించిపోనేల రత్నాలమించుదాన!

తిరిగిచూడవె ముత్యాలసరులదాన!
చేరి మాటాడు చెంగావిచీరదాన! 365

క॥ కుంకుమ లేదో మృగమద
పంకము లేదో పటీరపాంసువు లేదో
సంకుమదము లేదో యశు
భంకరమగు భస్మమేల బాలా! నీకున్. 366

శ్రీనాథుని బావమఱఁది రామయమంత్రి యనునతఁడు మంచిభోజనపుష్టి గలవాఁడట! ఆతఁడొక యూరికరణము. పాఁడిపంటలు గల సంసారి. ఒకసారి బంతిని గలసి భుజించుచు శ్రీనాథుఁ డాతనికి నీ పద్యము చెప్పిగేలికొనెను.

ఉ. గ్రామము చేతనుండి పరికల్పితధాన్యము నింటనుండి శ్రీ
రామకటాక్షవీక్షణపరంపరచేఁ గడతేఱఁ గాక మా
రామయమంత్రిభోజనపరాక్రమమేమని చెప్పవచ్చు? నా
స్వామి యెఱుంగుఁ దత్కబళచాతురి తాళఫలప్రమాణమున్. 367

వేఱొక బంధుజనునిపైఁ జెప్పినది.

ఉ. మా కలిదిండికామయకుమారకుఁ డన్నిటఁ దండ్రివైఖరే
కాక తదన్యుఁ డెట్లగును? గాడిదకుం దురగంబు పుట్టునే?
చేకొని కొంకినక్కకును సింగము పుట్టునె? మాలకాకికిం
గోకిల పుట్టునే? చిఱుతకుక్కకు మత్తగజంబు పుట్టునే? 368

తనయెడ నత్యంతాదరము సూపిన రాజులును, రాజమంత్రులును, స్వర్గస్థులైరి. కడుపు కక్కుర్తిచేఁ గృష్ణాతీరమున బొడ్డుపల్లెను గుత్తకుఁ గొని శ్రీనాథుడు కృషిచేయ మొదలిడెను. కృష్ణవరదవలనఁ బైరు మునిఁగి పోయినది. అప్పుడు తన్నాదరించిన రెడ్డిరాజులకు గర్భశత్రువులగు నొడ్డెరాజులు రాజ్యమేలుచుండిరి. విద్యాగౌరవము లేక యా యొడ్డెరాజులు శ్రీనాథునిఁబలుసిలుఁగులకుఁ



బాల్పఱిచిరి. శ్రీనాథకవిసార్వభౌముఁ డీ క్రింది పద్యమును జెప్పి యాంధ్రవాఙ్మయ మున్నంతకాలమును శాశ్వతమగునట్లారాజుల కపకీర్తిని నెలకొల్పెను.

సీ. కవిరాజుకంఠంబు కౌఁగిలించెను గదా!
పురవీథి నెదురెండ పొగడదండ
ఆంధ్రనైషధకర్త యంఘ్రియుగ్మంబునఁ
దగిలియుండెను గదా నిగళయుగము
వీరభద్రారెడ్డి విద్వాంసుముంజేత
వియ్యమందెను గదా వెదురుగొడియ
సార్వభౌమునిభుజాస్తంభ మెక్కెను గదా
నగరివాకిటనుండు నల్లగుండు

గీ. కృష్ణవేణమ్మ గొనిపోయె నింత ఫలము
బిలబిలాక్షులు తినిపోయెఁ దిలలు పెసలు
బొడ్డుపల్లెను గొడ్డేఱి మోసపోతి
నెట్టు చెల్లింతుఁ దంకంబు లేడునూర్లు. 369

అవసానకాలమున శ్రీనాథ మహాకవిసార్వభౌముఁడు చెప్పికొన్న పద్యము.

సీ. కాశికావిశ్వేశు గలిసె వీరారెడ్డి
రత్నాంబరంబు లే రాయఁ డిచ్చు?
రంభఁగూడెఁ దెనుంగురాయరాహుత్తుండు
కస్తూరి కే రాజుఁ బ్రస్తుతింతు?
స్వర్గస్థుఁడయ్యె విస్సనమంత్రి మఱి హేమ
పాత్రాన్న మెవ్వనిపంక్తిఁ గలదు?
కైలాసగిరిఁ బండె మైలారువిభుఁ డేఁగి
దినవెచ్చ మే రాజు తీర్పఁగలఁడు?

గీ. భాస్కరుండు మున్నె దేవునిపాలి కరిగెఁ
గలియుగంబున నింక నుండఁ గష్ట మనుచు
దివిజకవివరుగుండియల్ దిగ్గు రనఁగఁ
నరుగుచున్నాఁడు శ్రీనాథుఁ డమరపురికి. 370

శ్రీనాథ కవిసార్వభౌముఁడు కర్ణాటాధీశ్వరుఁడగు ప్రౌఢదేవరాయల దర్శింపఁ బోయినప్పుడు చెప్పిన పద్యము లీ క్రిందివి క్రొత్తగాఁ జేకూరినవి. దేవరాయల యాస్థానమున ధర్మాధికారిగా ముమ్మకవి యనుపేరి విద్వత్కవి యుండెనట! ముందుగా శ్రీనాథుఁ డా కవీశ్వరుని దర్శించి యీ క్రింది పద్యములు చెప్పెనట!

సీ ॥ పంపావిరూపాక్ష బహుజటాజూటికా
రగ్వధ ప్రసవ సౌరభ్యములకు
తుంగభద్రా సముత్తుంగ వీచీఘటా
గంభీరఘుమఘుమారంభములకు
కళసాపురప్రాంత కదళీవనాంతర
ద్రాక్షాలతాఫల స్తబకములకు
కర్ణాటకామినీకర్ణ హాటకరత్న
తాటంకయుగ ధాళధళ్యములకు

గీ ॥ నిర్నిబంధనిబంధమై నెనయు కవిత
తెలుఁగునను సంస్కృతంబునఁ బలుకనేర్తు
ప్రౌఢదేవేంద్రరాయ భూపాలవరుని
సమ్ముఖంబున దయఁజూడు ముమ్మసుకవి! 371

చ ॥ తరువున గాండివం బిడఁడె ధర్మజునానఁ గిరీటి యేను వా
క్సరసిజనేత్ర యానతి విచారముచొప్పున గర్వహీనతన్



మరలి తెలుంగుభూమికసమానగతిం గొనిపోవువాఁడనై
బిరుదులు నారివాఁగుకడఁ బెట్టితి సత్కవిసార్వభౌముఁడన్. 372

ముమ్మ కవియెడ నీ విధముగా నార్జవము నెఱపెను. పిదప రాయల సందర్శన మునకు జాగగుచుండఁగా రాయల కిట్లు వార్త పంపెను –

సీ ॥ డంబు సూపి ధరాతలంబు పైఁ దిరుగాడు
కవిమీఁదఁగాని నా కవచ (?) మేయ
దుష్ప్రయోగంబుల దొరకొని చెప్పెడు
కవిశిరస్సునఁగాని కాలు చాఁప
సంగీత సాహిత్య సరస విద్యల నేర్చు
కవుల ఱొమ్ములు గాని కాల్చి విడువ
చదివి చెప్పఁగ నేర్చి సభయందు విలసిల్లు
కవినోరుఁగాని వ్రక్కలుగఁ దన్న

గీ ॥ దంటకవులకు బలువైన యింటిమగఁడఁ
గవుల వాదంబు విన వేడ్క గల్గెనేని
నన్నుఁ బిలిపింపు మాస్థానసన్నిధికిని
లక్షణోపేంద్ర! ప్రౌఢరాయక్షితీంద్ర! 373

రాయల సందర్శనము సమకూరెను. డిండిమభట్టు ప్రత్యర్థి పండితుఁడుగా నేర్పడెను. బాలను, యువతినిఁ, బ్రౌఢను, లోలను, గూర్చి రాజు నాల్గు సీసపద్యములు చెప్పఁగోరెను. శ్రీనాథుఁడు చెప్పెను. అందొకటి –

సీ ॥ కమనీయకరపల్లవము మేను గదియంగ
నొయ్యన చాఁచిన నులికిపడును
ఆలింగనమునకు నక్కునఁ జేర్చినఁ
జేదోయి యురము పైఁ జేర్చికొనును
చుంబనమ్మున కోష్ఠబింబంబు గమకింప
వదన మొయ్య నొకింత వంచుకొనును

గిలిగింత సేఁతకుఁ గినుకయు సిగ్గును
మొలవంగఁ గన్నులు మోడ్చుకొనును

గీ ॥ అట్టి బాల రతిక్రీడ ననువుపఱుప
నేర్పు గల్గునె పరులకు నీకుఁగాక
రాజపరమేశ! రాజాధిరాజవిభవ!
లక్షణోపేంద్ర! ప్రౌఢరాయక్షితీంద్ర! 374

డిండిమభట్టారకునితోడి వివాద మీ సందర్భమందలిది. ప్రత్యర్థిని జయించిన పిదప శ్రీనాథుఁడు చెప్పిన పద్యము లివి చేకూఱినవి.

మ ॥ జననాథోత్తమ! దేవరాయనృపతీ! చక్రేశ! శ్రీవత్సలాం
ఛనసంకాశ! మహాప్రభావ! హరిరక్షాదక్ష! నాబోఁటికిన్
గునృపస్తోత్రసముద్భవం బయిన వాగ్దోషంబు శాంతంబుగాఁ
గనకస్నానము చేసి కాక పొగడంగా శక్యమే దేవరన్. 375

కనకస్నానమహోత్సవము జరిగినది.

శా ॥ జోటీ! భారతి! యార్భటిన్ మెఱయుమీ! చోద్యంబుగా నేను గ
ర్ణాటాధీశ్వరుఁ బ్రౌఢదేవనృపతిన్ నాసీరధాటీచమూ
కోటీఘోటకధట్టికాఖురపుటీకుట్టాక సంఘట్టన
స్ఫోటీధూతధరారజశ్ఛుఱుకితాంభోటిన్ బ్రశంసించెదన్. 376

ఇత్యాదిపద్యముల దేవరాయలను స్తుతించినాడు.

## భృంగపంచకము

ఇది శ్రీనాథకృతి యందురు.

సౌందర్య శాలిని యగు నొక నరపాలుని దేవేరి యమాత్యునకుఁ జనవుపడి యుండెను. ఒకప్పు డా భూపతి కార్యవశమున స్థలాంతరమున కరుగుడు నా మంత్రి యంతిపురమునఁ జేరుకొని రాజమహిషితోఁ గేరింతలాడుచుండెను.



పుడమిఱేఁడును నాఁటి రేయికే మరలఁ దిరిగివచ్చుటయుఁ గోటలోనికి వచ్చిన తోడన కవాటములెల్ల బంధింపఁబడుటయు నెఱిఁగి దూతిక యొక ర్తీవృత్తాంత మమాత్యునకుఁ దెలిపి దాఁకొనుటకు భృంగాపదేశమునఁ జెప్పినది.

ఉ ॥ మాయురె! భృంగమా! వికచమల్లికలన్ విడనాడి తమ్మిలో
నీ యెడఁ బూవుఁదేనియల నింపుజనింపఁగ గ్రోలి సొక్కియున్
బోయెద నన్న భ్రాంతి నినుఁ బొందదు రా జుదయించె నిప్పుడీ
తోయజపత్రముల్ వరుసతో ముకుళించెఁ జలింపకుండుమా! 377

పుడమిఱేఁడు శయనాగారమున కరిగినపిదపఁ గొంతదడవునకు మంత్రి యిఱుకటమున దాఁగియుండజాలక యిటునటుఁ గదలఁగాఁ జప్పుడగుట విని మఱల నా దూతిచెప్పునది.

చ ॥ అళికులవర్య! పద్మముకుళాంతరమందు వసింపనేరమిన్
జలనము సెందెదేమి నవసారసమిత్రుఁడు రాకయుండునా?
తొలఁగక యందె యుండు మిఁకఁ దోయజవైరి తిరంబె రాత్రి యీ
కలవరమేల? తమ్మితుద గానక తూఱక యూరకుండుమా! 378

సాధ్వీమణియగు నా మంత్రి భార్య ఱేఁడంతిపురమునఁ జేరుట విని రేయి రెండుజాములు కడచనినను దన భర్త యిలుసేరమిచే దిగుల్పడి యేమి కీడు వాటిల్లెనో యని కనుఁగొనరాఁగా నామెను గూర్చి దూతి చెప్పునది.

మ ॥ అళినీ! తత్తఱ మేలె నేఁడు నిదె నీ యాత్మేశుఁడౌ భృంగమున్
జలజాసక్తమరందపానవశతన్ సానందుఁడై యున్నవాఁ
డులు కింతేనియు లేక నీ వరుగుమా! యొప్పార నిప్పాట నీ
చెలువుండుం బఱతెంచుఁ దేకువను రాజీవంబు పుష్పించినన్ 379

తా మింక వెలుపలకు దయచేయుండని మంత్రికిని బోధించుచుఁ జెప్పునది.

మ ॥ పతి నిద్రించినవేళ రాందగున యో పద్మారి యీ కేళికా
యతనంబందు రతిశ్రమన్ విభుఁడు నిద్రాసక్తుఁడై యుండె నీ
శతపత్రేక్షణ మోము వాంచినది నీ సామర్థ్యమున్ జూపఁబో
కతివేగంబున నేఁగుమా! తొలఁగి మా యాత్మల్ సుఖంబందఁగన్ 380

రేయి రాజమహిషి తన కంఠహారమును మంత్రికంఠమున వైచెను. ఆతఁడు నది మఱచి మఱునాఁడు దానిఁదాల్చియే రాజసభ కరుదెంచెను. అది గాంచి రాజు గుఱుతించునేమో యని భీతిలి నిపుణయగు నా దూతివంటివేషమున నరుగుదెంచి యీ క్రింది పద్యమును జదువ, నందలి "మానపరిపాల" యను విశేషణముఁబట్టి మంత్రి తెలిసికొని తన కంఠమందలి హారమును బైపుచ్చడమునఁజుట్టి పారితోషికముగా నొసంగెను.

చ ॥ అతులసభాంతరస్థితబుధావళికెల్ల జొహారు వీరరా
హుతులకు మేల్జొహారు సతతోజ్జ్వలవిక్రమ సార్వభౌమసం
తతికి జొహారు వైభవవితానపురందరుఁడైన యట్టి భూ
పతికి జొహారు మానపరిపాల! జొహారు ప్రధానశేఖరా! 381

## బమ్మెర పోతన

ఈతఁడు క్రీ॥ 1400, ప్రాంతమున నున్నవాఁడు. శ్రీనాథునకు బావమఱది యందురు. శ్రీభాగవతము, దండకము, వీరభద్రవిజయము నీతని కృతులు. కొందఱు, భోగినీదండక వీరభద్ర విజయములకుఁ బోతనకర్తృత్వమునెడ సంశయపడెదరు. ఈ పవిత్రకవి వైషయికేచ్ఛావైముఖ్యమును బ్రశంసించు కట్టుకతలు కొన్ని కలవు. వానిని విడచి యా ప్రసక్తిలోని పద్యము లుదాహరించెదను.

ఉ ॥ కాటుక కంటినీరు చనుకట్టుపయింబడ నేల యేడ్చెదో
కైటభదైత్యమర్దనుని గాదిలికోడల! యో మదంబ! యో



హాటకగర్భురాణి! నిను నాఁకటికై కొనిపోయి యల్ల క
ర్ణాటకిరాటకీచకుల కమ్మఁ ద్రిశుద్ధిగ నమ్మ భారతీ! 382

శ్రీనాథకవీశ్వరుఁడు, పోతనామాత్యునితో నిట్లనియె నట -

క ॥ కమ్మని గ్రంథం బొక్కటి!
యిమ్ముగ నే నృపతి కైనఁ గృతియిచ్చినఁ గై
కొమ్మని యీయరె యర్థం?
బిమ్మహి దున్నంగ నేల యిట్టి మహాత్ముల్?

నందిమల్లయ ఘంటసింగయలు, శృంగారషష్ఠమనుపేర భాగవతషష్ఠ స్కంధమునే తెలిఁగించినారు. దానిఁ గూర్చి- 383

శా ॥ చండాంశుప్రభవీక్ష! తిమ్మయతనూజా! తిమ్మ! విధ్వస్తపా
షండంబైన త్రిలింగ భాగవత షష్ఠస్కంధభాగంబు నీ
కుం డక్కెం జతురాననత్వగుణయుక్తుల్మీఱ వాణీమనో
భండారోద్ధతి చూఱకారబిరుద ప్రఖ్యాతి సార్థంబుగన్ 384

## పిల్లలమఱ్ఱి పినవీరభద్రకవి

ఈ మేటికవి క్రీ॥ 1480 ప్రాంతమున నాంధ్ర దేశమునఁ బ్రఖ్యాతి కెక్కినవాఁడు. శృంగారశాకుంతలము, జైమినిభారతము నను రెండుకృతులు మాత్ర మీతనివి లభించుచున్నవి. విద్యానగరమును బరిపాలించిన సాళ్వగుండ నరసింహరాజునకు జైమినిభారతము కృతిగా నొసఁగఁబడినది. నరసింహ రాజునకు కృతి రచించికొనివచ్చుట కేర్పఱిచిన గడువునాఁటివఱకు నీతఁడు గ్రంథరచన మారంభింపనే లేదనియు నాఁడు తద్బంధుజనులు కృతి రచింప వైతివి రాజువలనఁ జిక్కు వచ్చు నని మొఱపెట్టఁగా నా రాత్రి యింటిలో నొక గది యలికించి ముగ్గు వెట్టించి తాటియాకులును గంటమును గొని తానొకరుఁడ యందుఁ బ్రవేశించి

సరస్వతీసాహాయ్యమునఁ దెల్లవారువఱకుఁ గృతిని సమకూర్చి మఱునాఁడు రాజాస్థానమున వినిపించి 'వాణి నారాణి' యనె ననియు నొక కట్టుకథ కలదు. అంత శీఘ్రకాలములో నతిరసవంతమగు నా కృతి నాతఁడు రచించుట సత్యమయి యుండును. పైకథకు దోడుగా నీ పద్య మొకటి కలదు.

క ॥ పిల్లలమఱి పినవీరన
కిల్లా లట వాణి యట్టులే కా కున్నన్
తెల్లముగ నొక్క రాతిరి
తెల్లగ తెలవారువఱకు తేగలఁడె కృతిన్. 385

## వెల్లంకి తాతంభట్టు

కవిలోక చింతామణి యనుపేరి లక్షణ గ్రంథమును రచియించిన యీ కవీశ్వరుఁడు పదునైదవశతాబ్దిలో నున్నవాఁడు. ఈ క్రింది పద్యము లాతని ప్రశస్తిని దెలుపుచున్నవి –

సీ ॥ ఏ కవి నిర్మించె నీ శబ్దశాస్త్రప
ద్ధతి యెల్ల సుకవిచింతామణి యన
ఏ కవి చెప్పె ననేక పుణ్యానల్ప
బంధురసంక్షేప భాగవతము
ఏ కవి పఠియించె నెల్ల భాషలు నతి
ప్రకటనిర్భరమతిప్రౌఢి మెఱసి
ఏ కవి తెచ్చె మహీశసంఘముచేత
వారణాశ్వాదిసువస్తుచయము

గీ ॥ అతఁడు వెల్లంకి తాతమహాయశోగ్ర
గణ్యుఁడుత్తమ సుకవి ముఖ్యాధినాథుఁ



డంబరాశావకాశ విఖ్యాతచక్ర
వాళ శైలాంతరావాప్తఖేలయశుఁడు. 386

సీ ॥ 'కర్ణాట కటకభూకాంతసభాంత ప్ర
గల్భ కవీశ్వరకమలహేళి!
గజపతిసంసదఖర్వ విద్యాగర్వ
తార్కికకుముదసుధామయూఖ!
అశ్వ సాధనమహేంద్రాస్థానశాబ్దిక
వర్య చూతద్రుమవనవసంత!
మాళవేశ్వరసదో మధ్యమస్థాయికా
లంకారిక మయూరలలిత మేఘ!

గీ ॥ యనుచు ని న్నవనీపతు లహరహంబు
సరగ గంభీరవాక్ప్రౌఢి సన్నుతింతు
రబ్జభీమణితనయ! శబ్దార్థనిలయ
తాస్థిరాత్మక! వెల్లంకి తాతసుకవి! 387

## కృష్ణదేవరాయలు

బళ్లారిమండలములోని యానెగొందికి సమీపమున నుండిన విద్యానగరమను పట్టణరాజము రాజధానిగా దక్షిణ హిందూ దేశమునకెల్ల నేకచ్ఛత్రాధిపత్యమును నిర్వహించిన యీ నృపాల రత్నము క్రీ॥ 1509 మొదలు 1530 వఱకు రాజ్యము వహించినట్లు తెలియుచున్నది. కృష్ణరాయలు బహువారములు దండయాత్రలు చేసి నానారాజుల జయించి తురుష్కుల ముష్కరకృత్యముల సాగనీయక రాష్ట్రముల నాక్రమించుకొని మహారాజ్య వైభవ మనుభవించినవాఁడగుటయేగాక సరసకవితా విలాసలాలసుఁడై పెద్దనాది సుకవీంద్రుల పల్కుఁదేనియలఁ జూఱలఁగొని సంస్కృతాంధ్రములందు మేలయిన కవనము సెప్పనేర్చిన సుకవిరాజ శిఖామణి. ఆంధ్రమున విష్ణుచిత్తీయమును

సంస్కృతమున మదాలసా చరిత్రాదికములు నితనికృతులు. ఆంధ్ర వాఙ్మయమున కీమహారాజు కాలమున నింతంతనరాని మహోన్నతి చేకూఱెను. పెద్దనాదికవిశ్రేష్ఠు లీతని యాస్థానమునఁ గవీశ్వరులు. మనుచరిత్రము, పారిజాతాపహరణము మొదలగు కృతుల కీతఁడు కృతిపతి. పెద్దనామాత్యున కీతఁడాంధ్రకవితా పితామహుఁడన్నబిరుద మొసఁగెను. విద్యావిషయమున నీ మహారాజు నాస్థానమునందు జరిగినవృత్తాంతములు వింతవింతలుగాఁ జెప్పుకొనఁ బడుచున్నవి. కొన్ని మాత్రమిందుఁ దెల్పఁబడును.

ఒకప్పుడు కృష్ణరాయలు పసిఁడి పళ్లెరమునఁ గవిగండ పెండేరమును గొనివచ్చి సభాస్థానమున నిడి సంస్కృతాంధ్రములందు సమముగాఁ గవనము సెప్ప నేర్చిన వారిద్దానిఁ గైకొన నర్హులనఁగా సభ్యులు మిన్నకుండిరనియు దానిపై నాతఁడే.

ఉ॥ ముద్దుగ గండపెండియరమున్ గొనుఁడంచు బహూకరింపఁగా
నొద్దిక నా కొసంగుమని యొక్కరుఁ గోరఁగలేరు లేరొకో –

అని సగముపద్యముఁ జదివినఁ బెద్దనామాత్యుఁడు లేచి –

పెద్దనబోలు పండితులు పృథ్విని లేరని నీ వెఱుంగవే
పెద్దన కీఁదలంచినను బేరిమి నా కిడు కృష్ణరాణ్ణృపా! 388

అని పూరించి యీ మాలిక నాశువుగా రచించి చదివె నట!!

ఉ॥ పూఁత మెఱుంగులుం బసరుపూఁపబెడంగులుఁ జూపునట్టివా
కైతలు? జగ్గు నిగ్గు, నెనగావలెఁ గమ్మన గమ్మనన్వలెన్
రాతిరియున్ బవల్ మఱపురానిహొయల్ చెలి యా రంజపు ని
ద్ధాతరితీపులో యనఁగఁ దారసిలన్వలె లోఁ దలంచినన్
బాఁతిఁగఁ బైకొనన్ వలెను బైదలికుత్తుకలోని పల్లటీ
కూఁత లనన్వలెన్ఁ సొగసుకోర్కులు రావలె నాలకించినన్



జేతికొలందిఁ గౌఁగిటను జేర్చిన కన్నియ చిన్ని పొన్ని మే
ల్మోఁతల చన్నుదోయివలె ముచ్చటగావలెఁ బట్టి జూచినన్
డాతొడనున్న మిన్నుల మిటారపుముద్దులగుమ్మ కమ్మనౌ
వాతెఱ దొండపండువలె వాచవిగావలెఁ బంటనూదినన్
గాతలఁ దమ్మిచూలిదొర కైవసపుంజవరాలిసిబ్బెపు
న్మే తెలియబ్బురంపుజిగి నిబ్బర పుబ్బగుగబ్బిగుబ్బ పొం
బూఁతలనున్న కాయసరిపోడిమి కిన్నెరమెట్లబంతి సం
గాతపు సన్నతంతి బయకారపుఁ గన్నడగౌళపంతుకా
సాతతతానతానలపసన్ దివుటాడెడు గోటమీటుబల్
మ్రోఁతలునుంబలెన్ హరువు మొల్లముగావలె నచ్చతెన్గు లీ
రీతిగ, సంస్కృతంబు పచరించెడుపట్టున భారతీవధూ
టీతపనీయగర్భనికటీభవదాననపర్వసాహితీ
భౌతికనాటక ప్రకరభారతభారతసమ్మతప్రభా
శీత నగాత్మజా గిరిశశేఖర శీతమయూఖ రేఖికా
పాతసుధా ప్రపూరబహుభంగఘుమంఘుమఘుంఘుమార్భటీ
జాతకతాళయుగ్మ లయసంగతి చుంచువిపంచికామృదం
గాతతతేహితత్తహితహాధితధంధణుధాణుధింధిమి
వ్రాతనయానుకూలపదవారకుహూద్వహహారికింకిణీ
నూతన ఘల్ఘలాచరణనూపురఝూళఝుళీమరందసం
ఘాతవియద్ధునీ చకచకద్వికచోత్పలసారసంగ్రహా
యాతకుమారగంధవహహారిసుగంధవిలాసయుక్తమై
చేతము చల్లఁజేయవలె జిల్లనఁ జల్లవలెన్ మనోహర
ద్యోతకగోస్తనీఫలమధుద్రవగోఘృతపాయస ప్రసా
రాతిరసప్రసారరుచిరప్రసరంబుగ సారెసారెకున్. 389

రాయ లంతటఁ గవిగండపెండేరమును దానై యాతని పాదమునఁ

దొడిగెనఁట! రాయలు వేఱొకప్పు డేదో యాశువుగా రచింపుమనఁ బెద్దనగారు చెప్పినది –

చ ॥ నిరుపహతిస్థలంబు రమణీప్రియదూతిక తెచ్చియిచ్చు క
ప్పురవిడె మాత్మ కింపయినభోజన ముయ్యెలమంచ మొప్పు త
ప్పరయు రసజ్ఞు లూహ తెలియంగల లేఖకపాఠకోత్తముల్
దొరగినఁగాక యూరక కృతుల్ రచియింపు మనంగ శక్యమే! 390

కృష్ణరాయ లొకనాఁ డాస్థానమునఁ గవీశ్వరుల కీసమస్య నొసఁగెనట! "వి! స్ఫురితఫణామణిద్యుతులఁ బొల్పగునాగకుమారుఁడో యనన్" – పెద్దన్న గారి పూరణము –

చ ॥ వరుఁడు చెఱంగు పట్టినను వల్వ తొఱంగిన లేమ సిగ్గుప
ట్టురుతరరత్నముద్రికల నొప్పగు డాపలికేల మూయఁగాఁ
గర మమరెం గరం బపుడు కామనిధానముఁ గాచియున్న వి
స్ఫురితఫణామణిద్యుతులఁ బొల్పగు నాగకుమారుఁడో యనన్. 391

నగరు, తగరు, తొగరు, వగరు, అనుపదములు ప్రాసస్థానమున నెలకొల్పి, రామాయణ, భారత, భాగవత పరములుగాఁ గృష్ణరాయని యాస్థానమున రాధామాధవకవిచేఁ జెప్పఁబడిన పద్యములు –

చ ॥ నగరు పగాయె నింక విపినంబుల కేఁగుఁడు రాజ్యకాంక్షకుం
దగరు కుమారులార! యని తల్లి వగ ల్మిగులంగ దోఁపగాఁ
దొగరున రక్షగట్టి మదిఁదోఁపక గద్గదఖిన్న కంఠయై
వగరుచుచున్నఁ జూచి రఘువంశవరేణ్యుఁడు తల్లి కిట్లనున్. 392

చ ॥ తొగరుచి కన్నుదోయిఁ గడుఁ దోఁపఁగఁ గర్ణుఁడు భీమసేనుపై
దగరు ధరాధరంబునను దాఁకినభంగిని దాఁకి నొచ్చి తా
వగరుచుచున్ వెసన్ బరుగువాఱిన నచ్చటి రాజలోకముల్
నగరు సుయోధనాజ్ఞ మది నాటుటఁజేసి ధరాతలేశ్వరా! 393



చ ॥ వగరుపుమాత్రమే వరుడు వశ్యుఁడు గాఁడు సఖీసఖత్వమె
న్న గరుడవాహనుండు మము నాఁడటు డించుటయెల్ల నుద్ధవా
తగరని కాక మోహపు లతాతనులైన విడంగఁ జూతురే
తొగరుచి యోషధీశునకుఁ దోపఁగఁజేయునె వీడనాడఁగన్? 394

కృష్ణరాయలు ధూర్జటికవి కవనశక్తిని గూర్చి పద్యరూపమునఁ బ్రశ్నింపఁగా నొక కవి పూరించిన పూరణము –

చ ॥ స్తుతమతియైన యంధ్రకవి ధూర్జటిపల్కుల కేల కల్గెనో
యతులితమాధురీమహిమ!! –– హా! తెలిసెన్ జగదేక మోహనో
ద్ధతసుకుమారవారవనితా జనతా ఘనతాపహారి సం
తతమధురాధరోదిత సుధారసధారలఁ గ్రోలుటం జుమీ. 395

రాయల కోరికపై నీ క్రింది మూఁడు పద్యములును బెద్దన తిమ్మన భట్టుమూర్తి కవులచే రచింపఁబడినవి –

శా ॥ రంతుల్ మానుము కుక్కుటాధమ! దరిద్ర క్షుద్ర శూద్రాంగణ
ప్రాంతోలూఖలమూలతండులకణ గ్రాసంబుచేఁ గ్రొవ్వి దు
ర్ధాంతాభీల విశేష భీషణఫణాంతర్మాంస సంతోషిత
స్వాంతుండైన ఖగేంద్రు కట్టెదుర నీ జంజాటముల్ సాగునే? 396

ఉ ॥ స్థానవిశేషమాత్రమున దామరపాకున నీటిబొట్టు! నిన్
బూనిక మౌక్తికం బనుచుఁ బోల్చినమాత్రన యింతగర్వమా
మానవతీశిరోమణులమాలికలందును గూర్ప వత్తువో,
కానుక నియ్య వత్తువొ, వికాసము నిత్తువొ విల్వదెత్తువో. 397

ఉ ॥ తక్కక నేల ముట్టె గొని త్రవ్వఁగనేర్తు నటంచుఁ దాకుతా
వొక్కటె జాతి యంచు ముద మొందకు బుద్ధిని వెఱ్ఱిపంది! నీ

వెక్కడ! యాదిఘోణియన నెక్కడ! యద్రిసముద్ర దుర్గభూ
ర్భాక్కుతలంబు నొక్క యరపంటనె మింటికి నెత్త నేర్తువే. 398

రాయల యాస్థానమున కొక సంస్కృతకవి యరుదెంచి పెద్దనాద్యాంధ్ర కవీశ్వరుల యెడ నీసడింపుతో నిట్లు పల్కెనట –

శ్లో ॥ "ఆంధ్రభాషామయం కావ్య మయోమయవిభూషణమ్",
వెన్వెంటనే పెద్దనామాత్యుఁడు చెంపపెట్టు పెట్టినట్లు పూరించె!
సంస్కృతారణ్యసంచారి విద్వన్మత్తేభశృంఖలమ్ ॥ 399

రాయలకుఁ జదరంగపుటెత్తులు వేయుటయం దత్యంతాసక్తి యుండెడిదట! బొడ్డుచెర్ల చినతిమ్మన యను కొప్పోలుకరణము కవీశ్వరదిగ్దంతియను ప్రతిష్ఠగలవాఁడై శ్రీకృష్ణరాయలతోఁ జదరంగమాడుచుండెడువాఁడు. శ్రీకృష్ణరాయల పక్షమున నెంద ఱాలోచించి యెత్తువేయుచున్నను నీతఁ డొక్కఁడే యెదురెత్తు వేసి యాటగెల్చుచు వేయార్లు పందెముగొనుచుండెడి వాఁడట! ఆతని శక్తికి సంతోషించి కొప్పోలు గ్రామమునకుఁ కృష్ణారాయపురమను నామమేర్పఱిచి రాయలు సర్వాగ్రహారముగా నాతనికి ధారవోసెను.

క॥ శతసంఖ్యు లొక్కటైనను
సతతము శ్రీకృష్ణరాయజగతీపతితోఁ
జతురంగ మాడి గెల్చును
ధృతిమంతుఁడు బొడ్డుచెర్ల తిమ్మన బళిరే! 400

ఉ॥ ధీరుఁడు బొడ్డుచెర్ల చినతిమ్మనమంత్రి కుమారుఁ డంచితా
కారుఁడు సత్కళావిదుఁడు కౌశికగోత్రుఁడు పద్మనేత్రసే
వారతబుద్ధి నందవరవంశ్యుఁడు సత్కవిలోకనాథుఁడా
చారసమగ్ర వర్తనుఁడు చారువచస్స్థితినొప్పువాఁ డొగిన్. 401

రాయలు కళింగదేశ విజిగీషామనీష దండెత్తిపోవుచు బెజవాడలో విడిసి



హరివాసరోపవాసవ్రతమును గృష్ణాతీరమున నున్న శ్రీకాకుళపుణ్యక్షేత్రమునఁ గావించుటకై పెద్దనాది విద్వత్కవులతో నరిగెను. అప్పుడే యక్కడ వెలసి యున్న యాంధ్రనాయకస్వామి కృష్ణరాయల స్వప్నమున నాముక్తమాల్యద రచింప నాదేశించిన ట్లాముక్తమాల్యదయందుఁ జెప్పఁబడి యున్నది. అక్కడ నేకాదశినాఁడు పండితమండలిలోఁ బుణ్యకథాగోష్ఠి సలుపుచుఁ గృష్ణరాయలు దాశరథు లెక్కువవారా? పాండవులెక్కువవారా? అని ప్రశ్నించెనట. పెద్దనాదులు తమకుఁ దోఁచినరీతిని బలుదెఱఁగులఁ జెప్పిరట. దాశరథులు ఈశ్వరాంశమున జన్మించిన వారుగావున వారి కమానుషశక్తులును లోకోత్తర యోగ్యతయును గల్గుట వింతకాదు. పాండవులయెడ నీశ్వరాంశము లేదు. అట్లయియు శక్తులయందును యోగ్యతయందును దాశరథులతో సాటివచ్చిరి. కావునఁ, బాండవులే యెక్కువవారగుదురని తనయాశయమును రాయలు తుదకు వెల్లడించెనట! అది విని రాయల ప్రక్కను జామరము విసరుచున్న చాకలియొకఁడు కేలుమోడ్చి "దేవర జన్మాంతరమున నున్నను బాండవుల మీఁది యభిమానమును మానలే" దనెనట! రాయ లత్యానందము సెంది యా చాకలివాని నేది కావలయునో కోరుకొమ్మనెనట! వాఁడు దేవరకోట యేలవలెనని కోరిక కలదనెనట! అప్పుడే యక్కడ వానికి దేవరకోటసీమ నేలుకొమ్మని యనుజ్ఞనొసఁగెనట; నేఁడా దేవరకోట సీమను గమ్మజమీందారులు పాలించుచున్నారు. కాని, నేఁటి వఱకును నా సంస్థానమునఁ జాకలిచేఁ బల్లకి మోయింపకుండుటయు సీలు మొహర్లు వానియొద్దనే యుంచుటయు నాచారముగా వచ్చుచుండె నందురు. కృష్ణరాయలపై ననేక కవులచేఁ జెప్పఁబడిన చాటువులు.

మ॥ శరసంధానబలక్షమాది వివిధైశ్వర్యంబులుం గల్గి దు
ర్భరషండత్వ బిలప్రవేశ కలన బ్రహ్మఘ్నుతల్ మానినన్
నరసింహక్షితిమండలేశ్వరుల నెన్నన్వచ్చు నీ సాటిగా
నరసింహక్షితిమండలేశ్వరుల కృష్ణా! రాజకంఠీరవా! 402

మ॥ కలనం దావకఖడ్గఖండితరిపుక్ష్మాభర్త మార్తాండమం
డలభేదం బొనరించి యేఁగునెడఁ దన్మధ్యంబునన్ హారకుం
డల కేయూరకిరీటభూషితుని శ్రీ నారాయణుం గాంచి లోఁ
గలఁగం బాఱుచు నేఁగె నీవ యను శంకన్ గృష్ణరాయాధిపా! 403

ఉ॥ ఏపునఁ గృష్ణరాయజగతీశ్వరుఖడ్గము మింట మార్గముం
జూపిన భానుమండలము సొచ్చి హుటాహుటి శత్రు లేఁగుచో
రేపటిబాపనయ్య! పగలింటిమహోగ్ర పుజంగమయ్య! యో
మాపటిదాసరయ్య! మము మన్నన సేయు మటందు రెంతయున్. 404

ఉ॥ కాశియు నీ కరాసిసరిగాదు నృసింహునికృష్ణరాయ! యా
కాశిని జచ్చువారికిని గల్గును జేతికిఁ బుఱ్ఱె నీ మహో
గ్రాసిని గండతుండెములుగా మృతిఁబొందిన వైరికోటికిన్
భాసురరాంభకుంభకుచభారము లబ్బెడు నేమి చిత్రమో! 405

శా॥ రాయగ్రామణి కృష్ణరాయ! భవదుగ్రక్రూరఖడ్గాహిచేఁ
గాయం బూడ్చి కళింగదేశనృపతుల్ కానిర్ఝరీపోషణీ
మాయాభీకుముటూరులోటుకుహుటూమాయాసటాజాహరే
మాయాగ్గేయమడే యటంద్రు దివి రంభాజారునిన్ యక్షునిన్ 406

మ॥ సమరక్షోణిని గృష్ణరాయలభుజాశాతాసిచేఁ బడ్డ దు
ర్దమదోర్దండపుళిందకోటి యవనవ్రాతంబు సప్తాశ్వమా
ర్గమునన్ గాంచి సెబా సహోహరిహరంగాఖూబు ఘోడాకితే
తుముకీభాయిలబాయిదేమలికి యందు ర్మింటికిం బోవుచున్ 407

మ॥ గవఁకుల్ బల్లిదమయ్యె ఢిల్లికిని మక్కాకోట మేలయ్యెఁబం
డువకుం గ్రొత్తగఁ గ్రొత్తడంబు లమరెన్ బోలేరుచందేరులన్
దవసం బెక్కె బెడందకోటపురకాంతాగర్భనిర్భేదన
ప్రవణంబైన భవత్ప్రయాణజయవార్తన్ గృష్ణరాయాధిపా! 408



ఒకప్పుడు కృష్ణరాయలకు గృష్ణదగ్గఱఁదురుష్కులతోఁ బోరువాటిల్లెను. రాయలసేన కృష్ణకిద్దరిని దురుష్కసేన యద్దరిని నుండెను. నదిదాఁటి రాయలసేనపైకి రావలయునని యేన్గులతోఁ దురకలు నదిలోనికిఁజొచ్చి కృష్ణ వెల్లు వగాఁ బాఱుచుండుటచేఁ జెల్లాచెదరై కొట్టుకొని పోయిరి. ఏన్గులు మాత్ర మీ దరికి వచ్చి రాయలసేనలోఁ జిక్కెను. అప్పుడొక కవి చెప్పిన పద్యము–

క॥ నరసింహకృష్ణరాయా
దురమున నీ పేరిటేఱు తురకలఁజంపెన్
గరిరాజవరదుఁడంచును
గరిఘట లట మిమ్ముఁజూచి గ్రక్కున వచ్చెన్. 409

శా॥ శ్రీ లీలాత్మజ కృష్ణరాయ! సమరోర్విన్ నీదు వైరిక్షమా
పాలు ర్వేఁగి హయాధిరూఢులగుచుం బాఱన్ వనీశాఖిశా
ఖాలగ్నాయతకేశపాశులయి యూఁగన్ గేకిస ల్గొట్టియు
య్యాలో జొంపలొ యంచుఁ బాడుదురు భిల్లాంభోజపత్రేక్షణల్. 410

మ॥ బలభిన్నాగము చెంపఁగొట్టి గిరిజాప్రాణేశు నట్టెక్కి వా
గ్జలజాతేక్షణకొప్పువట్టి శశివక్షంబెక్కి ధట్టించి యా
బలరామున్ మొలఁబట్టి నీ యశము భూభాగమ్మునన్ మించె నౌ
లలనామన్మథ! కృష్ణరాయనరపాలా! రాజకంఠీరవా! 411

క॥ నరసింహ కృష్ణరాయని
కరమరుదగు కీ ర్తి యొప్పెఁ గరిభిద్గిరిభి
త్కరికరిభిద్గిరిగిరిభి
త్కరికరిభిద్గిరిభిత్తురంగ కమనీయంబై. 412

గీ॥ పద్మ నాట్యస్థలంబునఁ బక్కి లోనఁ
బైరుపైఁ బవ్వళించిన పరమమూర్తి
అనుదినంబును గృష్ణరాయాధిపునకుఁ
జుక్కజగడాలవేలుపు శుభము లొసఁగు. 413

చ॥ పెనిమిటి చేయు పుణ్యజనపీడనవృత్తియుఁ దండ్రిభంగమున్
దనయు ననంగభావమును దమ్మునికార్శ్యముఁ జూచి రోసి స
జ్జనపరిరక్షు శౌర్యనిధిఁ జారుశరీరుఁ గళాప్రపూర్ణు న
వ్వననిధికన్య చేరె జితవైరినికాయునిఁ గృష్ణరాయనిన్. 414

ఉ॥ అబ్జముఖీమనోజ! నరసాధిపనందన! కృష్ణ! నీ యశం
బబ్జకరాబ్జజాబ్జనయనాబ్జవిలాసము నీ వితీర్ణిమం
బబ్జకరాబ్జజాబ్జనయనాబ్జవిలాసము నీ పరాక్రమం
బబ్జకరాబ్జజాబ్జనయనాబ్జవిలాసము చిత్ర మిద్ధరన్. 415

ఉ॥ కాయము వంగి తా ముదిసెఁ గన్నులునుం బొరగప్పెఁ గాలు పే
దాయె నటంచు రోసి నరసాధిపనందన! కృష్ణరాయ! యీ
భూయువతీలలామ నినుఁబొందిన నాదిభుజంగభర్తకున్
బాయని చింతచేతఁ దలప్రాణము తోఁకకు రాకయుండునే! 416

ఆంధ్ర వాఙ్మయమున శ్రీకృష్ణరాయలవిఖ్యాతి యవినశ్వరమును బ్రధానమును గావున నా మహారాజునుగూర్చి సంస్కృతమునఁ జెప్పఁబడిన చాటు పద్యములఁగూడ నిందుఁజేర్చుట సముచితమని యట్లు చేయుచున్నాఁడను-

శ్లో॥ వీరాగ్రేసర! కృష్ణరాయనృపతే! త్వద్వైరికాంతా వనే
ధావంత్యః కుచయానరోమ లతికా వ్యాహారలీలాభృతః,
ప్రాప్తాన్ కోకమహేభపన్నగశుకాన్ రుంధంతి వక్త్రేందునా
మధ్యేనాపి కచేన కంకణలసద్వైడూర్యరత్నైరపి. 417

శ్లో॥ భో భో భూవర! భూరివిక్రమ! భవద్ధాటీషు విద్యాధరై
ర్నిస్సాణేషు ధణం ధణం ధణధణం ధాణం ధణధ్యానిషు,
త్వత్కృత్త ప్రతిమల్ల వీరవరణే దేవాంగనానా మభూ
న్నృత్తేభ్యో ధిమిధిమ్మి ధింధిమి ధిమిం ధింధిం ధిమింధింకృతిః. 418



శ్లో॥ దృగ్భీత్యా నరసక్ష్మాపతిసభ స్త్రీణాం మృగేణాశ్రితో
రాజా తన్ముఖతర్జిత స్స్వయ మపి త్యక్త్వాఽఽత్మనో మండలమ్.
దుర్గేశస్య జటాటవీ ముపగతః పాణౌ త మేణం దధౌ
సన్మార్గ ప్రవణో నిజాశ్రితతమం క్షీణోఽపి నోపేక్షతే. 419

శ్లో॥ వీరాగ్రేసర! కృష్ణరాయ! భవతా కృత్తా రణప్రాంగణే
ప్రౌఢాః కేచన పారసీకపతయః ప్రాప్తాః పురీమామరీమ్,
పీరుత్తేతి గురౌ, నలద్విషి సురత్తాణేతి, శచ్యాంపున
ర్బిబ్బీతి, ప్రణతౌ సలామితి, సురాన్ స్మేరాననాన్ కుర్వతే. 420

శ్లో॥ కృష్ణరాయ! స్తువంతుత్వాం కవయో న వయం స్తుమః,
నరసింహకిశోరస్య కియాన్ గజపతేర్జయః? 421

శ్రీకృష్ణదేవరాయలు లావణ్యగణ్య మగు నొక స్త్రీరత్నమును బహుయత్నమున సాధించి యవరోధ వధూసవిధమునఁ దన యుల్లాసమును వెల్లడించెనట! అంత నా యంతఃపురిక "యింతకే యింత యుప్పొంగవలెనా? యిది యేమి గజపతికుమార్తెను సాధించుటయొక్కో!" యని తేలనాడెనట! రాయల డెందమున చుఱుకుమని తాఁకెను. గజపతికుమార్తెను సాధింపఁదలంపొదవెను. ఒకనాటి రాత్రి యుపశ్రుతిపరిజ్ఞానమునకై చాకివాని యింటిదరి కొక యాప్తభృత్యుని, దిమ్మరుసును బంపెనట! ఆ యింటి చాకివాఁడు సుఖశయితుఁడై యిట్లు పాడుచుండెనట!

"కొండవీడు మందేరా కొండపల్లి మందేరా
కాదని యెవ్వఁడు వాదుకు వచ్చిన కటకందాకా మందేరా 422

విజయ సూచకమగు నా యుపశ్రుతిని గొనియే రాయలు దాడివెడలి కటకమువఱకును గలదేశమును వశ పఱుచుకొనుటయేగాక గజపతికుమార్తెను గూడ దక్కఁగొని యంతఃపురమున జరిగిన యవమానమును బాపికొనెనట!

శ్రీకృష్ణదేవరాయల నిర్యాణకాలము-

ఉ॥ బోరన యాచకప్రతతి భూరివిపద్దశ నందుచుండఁ గా
నారయ శాలివాహనశకాబ్దము లద్రియుగాబ్ధి సోములం
దారణవత్సరంబున నిదాఘదినంబున మాఘశుద్ధష
ష్ఠీరవివాసరంబున నృసింహుని కృష్ణుఁడు చేరె స్వర్గమున్
ద్వారక నున్న కృష్ణుఁ డవతారసమాప్తిని జెందుకైవడిన్. 423

రాయల నిర్యాణానంతరము కొన్ని సంతవ్సరములు పెద్దనామాత్యుఁడు జీవించి స్వావస్థ నిట్లు చెప్పుకొనెను-

సీ॥ ఎదురైనచోఁ దన మదకరీంద్రము నిల్పి
కేలూఁత యొసఁగి యెక్కించుకొనియె
మనుచరిత్రం బందుకొనువేళఁ బురమేఁగఁ
బల్లకిఁ దన కేలఁబట్టి యెత్తె
గోకటగ్రామా ద్యనేకాగ్రహారంబు
లడిగిన సీమలయందు నిచ్చె
బిరుదైన కవిగండపెండేరమున కీవ
తగుదని తానె పాదమునఁ దొడిగె

గీ॥ ఆంధ్రకవితాపితామహ! అల్లసాని
పెద్దనకవీంద్ర! యని తన్నుఁబిల్చునట్టి
కృష్ణరాయలతో దివి కేఁగలేక
బ్రదికియున్నాఁడ జీవచ్ఛవంబ నగుచు. 424

రాయల నిర్యాణానంతరమే గజపతిరాజు కన్నడరాజ్యముపైకి దండెత్తి రాఁగాఁ బెద్దనామాత్యుఁ డీ సీసపద్యమును రచించి పంపెను. సిగ్గిలి గజపతిరాజు తిరిగిపోయెను.



సీ॥ రాయరాహుతమిండరాచయేనుఁగు వచ్చి
యారట్లకోట గోరాడునాఁడు
సంపెటనరపాల సార్వభౌముఁడు వచ్చి
సింహాద్రి జయశిలఁ జేర్చునాఁడు
సెలగోలుసింహంబు చేరి ధిక్కృతిఁ గంచు
తల్పులఁ గరుల డీకొల్పునాఁడు
ఘనతరనిర్భర గండపెండెర మిచ్చి
కూఁతు రాయల కొనగూర్చునాఁడు

గీ॥ ఒడ లెఱుంగవొ, చచ్చితో, యుర్వి లేవొ,
చేరఁజాలక తలచెడి జీర్ణమైతొ,
కన్నడం బెట్లు సొచ్చెదు గజపతీంద్ర!
తెఱచినిలు కుక్క సొచ్చినతెఱఁగు దోఁప. 425

## అల్లసాని పెద్దన

చ॥ హరుఁడధికుండు వింటికిఁ, బురాంతకుకంటెఁ గిరీటి మేటి, శం
కరపురుహూత నందనులకంటెను రాముఁడు నేర్చు, నిందుశే
ఖరకపికేతు భార్గవులకంటెఁ గుమారుఁడు మీఱు, నంబికా
వర నర జామదగ్న్య శిఖివాహుల కెక్కుడు, రాఘవుం డిలన్ 426

## నంది సింగయతిమ్మన

పారిజాతాపహరణము రచించిన నందితిమ్మనకు ముక్కు పొడుగుగా నుండుటచే ముక్కు తిమ్మన యనియుఁ బేరు కల్గెను. పారిజాతాపహరణము కృతినందినప్పుడు కృష్ణరాయ లీతనికి రత్న కుండలముల నొసఁగెను. ఒకనాఁ డీ కవి కుండలముల ధరించి తన యింటియరుఁగుపైఁ గూర్చుండియుండగా భట్టుకవి త్రోవ నరుగుచు నీ కందపద్యముఁ జెప్పెను-

కII మా కొలఁది జానపదులకె
నీ కవనపులీవి యబ్బునే కూపనట
ద్భేకములకు? గగనధునీ
శీకరములచెమ్మ! నందిసింగయతిమ్మా! 427

ఆనందించి తిమ్మకవి చేత నేమియు లేకపోవుటచేఁ గర్ణమున నున్న కుండల మొకటి తీసి యాతని కొసఁగెనట! తర్వాత రాయలయాస్థానమునకు నొంటికుండలముతోఁదిమ్మకవియు భట్టుకవియు వచ్చిరట! ప్రస్తావ వశమున నీ వృత్తాంతము రాజు విని 'గగన' యనుచో 'నాక' యని మార్చి పద్యము మిస మిసలార్చెనట.

కII మాకొలఁది జానపదులకె
నీ కవనపులీవి యబ్బునే కూపనట
ద్భేకములకు? నాకధునీ
శీకరముల చెమ్మ! నందిసింగయతిమ్మా! 428

తిమ్మకవియు భట్టుమూర్తి కవియు రెండు కుండలములను రాజునకు సమర్పించిరట! రాయలు వారి సరసతకు మెచ్చి హెచ్చు బహుమతులిచ్చెనట!

## కందుకూరి రుద్రకవి

ఈ కవి విశ్వబ్రాహ్మణకులుఁడు. ఈయన వంశమువా రిప్పుడు కందుకూరి దగ్గఱనే చింతలపాలెమను గ్రామమున నున్నారు. రుద్రకవి యనంతర మా వంశమునకు "కవివారు" అని యుపనామ మేర్పడినదఁట! నేఁటిదాఁక నా వంశమువారు "రుద్ర" నామము పారంపర్యముగాఁ బెట్టుకొనుచున్నారు. ఈ క్రింది విధమున రుద్రకవి చరిత్ర విషయ మా వంశము వారి దగ్గఱఁ జేకూరినది:–

రుద్రకవి కృష్ణరాయల నాఁటివాఁడు. రాయల యాస్థానమున కీయనను



దత్రత్యులు మంత్రులు రానీయరైరి. రాయలసన్నిహిత భృత్యుఁడగు మంగలకొండోజి యనువాని తోడ్పాటున రాయల సందర్శనము పొసఁగఁగా రుద్రకవి యీ క్రింది పద్యము చెప్పినాఁడు.

కII ఎంగిలిముచ్చు గులాములు
సంగతిగాఁ గులము చెఱుపఁ జనుదెంచి రయా
యింగిత మెఱిఁగిన ఘనుఁ డీ
మంగలకొండోజి మేలు మంత్రులకన్నన్. 429

కII ఆ పలుకాలించి మహా
కోపంబునఁ దాతయాఖ్యకోవిదుఁ డనియెన్
"కాపల్లీ? తేవర్ణః
కోఽపితు? వద, కించ నామ గుణవ?" న్ననితాన్. 430

## రుద్రుని వాక్యము

ఉII బంధురవిప్రవప్రగృహభాసుర గోపురసౌధవీథికా
బంధుతటాకకూపపరిపక్వఫలాన్వితవృక్షవాటికా
గంధమదభ్రమద్భ్రమర గానవిహారికిఁ గందుకూరికిన్
సింధుపరీతభూములను జెప్పఁగఁ నొప్పగుసామ్య మబ్బునే. 431

సీII వరనిజకర్మ ధూర్వహత బ్రాహ్మణులు మీర్
పరికింప నిలఁ బరబ్రహ్మ నేను
ఇనుముచేతను నొనర్చిన శంఖచక్రాంక
గురువులు మీ ర్జగద్గురుఁడ నేను
దానప్రతి గ్రహాధీనబిరుదు మీది
పేషణీహనుమంత బిరుదు నాది

ఋషివంశభూషణశ్రేష్ఠులు మీరలు
కనక కుంతలపరిష్కారి నేను

గీ॥ అనుచుఁ దెల్పితి మామకఘనకులంబు
రాయలు వినంగ నంద ఔరా యనంగ
సత్కవులలోనఁ దాతయాచార్య! యేన
రూఢికెక్కిన కందుకూర్ రుద్రకవిని. 432

సీ॥ ఆ మాట తప్తలోహశలాకతో దీటు
గా నాటి చెవిఁ బుట్టు కఠినబాధ
యిట్టట్టుగాఁజేయ నిట్టూర్పు నిగిడించి
యూరకే తలయూఁచి హుంకరించె
తాతయ తా "నిషీ" దేతి వాక్కడుగఁగా
రుద్రుఁ "డెక్కడ" నని రూఢిఁ బలికె
నపుడు సమీచీన మధ్య సమస్యాయి
మా వద" యని దుస్సమస్య లెన్ని

గీ॥ యిచ్చె నన్నిటిఁ బూరించె హృదయలసద
సూయఁ దాతయాజ్ఞైకవిధేయుఁడైన
రాజుముం దతిజడరోషరక్త రూక్ష
వీక్ష నీక్షించి యిట్లనె దక్షుఁ డగుచు. 433

పూరించిన సమస్య లీ క్రిందివి యఁట :- తల లొక్కేఁబదినాల్గు కానఁబడియెన్ దద్గౌరివక్షంబునన్ (434) – దుగ్ధపయోధిమధ్యమున (435) – వక్త్రంబుల్ పది కన్నులైదు (436) – అస్ఖలిత బ్రహ్మచారి (437) – ఉంఁడ్రా వోరి దురాత్మక – (ఈ సమస్యలు మోచెర్ల దత్తప్ప వెంకన్న కవులు పూరించినవని వినికి.



ఇవి యీ వఱకు ముద్రితము లయినవి.)*

ఉ॥ రింప్ష్టహి యేమిటం గఱచు? ఋక్షము లెక్కడనుండు? నంధకున్
నంప్ష్టనుఁ జేసె నే విభుఁ? డనంతరమం దతఁడేమి చేసె చే
రుంప్ష్టఖిలాత్ముఁ డైనలవురూప మదేగతి నుండెఁ? జెప్పు మా
దంష్ట్రలమీఁద శంకరుఁడు తాండవమాడెను రాము కైవడిన్. 438

క॥ పచ్చలు కెంపులు హేమము
నిచ్చలముగ విశ్వకర్మ నిర్మించె నయా

* (లభించిన వాని నిందు చేర్చినాము – ప్రకాశకులు).

మ॥ లలితాకారుఁ గుమారు షణ్ముఖుని ఁదా లాలించి చన్నిచ్చుచో
గళలగ్న గ్రహరత్న దీప్తకళికా గాంభీర్య హేమాంచితో
జ్జ్వలరత్న ప్రతిబింబితాననములన్ శంభుండు వీక్షింపఁగాఁ
దలలొక్కేఁబదినాల్గు కానఁబడియెన్ దద్గౌరి వక్షంబునన్. (434)

ఉ॥ స్నిగ్ధపువర్ణుఁ డీశ్వరుఁడు చిచ్చుఱకంటను బంచబాణునిన్
దగ్ధముచేసె నంచు విని తామరసేక్షణు మ్రోలనున్న యా
ముగ్ధపులచ్చి మోదుకొనె, మోహన గంధము పిండి పిండి యై
దుగ్ధపయోధి మధ్యమున దుమ్ములు రేఁగె నదేమి చిత్రమో. (435)

శా॥ ఈక్వాప్రాసము కష్టమౌననుచు మీరింతేసివా రాడఁగా
వాక్త్రాసంబది సత్కవీశ్వరులత్రోవల్గామి నేఁ జెప్పెదన్
దిక్త్రారాతికిఁ బార్వతీశ్వరులకున్ దిగ్మ ప్రభారాశికిన్
వక్త్రంబుల్పది కన్ను లైదు కరముల్ వర్ణింపఁగా వేయగున్. (436)

క॥ ఈస్థాన ప్రాసము దుష్కర
మస్ఖలనత నీయఁదగునె యది సుకవులకున్?
సస్ఖలితలయి గుహుంగని
రస్ఖలిత బ్రహ్మచారి కార్గురు పుత్రుల్. (437)

యుచ్చులకొఱకై తాపిన
పచ్చని రాచిలుకమీఁదఁ బచ్చిక మొలచెన్. 439

ఈ క్రిందివి రుద్రకవి కోపించి రాజుమీఁదఁ జెప్పిన పద్యములఁట :-

ఉ॥ తిట్టుదునా భుజంగవిషదిగ్ధదవానలధాగద్దై గచి
ట్చిట్టచిటార్భటిప్రకటశీఘ్రమహోగ్రతదంతనిష్ఠురో
ద్ఘట్టనవిస్ఫులింగలయకారణ దారుణలబ్ధలుబ్ధరా
ట్పట్టణగోపుర ధ్వజనిపాతహతాహుతిగాఁగ నుద్ధతిన్. 440

ఉ॥ తిట్టుదునా మహోగ్ర కరతీవ్రవచోవరగద్య పద్యసం
ఘట్టఘరట్టఘట్టవధగా విధి గాచిన నైన మానినీ
పట్టణవప్రసౌధమణి బంధురసింధుర సైంధ వాఢ్యులన్
బట్టపురాజులన్ దొరలఁ బండితులన్ దురహంకృతాద్రులన్. 441

ఉ॥ తిట్టుదునా మహోగ్రకరతీవ్రవచో వరగద్య పద్యసం
ఘట్టఫణీంద్రకోటిఘనకంఠ విషాగ్నుల రీతి మెట్టునన్
నెట్టనఁ దాఁకఁగా వలయు నిందయుఁ జేయక పద్య మిస్తినా
పట్టపురాజురీతి బహుభంగుల లెస్స సుఖింపఁగా వలెన్. 442

ఈ విధముగా సింహావలోకనముగా మూఁడు పద్యములను బలికెనఁట! రాయలు భయభ్రాంతుఁడై మీ సామర్థ్యము మాకుఁ దెలియదాయె నని స్తుతియించెను. పిమ్మట నీశాన్యసింహాసనారూఢుని గావించెను.

అనఁగా:- అష్టదిగ్గజము లనఁబరగు కవీశ్వరు లెనమండ్రును రాయల యాస్థానమండపమున నెనిమిదిదిక్కులను నెనిమిది సింహాసనములపై వెలసి యుండెడివా రని యగుచున్నది. అందు రుద్రకవి యీశాన్యసింహాసనమువాఁ డయినాఁడు.



రుద్రకవి రాయలయాస్థానమునఁ బండ్రెండేండ్లు వసియించెను. సప్తకవులనఁబరగు పెద్దన, తిమ్మన, పుత్తేటిరామభద్రయ, పింగళి సూరన, కవిరాట్టు, తెనాలిరామలింగయ, భట్టుమూర్తి యనువారితోఁ, దాతయాచార్యులతో ననేక విధముల వాగ్వాదములు సలిపెను. కవిరాట్టు ఎవ్వరో?

వరకవి కొండయ్య, ప్రెగడరాజు నరసరాజు ననునల్లుమామలు కవులు రుద్రకవి కవిత నాక్షేపించిరఁట. ఈ క్రింది పద్యములను రుద్రకవి చెప్పెనఁట:-

క॥ విదితంబుగఁ గవిరుద్రుని
సదమలవాగ్జనిత శాస్త్రసంహితపదముల్
కుదిరిక తెలియక యూరక
వదరకురా వెఱ్ఱిముండ! వరకవి కొండా! 443

చ॥ తెలియని వన్ని తప్పులని దిట్టతనాన సభాంతరంబునన్
బలుకఁగ రాకురోరి పలుమాఱుఁబిశాచపుఁబాడెకట్టె! నీ
పలికిననోట దుమ్ముపడ! భావ్యమెఱుంగవు పెద్దలైనవా
రల నిరసింతురా! ప్రెగడరాణ్ణరసా! విరసా! తుసా! బుసా! 444

ఈ పద్యము తెనాలి రామలింగని పద్యముగాఁ బ్రఖ్యాతము. 'ఒకని కవిత్వమందెనయు'నను పద్య (445) మింకొకటి దీనితోడిది రామలింగనిది కలదు.

చ॥ ఒకని కవిత్వమం దెనయు నొప్పులు, నా కవిత్వమం
దొకనికిఁ దప్పుపట్టఁ బనియుండదు, కాదని తప్పు పట్టినన్
మొకమటు క్రిందుగాఁ దివిచి ముక్కలు వోవ నినుంపకత్తితో
సిక మొదలంటఁగోయుదను, జెప్పునఁగొట్టుదు, మోము దన్నుదున్ 445

రుద్రకవికిఁ గొప్పోలు త్రిపురాంతకుఁడు, నాగళ్ళ చిట్టప్ప యను వారిర్వురు శిష్యులఁట! నవఘంటసురతా ననుపండితునితో వాదించుచు నీ క్రింది పద్యమును శ్రీకృష్ణరాయలఁ గూర్చి త్రిపురాంతకుఁడు చెప్పినాఁడట :

చ॥ గడియకు నూఱుపద్యము లఖండతరప్రతిభన్ ఘటింతునో
బడిబడి నూఱుఘంటములఁ బద్యములన్ లిఖియింతునో పదం
పడి వివిధాంధ్రభాషలఁ బ్రబంధము లొక్కొకనాఁడు చేతునో
యడుగుఁడి మీ మనంబునకు హర్షము వేంకటకృష్ణభూవరా! 446

ఇది కృష్ణరాయలఁగూర్చినది కామి స్పష్టము. మోచర్ల దత్తప్పగారి నాదరించిన తెట్టుప్రభువు, వేజెండ్ల వేంకటకృష్ణరాజుగారిం గూర్చి చెప్పఁబడినది కాఁదగును.

ఉ॥ తెట్టు కుమారకృష్ణ జగతీవరనందన రాజ్యలక్ష్మికిం
బట్టు, ధరాంగనామణికిఁ బాపటబొట్టు, రిపూరగాళివా
కట్టు, సముజ్జ్వలద్ధృతికిగట్టు, బుధాళికి వేల్పుఁజెట్టు, వా
గ్దిట్టల కున్కిపట్టును మదీయనివాసము యాచభూపతీ. 447

పై వేంకట కృష్ణరాజుగారు, ఎండ్లూరి ప్రభువగు మందపాటి రామచంద్రరాజుగారి మేనమామ.

చ॥ జబగడదశ్శు, లణ్ణు, శషసర్రు, కపయ్యు, ఝభ, ఙ్ఞటంచు వా
జబజబలెల్లఁజేసి యగసాలెల బేలల బోయపాలెపుం
బబువులఁ దేల్చి చేతఁ గల పైకము దోఁచుటగాదు రుద్ర! నీ
డబడబ భద్రమంత్రియెదుటం గొనసాగదు పోకుపోకుమీ! 448

అని భద్రమంత్రి చెప్పఁగాఁ గొప్పోలు త్రిపురాంతకుఁడిట్లు చెప్పెను:-

క॥ భద్రా! శ్వానము మొఱిఁగిన
రుద్రాంకిత జంగమయ్యరూఢికిఁ గొదువా
చిద్రూపుఁ డయిన సాక్షా
ద్రుద్రుఁడయా కందుకూరిరుద్రుఁడు ధాత్రిన్. 449



చిట్టప్ప యిట్లు చెప్పినాఁడు.

క॥ రుద్రకవివాక్పటుత్వము
భద్రప్రదయుక్తిఁదనరు భాసురలీలన్
రుద్రస్వరూపు నెదురను
క్షుద్రు లెదుర్కొనఁగఁ గలరె కుంభినిలోనన్. 450

"రవి గాననిచోఁ గవి గాంచునే కదా."[1] అన్న సమస్యను రుద్రకవియే పూరించినాఁడఁట. పెద్దనగారు రుద్రకవిని "తగురా కవిరుద్ర" యని యిట్లు ప్రశంసించిరఁట.

ఉ॥ వ్యగ్రకవిత్వతత్త్వ చతురాస్యులు కైయటభాష్యఫక్కికా
నుగ్రహశక్తి కల్గిన ఘనుల్ కవులెందఱు లేరు? నీదు ప్ర
త్యగ్రవచోధురీణకవితల్ తగురా కవిరుద్ర! రుద్రభ
క్త్యాగ్రసముజ్జ్వలస్ఫురితహల్లులకున్ స్వరపాళి కొజ్జలై. 451

శాకాబ్దములు 1480, జయసంవత్సర మాఘ శుద్ధ పంచమీ జయవాసరమున మల్కిబ్రహిమ్ ప్రభువు రుద్రకవికి రెంటచింతల (చింతలపాలెము) గ్రామము నొసఁగినాఁడు. పై గ్రామము నేఁటికిని రుద్రకవి వంశ్యులకే చెల్లుచున్నది.

శ్లో॥ అద్యాశీతిచతుశ్శతాధికసహస్రం వై శకాబ్దా గతా
స్త(అ)స్మిన్ శ్రీజయవత్సరే జయతిథౌ మాసే చ మాఘే తథా
పంచమ్యాం ద్వయతింత్రిణీజనపదం రుద్రస్య విద్వత్కవేః
ప్రీత్యా శ్రీయిభరామభూపతి రదాత్ క్షోణీధరాఖండలః. 453

సీ॥ ఇల శకవత్సరంబులు వేయునన్నూట
యెనుబదియును జనునెడ జయాబ్ద

1. "అరవి వీరభద్రు... గాంచునే కదా!" 452
ఈ సమస్యా పూరణమునకు చూ. రామకృష్ణకవి విషయము.

మున మాఘమాసంబునను శుద్ధపంచమి
నాఁడు మల్కిభరామ నరవరుండు
తగు కందుకూరి రుద్రకవీశునకు జరు
గుంబల్లిపురిని మాన్యం బొసంగె
నైఋతిభాగంబున నృదేన్కుచ్చెళ్ల
పొలమది రెంటచింతల యనంగ

గీ॥ నలరు పురియుత్తరమునఁదా నరయ జోగి
రాజుగారి పొలంబు పూర్వదిశ యొద్దె
వారి పొలము దక్షిణము పాలేరు పడుమ
రమర గూడూరు పొలిమేర హద్దు లివియు. 454

మల్కిభరాము పొగడ్తపద్యములు :-

ఉ॥ రాసుతుఁడైన మల్కి యిభరామునికీ ర్తియు, వెండికొండయున్,
ద్రాసునఁ బెట్టి తూన్ప, రజతాచల మెత్తున రాకయుండినన్
భాసురలీల నిల్పె నల బ్రహ్మ సదాశివు జాహ్నవీపతిన్
వాసుకికంకణున్ బుషభవాహనుఁ జంద్రకళావతంసునిన్. 455

చ॥ పొలుపుగ నంతరాళమునఁ బూచినపూవును, బువ్వులోనఁ బెం
పలరినచెట్టు, చెట్టుచిగురాకునఁ బండినపండు, పంటిపై
కొలదలిపిండె, పిండెగల కొమ్మయు నీకు దశావిభూతి ని
శ్చలసుఖ మాయువున్, మఱి యొసంగును మల్కిభరామ భూవరా! 456

ఈ క్రింది పద్యమున రుద్రకవి నెవరో ప్రశంసించిరి.

మ॥ హరియొస్కందపురీజనార్దనువరం బందెన్ మహాసత్కవీ
శ్వరులౌ రాయలవారిసన్నిధిని హర్షంబందెఁ బట్టంబు గ



ట్టిరి యాందోళికలున్ జవోగ్రతర ఘోటీ లగ్రహారంబు లం
దఱు చూడన్ బహుమాన మందెఁ గవిరుద్రాఖ్యుండు తాముఖ్యుఁడై. 457

(ఇందే ముద్రితమైన చూ. పుట 81) "దనుజమర్దన కందుకూరిజనార్దనా" అను మకుటము గల శృంగారపద్యాష్టకము రుద్రకవి కృతియని వినికి. "బలవదరీదరీకుహర భాస్వదరీయదరీదరీ హరీ" యను మకుటము గల శతక మొకటి కూడ రుద్రకవి కృతియేయని వినికి. అది సమగ్రముగా లభింపలేదు. మచ్చునకు మూఁడు పద్యములు మాత్రము:–[1]

చ॥ కలశపయోధిమీఁదఁ దరఁగల్ మఱి హెూరని మ్రోయ వేయుభం
గుల తలపాన్పు పాము బుసకొట్టఁగ నేగతి నిద్ర చెందెదో

---

1. ఉదాహృత పద్యములేకాక మఱి మూఁడు పద్యము లీ క్రిందివి శాస్త్రిగారి నోట్సు నందున్నవి –

చ ॥ కొలదిగ మున్ గుచేలుఁ డడుకుల్ గొనివచ్చిన మెచ్చి హెచ్చుగా
కలిమి నొసంగితీ (విపుడు) గంపెడు చక్కెరఁ దెచ్చిపెట్టినన్
బలుకవు ద్రవ్యమేమి గుణభక్తశరణ్యుఁడ నీవు (గావవే)
బలవదరీదరీకుహర భాస్వదరీయదరీదరీహరీ! 459

చ ॥ వెలయగ నంటి మీ కథలు వింటి, మిముం గనుగొంటి, వెంకటా
చలమును గంటి, నింపగు ప్రసాదము లోనికిఁ గొంటి, (భక్తికిన్
దొలఁగని మన్కిగంటి) నిక తొంటిచెనంటి గుణంబు లెన్నెదే
బలవదరీదరీకుహర భాస్వదరీయదరీదరీహరీ! 460

చ ॥ కలుములు రోయుమంటి, పరకాంతలఁ గోరకుమంటి, పాపముల్
తలపకుమంటి, నేమనిన దారికిరాదు మనంబు చక్కగా
వలనుకు వచ్చునే శునకవాలము బ్రద్దలువైచి కట్టినన్
బలవదరీదరీకుహర భాస్వదరీయదరీదరీహరీ! 461

యలసతఁ దండ్రి చీమ చిటుకన్నను నిద్దుర రాదు మాకు నో
బలవదరీదరీకుహర భాస్వదరీయదరీదరీహరీ! 458

చ॥ కలుషసరి త్తరీ పుషితగంధకరీ మహిభృత్కిరీ భవా
చలభిదురీ దయారసవిశాలఝురీ నిగమార్థమాధురీ
ఖలగజ కేసరీ విభవకంపితమేరుగిరీ లతాదరీ
బలవదరీదరీకుహర భాస్వదరీయదరీదరీహరీ! 462

చ॥ అల పగవాని తమ్ముఁడు భయాతురుఁడై చనుదెంచినంతనే
బిళిబిళి వచ్చితీవనుచుఁ బట్టము గట్టవె లంక కప్పుడే
కొలిచిన నిన్నె కొల్వవలెఁ గోరిక లిచ్చిన నీవ యీవలెన్
బలవదరీదరీకుహర భాస్వదరీయదరీదరీహరీ! 463

పంచరత్నము లనుపేర జనార్దనస్తోత్ర మొకటి రుద్రకవి కృతి యున్నది. ఒక్కపద్యము.

పంచ॥ అనాథనాథ నాగతల్ప యజ్ఞకల్పమౌ నిరం
జనా జనార్తినాశనా దిశాపరీవృథార్దశా
సనా సనాతనా యనాదిసత్య కందుకూరి శ్రీ
జనార్దనా జనార్దనా ససాహసారిమర్దనా! 464

సుందరీమయాంగ వామశోభనా నిరంజనా
స్యందనీకృతోర్విశైలజా మనోభిరంజనా
మందహాసభాసకంఠ మంజుభావితాంజనా
కందుకూరిసోమ విషయకామదర్పభంజనా 465

సుగ్రీవవిజయ మను యక్షగానమును నిరంకుశోపాఖ్యాన మను రసవత్ప్రబంధమును రుద్రకవికృతులు లోకమున వ్యాపించియున్నవి. "మా వంశమున రుద్రకవి నామధారులు పలువురున్నారు. కృష్ణరాయలనాఁటివాఁడు ప్రథమ రుద్రకవి.



ఇబ్రహీంనాఁటివాఁడు ద్వితీయ రుద్రకవి. వారికిఁ దర్వాతఁగూడఁగవిత నేర్చిన రుద్రకవులున్నా" రని యిప్పటివారు రుద్రకవి వంశ్యులు చెప్పుచున్నారు. శ్రీకృష్ణరాయలు క్రీ. 1530న స్వర్గస్థుఁడయ్యెను. ఇబ్రహీంపాదుషా క్రీ. 1558 రుద్రకవి కిచ్చిన గ్రామము నేఁటికి ననుభూయమానముగా నున్నది. కాన, యిబ్రహీంకాలమున రుద్రకవి యుండుట సునిశ్చితము. నిరంకుశోపాఖ్యాన కర్త యీతఁడు కాఁదగును. వేశ్యావర్ణనమున నా గ్రంథమందు సీసపాద మొకటి యిట్లున్నది– "చేరి కన్నడభూమి చెఱపట్టు పాశ్చాత్యనృపతికైన నొకింత కృప తలిర్చు." ఇట్లుండుటఁబట్టి యీ గ్రంథము విద్యానగర వినాశానంతరము రచింపఁబడినది. కాఁదగు ననఁదగును. ఈతఁడే బాలుఁడుగాఁ గృష్ణరాయలనాఁటఁగూడ నున్నాఁడేమో! లేక యీతని తాత వేఱొకఁడే యా నాఁట నున్నాఁడో! కృష్ణరాయల నాఁట రుద్రకవి యుండెననుట కాధారముగా మీఁద నుదాహరింపఁబడిన యా భాణకములకుఁ బద్యములకుఁ బరమప్రామాణ్యా మంగీకరింపరాదు. ఆ పద్యములు కొన్ని యిటీవలివా రా వంశము వారే యైతిహ్యములనుబట్టి రచించియుందురు.

రుద్రకవివంశ్యు లిటీవలివారు రచించిన పద్యములివి కొన్ని :–

క॥ ఈసారికి వైశాఖపు
మాసానకు లక్ష్మి తొలఁగి మతిచెడి భ్రష్టై
వీసానకుఁ గొఱగాకయు
ఖాసారామన్న వల్లకాడుం జేరున్. 466

సీ॥ భాసిల్లు నిభరాముపట్టభద్రుం డిచ్చె
భూదానశాసనపుణ్యలేఖ
వసియించు దిక్కుల వరకీర్తి యగునని
రసికశేఖరుఁడనె రమణతోడ
కరమొప్పు కాశికాపురముతో సరియగు

స్కాందపట్టణసీమ గడిcదిc జెలcగు
సరణి బేరైనట్టి జరుగుమల్లి పొలానc
దుదc బదేన్‌కుచ్చెళ్ళు దొరయు నొసcగె
బహుకాలమును బుత్రపౌత్రాభివృద్ధిగా
ననుభవించు మటంచు నానతిచ్చె
నిట్లు మేమిడు భూమి యించుకం తైనను
నాశ చెందినవారు కాశిలోన

గీ॥ విప్రగోవధ చేసిన విధి విధించు
పాపమునc జెంది మక్కాను బందిc జంపి
మేటియగు నానల నొసంగి మెసcగినట్లు (?)
కందుకురి రుద్రఘనులకుc గరుణ నొసcగె.

సీ॥ శ్రీలలరcగ రెంటచింతల ఖండ్రిక
కేవల ప్రభుcడు మల్కీభరాముc
డలరుద్రకవికి నత్యంతమౌ ప్రేమచే
నీనా మొసంగిన నివల మఱియు
తానీషపాచ్ఛావు తనరార నడపించె
వెనుక తావుత్ఖానుc డనువు మీఱ
దయచేసెc బిమ్మటc దగc బాల్పుఖానుcడు
నతనికిc బిదప నింపలరcగాను
సాతులాఖానుcడు సాహెబు మన్నించెc
దగనొప్పె నైదుముస్తాఖనుండు
గరిమతో ననవర్తిభానుడుcకృపనిచ్చె
కడు సురాజిద్దవుల్ గారు నిడిరి
తా వరుసన్ ప్రభు వీవల దయచేసె



నందుకు సాక్షియౌ ననుభవంబు
దీనికిc గొర్లశీతిద్వయంబై యొప్పు
శ్రీజనార్దనవర శ్రీc జెలంగు
కవిరుద్రఘను నలఖండ్రిక ఫలభోక్త
లీరేడు పూరుషు లీవలయిరి
రుద్రాఖ్య, కవితయు, రూఢి తత్కులమందుc
దత్కులీనుల మేము దాని కడను
క్షీరనదీతటక్షేత్రమందుc దపంబు
గావించు భవదీయ కవులమయ్య

గీ॥ భూరిసుకవీంద్ర మందార మేరుధీర
చారుగుణశీల సత్క్రియాసత్యలోల
.................... ................
పళ్లెచెంచలరాయ! సత్ప్రభువిధేయ! 468

రుద్రకవి విషయ మప్పకవీయమున నిట్లు కలదు :

చ॥ కొలcదిగ మున్ను చెప్పెc జలిగొండ నృసింహుcడు వెల్లయంచు నీ
వల నగసాలిరుద్ర పనువాcడును మొల్క లటంచుc గూరిచెన్
దెలియక కొందఱిట్లు వికృతిన్ బదమధ్యమునన్ లకార రే
ఫలతలపై యకారమును బాపుదు రార్యులు నవ్వునట్లుగన్. 469

ఇందుకు వినుకొండలో గుంటుపల్లి భాస్కరయగారి సమ్ముఖమందుc గందుకూరి రుద్రయగారు చెప్పిన పద్యము—

చ॥ వెలగకు వెల్లయంచు సరవిం జలిగొండనృసింహుc డాడcగా,
మొలకకు మొల్కయంచుc గవిముఖ్యుcడు రుద్రయ పల్క దోసమా?
భళిభళి మంచిమాటయె ప్రబంధము నా జలరాశి యందులో

పల నెఱసు గ్రహింతురె యపారములౌ మణు లెల్ల నుండఁగన్. 470

మొల్క యనుప్రయోగముగల పద్య మిది–

ఉ॥ ఎన్నఁడు నేరిచెన్ బెళుకు లీ చెలికన్నులు, కారుమబ్బుల
న్నన్న! కురుల్, పిఱుందు పటువై పటువైఖరిఁ గైకొనెంగదే,
మొన్న గదమ్మ పిన్న మొలమొల్కలు నేఁడివె ముద్దులాడి లేఁ
జన్నులు మిన్నలై పయఁటసందున దాఁగురుమూఁత లాడెడున్. 471

ఈ క్రిందిపద్య మొక్కటి యుపలబ్ధమయినది :–

సీ॥ పాటీరగంధహృద్ధోటీసమంచిత
ధాటీతిరస్కారి ఘోటకములు
కోటీందు వరకళా పోటీజ్జదంభోళి
దంభోళిసితశంఖ వ్రజంబు (?)
చేటీవిటాళీ కవాటీఘనారామ
వాటీశుభగ్రామ వారములును
............ .... ....................
పృథుల సత్కుండలములు

గీ॥ ప్రౌఢి గైకొంటి గీర్వాణపద సమృద్ధి
శతకహనుమజ్జయాది ప్రశ స్తకావ్య
ప్రీతి శ్రీకృష్ణరాయ ధాత్రీశువలన
మనుకులుండను రుద్రార్య ఘనసుకవిని. 472

## తెనాలి రామకృష్ణకవి

ఆంధ్ర కవులలోఁ దెనాలిరామకృష్ణకవి మిక్కిలి పరిహాస చతురుఁడు; ప్రౌఢకవితాధురీణుఁడు. శ్రీకృష్ణదేవరాయలవారి యాస్థానకవులలో నొక్కఁడని కొందఱు; తర్వాతివాఁ డని మఱికొందఱు. రాయల యాస్థానకవి యనుటకును



నాధారములు కలవు. పాండురంగమాహాత్మ్యము, ఘటికాచలమాహాత్మ్యము నీతని కృతులు. ఈతనికి వికటకవి యని పేరు. ఈతని యశస్సును గూర్చి యితం కవిచేఁ జెప్పఁబడిన పద్యము–

ఉ॥ లింగనిషిద్ధుఁ గల్వలచెలిం గని, మేచకకంధరుం ద్రిశూ
లిం గని, సంగతాళి లవలిం గని, కర్దమదూషిత న్మృణా
ళిం గని, కృష్ణచేలుని హలిం గని, నీలకచన్ విధాతృనా
లిం గని, రామకృష్ణకవిలింగనికీర్తి హసించు దిక్కులన్. 473

రామకృష్ణుఁడు వేఱు, రామలింగఁడు వేఱు గాఁగూడఁ దెలియవచ్చు చున్నది. ఉద్భటారాధ్యచరిత్రాదులు రామలింగకృతులట! విచారింపవలసియున్నది.

రాయలయాస్థానకవులలో నగ్రగణ్యుఁడగు పెద్దనామాత్యుని మనుచరిత్రమున "అమవస నిసికిన్" అను పదప్రయోగమును విని రామకృష్ణుఁడు...

క॥ ఏమి తిని సెపితివి కపితము
బ్రమపడి వెఱిపుచ్చకాయ వడిఁదిని సెపితో
యుమెతకయ తిని సెపితివో
యమవసనిసి యనెడిమాట యలసని పెదనా! 474

అని యాక్షేపించెనందురు. ఈ యాక్షేపము నొకవేళఁ బరిహాసమునకై పెద్దనామాత్యునిఁ గూర్చి రామకృష్ణుఁడు చేసియుండు నేమో! ఈతనికిఁ బెద్దనపై నపరిమిత గౌరవము కలదు. పెద్దన్న కెంతో యుత్కృష్టత వెట్టి దన కెంతయు నికృష్టతను బద్యమునఁ జెప్పుకొనెను. చూడుఁడు–

క॥ కవి యల్లసాని పెద్దన
కవి తిక్కనసోమయాజి గణుతింపంగాఁ
గవి నేను రామకృష్ణుఁడఁ
గవి యను నామంబు నీరుకాకికి లేదే? 475

అల్లసాని పెద్దన్నకవి, తిక్కనసోమయాజికవి, రామకృష్ణుఁడను నేను కవిని, ఇంకను గొందఱకుఁ గవియను పేరుగలదు! నీరు కాకికిని గలదు; అని కూడ నర్థము చూచుకొన నగును.

నందితిమ్మన యొకఁనాడు తన యింట నుయ్యెలో నూఁగుచు గవిత్వము రచించుకొనుచుండఁగా నీ కొంటెకోణంగి రామకృష్ణుఁడక్కడ కరిగి తాతా! ఊతునా యని యడిగెనట! తిమ్మకవి యంగీకృతి సూచింపఁగా రామకృష్ణుఁడు తుబుక్కున మొగమున నుమియగా, నీకిదేమి చేటుఁగాలమన, 'నూతునా' యనిగదా నేనడిగినది; దాని కంగీకరించితిరి గావున, నట్లు చేసితిననెనట! కోప మాపఁజాలక తిమ్మకవి యెదురనున్న యాతని నుయ్యెల పైనుండి యెడమకాలితో మొగమునఁ దన్నెనట! పాపము పల్లూడెను. చప్పున నింటికరిగి దుప్పికొమ్ము నరుగఁదీసి పల్లుగా నదుకుకొనెను. మఱునాఁడు రాయలసభకు వచ్చినప్పుడెట్లో యీ వార్త రాయలకుఁదెలిసి యాస్థానకవుల కిట్లు సమస్య నొసఁగెను– రవిగాననిచోఁ గవి కాంచునే గదా" ఏ కవియోగాని సరిగా నిట్లు పూరించెను–

ఉ॥ ఆ రవి వీరభద్రుచరణాహతి డుల్లినబోసినోటికిన్
నేరఁడు రామకృష్ణకవి నేరిచెఁబో మన ముక్కు తిమ్మరాట్
క్రూరపదాహతిం దెగిన కొక్కిరిపంటికి దుప్పికొమ్ము ప
ల్గా రచియించె నౌర! రవి గాననిచో ౘగవి కాంచునే కదా! 476

(చూ. పుట 174)

ప్రెగడరాజు నరసరాజనుకవి యొకఁడు పెద్దనాదికవీశ్వరుల సరకు గొనక వారి కవిత్వములందు దోషములు గలవని యందందు వదరులాడు చుండెడివాఁడట! ఆతఁడును స్వతస్సమర్థుఁడే. ఒకప్పుడాతఁడు కృష్ణరాయల యాస్థానమునకు వచ్చి పెద్దనాదులకంటె హెచ్చుగా నాశువుగాఁ గవిత్వము రచింతును: సభకూర్పింపుమనికోరెను. రాయలు మఱుదినము సభగూర్ప నంగీకరించెను.



పెద్దనాదులు కొంకఁదొడఁగిరి. రామకృష్ణుఁడు "నే నాకవినడఁగఁద్రొక్కెద" నని పెద్దనాదులకు ధైర్యము చెప్పెను. మఱునాఁడు సభకు నరసరాజు వచ్చి గంటకుఁ గొన్ని వందలు పద్యములు చెప్పెదననెను. రామకృష్ణుఁడు కొన్ని వేలు చెప్పెదననెను, వారిర్వురకు స్పర్ధ యేర్పడెను. నీ కవిత్వమున దప్పులుండునని సరసరాజు రామకృష్ణు నాక్షేపించెను. ఉండునేమో! నేను కవిత్వము చెప్పెదను చూపుమనెను. నరసరాజునకు వ్రాయసమునఁ దన యంతవాఁడు లేఁడనియు గర్వముగలదు. కావునఁ దానే వ్రాసెదననియుఁ గలమాఁగనీయనంత వడిగాఁజెప్పవలయు ననియుఁ దప్పులు చెప్పినదిద్దెద ననియుఁ బ్రతినపూనెను. రామకృష్ణుఁడు చిత్రోచ్చారణముతో నొక పద్యమును జదివెను. నరసరాజు వ్రాయలేక గింజులాడుకొని యెట్టకేల కిట్టు వ్రాసెను–

క॥ తృవ్వట బాబా తలపైఁ
బువ్వట జాబిల్లి వల్వ బూచట చేదే
బువ్వట చూడఁగను హుళు
క్కవ్వట తలఁపంగ నిట్టి హరునకు జేజే! 477

ఇది వ్రాయుటకు రామకృష్ణకవి పద్యము చదివి కొంతసేపూరకుండ వలసివచ్చెను. నరసరాజునకు వ్రాఁతబిరుదు పోయినది. రెండవపద్య మిట్లు చెప్పెను--

మ॥ గననీహారగు రామపద్మ ధళరంగత్కీర్తి చానూరమ
ర్దన శుక్రాక్షికళేభరాణ్మృగపతీ త్రైలోక్యధామోదరా
యనఁగా శంకరవాంఛితార్థ కృపదివ్యాస్తోకపాణీ జనా
ర్ధనదానేకపవైరి విగ్రహ ముకుందా మిత్రవిందాధిపా! 478

నరసరాజు తన నేర్పు వెల్లడి యగునట్లుగా ననేక దోషములను సంస్కరించి రామకృష్ణుని గేలిసేనెను. నిజముగా రామకృష్ణునియుచ్చారణ ప్రకార మా పద్యమున

కర్థము కలదు; అందు దోషములు లేవు. సామాన్యబుద్ధికి దోషములుగాఁ గన్పట్టునట్లు రామకృష్ణుఁడు రచించెను. సరసరాజట్లే పొరఁబడెను. అంతట రామకృష్ణుఁడు లేచి యీ క్రింది పద్యములఁ జెప్పి గెల్పుకొని నరసరాజును వంచించి పంపెను.

చ॥ ఒకని కవిత్వమం దెనయు నొప్పులు తప్పులు, నా కవిత్వమం
దొకనికిఁ దప్పుపట్టఁబని యుండదు, కాదని తప్పుపట్టినన్
మొక మటుక్రిందుగాఁ దివిచి, ముక్కలువోవ, నినుంపక త్రితో
సిక మొదలంటఁగోయుదును, జెప్పునఁ గొట్టుదు, మోము దన్నుదున్. 479

చ॥ తెలియనివన్ని తప్పులని దిట్టతనాన సభాంతరంబునం
బలుకగఁరాకురోరి పలుమాఱుఁ బిశాచపుఁబాడెకట్ట! నీ
పలికిననోట దుమ్ముపడ! భావ్య మెఱుంగవు పెద్దలైనవా
రల నిరసింతురా ప్రెగడరాణ్ణరసా! విరసా! తుసా! బుసా! 480

రాయల యాస్థానమున నప్పలాచార్యు లను పండితకవి యొకఁడు కలఁడట! ఆతనిఁ గూర్చి యొకరు – –

శ్లో॥ అపశబ్దభయం నాస్తి అప్పలాచార్యసన్నిధౌ,
రామకృష్ణుఁడుత్తరార్థమును వెంటనే యిట్లు పూరించె-
అనాచారభయం నాస్తి తిప్పన్మూత్రస్య సన్నిధౌ. 481

రాయలయాస్థానముననే యొకనాఁడు భట్టుమూర్తికవి "కుంజర యూథంబు దోమ కుత్తుకసొచ్చెన్" అన్న సమస్యఁజెప్పి దీనిఁబూరింపుఁ డని తక్కిన కవుల నడిగెనట! రామకృష్ణుఁడు––

కః॥ గంజాయి త్రాగి తురకల
సంజాతులఁగూడి కల్లు చవికొన్నావా!
లంజెలకొడుకా! యెక్కడ



కుంజరయూథంబు దోమకుత్తుకసొచ్చెన్? 482

రాయలు కోపించి యిదియా పూరణ మనెను. రామకృష్ణుఁడు "దేవా! పెద్దనాదిమహాకవుల కీ భట్టుకవియా సమస్య నొసఁగువాఁడు! అతని కిట్టి పూరణమే పోలు" ననెను. రాయలు 'నేనొసఁగితిని పూరింపు' మని యాగ్రహము తోనే పల్కెను. వెంటనే––

కః॥ రంజన చెడి పాండవు లరి
భంజనులై విరటుఁ గొల్వఁ బాల్పడి రకటా!
సంజయ! యేమని చెప్పుదుఁ
గుంజరయూథంబు దోమకుత్తుకసొచ్చెన్. 483

అని పూరించెను. రాయలు పరమానందభరితుఁ డయ్యెను.

పెద్దన్న మనుచరిత్రము, తిమ్మన్న పారిజాతాపహరణము, భట్టుమూర్తి వసుచరిత్రము, రాయలు మిక్కిలి మెచ్చుకొనుచుండువాఁ డట! ఒకనాఁడు సభలో మూఁడు గ్రంథములనుండియుఁ దుల్యసందర్భముగలవగు మూఁడు పద్యములఁ జూపి వానిని విమర్శింప సభ్యులను గోరెనట! ఆ పద్యము లివి––

ఉ॥ పాటున కింతులోర్తురె! కృపారహితాత్మక! నీవు ద్రోవ ని
చ్చోట భవన్నఖాంకురము సోఁకెఁగనుంగొను మంచుఁ జూపి య
ప్పాటలగంధి వేదననెపంబిడి యేడ్చెఁ గలస్వనంబుతో
మీటిన విచ్చుగబ్బిచనుమిట్టల నశ్రులు చిందువందుగన్. 484(మను.)

ఉ॥ ఈసునఁ బుట్టి డెందమున హెచ్చినకోపదవానలంబుచే
గాసిలి యేడ్చెఁ బ్రాణవిభుకట్టెదురన్ లలితాంగి పంకజ
శ్రీసఖమైన మోముపయిఁ జేల చెఱంగిడి బాలపల్లవ
గ్రాసకషాయకంఠకలకంఠవధూకలకాకలీధ్వనిన్. 485 (పారి.)

శా॥ ఆ జాబిల్లివెలుంగు వెల్లికల డాయన్ లేక రాకానిశా
రాజశ్రీసఖమైన మోమునఁ బటాగ్రంబొత్తి యెల్గెత్తి యా
రాజీవానన యేడ్చెఁ గిన్నరవధూరాజత్కరాంభోజ కాం
భోజీమేళవిపంచికా రవసుధాపూరంబు తోరంబుగాన్. 486(వసు.)

రామకృష్ణుఁ డీపద్యములపై నిట్టు లభిప్రాయ మొసఁగెనట! అల్లసానిపెద్దన అటునిటు నేడ్చెను. – ముక్కుతిమ్మన్న ముద్దు ముద్దుగా నేడ్చెను; – భట్టుమూర్తి బావురని యేడ్చెను;–– భట్టుమూర్తికిని రామలింగనికిని ఘోరవైరము. ఆ భట్టుకవితను గూర్చి రామలింగకవి యిట్లధిక్షేపించెను.

కII చీఁపర పాఁపరతీఁగలఁ
జేఁపల బుట్టల్లినట్టు చెప్పెడు నీ యీ
కాఁపుఁగవిత్వపుఁగూఁతలు
బాఁపనకవివరుని చెవికిఁ బ్రమదం బిడునే!. 487

శా॥ అద్రిస్నిగ్ధతలంబు బుద్బుదము లుద్యద్దారుభూషావళుల్
క్షుద్రౌదుంబరపాకపక్వఫలముల్ శుక్త్యంతరాకాశముల్
రుద్రాక్షాక్షరపంక్తి విభ్రమము లీ రూఢిన్నిరూపింప నీ
శూద్రప్రజ్ఞలు విప్రసత్కవి వచస్స్ఫూర్తి న్విడంబించునే! 488

కII కెంగేల రామకృష్ణుని
బంగరుకడియంబు లుండఁ బండితుఁడగునా
జంగులు జల్లులు గల్గిన
సింగారపుటూరఁగుక్క సింగంబగునా! 489

కవీశ్వరుల స్తోత్రపాఠములకును నతిశయోక్తులకును నేవగొని తిరుమల రాయ లొకనాఁడు స్వభావోక్తిమధురముగానే తన్ను వర్ణింపుఁడని వారి కాజ్ఞా పించెనట! ఆతని కొంటికంటిగ్రుడ్డి కలదు. రామలింగకవి వర్ణించిన వర్ణనము–



కII అన్నాతి గూడ హరుఁడగు
నన్నాతిని గూడకున్న నసురగురుండౌ
నన్నా! తిరుమలరాయఁడు
కన్నొక్కటి లేదుగాని కంతుఁడుగాఁడే. 490

కII ఒడ్డారపు నా కొడుకులు
దొడ్డదొరల్ కవుల కీయ దొరకొనుచోఁ దా
మడ్డాలె వచ్చుచుందురు
ముడ్డా చూచెదవు భట్టుమూర్తనగారూ! 491

అళియ రామరాయలకు వాయురోగము రాఁగా అంతఃపుర స్త్రీలతోఁ జెప్పినది:

కII ఓ యమ్మలాల! మందులు
వే యేల మకారకొమ్ము విషకవిగానిన్
వా యెత్తకుండఁ జేసిన
వా యెత్తదు రామరాయ వసుధేశునకున్. 492

మకారకొమ్ము విషకవి = మూర్తికవి, వాయి = వాయురోగము.

## పింగళి సూరకవి

ఈతఁడు కళాపూర్ణోదయము, ప్రభావతీప్రద్యుమ్నము, రాఘవ పాండవీయము, ననుకృతులను రచియించిన చతురకవి. ద్వ్యర్థికావ్యములలో నీతని రాఘవపాండవీయ మగ్రగణ్యము. ఈ క్రిందిపద్యము తద్గ్రంథరచనమును శ్లాఘించుచున్నది.

కII విశదం బొక పక్షంబున
విశయము వేఱొకట నిట్లు విలసిల్లిన యా
శశి యెట్లు సాటియగుఁ గవి
శశియగు రఘు పాండుకావ్యచణసూరనకున్. 493

## బెణకకవి

ఉ॥ శ్రీనరసింహ దేవుని విశేషకృపన్ రచియింప నేర్తునో
మానవనాథులార! నను మక్కువ సేయుచు నాదరింపుడీ
మానితవెన్ని నామకులమాన్యుఁడ భీమయమంత్రిపుత్రుఁడన్
మానిభశంకరాంబసుకుమారుఁడ బెణ్కపకాఖ్యసత్కవిన్. 494

## క్షేత్రయకవి

క॥ తముఁదామె వత్తు రర్థులు
క్రమమెఱిఁగిన దాతకడకు రమ్మన్నా రా
కమలంబు లున్న కొలనికి
భ్రమరంబుల నచ్యుతేంద్ర రఘునాథనృపా! 495

"ఇతి మువ్వగోపాలభక్తేన క్షేత్రకవినా ఉక్తత్వాచ్చ" ఆంధ్రకౌముది.

## కూచిమంచి తిమ్మకవి

మ॥ కవివిద్వద్ధరణీసుధాశన వరుల్ కార్యార్థులై తన్ను డా
సి వడిన్ జేతులు దోసిలించుకొని యాశీర్వాదముల్ సేయ నె
క్కువ దర్పంబున నిట్టటుల్ గదలకే కొఱ్ఱ మ్రింగినట్లుండు వా
రవనిన్ దుర్నృపు లేమి యోఁగలరొ భర్గా! పార్వతీవల్లభా! 496

## వక్కలంక వీరభద్రకవి

సీ॥ అతఁడు రాజకిరీటుఁ డఖిలరాజకిరీట
ఘటితపదాబ్జసంగతులు మీరు
అతఁడు వారణదూరుఁ డఖిలవారణరాజ
గణసమాకుల పురాంగణులు మీరు



అతఁ డాదిభిక్షుఁడు తతభిక్షుకానీక
యాచితార్థప్రదాయకులు మీరు
అతఁడు సర్వజ్ఞుఁ డంచితనైక సర్వజ్ఞ
పూజనీయ సమస్త బుధులు మీరు

గీ॥ భళిర మీతోటిసాటి కేపాటిమేటి
సర్వలోకేశ్వరుం (డనఁ జనెడుశివుఁడు)
వత్సవాయజగత్పతీశ్వరతనూజ!
ఘనసుగుణసాంద్ర! జగపతిక్ష్మాతలేంద్ర! 497

సీ॥ అంబుజంబిల్లుగా హర్షించుపువుఁబోణి
ధరజగజ్జరర నిర్భరవటుహరి
హార శేషచ్ఛాయయౌ కఠోరశ్రేణి (?)
ధరశార్ఙ్గ ధరుబొడ్డుదనరుకొడుకు
భూరిసింహము గుఱ్ఱముగ రూఢిఁ గలచేడె
దక్షమఘక్షయౌద్ధత్యబలుఁడు
రథగజతురగభద్రజయాయురక్షతా
..... ....... ........... ............

గీ॥ సంతతోత్సవశాలివై జగతి రేవ
నలరు మిల వక్కలంకవీరయను బ్రోవు
వత్సవయరాయ గజపతీశ్వరతనూజ
రాయజగపతిరాజ! గోత్రాబిడౌజ! 498

## దిట్టకవి తిప్పన

గీ॥ దిట్టకవిప్రసిద్ధి గలతిప్పన సత్కవిసార్వభౌముఁడౌ
నెట్టనినం గవిత్వమున నెవ్వరు వానికి నీడు గామిఁదాఁ

గట్టినగోచిదక్క నొకకానియు డాఁపక యర్థికోటికిన్
బెట్టుట బాపురే బిరుదు వెట్టిన వారిక చెల్లు నుర్వరన్. 499

## పుష్పగిరి తిమ్మకవి

ఈయన ములికినాటి బ్రాహ్మణుఁడు. నెల్లూరిమండలమందలి మోదెగుంటలో నున్నవాఁడు. ఈయన కృతులుగా సమీరకుమారవిజయము, కొన్ని శతకములు నుపలబ్ధములు. కంకంటి పాపరాజు నుత్తరరామాయణ మీయన రచించినదేయని లోకప్రతీతి. సమీరకుమారవిజయమునకు నుత్తర రామాయణమునకు శైలీభేదము గోచరించుటచే నా ప్రతీతి విశ్వాస్యము కానేరదని కొందరవాదము. గ్రంథద్వయమందలి పద్యైక్యము వారు పాటింపరు. తిమ్మకవి నివాసగ్రామముచేరువ నుపలబ్ధమయిన యొక ప్రాఁత వ్రాఁత పుస్తకమున గ్రంథాంతగద్యమున, పాపరాజప్రమోదసంపాదనార్థము, తిమ్మకవి రచించినట్లున్నది. తిమ్మకవి సాహాయ్యముచే నానాఁడు మఱియుఁ గొందఱు కవులలో గణన గాంచిరి. ద్విపదభాగవతకర్త టేకుమళ్ళ రంగశాయికవి యిట్టివాఁడు.

మ॥ కమనీయంబగు నీదు కావ్యరస మాకర్ణించి నానాబుధుల్
సముఁడౌ నీతఁడు పూర్వసత్కవులకున్ సాబాసురే యంచు స్తో
త్రము గావింతురు శంభుజూటతటినీరంగ త్తరంగార్భటిన్
మమతాహంకృతిదూర! పుష్పగిరితిమ్మా! సత్కవిగ్రామణీ! 500

## తురగా రామకవి

ఈతఁడు పెద్దాపురపుఁబ్రభువగు వత్సవాయ తిమ్మజగపతి మహా రాజులుంగారి నాఁటివాడు. ఈతని చాటుపద్యములే గాని గ్రంథములు తెలియరాలేదు. వత్సవాయ తిమ్మనృపాలు నీతఁడు తిట్టెను.

కః॥ అద్దిర! శ్రీ భూనీలలు
ముద్దియ లాహరికిఁ గలరు ముగు రందఱలోఁ



బెద్దమ్మ నాట్య మాడును
దిద్దిమ్మని వత్సవాయ తిమ్మని యింటన్. 501

మఱియు నీ పద్యమును వినుఁడు.

ఉ॥ పెండెల నాగికొప్పుపయిఁ బెద్దికటిస్థలి గంగిగుబ్బ చ
న్గొండలనుండు రామకవికుంజరుహస్తము క్రిందుఁ జేసె హా!
పండక బంటు మిల్లి యది పండిన నీ కసుమాలధారుణీ
మండలనాథుఁ బోలు నొక మానవమాత్రుని వేఁడఁబోవునే? 502

వింత యొక్కటి వెల్లడియయినది. సింగారముచెలరేఁగుచున్న పద్యములన్నియు శ్రీనాథునితలకుఁ దగిలింపఁబడుచున్నవి. పెండెల నాగి, గంగి, పెద్ది యనువిలాసినులు రామకవిగారికిం గామినులని పై పద్యము పలుకుచున్నది. కాన, యా వెలఁదుకలపేర నున్న పద్యములు రామకవికృతములే యగును.

ఉ॥ చూడఁగ నల్పుగాని పరిశోభిత దివ్యకురంగనాభ మే
జాడను రాజయోగ్యమగు జవ్వని నల్లని మేని సంచుతో
డాడగ రాదుగా! రతిరహస్య మెరింగిన జిత్తసంభవ
క్రీడలఁదేలి చూడవలె గేదగి గంగ విచిత్ర వైఖరుల్. 503

ఉ॥ భూతలమందు ధాతకు నపూజ్యత గల్గెను రెంట మూఁట భా
గోతుల బుచ్చిగాని కొకకొంచె మనంగ గృహంబు సేయమిన్
భీతకురంగనేత్రయగు పెండెలనాగికి మర్మజాత సం
ఘాతము లుంచినందుకును గంగిని నల్పొనరించినందుకున్. 504

అను పద్యమును, శ్రీనాథకృతులుగాఁ దలఁపఁబడుచున్నవి. రామ కవిగ్రామణివని నిజము నేఁటఁ దేటపడినది. ఈ పద్య మీ రామకవి దగునో కాదో!

గీ॥ విప్రుతలముండ తల్లి వివేకిగాదు
ఎన్నిదిట్టిన నా భార్య యేభ్యరాశి
అన్నిటికిఁ దోడు నా కాలు నవిటికాలు
రామకవి గానిబ్రదుకు శ్రీరామ రామ! 505

## నృసింహభారతి

ఈయన శృంగగిరిపీఠాధికారి కాఁబోలును. ఎవరో వీరిని బొగడినారు.

మ॥ కరహాటాంధ్రమరాటలాటవిలసత్కాంభోజనేపాళికా
కురుకాళింగవిదర్భ చేదియవనాఘూర్జావనీనాయక
స్ఫురితానేక సభాంతరాళములలో భూషింతు వాక్ప్రౌఢిచే
నరసింహోత్తమభారతీందుగురునిన్ నా స్వామినిన్ వేడుకన్. 506

ఈయన తన పీఠమునకు వచ్చు ద్రవ్యమంతయును మేడలకును, మిద్దెలకును వ్యయించెదువాఁడట!

శ్లో॥ కారూణామపి దారూణా మశ్మనాం వేశ్మనామపి
నృసింహభారతేర్ద్రవ్యమయ్యో అయ్యో వృథా వృథా. 507

## అహోబలపండితుఁడు

ఆంధ్రశబ్దచింతామణి సూత్రములకు భాష్య మొనరించిన గాలి యహోబలపండితుఁడు మైదవోలున నుండఁగా గుండ్లకమ్మ వఱదవచ్చి కొంపలు కూలి పంటలుపొద్వడి తిన నన్నమును గట్ట గుడ్డయులేని దుర్దశ వాటిల్లెను. అపుడు నరసారావుపేట మల్రాజువారి సంస్థానమున కరుగుదెంచి యీ క్రింది సీసపద్యమును జెప్పి వారివలన నొక యగ్రహారముంబడసి యాతఁడచ్చటకు నివాసము మార్చుకొనెనట!



సీ॥ జానకీపతి లేఁతసజ్జరొట్టెలపాలు
కొంపలకప్పెల్ల గొడ్లపాలు
సంవాసములు దొంగజాగిలంబులపాలు
నయనముల్ జాగరణంబుపాలు
కలపుస్తకపుఁద్రాళ్లు కట్టెమోపులపాలు
పొలుపైన చేతులు ముండ్లపాలు
భూరిసంధ్యావిధుల్ బురుదనీళులపాలు
నాలుక దీనోక్తి నటనపాలు

గీ॥ ఘనతరస్నేహ మతినీచజనముపాలు
చిత్తమే వేళ నతిదీర్ఘ చింతపాలు
హరిహరీ! దేహమంతయు నలఁతపాలు
మైదవోలున నుండుట మాకుఁజాలు. 508

ఆతని ప్రజ్ఞ.

క॥ నెట్టన నభినవనన్నయ
భట్టాచార్యాభిదాన పటుబిరుదాంకం
బిట్ట ట్టనక వహించిన
దిట్టఁడ! ననుఁ బోలఁగల సుధీవరు లేరే? 509

## అడిదము సూరకవి

క్రై 1750 ప్రాంతములం దీ కవిరత్నము విశాఖపట్టణపు మండలమందలి విజయనగరసంస్థానపుంబ్రభువగు పూసపాటి చినవిజయ రామరాజుగారి యొద్దఁ గవీశ్వరుఁడుగా నుండెను. ఆంధ్రచంద్రాలోకము, కవిసంశయవిచ్ఛేదము, కవిజనరంజనము మొదలగునవి యీతని కృతులు. ఈతని చాటువులు :–

చ॥ గడియకు నూఱుపద్దెములు గంటములేక రచింతుఁ దిట్టఁగాఁ
దొడఁగితినా పతాలుమని తూలిపడుం గులశైలరాజముల్
విడిచి యనుగ్రహించి నిఱుపేద ధనాధిపతుల్యుఁజేతు, నే
నడిదమువాఁడ! సూరనసమాఖ్యుఁడ! నా కొకరుండు సాటియే? 510

చ॥ గరిసెలుగ్రాఁతగాని మఱి గంపెఁ డెఱుంగము మన్యదేశముల్
తిరిగి యభీష్టవస్తువులు తెచ్చి భుజింతుము సర్వకాలమున్
సురుచిరసత్కవిత్వనిధి సూరకవీంద్రున కేలకల్గెఁ గం
చరమును రేగ మేక మెడచన్నులవంటివి రెండుమాన్యముల్! 511

ప్రశ్నోత్తరరూపముగాఁ దన వృత్తాంతముఁ జెప్పుకొన్న పద్యము :-

క॥ ఊరెయ్యది? చీపురుపలె
పేరో? సూరకవి; యింటిపే? రడిదమువార్;
మీ రాజు? విజయరామ మ
హా రా; జతఁ డేమి సరసుఁడా? భోజుఁడయా. 512

రాజును బొగడిన పద్యములు.

శా॥ ఢిల్లీలోపల గోలకొండపురి నిండెన్ నీ ప్రశంసల్ గుఱాల్
బల్లాలం బొడిపించి హుమ్మన యరబ్బా నెక్కి పైకొంచుబా
దుల్లాఖానునిఁ బాఱఁదోలితివి నీ దోశ్శక్తి సూబాలకున్
మళ్ళింపం దరమౌనె శ్రీ విజయరామా! మండలాధీశ్వరా! 513

ఉ॥ పంతము నీకె చెల్లె నొకపాటి యమీరుఁడు నీకు సాటియా?
కుంతముఁ గేలఁబూని నినుఁ గొల్వనివాఁడు ధరాతలాన భూ
కాంతుఁ డొకండు లేఁడు కటకంబు మొదల్కొని గోలగొండప
ర్యంతముఁజూడ శ్రీవిజయరామనృపాలక! మండలాధిపా! 514



విజయరామరాజుగా రేదోకారణమున సూరకవిగారియెడ నాగ్రహమూని యాస్థానము నుండి తొలగించిరట! బాదుల్లాఖానుతో నొకసారి యుద్ధము సేయఁ బోయి పరాభూతులై యారాజుగారు తిరిగి వచ్చుచుండఁగా సూరకవి తన గ్రామము ప్రక్కత్రోవలోఁ బనసచెట్టెక్కి విస్తళ్ళకై యాకులు గోసికొనుచుఁ జూచి యెదురుపోయి పల్లకీ నాపి తన కసితీఱునట్టు చుఱుకుగా నీ పద్యమును జెప్పెనట-

గీ॥ మెత్తనైయున్న యరటాకుమీఁదఁ గాక
మంటమీఁదను జెల్లునే ముంటివాఁడి
బీదలైయున్న సర్దార్ల మీఁదఁ గాక
కలదె క్రొవ్వాఁడి బాదుల్లఖానుమీఁద? 515

పొనుగుపాటి వేంకటమంత్రి యను నియోగిమీఁద సూరకవి చెప్పిన పద్యములు :-

క॥ ఘనకులమునఁ బొడమిన దు
ర్మనుజుం డిల నింద్యుఁడగు వమన మూర్ధ్వముఖం
బున వెడలి మంచిదగునా
విను మవహిత పొన్గుపాటి వేంకటమంత్రీ! 516

క॥ కినుకమెయిఁ దన్ను లాడఁగ
మొనకట్టిన సరియె గుఱ్ఱమున్ గాడిదయున్
ఘనుఁ డల్పుఁడు సరి యగుదురె
విను మవహిత! పొన్గుపాటి వేంకటమంత్రీ! 517

క॥ సామజము చెఱకు మేసిన
దోమలు పదివేలు చేరి త్రోలంగలవా?
గ్రామపతి తగవుదప్పిన
గ్రామములో నున్నవారు కాదనఁగలరా! 518

కు॥ ఇత్తడి పుత్తడి యగునా?
తొ త్తది నగ లెన్ని యిడిన దొరసా నగునా?
యుత్తమకులుఁడౌనా దౌ
లత్తునఁ దాఁ దిరిగినను గులాము గులామే! 519

కు॥ బలవంతుఁడు బలహీనుఁడు
పొలియుదు రిది తప్పు? నల్లపూసలు ముత్యాల్
దొలఁగుఁగద! మగఁడుపోయిన
వెలఁదుకకున్ బొన్గుపాటి వేంకటమంత్రీ! 520

కు॥ జలచరము లబ్ధిఁ బొడమవె?
జలరాశికి మోదకరుఁడు చంద్రుం డొకఁడే
కుల ముద్ధరింప నొకఁడే
విలసద్యశ! పొన్గుపాటి వేంకటమంత్రీ! 521

కు॥ వలరాచపనికిఁ గాదా
వెలవెలఁదుక పొన్పు నెక్క విటుఁడు సహించున్
జల మేల కార్యవాదికి
విలసద్యశ! పొన్గుపాటి వేంకటమంత్రీ! 522

కు॥ వరదానాచారంబుల
గరిమగను వనీపకులును కర్మఠులును భూ
సురమణి యని నిన్నందురు
విరచితవృష! పొన్గుపాటి వేంకటమంత్రీ! 523

కు॥ చుక్కలవలెఁ గర్పూరపు
ముక్కలవలె నీదు కీర్తి ముల్లోకములన్



గ్రిక్కిఱిసి పిక్కటిల్లెను
వెక్కసముగ పొన్గుపాటి వేంకటమంత్రీ! 524

కు॥ వెన్నెలవలె, గర్పూరపు
దిన్నెలవలె నీదు కీర్తి దిగ్దేశములన్
మిన్నంది వన్నె కెక్కెను
విన్నావా? పొన్గుపాటి వేంకటమంత్రీ! 525

పూసపాటి సీతారామరాజుగారొకప్పుడేకవచనమున సంబోధించి నందులకుఁ గుపితులుకాఁగా సూరకవి చెప్పిన పద్యమొకటి :-

కు॥ చిన్నప్పుడు రతికేళిక
నున్నప్పుడు కవితలోన యుద్ధములోనన్,
వన్నె సుమీ రాకొట్టుట
చెన్నుగ నో పూసపాటి సీతారామా! 526

చ॥ ఇరువదిమూఁడు పూరుషము లిప్పటి కయ్యెఁ గవిత్వవృత్తిచే
నరపతు లెల్ల మెచ్చఁ బదునాల్గుతరంబులు మించుపిమ్మటన్
వెరవగు జీవనస్థితి లభించుట తొమ్మిది యయ్యెఁ బూరుషాం
తరములు నిక్కళింగవసుధాధపు చెంగట నాశ్రయించుటల్. 527

పూసపాటి పెద్దవిజయరామ మహారాజుగారు బాదుల్లాఖాను తోడి యుద్ధమునుండి తిరిగివచ్చుచుండఁగాఁ ద్రోవలోఁ జూచి సూరకవి చెప్పిన పద్యమిది యొకటి!

సీ॥ గరిడీలలోపల గంతు వేయుట కేమి
యీఁటె పట్టి యరిపై దాఁటవలెను
సొగసుగ మొలకత్తి బిగియఁ జెక్కుట కేమి
వెఱవక వైరుల నఱకవలెను

మాటిమాటికిఁ జెడ్డమాట లాడుట కేమి
యదలించి రిపులఁ జెండాడవలెను
తొమ్మున నెఱ్ఱగందమ్ము పూయుట కేమి
గాయంపునెత్తురుల్ గ్రమ్మవలెను

గీ॥ కాని లేకున్న సత్కీర్తికాంత గలదె
పూసపాటికులాంభోధిపూర్ణసోమ!
సమరజయభీమ! గజపతి సార్వభౌమ!
విమలసద్గుణరామ! శ్రీవిజయరామ! 528

సూరకవి తన శిష్యులఁగూర్చి చెప్పినదఁట :-

గీ॥ పారమందిరి యక్కినపల్లివారు
దుక్కిచేతను దీర దెందువుల కెల్ల
దూసి కృష్ణుండు చదువంటె దుఃఖపడును
ధీరుఁడై నిల్చె మురపాక సూరసుకవి. 529

చింతకాయ లిచ్చినవానిమీఁది పద్యము-

గీ॥ బండ్లు నోడలు పట్టవు పలుకులై తె
చేరి వేఁడిన నీఁడాయెఁ జింతకాయ
కొండశంబములో రాచకొడుకుకన్న
శంబమున మేలు రేగాని సన్నిగాఁడు. 530

బాచన్నమీఁది పద్యము-

క॥ బాచా బూచులలోపల
బాచన్నే పెద్దబూచిపళ్ళున్ దానున్
బూచంటె రాత్రి వెఱతురు
బాచన్నను జూచి పట్టపగలే వెఱతుర్. 531



శృంగవరపుఁగోట జమీనుదారు రాజభూపాలరాజుగారు విజయనగరపు పూసపాటివారితోఁ బోరాడఁబూనఁగాఁ జెప్పిన పద్యము-

గీ॥ విజయరామమహారాజవీరుఁ డేలు
పట్ట ములికించె రాజభూపాలరాజు
కడను మాటల కేమి యీ కాలమునను
బుఱ్ఱనవ్వను బులితోఁక గొఱ్ఱె కఱచె. 532

పర్లాకిమిడి రాజుగారిమీఁదఁ జెప్పిన పద్యములు-

క ॥ గోవింద ద్వాదశివలె
నే వచ్చితి రాకరాక నీ నగరికి నో
పావనగుణ నారాయణ
దేవుమహారాజ సాహితీనవభోజా! 533

క ॥ నీ విచ్చుబత్తెక ర్చొక
భూవల్లభుఁ డిచ్చు త్యాగమున కెన వచ్చున్
బావనగుణ నారాయణ
దేవుమహారాజ సాహితీనవభోజా! 534

క ॥ వారిధికిని వారిధియే
మేరునగంబునకు సాటి మేరునగంబే
నారాయణదేవుకు సరి
నారాయణదేవు గాక నరపతు లెదురా? 535

పాలకొండను గూర్చి చెప్పినది -

శా ॥ రాజా జాఁరుడు, మంత్రి నిర్దయుఁడు, నీ రాష్ట్రంబులోఁ బెద్దలా
కోజుల్ కొండలు జీవహింసకును, సంకోచింప రెవ్వారికిన్

దాజీ మీయరు పాలకొండపురిలో దాక్షిణ్యశూన్యత్వ మీ
ఫాజీపట్టణ మేల వచ్చితిని నా పాపంబు సర్వేశ్వరా! 536

మ ॥ నరసింగుండును వెంకుపాత్రుఁడును గృష్ణా పాత్రుఁడున్ నాయుఁడున్
శరభాపాత్రుఁడు పాలకొండధరణీసామ్రాజ్యధౌరేయులై
ధర వర్ధిల్లెడు రామభద్రనృపునాస్థానంబునం బంచముల్
చిరకాలంబుగ వీరివెంటఁ దిరుగన్ జీచీ మనంబొప్పునే. 537

బత్తుల-అయ్యన్న యను దాతను గూర్చి చెప్పినవానిలో -

క ॥ ఇచ్చెడువానికి, రణమునఁ
జొచ్చెడువానికిని గాక సురుచిరకీర్తుల్
వచ్చునె పందకు లోభికిఁ
బచ్చునివిల్కాఁడ వయ్య బత్తులయయ్యా! 538

గీ ॥ చేఁదుఁ బట్టువేళఁ జెలఁగి యేడ్చును బిడ్డ
యంత కంత సుఖము నదియె యిచ్చు
నర్థి యడుగువేళ నది కష్ట మనిపించు
ననఘచరిత బత్తులయ్యనార్య. 539

పాలకొండ ప్రాంతమును గూర్చి -

శా ॥ క్షేమాకీర్ణవికీర్ణధామములు నక్షీణేక్షురంభాటవీ
స్తోమంబుల్ బహుశాలిధాన్యతతు లెచ్చోటన్ నదీమాతృక
గ్రామంబుల్ బహుళాగ్రహారము లనేకంబుల్ ధరం జూడఁగాఁ
క్షామం బన్నది లేదు క్షీరగిరిదేశంబందు నెందేనియున్. 540

కొత్ర బాలకవియు సూరకవియు సమకాలమువారు. వీరిర్వుర వాగ్ధాటి కోడి పర్వతాలను పేరుగల కవి యొకఁడూడనిఁబాడెను.



ఆ ॥ వె॥ నరుని నొగలమీఁద హరి యున్న చందాన
సూరకవివరేణ్యుజోకఁ గూడు
కొత్రబాలకవి యకుంఠవాగ్ధాటికిఁ
బర్వతాలుగాఁడు పాటిపోయె. 541

ఒకప్పుడు సూరకవి బోయదొంగల బారినుండి తప్పించుకొని చెప్పినది -

మ ॥ హనుమంతుం డెదుటన్ దివాకరసుతుం డాచెంత సౌమిత్రియున్
దను సేవింపఁగ జానకీవిభుఁడు వాత్సల్యంబుతో నిల్చి యిం
పున నన్నెప్పుడు గాచుచుండఁగను నీ బోయాధముల్ కిన్కచే
ననుఁ జంపంగలవారె రావుకులజన్మా! రంగ రాయోత్తమా! 542

గంటముచేసి యిచ్చిన కమసాలిమీఁదఁ జెప్పినది...

క ॥ ముల్లోకంబుల నాలుక
పల్లిపరశురాముకీర్తి ప్రబలి వెలుంగున్
మల్లీసుమవల్లిన్ జా
బిల్లిన్ మఱి పాలవెల్లి భీష్మునితల్లిన్. 543

మన్నెదొరలమీఁది పద్యములు...

క ॥ అర్బుదములు న్యర్బుదములు
బర్బర దేశాధిపతులు పడిగాపులు నీ
దర్బారునఁ బడియుందురు
దోర్బలసంపన్న మన్నెదొరయెరకన్నా. 544

క ॥ ధీరాగ్రణి శివరామ
క్ష్మారమణుం డేలు చెముడు శంభరపురమా
పోరామారొంపిల్లా
పారాదామంగరాజ పాళెముపట్టా! 545

ఆ॥వె॥ దేవునాన మున్ను దేశాన కొంక కవి
యిప్పు డూరనూర నింటనింట
నేగు రార్గు డేడ్గు రెనమండ్రు తొమ్మండ్రు
పదుగురేసి కవులు పద్మనాభ! 546

తన్నాదరించిన పొన్నుపాటి వేంకటమంత్రి స్వర్గస్థుఁడు కాఁగాఁ జెప్పినది.

మ ॥ కరుణాసాగరుఁ బొన్నుపాటికుల వేంకట్రామదాసున్ వసుం
ధరయం దుంచక స్వర్గలోకమునకుం దర్లించినా వేమి? త
త్పురిఁ గల్పాదులు లేవె యాచకులకున్? భూయాచకశ్రేణి కె
వ్వరు దిక్కేమిది మొండిజగ్గడవు కావా? వెఱ్ఱివై పల్కితిన్. 547

## సమస్య

ఉ ॥ సారతరప్రబంధము లసంఖ్యముగా నొనరించునట్టి యా
సూరకవీంద్రునిం జునిగి చూత మటంచును మాటిమాటికిన్
ఈరసమెత్తి దుష్కృతుల నిచ్చినవారల నోరు మొత్తుఁడీ
మీరును మీరు మీరు మఱి మీరును మీరును మీర లందఱున్. 548

## కొట్ర బాల (భాస్కర) కవి

ఈయనను గూర్చి యొకానొక భట్టుకవి చెప్పినది –

శా ॥ భట్రాజున్ నిరసించి పద్యములు చెప్పం బూనుచో మేటి యౌ
చట్రాతింబలె నున్నవానికిని నిచ్చుల్ తెల్వి పుట్టించు నే
కుట్రల్ నేరని సత్యసంధుఁడని లోకుల్ మెచ్చ వర్తించు నీ
కొట్రా బాలకవీందుశేఖరుఁడు మాకుంబూజ్యుఁ డెల్లప్పుడున్. 549

ఆ భట్టుకవి అడిదము సూరకవినిగూర్చి చెప్పిన పద్యములు.



క ॥ అంతా కవులము గామా
అంతింతో పద్యసమితి నల్లఁగ లేమా
దంతివి నీతో సమమా
కాంతాసుమబాణ! సూరకవి నెఱజాణా! 550

క ॥ రవి యెఱుఁగును భువితత్త్వము
భువిలోపల జనుల నెల్లఁ బోషించు సదా
శివుఁ డెఱుఁగు నాట్యతత్త్వము
కవితాతత్త్వంబు సూరకవియే యెఱుఁగున్. 551

దంతులూరి యన్నమ రాజనునాతఁ డీ యడిదమువారి రేగమాన్యము నుండి యక్కడి చెఱువు ముఱుగునీరు పోనీక యద్దుకట్టి చిక్కులు వెట్టుచుండఁగా నీ సూరకవికిఁ దండ్రివరుసవాఁడగు రామకవి మోకాలిబంటిలోఁ దన మాన్యమున నిలుచుండి యీ క్రిందిపద్యములఁ జెప్పెనట! అంతట నా రాజు కట్టిన యద్దుకట్టతెగి పల్లమునకు నీరు వంచుకొని పోయెనట!

సీ ॥ బ్రహ్మాండభాండసంపత్తి కుక్షిని గల్గు
పద్మనాభుని పదాబ్జమునఁ బుట్టి
సకలరత్నాకరస్థానమై యుప్పొంగు
నంబుధీశుని చరణంబు ద్రొక్కి
పరమతత్త్వజ్ఞుఁడై పరఁగుశంతనుమహీ
రమణువామాంకభాగమునఁ జేరి
అఖిలలోకాధ్యక్షుఁడై మించి విహరించు
శివుజటాజూటాగ్రసీమ నిలిచి

గీ ॥ తనరు నీవంటి ధన్య కుత్తమము గాదు
పూసపాటిమహాస్థానభూమియందుఁ

గాలు త్రొక్కంగ నోడుఁ జండాలుఁడైనఁ
గదలు మిటమాని దివిజగంగాభవాని! 552

సీ ॥ ఆదిభిక్షుం డీతఁడని రోసి విడియాకు
గొనివచ్చి యిట నిల్వఁ గోరితొక్కొ
జగడాలచీలివై సవతితోఁబోరాడి
వీఁగివచ్చి యిచట డాఁగితొక్కొ
నిర్జరాంగన లెల్ల నీఱంకు వెలిపుచ్చ
దూఁబవై యిచ్చోట దూఱితొక్కొ
బీదబాఁపలఁ గష్టపెట్టుటకై మిన్ను
దొలఁగి యిచ్చోటను నిలిచితొక్కొ

గీ ॥ వలదు ద్విజభూమిఁ గాల్నిల్ప వరుస గాదు
రవ్వ నీ కేల తగ దంబురాశి కరుగు
నాతి యతఁడె కాఁడటె పిన్ననాఁటి మగఁడు
కదలు మిటమాని దివిజగంగాభవాని ! 553

సీ ॥ భావింప నిలువెల్ల భంగంబులే కాని
భంగము ల్దొలఁగు టెప్పటికి లేదు
తిరుగుచో వంకరతిరుగుడింతియ కాని
తిన్నగాఁ దిరుగుట యెన్నఁడెఱుఁగ
మొనసి రేయుఁబవళ్లు మొరయుచుండుటె కాని
మొరయకూరకయుంట యెఱుఁగ మెపుడు
పరుల కల్మిని రోసి పల్చనగుటె కాని
పలుచనిగతి మాని మెలఁగు టెఱుఁగ

గీ ॥ మనుచు నీలోన నీవైన యవగుణంబు
లరసి లజ్జించి దివినుండకరుగుదెంచి



నిలువునీరైననీ విందు నిలిచితొక్కొ
కదలుమిట మాని దివిజగంగాభవాని! 554

సీ ॥ పచ్చిమాంసము కల్లు భక్షించి మత్తెక్కి
రాణించు తిరుగు పరాంసులైన
గంజాయి గుండ హుక్కాలుడికెడి నీళ్ళు
ద్రావి ద్రెూన్పడెడు తురుష్కులైన
గోవులఁ బడమొత్తి కోసి ముక్కలు మెక్కు
సమదాంధులగు కొండసవరులైన
తెరవాట్లు గొట్టి కత్తెరదొంగలై చాల
వాలించు తిరుగు చండాలురైన

గీ ॥ భూసురక్షేత్రమిది యన్నఁ బోఁడొకండు
చిన్న పొలములు బ్రాహ్మణక్షేత్రమునకు
ఘాతుకత్వంబు సేయు ముష్కరులు గలరె?
కదలుమిట మాని దివిజగంగాభవాని! 555

సీ ॥ కృతకాద్రులాయెనా కీలోగ్రఫణిఫణా
నేకఫూత్కార వల్మీకచయము
విరిదోఁటలాయెనా కఱకుకంటకకంట
కాంకుర విస్ఫురితాగచయము
పువుఁబాన్పులాయెనా నవమంజులశ్వేత
లవణాలవాలమౌ చవుటినేల
బొమ్మరింఢ్లాయెనా భూరిభేకాండజా
ధారమై తనరు కేదారచయము

గీ ॥ నీకు విహరింప వసతులై నివ్వటిలెనె
చిన్ని పొలములు, బ్రాహ్మణక్షేత్రమునకు

ఘాతుకత్వంబు చేయు ముష్కరులు గలరె?
కదలుమిట మాని దివిజగంగాభవాని! 556

అడిదము రామకవి పైవిషయమును గూర్చి పూసపాటి విజయరామరాజుగారి కిచ్చుకొన్న యర్జీపద్యములు -

సీ ॥ అవధారు! దేవ! మహాప్రభూ! విన్నపం
బాశ్రితోత్తముఁడ శుద్ధాంధ్రకవిని
పేరు రామన యింటి పేరడిదమువారు
మాజాగ భూపాలరాజురేగ
నల్లకృష్ణక్షమానాయకాగ్రేసరుఁ
డెఱ్ఱకృష్ణక్ష్మాతలేంద్రులచటఁ
గరణికధర్మంబు గల్పించి మాన్యంబు
దయచేసిరది యాస్పదంబు మాకు

గీ ॥ నదియు నీ యేఁడు దంతులూరన్న నృపతి
సత్తముఁడు గ్రామమెల్లను గుత్తచేసి
చెఱువు బిగఁగట్టి ప్రజలు జేజేపడంగ
ముంపుగట్టించె వరిపొట్ట ముంపఁదలఁచి 557

సీ ॥ విన్నవించెద నాదు వృత్తాంత మది కొంత
చిత్తగింపు పరాకు సేయకుండఁ
బొలములో నొకఁడేరుపూన్పంగఁ జాలఁడు
గంగాభవాని డాకకును జడిసి
దుక్కి టెడ్లను గొని దున్నుకుందమటన్న
బదులియ్యఁడెవ్వడు పాఁతనేబు
ఏ జోలియును లేక యింట నుండెదమన్న
సాలుకు వచ్చు గంటాలపన్నుఁ



గీ ॥ దేశమునవారు పొన్నూరు తెన్ను గాదు
పంట పసలేదు గంటాలపన్ను పోదు
మీకు దయరాదు మునుపటి మిసిమి లేదు
అతులగుణదీప! విజయరామావనీప! 558

సూరకవి ప్రపౌత్రుఁడు బాలభాస్కరకవి చల్లా పట్టాభిరామయ యను వానిఁగూర్చి చెప్పిన పద్యము.

సీ ॥ విజయరామక్షమావిభు మెచ్చి భాసిల్లె
ధరణిలో మా ప్రపితామహుండు
గంగాభవానిని గడుదిట్టరై తిట్టి
ఖ్యాతిఁ జెన్నొందె మా తాత యొకఁడు
వెలయంగ మగటి పల్వెంకను బడఁ దిట్టి
తగఁదెగటార్చె మా తండ్రిగారు
ఆ రీతిగాఁ దిట్టి యమపురంబునకును
నిన్నుఁ బంపదలంచి యున్నవాఁడఁ

గీ ॥ గాచుకొమ్మిటు మీఁద నఖండచండ
దారుణోద్దండ కవితాగభీరశక్తి
నీ తరముగాదు కలహించి నిర్వహింప
చల్లపట్టాభిరామ! నీచగుణధామ! 559

## కృష్టిపాటి వెంకటసుబ్బకవి

ఈయన కర్నూలు మండలవాసి. ఇప్పటికి డెబ్బదియేండ్లకుఁ బూర్వమున్న వాఁడు. మహానందిక్షేత్రమున జగద్గురు శ్రీ (పుష్పగిరి) శంకరభారతీ స్వామిసన్నిధిని బ్రాహ్మణసమారాధనము జరుగుచుండువేళఁ గుంభవర్షము గురియ నారంభింపఁగాఁ గవిత్వమహత్త్వముచే నా వర్షబాధ దొలఁగించి శ్రీవారిచే గొప్ప సన్మానముఁ బడసినాఁడట! అప్పటి పద్యములివి -

ఉ ॥ గోండ్రలు పెట్టి మేఘుఁడతికోపమునన్ గురియంగఁ జొచ్చె మా
తండ్రి! మరుత్తనూజ! నను దబ్బఱకాఁడని యెంచకుండ నీ
వేండ్రము నీవె మాన్పవలె వేయువిధంబులఁగాక యున్న మీ
తండ్రికినైనఁ జెప్పి జలద ప్రతిబంధము మాన్పు మారుతీ! 560

శా ॥ విద్యుత్పింగళ మంగళేక్షణ కృపావిర్భూత శ్రీకృష్టిపా
డ్విద్వ ద్వేంకటసుబ్బ సూరికవితో ద్వృత్తత్వ మాలించి నీ
విద్యుద్గర్జనభర్జనాదులడరన్ వేమారు వర్షింపకే
విద్యాశంకరభారతీవిజయమున్ విక్రాంతి వాటిల్లఁగాన్! 561

నశ్యమును గూర్చి యీయనకును ఉయ్యాలవాడ నారసింహారెడ్డి గారి యాస్థానపండితుఁడగు నోబళాచార్యులకును జరిగిన సంభాషణ పద్యము లివి--

ఉ ॥ నస్యము లేదుగా! పవననందనదివ్యకటాక్షవీక్షణా
వశ్యవరప్రభావ విభవానుభవాద్భుతభూమిభృద్ధనుః
కైశ్యఘుమంఘుమంఘుమితగాంగఝురీవిలుఠ త్తరంగసా
దృశ్యకవిత్వతత్త్వముఖరీకృతవేంకటసుబ్బసూరికిన్. 562

శా ॥ కోకో! నస్య మవశ్య మీశ్వరజటాకోటీరటద్వ్యోధునీ
ప్రాకాశ్యోర్మిసకాశ పేశలసుశబ్దప్రక్రియోపక్రమా
నేకగ్రంథనిబంధనార్జిత సమున్నిద్రప్రతాపప్రథా
స్తోకశ్రీకర కృష్టిపాటికులసింధుస్వచ్ఛ చంద్రోదయా! 563

## అల్లమరాజు సుబ్రహ్మణ్యం

ఈయన యిప్పటికి ముప్పదేండ్లకు ముందున్న గొప్పకవి. బహుగ్రంథ కర్త. పీఠికాపురాధీశ్వరుఁడగు రావువేంకటమహీపతి గంగాధరరామారాయ ప్రభునిచే సమ్మానితుఁడు. ప్రభునామమును బొందించి యాశువుగా నీకవి చెప్పిన పద్యము.



క ॥ శ్రీధర శౌరీ వైకుం
ఠాధర శ్రీరావువేంకటమహీధరగం
గాధరరామారాయ
క్ష్మాధరునిం బ్రోవుమెపుడుఁగరుణాదృష్టిన్. 564

కాట్రావులపల్లె యుప్పునీటి నూతులఁ గూర్చి చెప్పిన పద్యము –

క ॥ దేవాసురులబ్ధిఁదరువ
నావిర్భూతమయి హాలహలమపుడు మహా
దేవునకున్ భీతిలి కా
ట్రావులపలి నూతులందు డాఁగెను జుండీ. 565

వైదికుని కవిత్వమునాక్షేపించువారిఁగూర్చి చెప్పినది –

ఉ ॥ చందనశాఖికన్న విరసంబగు బూరుగు మేలటన్న రీ
విం దగినట్లు వైదికకవిత్వసుధారసధారలెల్లఁ జె
ల్వొందఁగ భూతలంబున నియోగికవిత్వముతోడ సాటిరా
దందురు బెట్టిదంబగు నటందురు కొందఱు మూఢమానవుల్. 566

## బుక్కపట్నం తిరుమలతాతాచార్యులు

తెల్గువిశ్వగుణాదర్శకర్త యీతఁడు రోఁతగా బూతుఁబద్దెములను జెప్పుచుండువాఁడఁట! మతుకుమల్లి శాస్త్రులను నస్య మడిగి యాయన లేదనఁదాఁ గోపించి యీ క్రింది పద్యము చెప్పెను.

క ॥ శాస్తుర్లట యీ నీఁచుఁడు
పాస్తొత్తులమగఁడు వీని పరువేమో కా
కాస్తంత నస్యమడిగిన
నాస్తే యని పలుక వీని నాలుక పీఁకా. 567

ఇట్టి చెట్టతికమునకు నేవగించి వేఱొకకవి దూఱి చెప్పిన పద్యము.

గీ ॥ అహహ తిరుమలవంశంబు నడవిఁగలిపి
బుక్కపట్టణమంతయు బూది చేసి
కొంటెకూఁతలు నేరుచుకొంటి వౌర
కుటిలతిరుమల తాతన్న! కొంటెదున్న. 568

తాతాచార్యుఁడు వైద్యము చేయునఁట! రోగము కుదుర్చుకొన్నవాఁడై యచ్చన్న యనునొకఁడు తానిచ్చెద నన్న యీవి యీయకపోఁగా నీ పద్యము నీ యాచార్యుఁడు చెప్పెను –

క ॥ పచ్చడము దుప్పటాయెను
విచ్చలవిడి తులసిపత్రి విడియం బాయెన్
అచ్చుల నగుబాటాయెను
అచ్చన్నా! నీదుకీర్తి యట్టిట్టాయెన్. 569

## తురగా వెంకమరాజుగారు

ముదిసి ముప్పునఁబడినప్పు డీపద్యము చెప్పుకొన్నాఁడఁట! ఈయన స్వర్గస్థుఁడయి యిప్పటికి నిర్వది యేండ్లు కావచ్చినది.

ఉ ॥ దార యడంగెఁ, బిమ్మట నుదారుఁడు రెండవపట్టి తీఱె, దృ
క్సారము దూరమయ్యె, నధికంబగు దేహపటుత్వమాఱె, నా
హారము వండిపెట్టుటకు నాఁడదియుం గఱవయ్యె, నేఁటి కీ
దారుణకష్టముంచితి గదా నతలోక, విపన్ని వారకా! 570

## మాడభూషి వేంకటాచార్యుఁడు

ఈయన యిప్పటికి ముప్పదియేండ్లకు ముందు వైకుంఠవాసియయ్యెను. 'విద్వానభినవపండితరాయ'లని యీయన బిరుదనామము.. ఈయన తర్క



వ్యాకరణములందు గొప్ప పండితుడు. సంస్కృతాంధ్రములందు గొప్పకవి. శతావధానాష్టావధాన చాతుర్యమందీయన జగజెట్టి. ఏకసంధాగ్రాహి. వనప్పాకం అనంతాచార్యులుగారీయన ప్రాణమిత్రము. అనంతాచార్యులుగారి దగ్గఱ కొకప్పుడవలిప్పుఁడగు నొక యరవదేశపు విద్వాంసుఁడు వచ్చి స్వ రచితము లయినశ్లోకములను జదువుచు నర్థసారస్యము వివరించుచుఁ బ్రశంసించుకొనుచు నుండగా వేంకటాచార్యులుగారు వినుచునుండిరి. పదిశ్లోకములయినవి. ఆత్మోత్కృష్ట ప్రశంసాపరాయణుఁడుగా నున్న యాపండితునితో "నయ్యా! యీ శ్లోకములు పిన్ననాఁడు మా నాయనగారు నాకుఁ జెప్పిరి. ప్రాచీన కవికృతములయిన యీ శ్లోకముల ననంతాచార్యులుగారెఱుఁగరుగదా యని యాత్మీయములుగాఁ జదువ నారంభించితిరా?" యని యడ్డు పలికిరఁట. కుపితుఁడై వెడనవ్వు నవ్వి యా యరవదేశపుఁ బండితుఁడు వేంకటాచార్యులు గారి నెఱుఁగక "యేది నీకు వచ్చునేని చదువుము. రచించినవాఁడను నేనే యిక్కడ నుండగా నాతోనే యిట్లు పలికెద వేమయ్యా! ఎవ్వరవు నీవు" అని తుటారించెనఁట! 'ఇదిగో చదువుచున్నా' నని వేంకటాచార్యులుగా రన్నింటిని నేకసంధాగ్రహణమున నప్పగించిరి. వెల్లబోయి యా పండితుఁడు వేఁడుకొనెనట! 'మీ మాహాత్మ్యము నెఱుఁగనైతిని మన్నింపుఁ'డని. ఈ విషయ మనంతాచార్యులుగారివలననే విన్నాఁడను. వేంకటాచార్యులుగారు రచియించిన రామావధూటి తారావళినుండి కొన్ని పద్యములు –

## రామావధూటి తారావళి

సీ॥ శ్రీరాధికాకుచాశ్లేషజసంతోష
వివశుఁడౌ శ్రీకృష్ణవిభునకెరఁగి
సకల విద్యావాప్తిసాధనభూతయౌ
శారదాంబకు నమస్కారము లిడి
యైహికానంద ప్రవాహపూరక మైన
శృంగార రసకమాత్మ నిరవుకొలిపి

మదనసామ్రాజ్య సింహాసనారూఢులై
పురణించురసికశేఖరుల నెంచి

గీ॥ వివిధరతితంత్ర పాండిత్యభవమహాను
భవములె పదార్థములుగ నేర్పటిచి సీస
పద్యనక్షత్రమాలిక భావవిదుల
మనములలరంగఁగూర్తు రామావధూటి. 571

సీ॥ చక్కని కెమ్మోవి సరసంపుఁబలుకులు
బారైన కురులు పొల్పారు బొమలు
సొగసైన చూపులు సోగకన్నులు తళ్కు
దేరుచెక్కులు కాంతులూరు నొసలు
తీరైన చుబుకంబు దిద్దిన శ్రీచూర్ణ
లేఖయు మృదువైన లేఁతనగవు
కుదురైన రదనముల్ గుమ్మబుగ్గలు నంద
మగు నాస నాసికామండనములు

గీ॥ కలిగి చెలువొందు నీ మోముఁదలఁచి వలచి
తాల్మి చెడి బెట్టుకై కొంత ధైర్య మూని
గుట్టు చెడకుండఁగాలంబు నెట్టుచుంటి
మరుని రతనాల పేటి రామావధూటి. 572

సీ॥ కనుమూసినంతలోఁగలకల నవ్వుచు
వచ్చి కౌఁగిటఁజేర్చి ముచ్చటాడి
మోము మోమునఁజేర్చి ముద్దుల నూరార్చి
సారెసారెకు మోవి చప్పరించి
నన్నిట్టులెడబాయ నాయమా మీకని
యతినిష్ఠురములాడు నంతలోన



మేల్కని నలుదెసల్ మిఱుకుచుఁజూచి క
న్నీరు మున్నీరుగా నెగడఁబ్రతిది

గీ॥ నంబు రాత్రులు నిటులుండె నా యవస్థ,
యిట్లు కలలోన నన్నలయించకుంటె
వారిజాతాక్షి నాతోడ వచ్చి యిటనె
మమతతో నుండరాదె రామామధూటి. 573

సీ॥ నీ మోము నీ గోము నీ మోవి నీ తావి
నీ సౌరు నీ తీరు నీకుఁదగును
నీ చనుల్ నీ కను ల్నీకౌను నీ మేను
నీ తొడ ల్నీనడల్ నీకుఁదగును
నీ గుట్టు నీ బెట్టు నీ కురుల్ నీ మరుల్
నీ చెల్మి నీ తాల్మి నీకుఁదగును
నీ తళ్కు నీ బెళ్కు నీటు నీ గోటు
నీ హొయల్ నీ లయల్ నీకుఁదగును

గీ॥ నీకుఁదగినట్టిపురుషుఁడ నేన నాకుఁ
దగిన సుందరి వీవ కాఁదలఁచి చాల
వలచి యన్యోన్య మతనుని గొలిచి మిగుల
మంచితో నుంటిమి గదె రామావధూటి. 574

సీ॥ ఒకనాఁటి కలలోన సకియ నీ కాలిపా
జేబులో జందెంబు చిక్కినట్లు
ఒకనాఁటి కలలోన సకియ నీచేతి పో
చీలోన నా కురుల్ చిక్కినట్లు
ఒకనాఁటి కలలోన సకియ కౌఁగిఁట జేర్చు
తఱిఁగంటె గడ్డానఁదాకినట్లు

ఒకనాఁటికలలోన సకియ మెల్లన నాదు
గూబలో కొక్కొరో కూసినట్టు

గీ॥ లిన్ని విధముల నచ్చట నున్న నాఁటి
వన్నె లన్నియుఁగలలోన వచ్చి యిచట
గాసి గూర్చుచున్నవి నిన్నుఁబాసి యెట్లు
మరులు నిల్పఁగనేర్తు రామావధూటి. 575

సీ॥ నమ్మినవాని నన్యాయంబు సేయుట
కాశిలో గోహత్య గాదె కలికి
వలచి వచ్చినవాని వంచనల్ సేయుట
నరహత్య గాదె పున్నాగవేణి
చెలిమి కోరినవానిఁజేపట్టి విడుచుట
బ్రహ్మహత్యయె కాదె పంకజాక్షి
ఆడి తప్పినదోషమన్ని దోషములలో
మొదటిదోషము సుమీ మోహనాంగి

గీ॥ నిన్ను నమ్మితి వలచితి నీవు నన్నుఁ
బ్రేమఁజేపట్టితివి యిఁక విడువ ననుచు
బాసఁజేసితి విప్పు డీ పగిదిఁగూర్మి
మఱచిపోవంగఁ దగునె రామావధూటి. 576

సీ॥ చంద్రఖండంబుపైఁ జంద్రఖండము రేక
నుదుటఁ గుంకుమవంకఁ బదిలపఱచి
కొండలపై మంచు నిండియుండినరీతిఁ
జనులపై మైత్రైకఁ జక్కపఱిచి
కలువరేకులఁదుమ్మెదలు వ్రాలి యున్నట్లు
కనుదోయి నంజనంబును ఘటించి



బంగారుప్రతిమలు బటిక నార్చినరీతి
లలి జిల్గుమల్లి సెల్లా ధరించి

గీ॥ యంగజప్రభు విజయకాహళులపగిదిఁ
గాళ్ల నందెలు పాంజెబుల్ ఘల్లురనుచు
మ్రోయ మెల్లన వచ్చి నా మ్రోల నిలుచు
ఠీవి మఱవంగఁదరమె రామావధూటి. 577

సీ॥ ఒకనాఁడు మేడపై నొంటిగా కిటికిటీ
లెల్ల బిగించి శయించువేళఁ
జల్లగా నే వచ్చి మెల్లమెల్లనె ముద్దు
లిడఁబోవఁగాఁ ద్రుళ్ళిపడి బిరాన
లేచి చెంగట నన్నుఁజూచి సెబాసు రా
రండి యటంచు నురంబుపైకి
తిగిచి నా చిబుకంబుఁ దివురుచు నవ్వుచు
మధురవాక్యముల నన్ మరులుకొల్పి

గీ॥ సరసులైనట్టి నీవంటి జాణలిట్లు
చెలుల మానంబులను బయల్ సేయఁదగునె
యంచు మంచిగ బోధించినట్టి నేర్పు
మదికి మఱవంగఁదరమె రామావధూటి. 578

సీ॥ చిననాఁటి నుండి విజృంభించి సఖులతోఁ
బొందులొనర్చితిఁగుందరదన
యీలాటి మోహంబు లీలాటి విరహంబు
లేనాఁడెఱుంగనే యిగురుఁబోఁడి
నీవంటి చెలియతో నేస్తమబ్బె నటంచుఁ
జాలఁబొంగితిఁగదే జలజగంధి

యిప్పుడిట్లెడఁబాసి యేఁగుట నా పూర్వ
పుణ్యంబు గాఁబోలుఁ బూవుఁబోఁడి

గీ॥ యింత పాపంబు జగతిలో నెచటనైనఁ
గలదె నా పాపమిటు పండెఁగాక యైనఁ
దరుణి నీ మది కరుణమాత్రంబు తప్పి
పోవకున్నను జాలు రామావధూటి. 579

సీ॥ 'బోఁటి నేఁడూరికిఁ బోవలె' ననుచు నే
నొక్కింత పలుకంగ నుస్సురనుచు
'నెపుడుఁ బ్రయాణాలె యేమి సేతు' నటంచుఁ
గనుఁగొలఁకుల నీరు గ్రమ్మఁ గొంత
సేపున "కెపుడు విచ్చేయుదు రొక్కొ! య
చ్చటనె యచ్చటల ముచ్చటల మరగి
యుందురో" యన భయంబొంది నే నెన్నటి
కిని నట్టివాఁడఁగానని పలుకఁగ

గీ॥ నొట్టుసుండి తప్పక హుటాహుటిగ రండి
యనుచుఁ గౌఁగిటఁజేర్చి బాష్పంబులొలుక
రేపు పోవచ్చు ననుచుఁ బ్రార్థించునట్టి
మంచి మఱవంగఁ దరమె రామావధూటి. 580

సీ॥ ధరలోన జన్మ మెత్తంగ నేమి ఫలంబు
సరసవిద్యలనెల్ల జదువవలయుఁ
జదివిన నేమాయె సారస్య మెఱిఁగిన
చెలియతో స్నేహంబు సేయవలయుఁ
జేసిన నేమాయెఁజిడిముడి లేక వి
చ్చలవిడి ముచ్చట్ల మెలగఁవలయు



మెలఁగిన నేమాయె నెడబాయకెల్లప్పు
డేకీభవించి వర్తింపవలయు

గీ॥ నటుల వర్తింప నేమాయె నవ్విధమునఁ
జెడని ప్రేమలతోఁదనుల్విడువవలయు
నహహ యివి యెల్లఁ బూర్వపుణ్యమునఁగాక
మనుజులకు వీలుపడునె రామావధూటి. 581

సీ॥ మేడలోఁ జన్నీళ్లు మెండుగాఁజల్లించి
తడియొత్తి చిటిచాఁపలిడి సుమ్మదుల
తల్పంబుఁబఱిచి చెంతల మిన్నలగు షర్బ
తులును షోడావాటరులును గల్గు
సీసాలు చక్కెరల్ జీడిపప్పులును బా
దముపప్పులును మంచి ద్రాక్షపండ్లు
కజ్జాయములు ముంతఖర్జూరముల్గల
పళ్ళెముల్ ప్రేమతో భద్రపఱిచి

గీ॥ భోజనమొనర్చి నేను రాఁబొలుపు మీఱ
శయ్యపైఁజేర్చి యుచితోపచారములను
వేసఁగిపగళ్ళ సుఖియింపఁ జేసినట్టి
మంచి మఱవంగఁ దరమె రామావధూటి. 582

సీ॥ !కమలాక్షి! నీ మోముఁగనుగొన్న నా కన్ను
లేమియుఁ గనుఁగొన నేవగించు
!బింబోష్ఠి! నీదు మోవిని గ్రోలు నా జిహ్వ
యేమియుఁగ్రోలంగ నేవగించుఁ
!గలవాణి! నీదు పల్కులు విన్న నా వీను
లేమియును వినంగ నేవగించుఁ

!గనకాంగి! నీతోడcగలసిననాదుమే
నేమియు స్పృశియింప నేవగించుc

గీ॥ సరసిరుహగంధి నీ మేని పరిమళంబుc
గొన్న నానాస యెదియు మూకొనcగబోదు
అహహ! పంచేంద్రియములు నీయందె నాటి
మఱల విcక నేమి సేతు రామావధూటి. 583

సీ॥ సౌధంబుపై నీళ్లు చల్లించి చిమ్మించి
చాపలు పఱిపించి చారురత్న
కంబళంబులు వేసి ఘనహంసతూలికా
తల్పంబు బఱిపించి తమకమలర
నందుపై ననుcజేర్చి యగరుగంధముc బూసి
చలువపన్నీరులు చల్లి మల్లె
పూదండలును జాజిపూదండలురమున
వేసి చల్లనిగాలి వీచుచుండ

గీ॥ రమణ నీరీతి వేసవిరాత్రులందు
రాగ మెచ్చంగ నిష్టోపభోగములను
నన్ను సుఖియింపc జేసిన నాcటికూర్మి
మదికి మఱవంగ వశమె రామావధూటి. 584

సీ॥ ఉదయమే లేచి నిన్ వదలలేకైదాఱు
గడియలవఱకుండి కదలి మేడ
డిగి వచ్చుచో వాకిటికిముందు గుబగుబ
నీ వేcగి యీవల నావలc గని
సై యన నే వేగcజని బసలోcగల
పనులెల్లcదీర్చి సాపాటు చేసి



గంధంబుc బూసి వేడ్కల మించి కెలcకుల
నమ్మలక్కలు వెఱcగంది చూడ

గీ॥ నీటుగా వచ్చుచోc జూచి నేcడు దృష్టి
తాcకు నని ప్రొద్దు గ్రుంకినతత్ క్షణంబు
జీడిగింజలు దృష్టి తీసినవిధంబు
మఱచిపోవంగcదరమె రామావధూటి. 585

సీ॥ ఊరు నేcడే బైలుదేరుట నిశ్చయం
బైనచో నెదురు మాటాడలేక
మోము వెల్వెలcబోవ ముచ్చటాడుచునుండి
ధ్యానంబు వేఱుగాcదల్లడిలుచు
నా మాట లీమాటలడుగుచు నుచితోప
చారముల్ సేయుచు గారవమున
భోజనానంతరంబునను దమ్ములము గు
డాన్వితంబుగనిచ్చి యవలcజేయి

గీ॥ చేతిలో నుంచి యూరికి క్షేమముగను
బోయి శీఘ్రంబు రమ్మని పొలుపు మీఱ
నన్నుcబంపిన యానాcటినైపుణంబు
మఱచిపోవంగcదరమె రామావధూటి. 586

సీ॥ కదుపులోc గమ్మనికాంక్షలూరుచునుండు
నిను జ్ఞాపకము సేయcగనకగాత్రి
కనుల కేమో తళుక్కను నట్లుగాc దోcచు
నిన్నెన్న సౌదామనీలతాంగి
నిలువెల్ల నేమేమొ పులకించు నీతీరు
స్మరియించ శీతాంశురుచిరసుముఖి

సారెకు నేమేమొ నోరూరుచుండు నీ
మాటలఁ దలఁప బింబాధరోష్ఠ

గీ॥ యోచనగ నుండు మదికేమి తోఁచకుండు
దిగులుగా నుండు మరుమాయ దెలియకుండు
దైవమిఁక ముందెటులు సేయఁదలచినాఁడొ
మనకుఁ దెలియంగరాదు రామావధూటి. 587

సీ॥ ధరలో ననేకసుందరులుందు రైన వా
రలయందు నెందు నీవలెనె మంచి
గుణము విశ్వాసంబు కుదురు సత్యము తప్ప
కుండుట యుక్తమయుక్త మెఱిఁగి
తివురుట వినయవిధేయత లభిమాన
మాదరంబు దయామయాంతరంగ
మందంబు చందంబు నళుకును బెళుకును
సమయంబునను దెంపు సౌష్ఠవంబు

గీ॥ దగిన సరసునిఁ జేపట్టి తప్పులొప్పు
లెఱిఁగి విడువక ప్రేమచే నేలికొనుట
తెలివితేటలుపాయముల్ లలితవాక్య
మాధురియు నిన్ని గలవె రామావధూటి. 588

సీ॥ నీ యాత్మ నా యాత్మ నిజముగా నొకటంచు
నా మనంబునఁ జాల నమ్మియుంటి
నాతోడఁ జేసిన నమ్మిక లెప్పుడు
మఱచిపోవని రూఢి పఱిచియుంటి
నెవరెన్ని చెప్పిన నిఁక నన్ను విడనాడ
వంచు నా మది నిశ్చయించుకొంటి



మన శరీరము లున్నమట్టుకు మనలోనఁ
బొర కల్గదని తలపోసియుంటి

గీ॥ వనితరో యిప్పుడిటు కాలవశముచేత
మనలకెడబాపు కల్గె నీ మది విరక్తిఁ
బొరయ లోగడ సంగతుల్ మఱచిపోవ
మంచిమార్గము కాదు రామావధూటి. 589

సీ॥ ఘనమైన మోహంబుఁగలవాఁడ నౌటచే
లలన నే నీకింత తెలుపవలసెఁ
బట్టుకై యభిమానపడువాఁడఁ నౌటచేఁ
దెఱవ నీకింత బోధింపవలసెఁ
బ్రౌఢానుభవమాసపడువాఁడ నౌటచే
నింతి నిన్నింత ప్రార్థింపవలసెఁ
జెలిమిపై లక్ష్యంబు గలవాఁడ నౌటచే
వనిత నీకింతగా వ్రాయవలసెఁ

గీ॥ గాక తమతమ యక్కఱల్ గడపుకొనెడు
వారలందఱతో పాటివాఁడ నైన
నింత యేటికి? నీకు నొక్కింతయైన
మనమునను దయ లేదు రామావధూటి. 590

సీ॥ నీ మోము నే నొక్క నిముసంబు గనుఁగొన
శశి యేటి కనిపించుఁ జంద్రవదన!
నీ మోవి నే నొక్కనిముస మానిన దొండ
పండేటి కనిపించుఁ బల్లవోష్ఠి!
నీ కను లే నొక్కనిమిషంబు గనినఁబ
ద్మమ్మేటి కనిపించుఁదరళనయన!

నీ బొమల్ నే నొక్కనిమిషంబు గనుఁగొన్న
విల్లేటి కనిపించు విలసితభ్రు!

గీ॥ నీదుచెక్కులు నే నొక్కనిమిషమైనఁ
గనిన నద్దంబు లేమిటి కనుచుఁ దోఁచు
నిట్టి నినుఁబాసి యున్న నా కిపుడు జన్మ
మే వృథా యని తోఁచు రామావధూటి. 591

సీ॥ శ్రీ మించు నెమ్మోము తామరవిరి తళ్కుఁ
గన్నులు విరిసిన కైరవములు
కుదురైన రదనముల్ కుందకుట్మలములు
తీరైన నాసిక తిలసుమంబు
తరళాధరోష్ఠంబు దాసానిపుష్పంబు
పొలుపైన పొక్కిలి పొన్నపువ్వు
ఆదోఁక లగుజంఘ లరఁటిపూమొగ్గలు
చక్కని మెయి శిరీషప్రసూన

గీ॥ మహహ మున మంచిమంచిపూలరసి తెచ్చి
పొదవి నెమ్మేనుఁజేసెఁగాఁబోలు బ్రహ్మ
దాన నిలఁగల యెల్ల సుందరులలోన
మాకు స్పృహణీయవైతి రామావధూటి. 592

సీ॥ నారంగములు బృహన్నారంగములు గల్గి
విలసిల్లు నుద్యానవీథులందుఁ
గాదంబములు పద్మకాదంబములు గల్గి
తనరారు కాసారతటములందుఁ
బర్యంకములు మహోపర్యంకములు గల్గి
వినుతి కెక్కిన సౌధవీథులందు



మణిపుత్త్రికలు నభోమణిపుత్త్రికలు గల్గి
సౌరు మీఱిన చంద్రశాలలందు

గీ॥ మనము మనముల మోహ మ్ముమ్మరముగాఁగ
మరునిఁ బూజించి మించి యేద్దెఱను రతుల
నతులగతులను దేలి సమ్మతుల మీఱి
రీవి నుంటిమి గదవె రామావధూటి. 593

## శిష్టు కృష్ణమూర్తికవి

## శంఖవర్ణనము

సీ॥ చిగురువిల్తుని యప్ప చేఁబూనునడిదంపు
రకపుఁబసిండి పరంజనంగఁ
గొనసాగి దెసలల్లి కొనఁబ్రాకు నతని కీ
ర్తిప్రతాపములచేరిక యనంగఁ
జెలియలి కనువేడ్కఁ జెంత కరుగుదెంచి
నిలుచున్న చిన్ని జాబిలి యనంగ
నాబిడ గేల్గంట నమరింపఁ గూర్చిన
కొమరారు బంగరుకుప్పె యనఁగఁ

గీ॥ బరఁగు నిందలి దక్షిణావర్తశంఖ
మౌర దామెరకులకలశాబ్ధిసోమ
విభవనిర్జితసుత్రామ విమలనామ
సద్గుణస్తోమ వేంకటసార్వభౌమ. 594

చ॥ తరువున బర్హి యంతరపథంబున నీగనయంబు నీరజా
కరమునఁ గ్రౌంచమున్ బొదపి కంబభిద్రశ్రుతిసూర్య ఘోటమున్
సరిమపథంబుల క్రమత సక్రమతన్ దటిఁబల్క శుద్ధసా
హెురి యిపు డాలపించు నన నొప్పెను గానసీమ నయ్యెడన్. 595

చాటువులు .-

శ్లో॥ ప్రీత్యా దామర వేంకటేంద్ర భవతా నిత్యార్చిత స్సంతతం
కృత్యాకృత్య వివేకోక్తి పదవీవృత్త్యాధికవ్యక్తిభాన్
సత్యాధీ శముఖామరార్చితపదః సత్యానుసృత్యాదరో
దైత్యారాతిరయం తవాననకళా మత్యాద్య సాక్షాదభూత్. 596

ఆర్యా : కాంచన పిశంగవసన:
కవితారుణవర్ణ పీత సంవసనః
తరుణతరమందహసనః
త్వా మవతా ద్వేంకటేంద్ర సవిలసనః 597

లక్ష్మీస్తనభరకుంకుమ, లాంఛితవక్షస్థలాంచితః కృష్ణః
దామరకుమారవేంకట, ధరణీనేతార మవతు సుకుమారమ్. 598

కుండినాయక తనయా
కుచయుగ కాశ్మీరముద్రితోరస్కః
కురుతా త్కువలయనీలః
కోఽ పి పుమా న్వేంకటేంద్ర తవ కుతుకమ్. 599

శా॥ ఛిద్రాన్వేషణతత్పరో నను రమాసూను స్స పంచాశుగీ
ముద్రాముద్రితదోర్యుగ ప్రవిలసత్కాంతారబాణాసనః
సద్రాగాద్య నిరీక్ష్య తే మమ తనుం సంతర్దయన్నిర్దయం
నిద్రా నైతి నిశా న యాతి తరుణీ నాయాతి కా యాతనా. 600

శా॥ యాతా కాచనదూతికా మదుదితం వ్యాఖ్యాతుమేతర్హి సా
నాయాతా బత పంచబాణపృతనాకోలాహలో ద్యోతతే
ఏకాకీ న్యవసం వసంతసమయే దైవా దహం నిష్కటే
నిద్రా నైతి నిశా న యాతి తరుణీ నా యాతి కా యాతనా. 601



జవః స్థిరత్వం రేఖా చ భ్రమణం దృష్టి రశ్రమః
అస్వేదః పటువాగ్రూపం పాత్రప్రాణా ఇమే దశ. 602

శ్రీశిష్టుకృష్ణమూర్తి కవిచంద్రుఁడు రాజా నల్లపరాజ మీర్జాసాహెబు వెంకట నీలాద్రిరాజు గారిని దర్శించినపుడు చెప్పిన పద్యము.

శ్లో. లక్ష్మీవక్షోజకుంభ ద్వితయపరిసర ప్రస్ఫురత్కుంకుమశ్రీ
శోణానూనాగ్ర సంధ్యారుచిరుచిరఘన భ్రాంతి కృత్కాంతివక్షాః
పద్మాక్ష స్సర్వ విద్వద్వినుత గుణగణాధ్యక్ష మక్షీణశౌర్యం
మీర్జానీలాద్రి రాజ ప్రభుమణి మవతు స్ఫారకారుణ్యబుధ్యా॥ 603

## శిష్టు సర్వశాస్త్రి

దామరవేంకట భూపాలుని యాజ్ఞాప్రకారము శిష్టు సర్వశాస్త్రి చెప్పిన చాటువులు

### దక్షిణావర్త శంఖము

క॥ కలిమిచెలి బొడ్డుబిడ్డకుఁ
బొలుపుగ బాల్వోయ నిడినపొంబాలడ నా
నలరారు నిందుఁదగుని
వ్వలమురి వేంకటనృపాల వరగుణశీలా. 604

చ॥ తరుణశశాంకశేఖరుఁడు దామర వేంకటభూమిపాలుఁడా
దరమునఁ జల్పుపూజనల దానముల న్ముదమంది మిత్రుఁడౌ
సిరి నిడువాని కాన యిడఁ జెచ్చెర నాతఁడు పంప వచ్చి సు
స్థిరమగు శంఖ సేవధిగ ధీఁదలపోయుదు దివ్యశంఖమున్. 605

### స్తంభ వర్ణనము

సీ॥ సంతతంబును సుప్రసాదత మించు ప్రా
సాదలక్ష్మి వహించుజడ యనంగ

రత్న సంపదఁ జూడ రహి మరంగున నిల్చు
వరుణుఁడెక్కిన దంతికరమనంగ
రాజ్యరక్షకు రమారమణుఁడు నిల్పినఁ
గన్పట్టు తనదగు గద యనంగ
నిచటి చాగము విని యే నెంత యని కంది
కొల్వ వచ్చిన దేవకుజమనంగ

గీ॥ భావుక భవత్సభాంతర భాసమాన
రాజరత్నమయ స్తంభరాజ మొప్పుఁ
బోషితబుధాళి తోషితభూజనాళి
కృతినళినహేళి వేంకటక్షితిపమౌళి 606

ఉ॥ గాలికిఁ దూలు కేతనము ఖడ్గముగా బలవైరిమేడతో
నోలి నెదుర్ప నీదగు సమున్నతసౌధము కప్పుడాలొగిన్
గేల నమర్చి మిన్నలమి కేరుచు నెత్తిన బాహుశాఖ నా
నీలపుఁగంబమొప్పు నవనీనుత వేంకటనాయకాగ్రణీ. 607

చ॥ అనవరతంబు నీకుఁ బురుషార్థ చతుష్టయిఁ గూర్తు నంచు సూ
చన మొనరించు నాల్గయిన శౌరిభుజార్గళమో యనంగఁబై
నునిచిన దిమ్మెకై ల్దగ సమున్నతతావకసౌధమందొగిన్
దనరును నాల్గుగంబములు దామరవేంకటనాయకాగ్రణీ. 608

చ॥ మిలమిల లీను నీ పసిఁడిమేడ ప్రకాశము పేరిపుత్రుతో
నలబలవైరిసౌధరుచి యన్నుహితం జతఁగూర్చి వియ్యపుం
జెలిమి వసంతముం జిలుకఁ జేర్చిన నీలపుఁగ్రోవి నాఁగ రా
జిలు నల రాలకంబమనఁజెన్నగు దామరవేంకటాగ్రణీ. 609



## పీఠికా వర్ణనము

సీ॥ కలధౌత రేఖికావలయిత పీఠిస
మీరణప్రేరణ తీరకలిత
ఫేనసరసిలోన మానుగఁబొడమిన
యలరుప్రవేణికా ప్రావృత తదు
పరి పీఠికాశోణపంకజమ్మున మించు
కనకపీఠికనత్కర్ణిక నొగి
నివసించు సిరితోడ నెనరూనుమనసునఁ
గలయ నల్లన నల గరుడవాహుఁ

గీ॥ డితఁడె సుమ్ము త్వదీయసంతతసుఖాభి
రూపసౌధాంతరమ్మున రూఢి నిన్నుఁ
బ్రోవ వచ్చె సమంచితాభ్యుదయశాలి
వినుతగుణపాళి వేంకటావనీపమౌళి. 610

సీ॥ చుట్టు గట్టిన వెండికట్టు నీలపుఁబీట
క్షీరాబ్ధివేష్టిత క్షితివలయము
తదుపరినిహిత సుత్రామమణీగణ
ఖచితమౌ పీఠము గగనతలము
దానిపై నెఱచాయలీను రాంకవకుథా
స్తరణంబు విస్ఫురత్తరణిబింబ
మందలి తులసీదలారుణ కుసుమాళి
మరకత మాణిక్యమయనలినము

గీ॥ గాఁదదీయాంతరమ్మున గమల నెనసి
యున్న దేవుండితండిదె నిన్నుఁ బ్రోవ

వచ్చియున్నాఁడు నీ రతి మెచ్చినాఁడు
వినుతగుణసాంద్ర! దామరవేంకటేంద్ర!! 611

సీ॥ కలధౌత రేఖికావలయితేంద్రోపల
పీఠము నిర్ఝరీవృతనగేంద్ర
మప్పీఁటపై నొప్పు గప్పు రామని మించు
పేరియక్కొండకు వెలయుశిరము
దానిపై నెఱరంగు లీను రాంకవకుథ
ధాతురాగస్ఫురద్ధరణీతలము
నా మీఁద మరకత కోమలదీప్తుల
నలరారు తులసీదళాళికవని

గీ॥ యది నిరంతర కుసుమస్రగగ్ర మగుట
నిత్యమాధవసంబంధనియతి నొదవె
నిదియు నీ మహిమోన్నతి గదర సుగుణ
వార దామరతిమ్మభూవరకుమార! 612

సీ॥ అనుదినంబరుణోదయమున గజేంద్రమో
క్షణపఠనంబీవు సలుపునపుడు
సిరిమగఁడేరీతిఁగరిఁ బ్రోచె నని మదిఁ
దలఁపఁగ నవ్వేడ్కఁదెలుపఁ గ్రింది
కరిపీఁట కరియుఁబైఁ గననగు రెండవ
యది కుంభముగ నందుఁ బొదలుతులసి
కారుణకుసుమంబు లంబులోడనలగ్న
శైవలకహ్లారసమితి గాఁగ

గీ॥ నవ్యకుథకాంతి యాస్ఫాలనక్రియాత్మ
కరనఖద్యుతి గాఁగ నీ వరయు మనుచు



నెదుట నిలుచున్న వైకుంఠుఁడితఁడె సుమ్ము
వినుతగుణధుర్య! వేంకటావనిపవర్య!! 613

సీ॥ తన మోము నిగనిగ ల్దవిలి యిట్టటు సరి
గాలి నీడ్వగ స్వీయగళలు దొరిగె
నాలుగు తెన్నులై నడుమ మిక్కిలి కంది
యున్న రూప్యప్రాంతయుక్తపీఠ
కుముదబంధుఁడు శోణకుథసమా స్తృతతదు
పరిపీఠ భుజగారిపదములఁబడి
ద్విజరాజ వీవును ద్విజరాజ నేనును
సరివాని శరణార్తి నరయఁ గీర్తి

గీ॥ యనుచు వేఁడుచు నున్నటు లరసినగవు
నెరయ సాక్షాత్కరించెను నియతి నీకు
నీ వొనర్చిన యారాధనావిధిఁగని
వినుతగుణపాళి వేంకటావనిపమౌళి. 614

సీ॥ పౌలస్త్యు దురమున భంజించి చుట్టురా
మ్రోయురాయంచలమూక నొప్పు
పుష్పకమున భూమిపుత్రికతో నెక్కి
నలుప్రక్కలందును గొలుచు కొమ్మ
మెకముల ముఖకాంతిచకచక ల్వ్యాపింప
నరుదెంచురాఘవుఁడనఁగ రజత
వేష్టితాంధ:పీఠవిలసదింద్రోపల
పీఠియందరుణప్రవేణికాంచ

గీ॥ దప్రమేయచ్ఛవిచ్ఛట లలమి పర్వఁ
గూరుచున్న సిరిపతి చెన్నారు నౌర

శశ్వదార్జిత పుణ్య విశ్వజనగణ్య
నీతినైపుణ్య! వేంకటనృపవరేణ్య!! 615

ఉ॥ ప్రీతుఁడ నైతి నీ తెలివి వేంకటనాయక కాశి కేఁగు నీ
తాతకు దర్శనం బొసఁగి ధన్యునిఁ జేసితి నిప్డు వచ్చి నిన్
జేతు నటంచుఁ బీత యుగనీలనగేంద్రముతోడ నా జగ
న్నేతయె యేతదాకృతిగ నిల్చెఁ బ్రసాద మెసంగఁ జెంగటన్. 616

శా॥ తారాంకాభ్రసరత్పరీవృత మదః పీఠం స్వరూర్ధ్వస్థితం
పీఠీశోణకుథాబ్జభాపరిగతం సత్యం తత స్తత్పరే
దివ్యే దామ్న్యరుణప్రసూనతులసీపత్ర ప్రభౌ శ్రీహరి
ప్రత్యక్షౌ భవతః కిమత్ర భవతః శ్రీవేంకటేంద్రప్రభో. 617

గీ॥ తారావృతాధరసమున్నతపీఠికాగ్రే
స్వారుణ్యవత్కుథసమా స్తతపీఠతార్క్ష్యే
ఆరాదుపేత్య విదధాతి ముదం సదారో
నారాయణ స్తవ స దామరవేంకటేంద్ర! 618

శా॥ ఊర్ధ్వస్థాచ్యుతపాదసారస లసన్మాధ్వీద్యుషన్నిమ్నగా
పీఠా దూర్ధ్వగతా ద్విహాయ సుపథా త్ర్పాప్యాధరం పీఠకం
స్వస్థానాశ్రయ తత్పరాకన ఖలం తత్రైవ నానాదిశో
ధావంతీ న పున: పపాత ధరణీ శ్రీవేంకటేంద్రప్రభో! 619

**చాటువులు :**

చ॥ సిరినెతి మించు నెమ్మిపురిఁజెన్నుగ నౌదలఁ దాల్చి మేల్మిబం
గరు మొలనూలిగంట గలుగల్లున మ్రోయఁగ మోముఁదామరం
జిఱునగవొప్పఁదల్లికడఁ జిందులు ద్రొక్కుచు నాడు నల్ల వే
ల్పు రహి నొసంగు నీకుఁ గలుము ల్దయ దామరవేంకటాధిపా. 620



క॥ కృష్ణుఁడు పదకమలనయ
జిష్ణుఁడు నరకాదిదైత్య జిత్వర కేళీ
ధృష్ణుఁడు భక్తశ్రీవ
ర్ధిష్ణుఁడు వేంకటనరేంద్రుఁ దిరముగఁ బ్రోచున్. 621

## కంకతికావర్ణనము

చ॥ హిమకరకీర్తి వేంకటమహీరమణా కలధౌతదంతప
త్రములు ప్రదీప్యహంకృతిఁ బరస్పరము న్గలహించిచె
య్యమరఁగఁ బట్టి నీసముఖమం దొగి నత్తగవెల్లఁ దీర్పఁగా
సమయనిరీక్షణక్రమము సల్పుచు నిల్చె నచంచలాకృతిన్. 622

చ॥ అనుపమ రాజతద్యుతిసమంచితమై భవదీయసన్నిధిన్
దనరును దంతకంకతము తావకకీర్తులకుం దరంబుగా
క నొగిలి పుత్రి గంగ దలఁ గ్రక్కునఁదాలిచి స్రుక్కి కొల్వ న
చ్చినయజహత్స్వపాదహిమశృంగియ నాఁదగు వేంకటాధిపా. 623

ఉ॥ అర్ణవమేఖలావసనమై తగునీదుయశంబుఁ గాంచి దు
ర్వర్ణత నంటి వెండి మదవారణసద్విజకంకతాప్తిస
ద్వర్ణము నంటి నిన్నుఁ గొలుపంగ భవత్కరపాళియైత్వద
భ్యర్ణము చెందె వేంకటధరాధిప సూరిజనోదయత్కృపా. 624

గీ॥ సారగురుబుధ మిత్రమందార మహిమఁ
దనరు నీ మేడఁగని దివంబనుచు నుచిత
గతి రజతకంకతాకృతిఁ గవియు శశియుఁ
బొంకముగఁ గూడి నిలిచిరి వేంకటేంద్ర. 625

ఉ॥ దామరవేంకటక్షితిప! తావకహర్మ్యము తావరీవెనూ
దామర పట్టి విట్టినుడి తప్పగునేని భవత్ప్రకాశమం

దేమఱకెప్పుడు న్నిలుచునే రజతచ్ఛదపక్షవృత్తి లీ
లామహనీయకంకతమరాళకులాగ్రణి యిట్టు లొద్దికన్. 626

ఉ॥ దామరవేంకటేంద్ర! సతతంబును నీ మహనీయ సద్గుణ
స్తోమము లెక్క వెట్టుటకుఁ జొప్పుడు చొప్పుగ నాత్మ నెంచు నా
గ్రామకరంబు నాకలితరౌప్యశిరోఘనకంకతంబు ల
క్ష్మీమహితస్థితిం దగఁ బ్రకీర్ణ తదీయరథాళి వ్రేళ్ళుగాన్. 627

సీ॥ దేవకి కల వసుదేవునకును మనో
రంజనముగ మధురం జనించి
యమునఁదరించి న్యాయముగ యశోదకుఁ
బట్టియై సతులఁ జేపట్టి ప్రోచి
గోపసుతులతోడ గోపాలన మొనర్చి
సురలుల్లసిలఁగ నసురులఁ ద్రుంచి
ధరమెత్తి వ్రజజనోద్ధరణంబొనర్చి యు
వెడఁగైన కాళియు వెడలి నడఁచి

గీ॥ తరణిజహ్రదంబు నిర్దోషతరముఁ జేసి
ప్రబలు శ్రీకృష్ణుఁ డెప్పుడు ప్రబలఁజేయు
నీ మహైశ్వర్యమంతయు నేమ మమర
కృతినళినహేళి వేంకటక్షితిపమౌళి. 628

## పారిజాత వర్ణనము

ఉ॥ నే నిలఁ బారిజాత మని నిక్కము గాఁగఁ బ్రసిద్ధిఁ గాంచితిం
దానును బారిజాతమఁట దైవతసూనము తప్పిదంచుఁజు
మ్మీనన యాయతాత్యరుణవృంతము పేరిటి దీర్ఘకోపముం
బూనెను శ్రీకుమారపదపూర్వక వేంకటభూమినాయకా! 629



శోణవృంతము పారిజాతకసూన మొప్పగు వేంకట
క్షోణినాయక యత్తమామలఁ గొల్వు సేయ మరుంగునన్
రాణ నొద్దిక మీఱ నిల్చిన నల్వచెల్వ సముల్లస
చ్ఛోణిమాయతచిత్రకాంకనశోభమానముఖంబునాన్. 630

సీ॥ మహిఁ గల కొలఁకుల విహరింప సరసిజా
సన వాహనావతంస మొకనాఁడు
చనుదెంచి గతిగర్వమున మించు నిందలి
రాయంచగమిఁగని రాణమాట
వాసిగ సిరినడవడువున నెందును
లేమి తెల్లము గర్వ మేమి మనకు
నన విని సిరి యెందుఁ గననగు నని భువి
వెదకుచు నీ యింట వెలసియున్న

గీ॥ సిరిని వెరపున మైమాటిచెంత నిలిచి
కాంచు నంచల సహచంచుకముఖములనఁ
దనరు నీ పారిజాతము ల్దైర్యనయవి
వేకనిస్తంద్ర దామరవేంకటేంద్ర! 631

శ్రీపాస్య...వరదాస్యకృతిప్రసిద్ధ్యై
భూపారిజాత కుసుమోపధి రాజ ఏషః
వృంతచ్ఛలారుణమణీమయవేత్రధారీ
ప్రాంతస్థితః సపది వేంకటభూపమౌళే! 632

భాభాంతి పారిజాతప్రసవాః కురువిందదండసంకలితాః
హీరమయా స్తాటంకా ఇవ లక్ష్మ్యా వేంకటావనీరమణ. 633

భూపారిజాతమధునా సిక్తో య శ్రీపతి స్స్వయా
భూపారిజాతమధునా వేంకటేంద్ర ధునోతి తే. 634

పాణౌ వేంకటభూపాల పారిజాతం తవాధునా
దానపత్రాంకనారోద్యన్ముద్రికేవ విరాజతే. 635

సిందూరపేటికాంత
స్సిందూరాకర్షణా త్తరేఖ్యో౽ యం
వృంతయుతపారిజాత
ప్రసవః శ్రీవేంకటేంద్ర పద్మాయాః. 636

వృంతాంచత్పారిజాత ప్రసూనం వేంకటనాయక
సంధ్యాభ్రలేఖాగ్రలసత్కవిభ్రమదవిభ్రమః 637

## శ్రీచూర్ణకర్ణికా వర్ణనము

చ॥ ఘనమగు ధైర్యలక్ష్మి మును గాసిలఁ జేసితివిప్పుడీవు సే
యు నియతహేమదానముల నొక్కటఁ జిక్కితి నంచు మేరు విం
క నను భవత్కటాక్షమునఁ గన్గొని రక్షణ సేయుమంచు వే
డ్కొను నిను బంగరుంగణికడొంకున వేంకటభూమినాయకా! 638

క॥ శ్రీవేంకటధరణీవర
తావక కరపద్మలగ్న తరణికర మయీ
సౌవర్ణ కణిక శ్రీచూ
ర్ణావళి తల్లగ్న రసపరాగమ తెలియన్. 639

శ్లో. శ్రీచూర్ణద్రవముద్రిత
చంచత్కాంచనశలాలికా కనతీ
స్వవదనమరందమేదుర
పరాగలిప్తారవింద నిలయేవ. 640



## కూర్మపురాణ పుస్తకము

సీ॥ నల్లని వేగిసబల్లలు ప్రక్కల
జానగు నీలంపుఁజరులు గాఁగ
నందంద పైపయిఁ జందనబిందువుల్
రహి నిగ్గులీన్మగరాలు గాఁగ
నంతరాంతరముల నలరుపచ్చని తాళ
పత్రము ల్జాళువాపసిఁడి గాఁగఁ
గట్టిన యెరపట్టుదిట్టంపు సూత్రము
శోణరత్న ప్రభాస్ఫూర్తి గాఁగ

గీ॥ రత్న సానువు గూర్మ పురాణపుస్త
క చ్ఛలమ్మున నర్థనికాయములను
బంచి యిడకుండ ని న్వేడ వచ్చె ఁజుమ్ము
వినుతగుణసాంద్ర దామరవేంకటేంద్ర. 641

శ్లో. సభ్యాస్తే భగవత్కథాజలనిధిం మథ్నంతి సంవిత్సుధాం
యుక్త్యా కూర్మ పురాణమందరధరం సంతుష్టచిత్తా బుధాః
శోణాంచద్గుణకర్షణారుణవపు స్స ర్వాధిపప్రావృతం
స త్వం దామరవేంకటక్షితిపతే త్వం ప్రేరకః శ్రీపతిః. 642

## ఉద్ధరిణె

క॥ వెన్నుని పచ్చని పుట్టపు
వన్నియపూఁతఁ దనర్చు పాఁపదొర యనన్
జెన్నగుఁబొన్నుద్ధరణియ
సన్నుతగుణ వేంకటేంద్ర సద్గుణసాంద్రా. 643

ఉ॥ పన్నుగ నీవు భూభరము భారముచే భరియింపుచుండ నా
పన్నగరాజు సంతసిలి పచ్చనిపుట్టపువన్నియల్మెయిన్
జెన్నుగ వెన్ను మోచికొని శీఘ్రగతి న్నినుఁగానవచ్చె నౌ
సన్నుతకీర్తి వేంకటరసాపతి హాటక దర్వికోపధిన్. 644

క॥ వాసవిరథచోదకతా
భాసురకృష్ణాగ్రహస్త భర్మకశయనా
భాసిలుఁ బసిఁడిగలంతిక
వాసవసమ వేంకటేంద్ర వరగుణసాంద్రా! 645

సీ॥ వక్షస్థలీలసద్వనజాలయాహ స్త
వా స్తవ్యహాటకవల్లకి యనఁగ
విశ్వజనీనతావిశ్రుత మహిమయు
ఝుమరజిత్కరస్ఫురన్మురళి యనఁగఁ
బద్మ ప్రబోధనప్రథమాన తేజస్క
భాస్కరప్రత్యగ్రభాను వనఁగ
సన్నుతకాశీస్థితాన్న పూర్ణాశయ
స్థలలసత్తపనీయదర్వి యనఁగఁ

గీ॥ దగి పసిఁడియుద్ధరిణె మించు దామరాన్వ
యాంబునిధిపూర్ణిమాచంద్ర యాదవేంద్ర
తరుణకరుణాకటాక్షవిస్ఫురణపూర్ణ
విభవవిద్యావిని స్తంద్ర వేంకటేంద్ర! 646

(చాటు సమస్యలు)

సీ॥ మేచకరత్నజిల్లోచనరోచులు
తేఁటిదాటులక్రియ దాటిదాటి
ఆ భుగ్న రుచిరలంబాలకరుచులును
తేఁటిదాటులక్రియ దాటిదాటి



లలితవక్షస్థలీలాంఛనప్రభలును
తేఁటిదాటులక్రియ దాటిదాటి
వికసితతాపింఛవిగ్రహద్యుతులును
తేఁటిదాటులక్రియ దాటిదాటి

గీ॥ యోజఁ బర్వసుపర్వసమాజమాన్య
మకుటకోటినీరాజితమహిత పాద
యుగళుఁ డగు చిన్ని వెన్నుఁడొసఁగు శుభములు
దామరకుమారవేంకటధరణిపతికి. 647

సీ॥ నాళీకనిర్యన్మధూళీఝురీనట
త్సారంగలీలచేఁ జౌకళించి
సామంతజనపాళిసంవర్ధితానూన
సారంగలీలచేఁ జౌకళించి
మధ్యభాగస్ఫురన్మణిరశనారత్న
సారంగలీలచేఁ జౌకళించి
సానుమదధినాథసంజాతమదమత్త
సారంగలీలచేఁ జౌకళించి

గీ॥ పొగడికకు నెక్కు కురులుఁ జూపులును గట్టు
పుట్టము న్నడలుం గల్గి పొలుచు కడలి
పట్టి చూపట్టి మిమ్ముఁ జేపట్టి ప్రోచు
వినుతగుణసాంద్ర! దామరవేంకటేంద్ర!! 648

మ॥ భవద భ్యర్చితభార్గవీరమణశుంభ ద్రత్న పీఠాధరో
ర్ధ్వవిలగ్న క్షితిపారిజాతతులసీపత్రాళి సేయం దదా

స్వవిధు ప్రాక్స్వమాగమక్షమమితోఽ హంపూర్వి కాసంసర
ద్భవిభావర్యుపమర్దశంక నలరింప న్వేంకటక్ష్మాపతీ. 649

## (శిష్టువారివి ముగిసినవి)

ఉ॥ ఇందుసమాఖ్య వేంకటమహీరమణా రమణీయమై సదా
నందన మైన సౌధభవనంబున నిన్ ఘనపారిజాత మం
చుం దనరన్ బుధుల్ పొగడుచోఁ బెఱనాలుగు కల్పవృక్షముల్
పొందిక విన్కి వచ్చి కొలువుం గనె నాలుగు కల్పవృక్షముల్. 650

చ॥ అమలమణీమయాధరధరాతికనత్కమలాకరంబునన్
గమలము నీదుమేడ యిటు గానియెడన్ డిగునే తదంతరా
ళమునకు నింద్రనీలజటిలంబగు కంబము పేరి తేఁటిమొ
త్తములొకండై నృపాలమణి దామరవేంకటనాయకాగ్రణీ. 651

## కాకిత వర్ణనము

ఉ॥ త్రాణసమస్తసాధుకవి దామరవేంకటనాయకేంద్ర నీ
పాణితలంబునం దగు కృపాణిక కాగితమట్లు కానిచో
రాణఁదతంతరాళలిపిరాజిమిషంబునఁ దిన్ననై కడున్
నాణెములైన చాయలు ఘనంబుగ నొప్పునె దప్పకెప్పుడున్. 652

శ్రీవేంకటేంద్ర భవతా పునరీక్షణాయ
సత్యవ్రతేన హృదయో నిహితో ద్య దృష్టః
దైత్యానుషంగమలినశ్రుతివర్ణ వోఢృ
మీనోఽ చ్యుత స్సలిపి కాగితకైతవేన. 653



## మంచెళ్ళ వాసుదేవకవి

ఈతఁడాంధ్రశబ్దచింతామణివృత్తిని గంధవహమును రచించెను.

గీ॥ వసుధలోపల మంచెళ్లవారి యిల్లు
శారదాదేవి నాటకశాల యండ్రు
వాసుదేవుని కవితావిలాసమచట
మ్రోల బంగారుగజ్జెలమ్రోఁత గాదె. 654

## ఉత్పల విజయనరసింహాచార్యుఁడు

ఉ॥ వాయువశంబునన్ గృహము వంగెను దాడి పడెం బొలంబులో
మాయది గాని వేఱొకటి మాయది గాదది దేవరంచు నీ
రాయఁడు తాను దెచ్చుకొని రాయిడి వెట్టున దెట్టి కృత్యమో
మాయది దేసిరాజువరమంగపతీశ్వరమంత్రిచంద్రమా! 655

ఉ॥ కంచనపల్లికృష్ణయకుఁ గల్గిన వైష్ణవసిద్ధి స్వాములన్
వంచన చేసి తాను బ్రతివందనవాంఛఁ దలంచుమాత్రమే
పంచనఖప్రబుద్ధనఖపాళికి నక్కలజిత్తు లెంతయా
కాంచనశైలచాప శశిఖండకలాప శివా శివాధవా! 656

చ॥ వరకవియైన నేమి మతి వైష్ణవసత్తముఁడైన నేమి భూ
వరసుతుఁడైననేమి తగవా మరుబామున వృద్ధగుండిలో
..........................................................
.......................................................... 657

క॥ భేతాళ వంశజాతుఁడు
భూతదయోపేతుఁ దర్థిభూసురవర జీ
మూతుండరిచయ జంఝూ!
వాతుం డీ పాపిరాజవర్యుండు హరీ! 658

గీ॥ కాటుదోమల కెల్ల నుచ్చాటనంబు
మహిషములు పాలు పిదుకంగ మంత్రసిద్ధి
సైరభపురంధ్రికిని వీచు చామరంబు
చెలఁగు నిరుదండపచ్చి కసిందమండ! 659

క॥ మునుపగ్రహార గృహములఁ
గినుకం జిచ్చిడిన కోటగిరి సుబ్బన్నే
సనదుల కట్టలు గాల్పగ
పనివడి పెను మచ్చ లచ్చిపతియై పుట్టెన్. 660

## ఊళ్ళ పేళ్ళు పురాణకథఁ గూర్చుట

క॥ తప్పెను మూడిన దనుటకు
నిప్పటికి శిఖండిపార్థు లెదురమ రేప
ల్లెప్పే టేరున గురునకు
మొప్పము పార్షదున కారుమూరగు విలువన్. 661

గీ॥ బంధుకరవది వద్దది పార్థివేంద్ర
జయము సేకూరు పాడుచేజెర్ల యనఁగ
ఎల్లజనములు రవరవం గొల్లు మనఁగ
బాపదశరాజు పల్లెత్తి పలుకఁడయ్యె. * 662

## చంద్రశేఖరకవి

హత్తుగ రామభద్రునికటాక్షము నాయెడఁబట్టి కావ్యజృం
భత్తరధాటి మేటి ననుఁబట్టఁగ దుష్కవిశత్రుఁడోడు భూ
భృత్తులు చంద్రశేఖరకవీంద్ర యనన్ మనినాఁడ వీరరా

* శ్రీ నీలం గోవిందరాజులు సేకరించి పంపినవి. చూ. పేజి మణిమంజరి. సం. 1.1. ఫిబ్రవరి 1981 ప్రభాకరజయంతి సంచిక.



హుత్తుఁడ రెండువీథుల మహోద్ధతిఁ జొచ్చి కవిత్వపాటవో
న్మత్తతురంగి నెక్కి హురుమత్తులు చూపుదు రాయరాణువన్. 663

## కుప్పా ఆంజనేయశాస్త్రి

సీ॥ సచ్ఛాత్రులై బుధుల్ చనుదెంచినారని
నయనముల్ శ్రుతులకు నడపువార్త
శ్రుతులంత నా వార్త నతిమోదసంపూర్తి
భుజశీర్షములకెట్లొ బోధ సేయు
నిజరూపముప్పొంగ భుజయుగ్మ మా పైని
జానులదరిఁజేరి సంప్రతించు
నీ రీతిఁదంతెల నిచ్చి యెవ్వాని దే
హంబు దా సాష్టాంగ మాచరించు

గీ॥ నట్టి సౌందర్యవారిధి నట్టి సుగుణ
గణ్యు నచ్యుతరాజవరేణ్యు వర్ణ్యు
వేఱు వర్ణింపఁగలవారు లేరటన్న
నేను వర్ణింతు నని యాడ నెంతవాఁడ! 664

## వారణాసి సుబ్రహ్మణ్యశాస్త్రి

సీ॥ సోయగంబున సూనసాయకుండగు సాటి
పొరబడి తనువు గోల్పోవఁడేని
నానంద మొదవింప నమృతాంశుఁడగు సాటి
క్షీణింపకుండఁ బ్రవీణుఁడేని
దాక్షిణ్యమునను సీతాకాంతుఁడగు సాటి
యల సాధ్విఁ గానల కనుపఁడేని

నర్థుల కిడునెడు నంబుదంబగు సాటి
గర్జించి మనములఁగలఁచఁడేని

గీ॥ యనుచుఁ బొగడొందు మీర్జాహ్వయాంకితుండు
మహితసౌజన్యసౌలభమాన్యతముఁడు
సతతబుధజనసత్క్రియాచరణయుక్తి
ధన్యుఁడచ్యుతరామరాజన్యవిభుఁడు. 665

## తు (మ?) ర్ల జోగయ్యకవి

శ్లో॥ కవిత్వే వాదిత్వే రిపుజనమదోద్రేకహరణే
ధనిత్వే దాతృత్వే బుధపరమనోరంజనవిధౌ
ప్రభుత్వే భోగిత్వే భగవతి చ సద్భక్తివిషయే
నరేంద్ర స్త్వత్తుల్యో నహి జగతి మీర్జాక్షితిపతే. 666

## మెప్పెర్ల తిరుమలాచార్యుడు

శ్లో॥ జ్యోతిశ్శాస్త్రచమత్కృతిప్రకటనార్థం యామి రాజ్ఞాంసభాం
నోగచ్ఛా మ్యుదరంప్రతి ప్రతికలం కుత్రాపి యం భూపతిం
శ్రీమన్నల్లపరాజవంశతిలకే మత్పోషణార్థం స్థితే
నీలాద్రిక్షితిపే సమస్తవిదుషాం దారిద్ర్యవిధ్వంసినీ. 667

## వద్దిపర్తి మంగయ్యకవి

సీ॥ సౌమ్యాస్యమునకుద్ది చంద్రుఁడె యందుమా
వృద్ధిక్షయంబుల వెలయుచుండె
సౌందర్యమునకుద్ది కందర్పుఁడందుమా
యంగవిహీనుఁడై యలరుచుండె
ఘనవదాన్యతకుద్ది కర్ణుఁడె యందుమా
నీచకులంబున నెగడియుండె



వరధైర్యమునకుద్ది స్వర్ణాద్రి యందుమా
మానవాగోచర మగుచునుండె

గీ॥ నిట్టి గుణములు గలుగువారెట్లు సాటి
యవని నల్లపరాజవంశాబ్ధిజాత
రామరాజబహద్దురురాజమణికి
యుక్తి గాదు వచోతిశయోక్తి గాదు. 668

## వఝల బుచ్చన్నశాస్త్రి

మ॥ భువనాతీతమనోజ్ఞరూపిణి సభాభూషాయమాణక్రియా
స్తవనీయస్ఫుటవాగ్విలాసిని సుధాధారారసాసారమా
నవహృద్వర్షిణి మామకీనరసనానవ్యాసనాసీన నా
కవితా కామిని నాదరింపవలదా గాఢానురాగంబునన్. 669

శా॥ తేజోరాశి దివాకరాన్వయమునన్ దేదీప్యమానుల్ మహా
రాజశ్రీ పదమూలబీజహితమీర్జా ప్రౌఢనామాంకితుల్
రాజత్కీర్తిదురంధరుల్ గలిగి రార్షగ్రంథసంపాదనా
నైజుల్ నల్లపరాజువారనఁదునిన్ రాజన్యరత్నంబులై. 670

చ॥ నవకవితాసుధారసము నల్లపరాజకులామరావతీ
భవబుధ రాజనందనులు పర్వ సభన్ గవిరాజషోడశ
ప్రవణకళానిపానదృఢపాన మొనర్చుటచే జరామృతుల్
గవయని దేహధారులయి ఖ్యాతి వహించిరి విక్రమంబునన్. 671

## వేదుల సూర్యనారాయణశాస్త్రి

శ్లో॥ రాజా నల్లపరాజవంశతిలకో మీర్జాయశోలాంఛన
శ్శ్రీమానచ్యుత రామరాజవిభురా డ్రాజన్యచూడామణిః

ఆశానాం పరిపూరణేవ హృదయం వాచాం నికాయై శ్రుతిం
సౌందర్యేణ వికాసయంశ్చ నయనే జాగర్తిచంద్రో యథా. 672

## నరసింహభారతీస్వాములవారు

గీ॥ పైఁడిగిన్నెను సుధ నుంచి పాలు పితికి
యుంగరపువ్రేలఁగలయంగ రంగరించి
తొడలె పాన్పుగఁ దగునట్లు పడకమర్చి
బుగ్గపై గిల్లి పాడుచు నుగ్గు పెట్టి
పెంచెఁ గాఁబోలు భారతి పిన్ననాఁడు
గాక యుండిన వాక్సుధాగరిమ గలదె!
అమలనల్లపరాజవంశాబ్ధిచంద్ర!
సత్యకీర్తి? సీతారామచంద్రమూర్తి! 673

దీనికి రాజుగారు చెప్పినవి.

క॥ విన నింపు గలుగుఁ దొలుతను
వినినంతనె రసముఁ గ్రోల వేడుక కలుగున్
వినియును గనియును దనియదు
మనమది నీ కవనమహిమ మౌనివరేణ్యా! 674

క॥ అందమగు నీదుసుకవిత
చందము మది నద్భుతంబు సంధించెను నా
వందనమిదె గైకొమ్మా
నందీశ పదాబ్జభృంగ నరసింహయతీ! 675

## వక్కి అప్పలనరసింహకవి

మ॥ అల భోజప్రభుదర్శనంబునను గావ్యంబుల్ రచింపంగ నే
ర్పు లెలర్పన్ లలి గల్గునందురు గవీంద్రుల్ తత్ప్రవాదావళుల్



దలఁపన్ సత్యములో యసత్యములొ దెల్పంజాల నీలాద్రిభూ
పలలాముస్ స్మరియించునంతనె కవిత్వం బొప్పుగా నొప్పెడిన్! 676

మ॥ క్షితి నజ్ఞప్రభు నిత్యకాంచన సమాశ్లేషాభిషేకోత్సవ
స్థితికన్నన్ గడుశ్రేష్ఠమై బరఁగు నీతిప్రాజ్ఞు నీలాద్రిభూ
పతిసూక్ష్మాదరణంబు జ్ఞానరహితవ్యాపారిణీభోగసం
గతికన్నన్ సరసాంగనాజనకటాక్షంబే యువామోదమౌ. 677

సీ॥ శ్రీకరా వినుతగుణాకరా శాత్రవ
భీకరా ప్రాకటాస్తోకవిభవ
సుందరా మణిమయమందిరా సంతతా
నంద రాకేందుపుణ్యయశ శుభద
పావనా శ్రితమానవావనా సజ్జన
భావనాళీకమిత్రా వరగుణ
భాజనా మృష్టాన్న భోజనా విలసత్ప్ర
యోజనా కవిజనభోజసదన

గీ॥ గానవిద్యానిపుణ! వైద్యగణితలక్ష
ణాంధ్రగీర్వాణ యవనవిద్యాప్రవీణ!
రక్షితాఖిలదీన! మీర్జాప్రధాన
బిరుద! వేంకటనీలాద్రిధరణినాథ! 678

సీ॥ రోగపూరితులు నీ రోగులౌదురు గదా
మీ వైద్యశాస్త్ర ప్రభావమునను
జ్ఞానరహితులు సుజ్ఞాను లౌదురు గదా
మీ జ్ఞానమహిమప్రమేయమునను
ధనహీను లత్యంతధనికు లౌదురు గదా
మీ ధనప్రాప్తసంప్రీతివలన

రసహీనులైనను రసికు లౌదురు గదా
రసిక కథాసుధారసమునఁ

గీ॥ గానఁజేరితి మీ సన్నిధానమునను
రోగ మెడఁబాపి జ్ఞానంబు రూఢి నొసఁగి
దీనతను మాన్పి రసికతాధీనుఁజేసి
యెలమి నేలుము నన్ను నో నృపకుమార! 679

## రామకవి

సీ॥ వెలిబట్టు వెలిబెట్టు వలిగట్టు తలకట్టు
బలుచట్టు పలగొట్టు వాలుగుట్టు
కలమించు చెలినించు కలయించు నలయించు
విలుగొంచు బలుఁద్రుంచు విభుని సంచు
మగరాలు తొగరాలు నగజూలు తొగజూలు
వగ రేలు దగ నేలు వాని డాలు
సరిపారు దరిజేఱు దరిదూరు నరిఁజీరు
సరిమీఱు నెఱివీరు సన్నుతీరు

గీ॥ నగనగేశ్వర శారదనారదౌఘ
శారదానారదామృతపూరదరద
దరదరత్కుందవిస్ఫూర్తి త్వత్సుకీర్తి
రమ్యగుణసాంద్ర! నీలాద్రిరాజచంద్ర! 680

సీ॥ శేషశైలోత్తుంగ శేషఫణాకదం
బము మగఱాలకంబంబు గాఁగఁ
బరమసంపత్పూర్ణ పరమహీనాథపూ
స్సమితి బల్ రతనంపుఁబ్రమిద గాఁగ



నమితసంపద్గర్వ విమతపరంపరా
స్ఫూర్తితైలాక్తసద్వర్తి గాఁగ
దావకీలిస్ఫురత్తావకీనప్రతా
పంబు ప్రకృష్టదీపంబు గాఁగ

గీ॥ పద్మజాండోర్ధ్వఖండ మన్పటుశరావ
ముంచి మీ కీర్తికాంత బాఱించినట్టి
కజ్జలము సుమ్ము గగనభాగమ్ము నమ్ము
రమ్యగుణసాంద్ర! నీలాద్రిరాజచంద్ర! 681

సీ॥ నవరసవిస్ఫార నాటకాలంకార
సాహితీపరిపూర్ణశక్తిశాలి
హృద్యానవద్యాంధ్ర విద్యావినిర్నిద్ర
పాండిత్య కౌశలీపరివృతుండు
పారశీకవిశేషభాషాచమత్కార
బంధుర ప్రతిభాధురంధరుండు
ప్రకటశస్త్రగజాశ్వరత్నాదికానేక
శాస్త్రపరీక్షావిచక్షణుండు

పృథుతరాటోపకలిత కీర్తిప్రతాప
కాంతిపూరితసకల దిగంతరుండు
వితతవితరణనిర్వక్రవిక్రమాది
రమ్యగుణపాళి నీలాద్రి రాజమౌళి. 682

## మిక్కిలి మల్లయ్యకవి

ఉ॥ ఎట్టి సువంశమందు జనియించిన నట్టిగుణాళి మీఱి చూ
పట్టినమానవుం డొకరిప్రాపునఁబూజ్యతఁగాంచుఁగానఁదా

నెట్టన వీణదండ మొకయించుక తుంబిఫలంబు లేక గ
న్పట్టునె రమ్యమై గుణగణాకర వేంకటరాయశేఖరా! 683

(శిథిలమగు పండితరాయశతకములోనిది)

## గొట్టెముక్కల నరసింహరాజు

ఈతకోట వాస్తవ్యులు గొట్టెముక్కల నరసింహరాజు భారతీదేవిని గూర్చి చెప్పిన పద్యము.

ఉ॥ తల్లి సతీమతల్లి పదతామరసాశ్రితకల్పవల్లి భా
స్వల్లలితాంగవల్లి రతివల్లభు తల్లి కృపారసంబు పై
జల్లి నిరంతరంబు మము చల్లని చూడ్కుల జూచి నీవు మా
యిల్లు భవద్గృహంబుగ వసింపగదే జగదంబ భారతీ! 684

(తాను పెంచిన గోరు ప్రమాదవశంబున పోగా అందును గూర్చి గొట్టె ముక్కల నరసింహరాజు చెప్పిన పద్యము. వీరు 1820 సం॥ ప్రాంతమువారు.)

సీ॥ కుంభికుంభస్తనీ కుచగుళుచ్ఛములపై
చంద్రవంకలు దీర్చు జాడ మాని
ఘనఘనాఘనవేణికాకచంబులమీఁద
చిక్కులన్నియు బాపు చెలువు వదలి
హారభాసురకుచాహారికుచాకీర్ణ
హారపంక్తులు దిద్దుదారి వదలి
బహువిధరతిభిన్నభామాముఖ స్వేద
బిందువుల్ చిటులించు పొందు లుడిగి

గీ॥ కామినీస్వర్ణ రంభాశిఖాసువర్ణ
మార్దవావాస పృష్ఠ సంభావ్యమాన



నవ్యకండూతి వాపెడు నయము వదలి
పోయెగా గోరు మా చేతిపొందు మాని! 685

## నస్యము

ఉ॥ నస్యము శీతమత్తగజనాశనహేతు విచార ధీర పం
చాస్యము సుప్తి గాఢతర సంతమస ప్రళయార్కబింబ సా
దృశ్యము వేదశాస్త్ర పఠనేప్సిత పండిత వాగ్విచిత్ర సా
రస్యము సర్వలోకజనరంజన దాస్యము రాజవశ్యమున్ 686

## శాలిపాలీవధూటులు

సీ॥ చేలంట నిటకు వచ్చితి వెందుబోయెద
వూరు జేరగవచ్చినార మబల!
నఖముఖంబుల వీక్షణంబొనర్చెద వేల
చనుగట్టులానగ జలజనయన!
తెలియ వాతెఱవింత తిలకించెదవు జాణ
పంటనాడగ భ్రమపడితి తరుణి!
నీ వీ సరణిఁగాంచు నేర్పు విచిత్రంబు
విప్పి చెప్పెద జూడవే లతాంగి!

గీ॥ అనుచు పథికచయంబుతో ననుదినంబు
సరసవాక్యోపవాక్య ప్రసంగములను
దేలుదురు వీటి బాహ్యప్రదేశములకు
శాలిపాలీవధూటు లా ప్రోలునందు. 687

## దర్భా సర్వేశ్వరశాస్త్రి

సీ॥ భూమి నల్లపరాజు బోలు ధీయుతుఁడన
నల్లపరాజు నా నామ మొప్పె

జననికాయంబు మీర్జావారనంగ మీ
　　ర్జావారునా బదరాజ మొప్పె
వృద్ధు లచ్యుతకీర్తి వీవగుదు వన బ
　　దైక దేశాచ్యుతాహ్వయము నొప్పె
రాము గుణమ్ముల సోము రూపున బోల
　　రామరాజను నామరాజ మొప్పె

గీ॥ సౌరభవదాఖ్య ప్రతిపద సార్థకంబు
తనువు జూడంగ జితదర్పదర్పకంబు
హృదయ మనుపమకారుణ్యసదన మహహ
రాజకులదీప! యచ్యుతరామభూప! 688

## కాకర్లపూడి వెంకటపతిరాజు

క॥ పంకేజభవ వధూపద
పంకజ మంజీరనినద భాసురములు నీ
పొంకపుఁ బలుకులు మీర్జా
వెంకట నీలాద్రిరాజ విద్యల భోజా! 689

## నక్కలపాటి బాలసరస్వతి

నక్కలపాటి బాలసరస్వతి యనుకవీశ్వరుఁడు కడపరెడ్లను గూర్చి చెప్పినది–

ఉ॥ రెడ్ల మటంచుఁ గ్రొవ్వునఁ జరించి వరాలు గడించె యూరకే
బుడ్లకొలందిఁ ద్రావి కడపుల్కడుఁ బెంచి వివేకహీనులై
యెడ్లవలెన్ వసించు గుణహీనుల కెక్కడి కీర్తులోరి వి
ద్విడ్లయకాల! గోల్ల చినతిమ్మతనూభవ! తాతభూవరా! 690



## మఱి రెండు పద్యములు

దేవలూరి కేశవరెడ్డియను నాతఁ డొక కవీశ్వరుఁడు త్రోవనరుగు చుండఁగా – ఓహో! కపీశ్వరులా! యని గేలిచేసెనట! కోపము పేడెత్తి యా కవీశ్వరుఁ డీ పద్యముఁ జెప్పెను.

క॥ పీ పట్టినట్టు నోరను
వీ పట్ట దదేమి నీకు? వీ, పీ, లందున్
దీపయి రుచిపుట్టెనొ నీ
కీ పట్టున దేవలూరు కేశవరెడ్డీ! 691

నారయప్పారావువారి సంస్థానమున జమాబందీకిఁ గరణములు వచ్చి చిరకాలము నూజివీట వసింపవలసివచ్చుచుండెడిదట! ఒకప్పు డా పరస్థలవాస క్లేశమును సైపలేని కరణమొకఁడు నారభూపాలునొద్దఁ జెప్పిన పద్యము

క॥ శీతజలస్నానంబును
భూతలశయనంబు నొంటిపూ టశనంబున్
నాతిగల బ్రహ్మచర్యము
నా తరమా! పూటగడప నారయభూపా! 692

# కదంబ కవితాపుష్పస్తబకము

## కవి-కవిత

కII కవిచేత విభుఁడు విభుచేఁ
గవి, సభ కవివిభులచేతఁ గడు విలసిల్లున్
రవిచే రుచి, రుచిచే రవి
రవిరుచివిభవమున నభము రంజిల్లుక్రియన్. 693

## కవి-బ్రహ్మ

కII భువి షడ్రసములు నాలుకఁ
జవిగొనఁగాఁజేసె బ్రహ్మ సత్కృతివలనన్
జెవి నవరసములుఁ జవిగొనఁ
గవి చేసెను బ్రహ్మకంటెఁగవి యధికుఁడగున్. 694

## కవుల వృద్ధి

కII అరు దొక కవి మును, పిపు డిరు
గురు మూగురు నల్వురైదుగురు నార్వురు నే
ద్వురు తొమ్మండ్రు పదుగురై
ధరఁగ్రైసరు లింటనింటఁ దనరిరి కృష్ణా! 695

## కవితాసాధనసామగ్రి

సీII ఆంధ్రప్రబంధరహస్య సంసిద్ధికి
వలయు సాధనము లవశ్యములుగ
బహు సంస్కృతాంధ్రోక్తి భవ్యకావ్యోభయ
వ్యాకరణజ్ఞతా వ్యాపకత్వ



మఖిల పురాణాగమాఖ్యానతత్త్వంబు
నైఘంటుకముల ఛందముల తెలివి
గ్రంథసంప్రతు లవకాశ మారోగ్యంబు
మేధ వివేకసమృద్ధి బుద్ధి

గీII సుగుణ లేఖక పాఠక సుఖనివాస
రాజపాలనమృష్టాన్న భోజనములు
దైవతానుగ్రహము నివి తనరునేని
విబుధుఁడొనరించుఁ గృతిని నిర్విఘ్నముగను. 696

సీII నిరుపమ దివ్యమందిరములు, దధిఘృత
శాకసూపాంచిత సరసభోజ
నములు, విచిత్రాంబరములును, బీరముల్,
పట్టెమంచమ్ములు, ప్రక్కదిండ్లు,
పఱుపు బాలీసులు, పటవాసమృగమదా
గురుచందనాదులు కులుకుకలికి
జవ్వనియును వ్రాయఁ జదువఁగా నేర్చిన
భృత్యవర్గంబు వివిక్తతలము
కలుగకుండినఁజెలువంపుఁగవిత గూర్ప
నలవి గాదు గదయ్య యా నలువకైన
సరసదరహాసపీఠికాపురనివాస
గోధునీకాశనీకాశ! కుక్కుటేశ!

(కూచిమంచి తిమ్మకవి దీ పద్యము) 697

## కవిత రుచి

కII సరసకవిత రుచి యెఱుఁగని
పురుషులఁ బశువులని నిక్కముగ నెఱుఁగుఁడు వా

రురువడిఁదృణంబు మేయమి
పరికింపఁగ ధరణిఁబసుల భాగ్యంబెందున్ 698

## మణిప్రవాళ (కలగలుపుభాష) పద్యములు

నైజామురాష్ట్రమున నొక యాగ్రహారికుఁడు తమ యగ్రహారపు స్థితిగతులను దురుష్కసంస్కృతాంధ్రములతో శ్లోకము చెప్పి ప్రభువునకు నివేదించినాఁడట!

శ్లో. ఫలంలేదు మజ్కూర్ కలంబందు హల్‌సాల్
అలం మోదుగాకుల్ క్వచిత్ టేకుమాకుల్
అవుర్ కోయకొంపల్ మరీ మాలకొంపల్
హమే ముళ్ళకంపల్ హమారేగ్రహారే! 699

శ్లో. తుమారా జవానుల్ హమారేగ్రహారే
కదాపీహదంగా సజా సేయకుండన్
హుకుం దీయతాం నో హకాంచాపి దద్యా
త్ఖుదా తే ముదేస్తా త్సదా జంగలీశ! 700

ఇట్టి దిట్టఁడే వేఱొక్కఁడు.–

శ్లో॥ తిండికైతే పదిమంది వసంతి
తండులాలు గృహమందు నసంతి
కుండబొచ్చెలు పరం విలసంతి
రండ నా కొడుకు లెల్ల హసంతి. 701

ద్రావిడాంధ్రములలో కలగలపు భాషల పద్యాలు బహుకాలమునుండి ఉన్నవి. కలగలుపు భాషకే మణిప్రవాళభాష అని పేరు. పాల్కురికి సోమనాథుఁడు వృషాధిపశతకములో మణిప్రవాళభాషాపద్యములు రచించినాఁడు. ద్రవిడ సంస్కృతముల కలగలపు చాటుపద్య మొకటి,



మణల్‌భ్యో వాంగలాం తైలం
కల్లుభ్యో వాంగలాం త్వచమ్,
పులిభ్యో వాంగలాం క్షీరం
త్వత్తః కించిన్నవాంగలామ్. 702

యాచకుఁడొకఁడు లుబ్ధుఁడయిన ధనికుని గూర్చి చెప్పిన పద్యమిది.

ద్రవిడాంధ్రభాషలలో చమత్కృతికై యిట్టి రచనలు వెలసినవి. కాని మళయాళభాషలో కవితారచన లెల్లను మణిప్రవాళభాషాత్మకములే. మాదిరి కొకటి.

ఆకృతికండా లతిరంభేయం
ఆరావలి వళ్‌దన్ అధరం పేయం,
అకృతిమద్యుతి రనవద్యేయం
అదుత్తి చెన్నిని అనుపశ్యేయమ్. 703

(నలచరిత్ర కథాకళి)

భోజనం ఈగసంకీర్ణం
దోమసంకీర్ణ మందిరమ్,
శయనం నల్లిసంకీర్ణం
దేహి మే కుంటికూనమా! 704

పాండవగీతలలోని యీ క్రిందిశ్లోకము మీది శ్లోకమున తల్లక్రిందులయినది.

భోజనం మిత్రసంకీర్ణం
బంధుసంకీర్ణ మందిరమ్,
శయనం సుతసంకీర్ణం
దేహి మే మధుసూదన! 705

మఱి యొకటి

అమర మమర మంటే ఆశ కాదా కవీనాం
అశన మశన మంటే ఆశ కాదా ద్విజానామ్,
అమృత మమృతమంటే ఆశకాదా సురాణాం
అధర మధరమంటే ఆశకాదా విటానామ్! 706

మఱియొకటి

పత్న్యా సుప్తే చెనకి పలికెన్
నన్ను సా రంతుకామా
నిద్రా కింతే, అది విని ఒసి
కాసి బాలే త్వ మంటిన్
భీతాభీతా కమలరుచినా
పాణినా నోరు మూసెన్
మందంమందం మధురవచనా.
చాలు చాల్నిత్యవోచత్. 707

ఈ వరుస మఱికొన్ని శృంగార పద్యాలు వెకలి రచనవి కలవు.

## ద్రాభశృంగారము

శ్లో॥ తీసుకో రమణి నాలుగుతారం
చేసుకో దినచతుష్టయభోగమ్
మూసుకోకు కుచకుట్మల యుగ్మం
కాసు లిస్తిమి కథం పిదధాసి 708

శ్లో॥ ముయ్యవే తలుపు సమ్యగిదానీం
తియ్యవే కుచతటోపరి వస్త్రమ్
ఇయ్యవే మధురబింబమివోష్ఠం
చెయ్యవే రతిసుఖం మమ బాలే. 709



శ్లో॥ అత్త చూచి నఖదంతనిఖాతం
మొత్తవచ్చె సరసం ముసలేన
ఒత్తరాకు భవదీయనఖేన
సత్తె మేడది సభాభువి మధ్యే. 710

శ్లో॥ ఓసి ఓసి వినవే మమజాతం
కాశి దేశ జలగాహనపూతమ్!
నీకు పుణ్యము గదే మృగనేత్రి
కోక నుత్సృజ మదీయసుఖార్థమ్ 711

## భాషాద్వయాభాస శ్లోకము

అంబలి ద్వేషిణం వందే
చింతకాయ కృతాదరమ్,
కూరగాయ కృతత్రాసం
పాలనేతి ప్రియంగవాన్. 712

## భాషాద్వయాపునరుక్తాభాస శ్లోకము

భాండే జలం వా తక్రం వా
నీరో మోరో వదాంగనె,
(నిర్ +రోమ+ఊరు, బహువ్రీహి సంబుద్ధి)
మార్గమాలోక్య గంతవ్యం
ముల్లుస్స్యాత్ తత్ర కంటకః.
(ముదం లునాతి.)

ఈ క్రింది పద్యము వర్తమానుఁడు కశ్చన రచించినది.

మ॥ వడపై, నావడపై, పకోడిపయి, హ
ల్వాతుంటిపై, బూంది యోం

పొడిపై, నుప్పిడిపై, రవిడ్డిలిపయిం
బోండాపయిన్ సేవియా
సుడిపైఁబాఱు భవత్కృపారసము ని
చ్చోఁగొంత రానిమ్ము నే
నుదుకుంగాఫిని మ్రొక్కు! గ్రుక్కఁగొనవే
యో కుంభదంభోదరా! 714

పై పద్య మీ క్రింది పద్యమునకుఁ దల్లక్రిందుల రచన.

మ॥ అరయన్ శంతనుపుత్త్రుపై విదురుపై
నక్రూరుపైఁగుబ్జపై
నరుపై ద్రౌపదిపై కుచేలునిపయిన్
నందవ్రజశ్రేణిపై
పరగం గల్గు భవత్కృపారసము నా
పైఁ గొంత రానిమ్ము నీ
చరణాబ్జంబులు నమ్మినాను జగదీ
శా! కృష్ణ! భక్తప్రియా! 715

## ద్రాభభాష

ఆంధ్ర ద్రవిడ కర్ణాటక భాషలలో 'ద్రాభభాష' యన్న వ్యవహార మున్నది. పాల్కురికి సోమనాథుఁడు "ద్రాభ ఛందోవిరుద్ధం, బాది యగున, లాభప్రలాపోక్తిలాఘవంబనక" అని దీనిని పండితారాధ్యచరిత్రలో పేర్కొన్నాఁడు- కర్ణాటాంధ్రకవులు మఱికొందఱు కూడ నీ ద్రాభభాషను గర్హించిరి. "ద్రాబ" యనియు గొందఱు కవులు దీనిని బేర్కొనిరి - ద్రాభభాష యెట్టిదో యీ క్రింది సీసమాలిక తెలుపుచున్నది.

సీ॥ బావగా రీ సారె పనస వల్లించిండ
తాత యీ జంఝాలు తాలిచిండ



మామ యీ శ్లోకంబు మఱవకరాశిండ
గోవిందునికి నంగికూరిశిండ
పెండ్లి సాగినదింట పెత్తనాన్కొచ్చిండ
మా ప్రాంతకంచాలు మాఱిచిండ
శోపస్కరాలెల్ల రేపు తెప్పించిండ
మావద్ద హరువైన మానిసిండ
కమ్మలు కడియాలు సొమ్ము శేయించిండ
బేరమాడఁగ నాకు నేరిపిండ
ఒమ్మెచ్చు పైఁడిగా నొఱసి తూపించిండ
అక్షతల్ గంధంబు లమరిచిండ
అప్పన్న యాయాకు దొప్పగా మడిశిండ
కూసుండి యీ బట్ట కూరిశిండ
పెద్దత్త యీసంట పెసలు గాలించిండ
వణ్ణంబు మెత్తగా వారిశిండ
పులగూర వండిండ బూరెలు నెంచిండ
ఆ చిన్నవానికి నప్పచిండ
నడిపత్త సెగదాఁకి బడలిక పడుసుంది
రూపత్త పప్పులు రుబ్బుసుంది
నిలువుడీ మనవాడు నీళ్లులు దెస్సాడు
క్రాఁగులో వేన్నీళ్లు కాపుసాడు
ఈశ్వరభట్లు దానింటికి బోసాడు
భానుభ ట్లింటికిఁబారుసాడు

గీ॥ అనుచు మురుముళ్లపల్ల్యగ్రహారమునను
శోభనము సేయుచుందురు ద్రాభభాష
యెట్లు నిర్మించె నా తలకొట్లమారి
బ్రహ్మ యిటువంటి పరిపాట బ్రాహ్మణులకు. 716

## చిత్రకవిత

కు॥ స్థిర సత్యాసక్తాశయ
నరకచ్ఛేదనధురీణ నరరాజకరా
సరసారకమమలోదయ
హరిహరతనయా యజాహ్వయా పరమాత్మా. 717

(మూఁడర్థములది)

చ॥ కరి నిను పేరఁబిల్చి తమకంబున మానన సన్నుతింపఁగా
సురుచిర ప్రీతిఁగాస్తివి వచోనిధి ధీరతతో జనార్దనా
అరిభయ యోబువాడధవ యా ప్రతిభన్ మొగి నాదిమూర్తివై
(మూఁడో అక్షరం చొప్పున ఏరితే గర్భపాదం నాలుగోది వస్తుంది).
నిరతము నన్ను గాచితివి నీరజనాభ బుధ ప్రమోదివై. 718

## అల్లమరాజు సుబ్రహ్మణ్యకవి కృష్ణభూపతిపైఁ జెప్పిన ద్వ్యర్థి

గీ॥ కృష్ణభూపాక పరమాత్మకృతిసురాగ
పుణ్యజనదాన ఘనశౌరి భూరిధామ
నవరసాభోగ విధుసమానన యశోధి
నహరివిక్రమ గనుమేలు మహిత వరద. 719

## చిత్ర ప్రశ్నోత్తర పద్యములు

కు॥ ఎద్దీశున కశ్వంబగు
గ్రద్దన నేదడవిఁదిరుగు ఖరకంటకియై
హద్దుగ నేవాఁడు ఘనుఁడు
పద్దుగ నుత్తరము లిందె పడయంగా నౌ 720



గీ॥ శూరనికర మేదురమును జూచి మెచ్చు
రహిఁగలువ యల రేఁటేని రాకఁగోరు
బూవు లేమావిగున్నకుఁబొడమకుండు
నరయ నుత్తరములు నిందె యమరియుండు. 721

గీ॥ దాన మేదానియందగుఁ దలఁచిచూడ
జారుఁడేకాంత కాంతాప్తిఁగోరుచుండు
గాంత యేరాంద్రతోఁగదుఁగయ్యమాడు
నరయ నుత్తరములు నిందె యమరియుండు 722

గీ॥ పుడమిఁబగతేనిఁజెండాడి పొలుపుగాంత్రు
కనఁగ నేమియుండును బండికంటికొనను
జనము లేమికొరంగను జాలకుండు
రరయ నుత్తరములు నిందె యమరియుండు. 723

## గ్రామ్యతాభాసము

శా॥ గంగూ మీ పడుచుల్లిగడ్డ పడిదేంగాచిందె, పాపత్త లే
రంగా వారిపెదెంగు మొన్న పెదవీరంసెట్టి నా గొల్లినాఁ
డంగట్లో పసపింగుదెచ్చె, పడిదెం బయ్యన్న కొడ్డింపనా
పెంగేలింతు రటంద్రు కోమటి సతుల్ పెన్మళ్ళ శ్రీమాధవా. 724

కు॥ మునుపా సుయోధనునిదౌ
ఘనతర వికృతిని గ్రీడి కడుఁ గ్రుద్ధుండై
తన తూపూకున నేసిన
మనమొ డ్డానరుని గెల్వ మానవువశమే! 725

## చిత్రకవితా రచనలు

### తగరుతాకు

ఆ॥వె॥ మునుపు పల్కు శబ్దములు గూడి యరిగెడు
నని యనేకవాచకార్థ భేద
శబ్ద సమితి నెదురు సంఘటించుటయును
దగరుతాకు లండ్రు ధన్యకవులు. 726

### లక్ష్యము[1]

సీ॥ హరి కీలి దహనాఢ్య చరుల దండియ మాన
వేంద్రుల నిబుతిదైత్యేశశిఖి
వృషలంబాసి వరుణ విషభు గంతక బర్హి
రగహరణాళికవా.... పద
ధర్మాగ్ని శక్రుల ధనదుండర్థప మరు
ద్ద్వాదశార్కి...హుతాశ జిష్ణు
లభవుండు మున్నుగా నిభ బస్త నర మక
రేణ హయ వృషముల నెక్కి (?)

గీ॥ కులిశ, తోమర, దండాసి గుణప తావి
కా గదా శూలములవైచి కాండి మోది
యడచి కట్టి విసరి కొట్టి పొడిచి రసుర
ఖగయుగ మృగయుగ నరషట్క తరులనొంచి (?) 727

### చతురక్షరికి లక్షణము

సీ॥ ఇమ్మహి బాహీరు హిమమయి బూమరి
మరువా-బీరంబు మారుమంబు

1. 727-737 పద్యములు గల వ్రాంతప్రతిని ప్రభాకరులు సరిచూచినట్లుకానరాదు.



బిరబిర బీరము బిమ్మర దయిరబా
బారారి మమరి రెమ్మో మురిమ్మ మెరము(?)
బూరి బేరము రాము రారమ్ము రొబ్బరి
రోరిమ్ము రాబేరు బేరమోము

గీ॥ బూరి-మోర మోరలు రారి బారి
మీరు మామరి మీరు మారు మీరు (?)
మయము బెబ్బరి యీరుబు మాడ్కి మించు
నాల్గు దిక్కులు సరిలేని నాల్గువ్రాల. 728

క॥ తలకట్టు గుడుసు కొమ్మును
నల దీర్ఘము లేత్వ మొత్వ మైత్వం బౌత్వం
బులు బొట్టు గిలుక యిన్నియు,
గొలందిగం బండ్రెండు పద్యగుణితంబయ్యెన్. 729

పారిజాతాపహరణమున - శరధిక్రోడనివేశ..........

పాదగోపనము. 730

చ॥ ఘనహరిభాను జాప్త మతికంజభవా యతుల ప్రతాప బా
గ్యనిధి కృపాకరా జనకజాయత శుక్ర కచా తురాత్మ పా
(వన వనజాననాయ) భయభవ్య సుధీ సరసాద్య హృద్య శా
హనుమ జయప్రభాధిక నయక్రతు పావన భవ్య సద్యశా 731

### క్రియోత్తర పాదగోపనము

మ॥ పదవే యింటికి శంక లెంచ కిచటన్ పద్మాస్య వేగింతురే
పదరీ రీతున నీ వయస్య లలరన్ ................దంపతుల్
తుదరాగిల్లిన మేజువాణి గద నీతోందెల్పెదన్ నేర్పునన్
మదలీలాలస తానె వాండు వలచెన్ మర్యాద పాలింపవే. 732

ఈ పద్యం ఐదేసి అక్షరములు పంక్తిగ్రవాసి అది....పంక్తిని చదివితే 'వేంకటగిరి వరదరాజు నిన్నేలెనే చెలీ!' అని ఉన్నది.

అర్థ గోపనము. చాటువు :

గీ॥ పద్మనాట్య స్థలంబున పక్షినడుమ
చొక్కమైనట్టి పైరులో చక్కి జగడ
మంచితంబుగ మిమ్ము రక్షించుగాత
మచ్యుతేంద్రుని రఘునాథ! యవనినాథ! 733

శ్రీ రంగస్థల కోవిలనడుమ సజ్జలో విగ్రహంబు మిమ్ము రక్షించుఁగాక యని యర్థము.

అర్థానకు అక్షరచిత్ర ప్రబంధం.

గీ॥ కచమునకుఁ దొల్త కొమ్ముఁదెఁగంతుఁడనుచుఁ
గంధరం బాదివర్ణ విఖండమయ్యె
నొత్తుఁగొనిపోవ గళము సద్వృత్తిఁజూపెఁ
దిరిగి కుందమ్ము లెదిరిన విరిగెఁగొమ్ము. 734

కుచము, ధరంబు, దరంబు, కందము.
గూడ తృతీయ చతుర్థ పంచమికి లక్షణము.

ఉ॥ రూఢి చెలంగఁగాఁగ్రమమురూ పన రెండును మూఁడు నాల్గు-
..........వైఖరులు గాగగనయ్యుని గూడమొక్కడిన్ (?)
ప్రౌఢిగ నన్నిటన్ దెలియదా విశదంబుగఁ జెప్పఁగాఁ దగున్
గూఢ తృతీయమందు మఱి గూఢచతుర్థిని గూఢపంచమిన్. 735

సీ॥ జాబిల్లి పూదాల్పు చామకు నెయ్యంపుఁ
గతయైన తన పేరు గలుగువాఁడు



బాసకైదువ నిరాబారిరాయని తోడి
విలుదోయిపందెమ్ముఁ గెలుచువాఁడు
బడి తల్లి.............బడి యెత్త నొల్లక
చనిసోకుమూకలఁ జదిపినాఁడు
రాయైన తపసిపేరంటాలిఁ గ్రమ్మఱ
మెలగించు నడుగుచే వెలసినాఁడు

గీ॥ రాచబాపని జన్నంబుఁ గాచినాఁడు
లచ్చి పుట్నిల్లుఁ గోలకుఁదెచ్చినాఁడు
చాలుపేరింటితొయ్యలి నేలినాఁడు
పుడమి నినలించెఁ గొందువంగడమునందు. (?) 736

ఒక అర్థము తెనుఁగు ఒక అర్థము సంస్కృతమునకు.

సీ॥ పెనుపాపపేరువేసిన గట్టివా, కుంభి
దైత్యావరోధవైధవ్యదాయి
కడవన్నె బంగారుగట్టు విల్తుఁడు భక్త
రక్షణ క్రీడాపరాయణుండు
చిగురుఁగైదువు జోదుఁ (దెగుదా) య పార్వతీ
వదనచకోర పార్వణవిధుండు
చేత్రిపానంబు చేసిన మొక్కలీఁడు ద
క్షాధ్వరధ్వంస దీక్షాధికారి

గీ॥ కలిమిఁగలవారి కూరిమిచెలియ (యన్న)
(యంబునిధి) వేష్టితోర్వీ మహారథుండు
బుడుతవెన్నెల పూమొగ్గ ముడుచువేల్పు
చిరకృపాదృష్టి మనల రక్షించుఁగాత॥ 737

## కల్పితకల్పవల్లి

సీస పద్యము, ద్విపద, చూర్ణిక, తిరునామము, రామకీర్తన, అష్టపది, భూపాలము, జోలపాట, లాలిపాట, నివాళిపాట, మంగళహారతి, మంగళము, దర్వు, వెరసి 13 విధాల చదువుకోవచ్చును.

సీ॥ కారుణ్యపూర వీక్షణ శుభ్రగాత్ర కై
లాసనద్గేహకళ్యాణమూర్తి
కాకోదరేంద్ర కంకణ నందివాహనా
కాధిపస్తోత్ర నాగాసురారి
సారంగపాణి సజ్జన కల్పభూజ దా
రిద్ర్య విచ్ఛేద ధాత్రీధ్రచాప
నీలాంబువాహసన్నిభకంఠ శోభహా
లాహలాహార యార్యాసనాథ
మౌని హృత్పద్మ షట్పదమారవైరి
మానితోల్లాస నిర్మల మానసాబ్జ
భాను శీతాంశు పాతక భాసురాక్ష
గాన సచ్ఛీల శంకర కలుషదూర! 738

## తిట్టు కవిత్వము

గీ॥ గ్రహము ముల్కి గణము గతి యక్కరము పింజె
పద్యమెఁసగ గోల చోద్యమయిన
జిహ్వ విల్లు నలుక సింజిని లక్ష్యంబు
ధూర్తజనుఁడు సుకవివార్త జోదు. 739



## కవిపిశాచము

క॥ శంకింపక సభలో దు
శ్శంకలు గావించి కేలుసఱచుచు సారెన్
గొంకక కేరెడు హీనుని
నంకింపక కవిపిశాచ మందురు ధరణిన్. 740

## కుకవిపిశాచము

క॥ ప్రకటిత లక్షణలక్ష్యము
లొకయింతయుఁదెలిసి తెలియ కొగి దుశ్శంకల్
ప్రకటించు హీనమనుజునిఁ
గుకవిపిశాచం బటండ్రు కోవిదు లెల్లన్. 741

క॥ నా సా పా వాల్ తెలియక
వ్రాసితినో యేమొ నాదు వ్రాల్చూచి మదిన్
వేసరక దిద్దుకొనుఁడీ
యో సూరిజనంబులార యొద్దికమీఱన్. 742

క॥ తుదుపులు సందిగ్ధంబులు
తడఁబాటులు పంక్తిలోప తటపట వ్రాలె
క్కడ వ్యతిరిక్తంబయినను
నెడనెడఁ దిట్టకుఁడు దిద్దుఁడెలమి రసజ్ఞుల్. 743

## చిత్రప్రశ్నలు

క॥ నగపగతు పగతు పగతుకుఁ
బగతుం డా మగధరాజుఁ బరిమార్చిన యా
జగజెట్టి యన్న తండ్రికిఁ
దగువాహనమైన యట్టి ధన్యుండితఁడే. (దున్న పోతు) 744

కII కరచరణంబులు గలిగియుఁ
కరచరణవిహీనుచేతఁ గడు దుర్బలుఁడై
జలచరుఁడు పట్టుబడియెను
శిరహీనుఁడు నవ్వినట్టి చిత్రము గలదే. 745

సీII రాజుల కెటువంటి రత్నముల్ ప్రియమగుఁ
గాయలేచెట్లవి కరులు మ్రింగు
నీశ్వరుఁడెద్దాని నెచ్చట ధరియించు
జారుఁడేప్రొద్దు నెవ్వారిఁ గోరు
నెన్నెన్ని దినముల కేతెంచుఁ బున్నమ
జనయిత్రిఁజూడఁగఁ.....దనమ్రోయు (?)
బంధువు లెయ్యెడ బలసి యేతెంతురు
యీతకా డెందున భీతిఁజెందు.

గీII నరయ నన్నింటి కైదేసి యక్షరములు
వ్రాసి చదివినఁదుదమొదల్ వరుస నొకటి
జెప్పునాతఁడు భావజ్ఞశేఖరుండు
లక్షణోపేంద్ర ప్రౌఢరాయక్షితీంద్ర. 746

## సమస్యలు

### "తోఁచు నడంగు వెండియును దోఁచు నడంగు మెఱుంగుచాడ్పునన్"

ఉII చూచితి భూతలేంద్ర యొక చోద్యమృగంబని సీత పల్కఁగా
లేచి శరాసనాంబకము లీలగఁజేకొని వ్రేయఁబోవ మా
రీచుఁడరణ్యవాటిని జరించెడు మాయలు రాముకంటికిన్
దోఁచు నడంగు వెండియునుదోఁచు నడంగు మెఱుంగుచాడ్పునన్. 747



ఉII పాచికలాడి సోలి పిదపన్ గురురాజును గెల్చి మిక్కిలిన్
యాచక కోట్ల కిచ్చి బహుయాగముల న్నెఱవేర్చినట్టి యా
కీచకవైరిసోదరుఁడు గెల్చిన రుద్రుజడన్ శశాంకుఁడున్
దోఁచు నడంగు వెండియును దోఁచు నడంగు మెఱుంగుచాడ్పునన్. 748

ఉII కాచిఫలించునోషధులుగల్గుగిరిన్ ధరియించి బాహువుల్
వీచుచు నబ్ధిదాఁటి కపివీరబలంబులఁబ్రోపఁగ్రక్కునన్
ఖేచరమార్గమందుఁ జనుకేసరినందనుఁడభ్రమందిలన్
దోఁచు నడంగు వెండియును దోఁచు నడంగు మెఱుంగుచాడ్పునన్. 749

### "తామసి తా మసి గాకపోవునే"

చII పురములఁ గాల్చిపోల్చె ఫణిభూషణుఁడై నుతి గాంచి మించెఁగం
ధర గరళంబు దాల్చె సెగకంటను మంటలు రాల్చె నట్టి యీ
శ్వరునెదిరింపఁజాల నఁజాలక యింద్రుఁడు పంప బేలయై
తతిమి యెదిర్చి మన్మథుఁడు తామసి తా మసి గాకపోవునే. 750

చII హరునిజయించినాఁడు హరి నర్మిలి సారథిఁ జేసినాఁడు తన్
జెఱవిడిపించినాఁడు తనసేనలతోఁ గోనిపోవు గోవులన్
మఱలిచినాఁడు క్రీడి యని మాటదలంపక రాజరాజు తాఁ
దతిమి యెదిర్చి పాండవులఁ దామసి తా మసిగాకపోవునే. 751

చII హరునిశరాసనంబు తెగటార్చిన చందము పార్థు భంగమున్
దురమున వాలిచావు ఖరదూషణు లాదిగ దైత్యులీల్గుటల్
అరయఁగ దైత్యులున్ గపులు నైనవిధంబు నెఱింగి రాముతో
దతిమి యెదిర్చి రావణుఁడు తామసి తా మసి గాకపోవునే! 752

**"శంఖంబుల్ దివినుండి జాతిపడియెన్ జంబూఫలప్రక్రియన్".**

శా॥ ప్రేంఖత్ప్రేమను సత్యభామకొఱకై కృష్ణుండు నీడేజరా
ట్కంఖాణస్థితిఁబారిజాత మిల వేడ్కందేగఁ దద్వాసనా
రింఖాయుక్తములై మిళిందములు పేర్మిన్ బద్మసంఖ్యల్ మహా
శంఖంబుల్ దివినుండి జాతిపడియెన్ జంబూఫలప్రక్రియన్. 753

శా॥ ప్రేంఖత్పుష్పకచంపకాటవులదారిన్ వ్యోమమార్గంబునన్
రింఖద్వాయువశంబునం దగిలి యా నెత్తావికిం జొక్కి త
త్సంఖాక్తంబులు తేంట్ల మొత్తములు లక్షల్ కోట్లు పద్మంబులున్
శంఖంబుల్ దివినుండి జాతిపడియెన్ జంబూఫలప్రక్రియన్. 754

**"రాధేయుఁడు నందినెక్కి రావణు గెలిచెన్".**

క॥ యోధెవ్వఁడు కురుబలముకు
మాధవసఖుఁడేమి యెక్కి మఱి తిరుగాడున్
సాధించె రాముఁడెవ్వని
రాధేయుఁడు నందినెక్కి రావణు గెలిచెన్. 755

**"గుఱ్ఱమునకు నైదుకాళ్ళు కోడికివలెనే".**

క॥ కట్టిచెలి యెక్కి తిరిగెడి
గుఱ్ఱమునకు నగతనూజకొమరుండెక్కే
గుఱ్ఱమునకుఁ బద్మోద్భవు
గుఱ్ఱమునకు నైదు (?) కాళ్ళు కోడికివలెనే. 756

"అర్భ, దర్భ, నిర్భ," వచ్చునట్లు సమస్య (రామలింగకవియట పూరించినది.)

క॥ అర్భకులు లేక కూచన
దర్భల పాపన్నకిచ్చెఁదన యాలిని నా
నిర్భాగ్యుఁడు తనచే మఱి
గర్భముగాకున్నఁ బోతు గాడ్దెలకొసఁగెన్. 757

(రాయలుకోపింపఁగా రామాయణకథాది పరముగా మరలఁజెప్పెనట.)

క॥ అర్భకులు లేక యాజియు
దర్భలశయనమునఁ బండి తపసి వసిష్ఠున్
నిర్భయత వేఁడి సతులకు
గర్భంబగు నట్టి క్రతువు గావించె నొగిన్. 758

క॥ అర్భకులు గల్గుటకు సం
దర్భముగాకున్న మదిని దపియించు పతిన్
నిర్భరత వేఁడి యముచే
గర్భము ధరియించి కుంతి గాంచెఁగుమారున్. 759

**"తిలకాష్ఠమహిష బంధము"**

క॥ తిలకాష్ఠ మహిషబంధము
ఫలములు భోజ్యములు యజ్ఞపశువుల నేనే
యిలఁ గూర్చుకొంటి రాముని
బిలువఁగ వచ్చితిని బంధభీతులఁ బ్రోవన్. 760

క॥ వలలుండు ప్రొయ్యిమీఁదను
గలకలమని కాఁగుబిందె గంజికి దింపన్
దిలకాష్ఠమహిషబంధము
సులభతఁదెమ్మనుచుఁదోడి సూదునిఁ బంపెన్. 761

ఈ సమస్య యల్లమరాజు సుబ్రహ్మణ్యకవి పూరించినదట.

ఉ॥ వ(జ్రువహార రత్నములు నన్నెనగల్ పులిమీఁద వచ్చునా
పు(త్రయటన్నరీతి జిగిఁబొల్పగు చూచుకలీలఁజూచుచున్
దొ(ట్రిల వేల కేలఁగొని గోరుల నొక్కుము నాథ యంచుఁదాఁ
గు(ట్ర యొనర్చె లేమ తన గుబ్బలయుబ్బు సహింపలేమిచేన్. 762

విద్యా నభినవరాయ బిరుదాంకితుఁడగు మాడభూషి వేంకటాచార్యకవి పీఠికా పురాధీశ్వరు నాస్థానికి శతావధానము చేయ నరుదేరఁగా "ఇఁక" నని యారంభించి కందపద్యముతోఁ (బ్రభుగుణకీర్తనముచేయ నీయన కోరెనట! ఆశువుగా వేంకటాచార్య కవి చెప్పినపద్యము:–

క॥ ఇఁక నెవ్వరి కీర్తులు నీ
(ప్రకటగుణుండైన రామరాయక్ష్మాభృ
త్సుకృతిజనపోషకుని కీ
ర్తికి సరిగా రావు సుమ్ము పృథ్వీస్థలిలోన్. 763

అరసున్న (ప్రాసము రాలేదని యాచార్యులుగారి నాక్షేపించి సు(బహ్మణ్య కవి యీ (క్రింది పద్యమును జెప్పెనట:–

క॥ ఇఁక విను నీయశమునకుఁద
లఁకి శశి కృశుఁడయ్యును మఱలఁబెరుఁగ వేర్వ్వె
ల్లఁకియుఁగొనునో తొలిమల కె
లఁకులను శ్రీరామరాయ లలిత(శ్రేయా! 764

ఉ॥ అంటని (మ్రానిపండు, కరియంటని కాముశరంబు, తేఁటిము
క్కంటనిపువ్వు, హంసముఖమంటని తూఁడు, పయోధినిప్పు, నీ
రంటని రత్న, మన్యభృతమండలి కెందలిరాకు, రాహుతా
నంటని చం(ద్రబింబ, మన నా నృపకన్య వెలింగె నత్తఱిన్. 765



## మఱికొన్ని సమస్యలు

"ముండను వీక్షించి మురిసె మునివరుఁడటవిన్!"

క॥ చండతరనియమ మెసగ న
ఖండతపం బాచరింపఁగాఁ దన కోర్కుల్
నిండఁగఁ (బసన్నయగు చా
ముండను వీక్షించి మురిసె మునివరుఁడటవిన్. 766

"బడబానలపంక్తి మీఁదఁబచ్చిక మొలచెన్"

క॥ జడదాలుపు నీవారము
లుడుగక బానలకుఁ బోసి యునిచి మఱచి యొ
క్కెడఁ దడసిన వర్షముపై
బడబానలపంక్తిమీఁదఁ బచ్చిక మొలచెన్. 767

క॥ దుడుకుతనంబున వానరు
డుడుగక రావణుని వీరకులసతికొప్పున్
గుడిచేతఁబట్టె నహహా!
బడబానలపంక్తిమీఁదఁ బచ్చిక మొలచెన్. 768

క॥ పుడమిని గుమ్మరి మట్టిని
తడయక నిండించి యింటి తలవాకిలి (ప్రా
గెడుపున బెట్టిన వానలు
బడబానలపంక్తిమీఁద పచ్చిక మొలచెన్. 769

"రతిచి(త్రము తెలియరాదు రవికైన నృపా!

క॥ గతిలేని వానినే న
మ్మతిమాలిన మూర్ఖు నెట్టి మానిసినైనన్

అతిసరసు జేయఁగల భా
రతి చిత్రము దెలియరాదు రవికైన నృపా!. 770

క॥ పతిపై నలిగిన స్త్రీతో
నతులితముగ నాట్యమాడి యలసిన స్త్రీతో
నతినూతన రజస్వలతో
రతిచిత్రము దెలియరాదు రవికైన నృపా. 771

క॥ క్షితిలోని గవులకెల్లన్
సతతంబై వెలయు నాంధ్ర సంస్కృతములలో
నళుకన్ మేలయిన ప్లుతవి
రతిచిత్రము దెలియరాదు రవికైన నృపా! 772

క॥ క్షితిలోఁగొందఱు వాచ
స్పతులుగఁ బ్రజ్ఞానులుగ బహువిద్యలచే
నుతినొందఁ జేయు నా భా
రతి చిత్రము దెలియరాదు రవికైన నృపా. 773

**"వటబీజములంతలేసి వనితకుచంబుల్"**

క॥ పటువైన మేను వహవా
విటపుంగవ! వాఁడి గోళ్ళ విచ్చలవిడిగా
జిటుకనఁబొడిచిన నాటవు
వటబీజములంతలేసి వనితకుచంబుల్ 774

**"సంధ్యావందన మాచరింపవలదా చౌసీతిబంధంబులన్"**

శా॥ కంధ్యుద్భూతునిచే మనోభవునిచే గాసిల్లఁగాఁ గంచుక
గ్రంధ్యంతంబుఁదెమల్చి కౌఁగిటను జేర్పన్ నేర్పు లేదాయె నా
సం, ధ్యానాదులయందె నిల్పెద వయో స్వామీ! యిదేమైన మీ
సంధ్యావందనమా! చరింపవలదా చౌసీతిబంధంబులన్. 775



**"వెధవనాగన్నగాఁబోలు వెలఁదిమగఁడు! "**

గీ॥ ఔర! పువ్వారుఁబోణి కీ యందగత్తె
కేటి కిటు సేయవలసెనో మోటుపనులు
పతిప్రయోజకుఁడయినఁ జొప్పుడునె యిట్లు
వెధవనాగన్న గాఁబోలు వెలఁదిమగఁడు. 776

**"మానవతీలలామ కభిమానమె చాలును చీర యేటికిన్"**

ఉ॥ ఆ నరనాథుభార్యసముదంచితవర్తన మెంత వింతయో
మానితలీలమైఁ జెఱఁగుమాసిన చీరగృహంబు వెళ్ళినన్
హీనమటంచుఁధారణకు నింటికిఁ బంపక కీలికిచ్చు, నౌ
మానవతీలలామ కభిమానమె చాలును జీరయేటికిన్. 777

**"జేకొని రామలక్ష్మణులు సీతకుఁదమ్ములు శంభుఁడన్నయున్"**

ఉ॥ ప్రాకటమైనయుంగరము పావని యెవ్వరి కిచ్చె! సూర్యునిన్
రాకలు గోరు నే విరులు రాజతపర్వతవాసుఁడెవ్వఁడో
యేకముగాఁగఁ బాండవులకేమియుఁగావలెఁగర్ణుఁ డిప్పుడున్
జేకొని రామలక్ష్మణులు సీతకుఁదమ్ములు శంభుఁడన్నయున్. 778

**"నాననకోటి నూర్వశికి నైదు కుచంబులు సప్తనేత్రముల్"**

ఉ॥ మానుగ రాముఁడెన్ని దశమస్త శిరంబులు ద్రుంచె శూరుఁడే
మానినికింబ్రియుండు నల మన్మథబాణములెన్ని స్త్రీలకున్
మానితమేది శంకరగజాననశైలసుతాక్షులెన్నుచో
నాననకోటి నూర్వశికి నైదు కుచంబులు సప్తనేత్రముల్. 779

**"కల సారస్యము నీక కాక తెలియంగారాదు బింబాధరా!"**

మ॥ కలకంఠీ! కలగంటిఁ జక్కవలపైఁ గంజారి పొంచుండఁగాఁ
గలువల్ చల్లని లేఁతయెండ నెనయంగా మంచు తాఁదమ్మి ని
ట్లలరన్‌జేయ మెఱుంగుఁదీగ వెనువెంటై చీకువాలొప్ప నీ
కల సారస్యము నీక కాక తెలియంగారాదు బింబాధరా! 780

"వజ్రము పచ్చయ్యెఁబచ్చ వజ్రం బయ్యెన్"

కు॥ వజ్రమురా నీ హృదయం
బీజ్రాప్రాసంబు మాకు నీయందగునా
వజ్రిసభ గరుడుఁదాడిన
వజ్రము పచ్చయ్యెఁబచ్చవజ్రం బయ్యెన్. 781

"ఉసిరికమ్రానిమీఁదఁ బిడుగూనినఁ గాయలు రాలునాకృతిన్"

చ॥ దశరథరాజసూనునకు దానవనాయకుఁడేపుసూపినన్
బిసరుహమిత్రనందనుఁడు భీతి యొకింతయు లేక యుగ్రుఁడై
వెస గద వ్రేసె వ్రేసినను వేగమ రాలెఁగిరీటరత్నముల్
ఉసిరికమ్రానిమీఁదఁ బిడుగూనినఁ గాయలు రాలునాకృతిన్. 782

"మాటల దీరునా యువతిమన్మథ మన్మథబాణవేదనల్"

ఉ॥ బోటి హొయల్ మిటారి చను బోటులపై నురమొత్తి పంటితో
సూటిగ మోవి నొక్కి మధుసూక్తుల నొద్దికఁగౌఁగిలించి బల్
ధాటిగఁగాముకేళి ఘనతన్ బొనరించినఁగాక వట్టి యీ
మాటలదీరునా యువతిమన్మథ మన్మథబాణవేదనల్. 783

"మాటలదీరునా యువతి మన్మథ మన్మథబాణవేదనల్"

ఉ॥ పాటలగంధి మేల్ సొగసు పాపట చెక్కిలి మోవి కంఠమున్
నేటగు ప్రేమతో సుఖము నేర్పుగ ముద్దిడుచున్ విలాసతన్
బూటకు బూట కొక్క రతి భోగము సల్పఁగలేని వట్టి యీ
మాటలఁదీరునా యువతిమన్మథ మన్మథబాణవేదనల్. 784

ఉ॥ కోటివరాల్ ఖరీదియగు కోమలిముద్దుకుచంబులెప్పుడున్
గోటను నొక్కి పైఁగవిసి కొంత విలాసము ప్రొద్దుపుచ్చి నీ



రాట వనాట బంధరతులందుల సల్పఁగలేని వట్టి యీ
మాటలఁదీరునా యువతిమన్మథ మన్మథబాణవేదనల్. 785

ఉ॥ హాటకవర్ణమైన తనువోయని హుమ్మని తొమ్ము నిమ్ముగాఁ
గూటమిఁజేర్చి పెందొడలఁ గూరిమినొత్తి మనోహరంబుగా
వేటుకువేటు కొక్క మదివేడుకఁ జేసిన గాక వట్టి యీ
మాటలఁదీరునా యువతిమన్మథ మన్మథబాణవేదనల్. 786

"తామర వికసించి రక్తధారలు గురిసెన్"

కు॥ ఏమియు నెఱుగని వయసున
గోమలికుచమండలంబు కుదురుకొనంగా
సామజయానకు నెలనెల
తామర వికసించి రక్తధారలు గురిసెన్. 787

"ఆకులు పోకలున్ గలిగె నంతఁయె చాలును సున్నమేటికిన్"

ఉ॥ శ్రీకరమూర్తి హరిగుణశేఖర కొమ్మయమంత్రి తిక్క నీ
రాకలుగోరి ముగ్ధ లనురాగము బొందెడు మన్మథాగ్నిచేఁ
బ్రాకటమైన ముత్తెములు పాలెములాయెను వేగ రావయా
ఆకులు పోకలున్ గలిగె నంతఁయె చాలును సున్నమేటికిన్. 788

## పొడుపుపద్యములు

ఆ॥ ఆడఁబోవుచోట ఆ యిండ్లవారెల్ల
సారెసారె కొట్టి చంపి రనుచు
పుట్టినిల్లు చేరు పొలఁతి తాఁగాదయా
సమ్మెటాంకసోమ! జాణరాయ! 789

ఆ॥ చీర గట్టి రాత్రి సిగ్గుననొదిగుండు
పగలు చీర విడిచి పనులుసేయు

చేయివాఁడికత్తె చేడియ గాదయా
సమ్మెటాంకసోమ! జాణరాయ! – పగడసాలకాయలు. 790

కు॥ చెక్కుల పస గలి గుండును
చక్కని గుబ్బలనెసంగి సొరై యుండున్
చిక్కు నొక గడియలోపల
మక్కువసతి గాదు చూడ మహిమండలిలోన్. – **జోడుతలుపు.** 791

ఆ॥ పక్షిరాజుపేరఁ బరఁగిన మ్రానిపై
వెలుగుపిట్టజనులు వేడ్కతోడ
ఆవు నిచ్చెదమని అందఱు మ్రొక్కుదుర్
దీని భావ మేమి తిరుమలేశ:– **గరుడగంబం.** 792

కు॥ ముక్కున పైనము నడచును
పక్కను నోరుండు గాలి పారణసేయున్
గ్రక్కున వేసిన కూయును
మక్కువతో దీనిఁదెలియు మనుజులుగలరే?. – **బొంగరము.** 793

ఆ॥ మ్రానునందు పుట్టి మక్కు వకాయలై
యిండ్లలోనఁబెరిగి పండ్లునవును
తీపురసము లేదు తినరాదు చెప్పుమా
సమ్మెటాంకసోమ! జాణరాయ! 794

కు॥ వండగ నెండిన దొక్కటి
వండక మఱి పచ్చిదొక్కటి వడిఁగాలినదిన్
దిండికి రుచియై యుండును
మండలమున జనుల కెల్ల మహిలో వేమా :– **తాంబూలము.** 795

ఆ॥ వ్రేలిమీఁదనుండు వెండుంగరముగాదు
వ్రేలిమీఁదనుండి నేలజూచు



అంబరమునఁ దిరుగు నది యేమి చోద్యమో
విశ్వదాభిరామ వినురవేమ!. 796

కు॥ శిలవృక్షలతలఁ బుట్టిన
జెలువలు మువ్వురును గూడి శుభలగ్నమునన్
తలవాకిట రమియింతురు
చెలువలరఁగ దీనిఁదెలియు సుగుణులుగలరే!. – **తాంబూలము.**
797

ఆ॥ మూఁడు శిరములుండు ముదమొప్ప ఁబదికాళ్లు
కరములుండు రెండు కన్ను లారు
కొమ్ములెన్న నాలుగును తోకలును రెండు
దీని భావ మేమి తిరుమలేశ! 798
**–బండియెడ్లు, మనిషి.**

ఆ॥ మేత లేదు చెట్టుమీఁదను వసియించు
తియ్యనీరు ద్రావి తేటఁబెట్టు
ఈక గాని మాంస మెన్నడు లేదయా
దీని భావ మేమి తిరుమలేశ! 799

కు॥ ఆకాకుఁ గదిసియుండును
ప్రాకటముగ బూవు పిందె ఫలముండదు తాఁ
బైకొని చినుకులఁ గాచును
భూకాంతా! దీనిఁ దెలియు పురుషులు గలరే? 800

ఆ॥ మాను కాలవేసి మహిమీఁద నొక జాణ
పూని తిరుగనేసెఁ బొందుగాను
కాలవేయుమాను గడు రమ్య మాయెరా
సంపెటాంక సోమ జాణరాయ! 801

కు॥ ఈనక పిల్లలఁ బెట్టును
ఈనిన నద్దాని జంపి యెల్లరుఁదిందుర్
మానవులు పెంపఁ బెఱుఁగును
భూనాథా! దీనిఁ దెలియు పురుషులు గలరే? 802

ఆ॥ వన్నె చీరగట్టు వారకాంతయు గాదు
నెత్తి కుండ వెట్టు నెలఁత గాదు
తాటి వెంట వచ్చు తలలెత్తి చూడఁగా
సంపెటాంక సోమ జాణరాయ! 803

ఆ॥ ఒక్కమాని పేర నొనర నస్యము పేర
వన్నెచీర పేర వనిత పేర
అంత్యజాతి పేర హరిణంబు పేరను
దీని భావ మేమి తిరుమలేశ! 804

కు॥ భక్షణ పేరిటి పక్షికి
భక్షణయగునట్టి వాని భక్షణసఖునిన్
భక్షించు వాని పుత్రుని
శిక్షించిన వాని మిత్రు సిరి మీ కబ్బున్. 805

కు॥ నక్షత్రముపేరిటి సతి
నక్షత్రము చేతఁబూని నాథుఁడు గదియన్
నక్షత్రానికి రమ్మని
నక్షత్రముబట్టి యీడ్చె నారీమణియున్. 806

ఆ॥ పదియుఁబదియు మఱియుఁ బదునేనుఁ బదునేను
యిరువదేను నూట యిరువదేను
నూఱు నూఱు నూఱు నున్నూఱు నన్నూఱు
తలలవాఁడు మమ్ము ధరణిఁ బ్రోచు. 807



కు॥ ధరపైఁ బిల్లలఁబె ట్టును
శిరసున గర్భంబు దాల్చుఁ జెందిన దినమై
సురపతికైనను యోగ్యము
అరుదుగ నీ వార్త విన్న నంటిర కృష్ణా! 808

గీ॥ కాయమీఁదమ్రాను కదు రమ్యమై యుండు
మ్రానుమీఁద తీగ మలయుచుండు
తీగమీఁద వ్రేళ్ళు తీవ్రము లగుచుండు
దీని భావమేమి తిరుమలేశ! 809

ఆ॥ కడుపులోని ఱాయి కడు నీలవర్ణంబు
కాలగతులచేతఁ గదలుచుండు
తాటిక్రింది తపసు దనకెంత కాలమో
సంపెటాంక సోమ జాణరాయ! 810

ఆ॥ ఒంటికాలువాఁడు ఒనరంగఁ బై నెక్కి
చుట్టి పర్వు........ సూటిగాను
దాని యడుగులోనె ధర్మంబు త్రోవయా
దీనిఁదెలుపవలయుఁ దిరుమలేశ! 811

ఆ॥ మగనిఁ గ్రిందవేసి మగనాలు పైనెక్కి
తీవ్రగతులచేతఁ దిరుగుచుండు
రాలినట్టివస్తు రాజుల కింపౌను
దీని భావ మేమి తిరుమలేశ! 812

ఆ॥ ఱాతిమీఁద నాడు రమణవస్త్రము గట్టు
పురుషుఁడున్న కడకుఁ బోయివచ్చు
పనికివచ్చినపుడె పైచీర తొలగించు
దీని భావ మేమి తిరుమలేంద్ర! 813

ఆ॥ కండ్లు గలిగియుండుఁ గాటుక బెట్టదు
వస... పూసగట్టు వనితగాదు
జీవకోటిఁజంపు జీవమ్ము మతిలేదు
దీని భావ మేమి తిరుమలేంద్ర! 814

గీ॥ తాటి మీఁదనుండు, దాటిపం డొల్లదు
తాటి మీఁదిఁవానిఁ దఱమి కఱచు
తాటిక్రింది తపసు తనకెంతకాలమో
సంపెటాంక సోమ జాణరాయ! 815

ఆ॥ పిఱుదు గలిగియుండు బింబోష్ఠియునుగాదు
నడుము గలిగి యుండు నాతిగాదు
నోరు గలిగియుండు నొడువంగ నేరదు
సంపెటాంక సోమ జాణరాయ! 816

ఆ॥ విత్తు జనము లేక విరివిగాఁ బండును
ఆకులేక పెఱుఁగు లోకమందు
కోయఁగొడ్వలిడక కుప్పలు వేతురు
దీని భావ మేమి తిరుమలేశ! 817

ఆ॥ మొదలు నూరుగాయ ముదిరిన వంకాయ
నరులతోడఁ గూడ నడచుచుండు
ఎల్లరాజులకును నెక్కువై యుండును
దీని భావ మేమి తిరుమలేశ! 818

క॥ వంకాయ నడుమ నుండును
పంకజ మధ్యంబునందు బాగుగనుండున్
లంకకుఁ దుదినే యుండును
ఇంకన్ దెలియంగలేర యిప్పటిజాణల్. 819



ఆ॥ కనుల నెదలగలిగి కాన కట్టే యుండు
నెల్లకార్యములకు నేలికగును
ఇంటికింటి కేఁగు నేఁడాదిప్రాయము
దీని భావ మేమి? తిరుమలేశ! 820

ఆ॥ వారిలోనఁ బుట్టి వారిలోనఁ బెరిఁగి
వారిఁబాసి దొడ్డవారిఁజేటి
కంచు మంచు వచ్చి కలిమిలేములు చెప్పఁ
దెలియ వలయు దీని తిరుమలేంద్ర! 821

ఆ॥ వానకాల మేఱు వడి నేలఁబాఱును
ఎండకాల మేఱు నెండిపోను
ఎండిపోయినేఱు నేనుఁగు చొఱరాదు
దీని భావ మేమి తిరుమలేంద్ర! 822

ఆ॥ కాలులేక పాఱుఁ గడు బెద్దవారితో
జేయిలేక పట్టు జెట్టినైన
పల్లులేక కఱచుఁ బ్రాణంబు నొప్పంచు
సంపెటాంకసోమ జాణరాయ! 823

ఆ॥ పట్టివిడినఁ బాఱు పక్షీంద్రులుంగారు
పఁణఁతిఁబాసి బట్టబయలఁబాఱు
ములికినాటి ప్రజలు ముందుగాఁ జంప వో
సంపెటాంకసోమ జాణరాయ! 824

క॥ బావామఱఁదుల పేరిట
భూ.....డొకఁడుగలఁడు భువనస్థలిలో
భావము తెలియంజెప్పుమి
యే విధముగనైన గడుపు నేఁడాది స్తిన్ 825

కు॥ మగనాలి చెట్టపట్టక
పగలే సిగ్గనక పిసికెఁ బదుగురి నడుమన్
మగవాఁడు పట్టి చనియెను
**నగుమోమున నింతి పోయె నాథునికడకున్.** 826

కు॥ తానెన్నిచుట్లఁ బెట్టిన
నీనెలఁదిద్దంగవలయు నిదిగో పత్రం
బీనెల తిద్దక పోయిన
**నీనెల తిద్దంగ మనిరి యీశ్వర నరసా!** 827

కు॥ కసవులు మూఁడును నాలుగు
నెసగంగాఁగూడి పలికె నిదిగేహంబా
మసలక చెప్పిన వాఁడే
రసికుఁడురా ప్రౌఢదేవరాయ నృపాలా! 828

ఉ॥ మట్టి తుదాకు మీఁద నొక మత్తగజం బటు మేయుచుండఁగా
నిట్టి ఖరోగ్రకోపమున నెక్కటు దాని శిరంబుద్రుంపఁగా
గుఱ్ఱము కొమ్ము విర్గెనని కొక్కెర కంటను నీళ్లుగార్చఁగా
**గొఱ్ఱెలు చూచి నవ్వెనట గొబ్బునఁ జెప్పుడు దీని భావమున్.** 829

సీ॥ కన్నగానిచేతఁ గలిగుండు మందేది
జంతులలోన విశ్వాసి యేది
ఎల్ల రూపమ్ముల నెఱిఁగించునది యేది
(?)తతిగాని పంటకు జంట యేది
పూవులు దియ్యగాఁ బూచు వృక్షం బేది
జగ ముద్ధరించిన జంతు వేది
ఓడబేరముపోవ నొనరంగఁ దావేది
ఎల్ల నాయుధముల నెక్కు డేది



గీ॥ అన్నిటికిఁజూడ రెండేసి యక్షరములు
ఆదు లుడుపంగఁదుదలెల్ల నాదు లగును
చెప్పునాతఁడు భావజ్ఞచక్రవర్తి
లక్షణోపేంద్ర కృష్ణరాయక్షితీంద్ర! 830

సీ॥ ఎలనాఁగ నీ దేశ మే దేశ మన్నను
జెలువంపు చెట్టొండు చేతఁజూపె
ఇందీవరాక్షి నీ యిల్లెక్క డన్నను
తలఁబాయి మోసె నత్తరువుక్రింద
నలినాయతాక్షి నీ నామమే యది యన్న
తరువాతి దినమని తరుణి పలికె
కువలయదళనేత్రి కుల మెట్టిదియొ యన
నేఁటిలో రెన్నెల్లు నెసగఁ బుచ్చె

ఆ॥ ఇంతి నీకుఁబ్రైఁడి కొసరక చెపుమన్న
చుక్కచూపి సుదతి సున్నవెట్టె
రమణ భావంబు లెఱిఁగిన రసికవరులు
తెలుపు డివియెల్ల జనులకుఁ దేటపడఁగ. 831

సీ॥ రాకేందుముఖి నీదు రాజ్యమెట్టిది యన్న
తెలిపె రాగము పేరి దేశమనుచు
పూర్ణేందువదన నీ పురమేది యన్నను
మరుని గుఱ్ఱము పేర నమరుపురము
ఫుల్లాబ్జవదన నీ యిల్లెక్క డన్నను
తమము పండనిచెట్టు తరువుక్రింద
చిలుకలకొలికి నీ కులమేమి యన్నను
చెవిబెట్టుకొనుసొమ్ము నువిద చూపె

గీ॥ నీదు పేరేమి తెలుపవే నెలంత యనిన
మగువ తన పేరు చెప్పిన జగడ మనియె
నెమ్మితనమున నెఱకేళి సలుపు మనిన (?)
నింతిభావంబు తెలుపుడీ యిట్టులనుచు. 832

సీ॥ మనుజుని యాకార మహిమకు నెలవేది?
నగవైరి వైరికి నగరమేది?
రఘుపతి గాచిన రక్షించు పక్షేది?
శిబికర్ణులార్జించు చెలువమేది?
పంచబాణుని వింటఁ బరగిన రుచి యేది?
గిరిశుండు ధరియించు గిన్నె యేది?
నయనాంగరక్షకు నయమైన నెలవేది?
చెలువ మానముగాచు చెట్టునేది?

2గీ॥ అన్నిటికిఁ జూడ రెండేసి యక్షరములు
ఆదు లుడుపంగఁదుదలెల్ల నాదులగును
తెలిసికొనువాఁడు భావజ్ఞతిలకుఁడరయ
సోమకులదీప! సంపెట సోమభూప! 833

సీ॥ పరిణయంబున నేమి పక్షి గట్టవలయు
పాలిండ్లపైన నే పక్షి వ్రాలు
శబ్దభేదం బెర్గు జాణైన పక్షేది?
భామల మెడనున్న పక్షి యేది?
ఏ పక్షివల్లను హెచ్చు ధేనువు వెల ?
పాలు పేరినను నే పక్షి వలయు
వానకుర్సినఁ బల్కవలసిన పక్షేది?
పక్షులఁ గుఱుచైన పక్షి యేది?



..........................................
..........................................
చెప్పినాతఁడు భావజ్ఞ శేఖరుండు
లక్షణోపేంద్ర కృష్ణరాయక్షితీంద్ర!

సీ॥ ఫణిరాజు ఫణివైరి ఫణిభూషణుఁడు గూడి
యొక్క పేరింటనె యుండవలయు
రారాజు రతిరాజు రాజరాజును గూడి
యొక్క పేరింటనే యుండవలయు
నేనుఁగు సింగంబు నెలనాఁగయును గూడి
యొక్క పేరింటనే యుండవలయు
పక్షియు వృక్షంబు పాషాణమును గూడి
యొక్క పేరింటనే యుండవలయు
కవిమనోహరగుణసామ్యగతులు చూచి
..........................................
చెప్పినాతఁడు భావజ్ఞశేఖరుండు
లక్షణోపేంద్ర కృష్ణరాయ క్షితీంద్ర! 835

సీ॥ శ్రీనాథుపేర వర్తిల్లువాఁడొకవంక (?)
నొనరదేవగృహాఖ్యులొక్కవంక
గిరిజాధిపతిపేరఁ బరగువాఁడొకవంక
నొగి నభస్వన్మిత్రుఁడొక్కవంక
అమరనామంబుచే నమరువాఁడొకవంక
నుడురాజుతోడువాఁడొక్కవంక
ఖగములపేరటఁ దగుబలంబొకవంకఁ
బగవార లొకవంకఁ బలసికొలువ

గీ॥ అమరపురిపేరి సింహాసనముననుండి
కలికిమీఁదను దాడిరాఁదలఁచె మరుఁడు
సకియఁ గృపనేలు భావజ్ఞచక్రవర్తి!
ధీరగుణసాంద్ర! యార్వీటి తిరుమలేంద్ర! 836

సీ॥ జోకయై తగు సోమసూర్యుల కెల్లను
దినకట్టడకు నొక దేశమొసఁగి
మేటియౌ జడదారి దాటు జీతములకు
రథములఁ దనరు గుఱాల నొసఁగి
లలి వసంతుని నోములకు రోజుగాసమ్ము
కును జెంత మగయేనుఁగుల నొసంగి
మొనయు జేజేలగీముల గాసములకును
దగు భుజంగశతాంగసమితినొసఁగి

గీ॥ ఆకులకు నెల్లఁ దేనియనదముచేసి (?)
తరుణిమీఁదను దండు రాఁదలఁచె మరుఁడు
సకియఁగృపనేలు భావజ్ఞచక్రవర్తి!
ధీరగుణసాంద్ర! యార్వీటి తిరుమలేంద్ర! 837

సీ॥ రెండవదానిపై మెండుగా గమనించు
మేటిచే నవమంబు గీటణంచి
తండ్రిపేరిటి రాజుతనయ తృతీయమై
జనని వాక్యములఁ గాననము కేఁగి
ప్రమథాధిపతి సూను పట్టిని విడనాడి
పంచమాధిప సూనుఁబరగఁగూడి
దశమి చతుర్థియు ద్వాదశంబును గల
పురుషుని బంధించి పురము చొచ్చి



గీ॥ మందగేహశ్రవణునిఁ దాఁబ్రమందఁ జేసి
వానికంటెను మఱి పెద్దవానిఁ జంపి
షష్ఠమునుగూడి దాసులఁ జాల దయను
బ్రోచువాఁడెల్లపుడు మిమ్ముఁ గాచుగాత. 838

సీ॥ తోయంబు వ్రాసి యాతుద సుధాకరజూటు
నిలుపగాఁ గమలమై నిలిచియుండె
తఱువాతఁ గమలమిత్రము వ్రాసి మునుపటి
వారి మాన్పంగఁ గుబేరుఁడయ్యె
(సరవితో) నెప్పటి సలిలమందున నిల్పి
విహరింపఁజేసిన మిహిరుడయ్యె
సింధురాననుని నా సీమకు రక్షించి
వీక్షింప రుద్రసంఖ్యాక్షరములు

గీ॥ గానఁబడియున్నవానిని గర్వమణఁచి
త్రుంచి మించిన యద్దేవుఁడంచితముగ
సిరియు నాయువు సంకల్పసిద్ధిగాను
పరగఁగృపసేయు నీ సభాపతికి నిపుడు. 839

## సభాపతి

క॥ శ్రీరమ్యుఁడు సంతత శృం
గారుఁడు రాజాన్వయప్రకారుఁడు నుతదా
నారూఢుఁడు సకలకళా
పారంగతుఁడనఁగ నా సభాపతి యొప్పున్. 840

క॥ తరుణుండై నవరత్నా
భరణుండై గంధపుష్ప పరిమళయుతుఁడై

పరనారీసోదరుఁడై
పరగినవాఁడమరు నా సభాపతియనఁగన్. 841

కII తనయుల మంత్రుల మిత్రుల
నునిచి సమీపమునఁ దగు నియోగుల విద్వ
జ్జనులను మన్ననఁ గొందఱ
కునుఁదగునాసనము లిచ్చి కూర్చుండంగన్. 842

కII నరపతియై ధనియై సు
స్థిరమతియై సకలవిబుధ సేవితవిద్యా
పరిణతుఁడై చతురుండై
పరగినవాఁడమరు నా సభాపతి యనఁగన్. 843

కII భావజ్ఞుల రసికుల సం
భావనగలవారి రాయబారులఁ గవులన్
రావించి యథాసనమున
భావనతో నునుపవలె సభాస్థలి నడుమన్. 844

కII వీరాహవమున విజయము
ధీరోదారుండు సుగుణతేజోనిధియై
యారయ సింహాసనమున
నారూఢుం డగుచు నొప్పు నా సభ నడుమన్. 845

వ. ఇట్లు కొలువున్న సభాపతి లక్షణంబెట్టి దనిన బ్రహ్మదేవుని వామ దక్షిణ భుజంబులం బ్రభవించిన సోమసూర్యవంశంబులం దుదితుండై రాజస తామస, సాత్త్వికంబులనియెడు గుణత్రయంబు తెలిసి దానధర్మ పరోపకారంబులు సేయుచు స్వర్గమర్త్య పాతాళంబు లనియెడు లోకత్రయంబు నెఱింగి భూత, భవిష్య ద్వర్తమానంబు, లనియెడు కాలత్రయంబును బ్రహ్మ విష్ణు మహేశ్వరులను మూర్తిత్రయంబు నెఱింగి ప్రభుమంత్రోత్సాహంబులను శక్తిత్రయంబు గలిగి శత్రు



మిత్రో దాసీనుల గుర్తెఱింగి ప్రాహ్ణాపరాహ్ణ మధ్యాహ్నంబులను త్రికాలంబుల వార్చి యాహవనీయ దక్షిణాగ్ని గార్హపత్యంబులను త్రేతాగ్నుల ప్రభావంబులం దెలిసి దారేషణ పుత్రేషణ ధనేషణంబులను నీషణత్రయము వర్జించుకాలంబెఱింగి కృత త్రేతా ద్వాపర కలియుగంబులను చతుర్యుగంబుల ధర్మంబు లెఱింగి ధర్మార్థకామమోక్షంబులను చతుర్విధ పురుషార్థంబులం దత్పరుండై, యాన్వీక్షకీ త్రయీవార్తాదండనీతులను విద్యా చతుష్టయంబుం గని ఋగ్యజుస్సామాథర్వణంబులను చతుర్వేదంబులం సామభేదంబులం బ్రసక్తుండై వేదశాస్త్ర పురాణేతిహాసంబులం దాదరంబు గలిగి సామభేదదాన దండంబులను చతురుపాయపరుండై బ్రహ్మచర్య గార్హస్థ్య వానప్రస్థ భైక్షుకంబు లనియెడు చతురాశ్రమంబు లరసి రక్షించుచు రథగజాశ్వ పదాతులను చతురంగబలంబులఁగలిగి మనోబుద్ధ్యహంకార మమకారంబులను చతుర్విధతత్త్వ పరిజ్ఞానుండై, క్షౌరాభ్యంగ దంతధావన నిర్మల వస్త్రంబులను నలుతెఱంగుల గఱగతికలుగలిగి వస్త్రాభరణ గంధపుష్పంబులను చతుర్విధశృంగారవంతుండై ఉన్మదన మదన వశీకరణ సంతాపనంబులను చతుర్విధ మదనమార్గణంబులు తెలిసి, భద్ర దత్త కూచిమార పాంచాలురంబోలి, విటవిదూషక నాగరక పీఠమర్దకులయు, చిత్తిని హస్తిని శంఖిని పద్మిని యను చతుర్విధజాతి స్త్రీలయు లక్షణంబుల నెఱింగి బాలాయువతీప్రౌఢాలోలలను స్త్రీలవయఃపరిపాకంబు నెఱింగి యనుభవింప నేర్చుచు చతురికాచారికాసంచారికా దూతికాలక్షణంబుల నెఱింగి పృథివ్యప్తేజోవాయ్వా కాశంబులను పంచభూతంబులను శబ్దస్పర్శరూపరసగంధంబు లనెడు పంచభూతతత్త్వంబులను త్వక్చక్షు శ్శ్రోత్రజిహ్వాఘ్రాణంబులను పంచేంద్రియంబులను వాక్పాణిపాయూపస్థలను పంచకర్మేంద్రియంబులను ప్రాణాపానవ్యానోదాన సమానంబులను పంచప్రాణంబులను నెఱింగి ప్రారంభోపాయపురుష సంపద్దేశకాలవినివిభాగపాత్రప్రతీకారసిద్ధినిశ్చయంబు లను పంచాంగతంత్రంబుల నెఱింగి, ఊఁదుట, వ్రేయుట, మీటుట, వాయించుట, కంచుగిచుటలను పంచమహాశబ్దంబుల నెఱింగి స్త్రీ రత్నాశ్వరత్న

విద్వద్రత్రాన్నదానపుత్ర్త రత్నంబులనియెడు పంచరత్నంబులఁ దెలిసి, బ్రహ్మయజ్ఞ, దేవయజ్ఞ, పితృయజ్ఞ ఋషియజ్ఞ భూతయజ్ఞంబులను జేయుచు, గోమూత్ర గోమయ దధి ఘృత క్షీరంబులను పంచగవ్యంబుల నెఱింగి, మిత్రబేధ సుహృల్లాభ సంధి విగ్రహ లబ్దప్రణాశా సంప్రేక్ష్యకారిత్వంబులను పంచతంత్రంబుల నవలోకించి అరవిందా శోక చూత మల్లికా నీలోత్పలంబులను పంచబాణంబులకు లోనుగాక భక్ష్యభోజ్య లేహ్యచోష్య పానీయంబులను పంచవిధాహారంబులను కటుతిక్తలవణ మధురామ్ల కషాయంబులను షడ్రుచుల ననుభవింపుచు, సంధివిగ్రహ యానాసన ద్వైధీభావ సమాశ్రయంబులను రాజ షడ్గుణంబుల నెఱింగి కామక్రోధ లోభమోహ మదమాత్సర్యంబులను నరిషడ్వర్గంబు వివర్జించి, హిమ శిశిర వసంత గ్రీష్మవర్షాశరత్తులనియెడు షడృతువుల ధర్మంబుల నెఱింగి నడచుచు, హరిశ్చంద్ర నల పురుకుత్స పురూరవ సగర కార్త వీర్యులను నార్గురుచక్రవర్తుల చరిత్రంబుల వినుచు శైవవైష్ణవ శాక్తగాణాపత్య చార్వాక బౌద్ధంబులను షడ్దర్శనంబులకు సముండై వేదాంత వైశేషికభాట్ట ప్రాభాకర పూర్వోత్తర మీమాంసలను షట్ఛాస్త్రంబులను పరీక్షించుచు యజన యాజనాధ్యయనాధ్యాపన దాన ప్రతిగ్రహ షట్కర్మ నిరతులైన బ్రాహ్మణుల నరసి రక్షింపుచు,జంబూప్లక్ష కుశక్రౌంచ శాక శాల్మలీ పుష్కరంబు లనియెడు సప్తద్వీపంబులం గీర్తి వెలయ, నాందోళి కాంబరాభరణవాహన రాజ్య సతీ కర్పూర తాంబూలంబులను సుచిత సప్తాంగంబులం గలిగి సామదాన భేద దండ మాయోపేక్షేంద్ర జాలంబులను సప్తోపాయంబుల నెఱింగి స్త్రీ ద్యూతపాన మృగయా వాగ్దోషదండదోష నిరర్థక వ్యయంబులను సప్తవ్యసనంబులు వర్జించి సుతనిధి దేవగేహ వనతటాకసత్కృతులు నల్లిల్లు నను సప్త సంతానంబులం బడసి, కవి విద్వత్పౌరాణికైతిహాసిక భట పరిహాసక గాయకులను సభా సప్తాంగంబులం బరివేష్టితుండై, లవణేక్షు సురా సర్పి ర్ధధి క్షీర శుద్ధోదంబు లనియెడు సప్తసముద్రంబుల నెఱింగి మహేంద్రమలయ సహ్య శుక్తిమ ద్గంధమాదన వింధ్య పారియాత్రంబులను సప్తకులపర్వతంబుల నెఱింగి, బ్రాహ్మీ మాహేశ్వరీ కౌమారీ వైష్ణవీవారాహీంద్రాణీచాముండలను సప్తమాతృకల నర్చించుచు, స్వామ్యమాత్య



సుహృత్కోశ రాష్ట్ర దుర్గ బలంబులను సప్తాంగంబులు గలిగి, కశ్యపాత్రి భరద్వాజ విశ్వామిత్ర గౌతమ జమదగ్ని వసిష్ఠులను సప్త మహర్షుల నెఱింగి, అయోధ్యా మధురా మాయా కాశీ కాంచ్యవంతికా ద్వారావతు లనియెడు సప్తపట్టణంబులంజూచి, యమ నియమ ప్రాణాయామ ప్రత్యాహారధ్యాన ధారణ సమాధి యోగంబు లనియెడు యోగాష్టాంగంబుల నెఱింగి, దానత్వము దారిద్ర్యము, దారహైన్యము స్వయంకృషి యాచ్ఞ ఋణము మార్గము నడచుట యనియెడు నష్టకష్టంబులంబొందక, వరుణుండు, ధ్రువుండు ఆగ్నేయుండు ఉపరిచరుండు ప్రత్యూషుండు ప్రభాసుండునను నష్టవసువుల నెఱింగి యన్న వస్త్ర గంధ పుష్ప తాంబూల వనితాశయన సంగీతంబులను నష్టభోగంబుల ననుభవింపుచు దాసీ బంధు సుత భృత్య వస్తు వాహన ధన ధాన్యంబులను నష్టైశ్వర్యంబులు గలిగి, కులరూపగుణ విద్యా ధన యౌవన బల రాజ్యతపంబులను నష్ట మదంబుల నహంకరింపక, కస్తూరి కర్పూరము చాఁదు జవాది అగరు పన్నీరు తట్టుపునుఁగు గంధమునను నష్టసుగంధ పరిమళ లేపనుండై..శృంగార వీర కరుణాద్భుత హాస్యబీభత్స రౌద్ర శాంతభయానకంబులను నవరసంబుల నావేశంబుగలిగి, ముక్తామాణిక్య వజ్ర వైడూర్యగోమేధిక పుష్యరాగమరకత నీల ప్రవాళంబులను నవరత్న గుణవిశేషంబులం పరిజ్ఞాతుండై పద్మమహాపద్మ శంఖ మకర కచ్ఛప ముకుంద కుంద నీల వరములను నవనిధానంబులం గలిగి మరీచి అత్రి ఆంగిరసుఁడు పులస్త్యుఁడు పులహుఁడు క్రతుఁడు భరతుఁడు దక్షుఁడు వసిష్ఠుఁడు నను నవబ్రహ్మల నెఱింగి, సూర్య సోమ కుజ బుధగురు శుక్ర శని రాహు కేతువులను నవగ్రహంబుల విమర్శంబు గలిగి యింద్రఖండ తరుఖండ తామ్రఖండ చక్రఖండ నాగఖండ సౌమ్యఖండ బ్రహ్మఖండ గభస్తిఖండ భరతఖండంబులను నవఖండబుల నెఱిగి మఱియు మ భజస న యరతంబులను నష్టగణంబులను, స్వరప్లుతో భయ వృద్ధ్యనుస్వార వికల్పప్రాదిభేద బిందుసంయుక్త భిన్న ప్రత్యేక విభాగ కాక్వాదేశ నిత్యఖండ వర్గుచక్క టెక్కటి పోలికసరసంబులను నిరువది నాల్గువళ్లభేదంబుల నెఱింగి, ఋతు నాయక నవరతి జలకేళీ ప్రయాణ రణ మధుపానార్కోదయ

చంద్రోదయమహీపతి పురగిరి మంత్రదూత పరిణయవార్తాశ్వగజ వన వర్ణనలను నష్టాదశ వర్ణనలందెలిసి, సంస్కృత ప్రాకృతశౌరసేనీ మాగధీపైశాచికాచూలికాప్రభంశ తెలుంగులను నష్టభాషలం బ్రవీణుండై ఛందోభంగయతిభంగ విసంధిక పునరుక్తి సంశయాపక్రమవ్యర్థ మహాపర్థంబు విరూపిత శబ్దవిరోధంబులను, దశ దోషవివర్జితుండై, కుసంధి, దుస్సంధి, చుట్టుప్రాస, వైరివర్గంబు దేశవిరోధంబు కుఱుచకాకు, నిడుదకాకు, తెలుంగులకుఁ జొఱరాని సంస్కృతక్రియలు, దుష్ప్రయోగంబులను దశవిధాపశబ్దంబులుఁ జొఱనీయక, నవరసాలంకారంబై ఛందోబద్ధంబై మృదువర్ణవాక్యంబులు గలిగి వాక్యదశదీపితార్థ వైభవంబుల నెఱింగి లక్షణలక్ష్యంబులు కావ్యనాటకాలంకారంబులు చెప్ప నేర్చిన సుకవివరులకు నిధి నిక్షేపజలపాషాణాక్షీణాగామి సిద్ధసాధ్యంబులను నష్టభోగతేజస్స్వామ్యసహితంబుగా గృహారామక్షేత్రంబుల నిచ్చి యరసి రక్షించుచు, చూతునని చింతించుట, వగచుట, యుస్సురనుట, కొనియాడుట, సిగ్గెఱుంగకుండుట, అన్నం బరుచికంబగుట, జ్వరము వచ్చుట నాలుక తొట్రువడి యుండుట, జీవంబు తొలంగఁజూచుట ప్రాణపరిత్యాగంబు సేయుట యను దశావస్థలమర్మంబులు దెలిసి, వణఁకుట తలనొప్పివచ్చుట గఱగఱికలు విడుచుట ఆత్మమఱచుట తలపోయుట చింతొందుట కృశించుట దైన్యంబు నొందుట దుఃఖియగుట ఊర్పులంబొరల ఉన్నచోటెఱుంగకుండుట నిరాహారియగుట క్రాఁగుట మౌనంబుఁదాల్చుట అరజీవి తొలంగుట సంహారియగుట, యను షోడశావస్థలభేదంబు లెఱింగి అంగుష్ఠము, అరకాలు, మండ మోకాలు, ఊరు, జఘనము! నాభి, కుక్షి, కచము, వక్షము, గళము, అధరము, కపోలములు, నేత్రములు, ఫాలము, మస్తకంబు నను షోడశకళాస్థాన మర్మవిభేదంబుల నరసి, తెల్లదమ్మి, కలువమొల్ల, దిరిసె, మావి, జాజి, పొన్న అశోకంబు, విరవాది, మల్లె, పొగడ, గేదంగి, పాదిరి, కలిగొట్టు, సురపొన్న కదళికా పుష్పంబులను పోడశ బాణంబులను, చిగురువిల్లు, తీగెవిల్లు, తీపువిల్లు, పూవిల్లు నను నాలుగు విండ్ల సంధించి యేయు మదనబాణంబులకు లోనుగాక హావభావ హేలా మాధుర్య ధైర్యలీలా విలాస విచ్ఛిత్తి విభ్రమ కిలికించిత



మోట్టాయిత కుట్టమిత బిబ్బోక లలిత కుతూహల చకిత విహృత హాసంబులను పదునెనిమిది శృంగార చేష్టలు గల స్త్రీల చిత్తంబుల నెఱింగి, స్తంభప్రళయ రోమాంచ స్వేద వైవర్ణ్యకం పాశ్రు వైస్వర్యంబులను సాత్త్విక భావంబు లెనిమిది నెఱింగి, నిర్వేదగ్లానిశంకాసూయా మదశ్రమాలస్య దైన్య చింతామోహ స్మృతి ధృతి వ్రీడా చాపల్య హర్షా వేగ జాడ్య గర్వ విషాదౌత్సుక్య నిద్రాపస్మారసుప్తి ప్రబోధామర్షా వహిత్థా చండమతివ్యాధ్యున్మాద చరమ త్రాసవితర్కంబులన ముప్పదిమూఁడు సంచారి భావంబుల నెఱింగి, రతిహాసశోకక్రోధోత్సాహ భయజుగుప్సా విస్మయశమంబులను స్థాయిభావంబులనెఱింగి, జాజి మల్లె మొల్లవిరజాజి సంపెంగ చేమంతి తామర చెంగలువ కలుగొట్టు గేదంగి గురువింద పొగడ బొన్న పాదిరి కరవీరము, అశోకము మంకెన సురపొన్నలాదిగాఁగల పుష్పంబులు, కురువేరు, పచ్చ, సమ్మేళనంబు ధరియించి చౌసీతి బంధంబుల రతితంత్రంబులఁ బ్రమదాజనంబులఁ దృప్తిచేయుచు మఱియు బ్రహ్మక్షత్రియవైశ్యశూద్ర వ్యావహారిక గోరక్షక పాంచాల (పంచాహణ) కుంభకార తంతువాయక్షౌరకరజకవస్త్రచ్ఛేదక చర్మకర్మక పతితకతిలమాతక లుబ్ధక సంకీర్తక చాండాలమాతంగులను నష్టాదశజాతులు సంకరంబులు గాకుండ నరసి రక్షించుచు బ్రహ్మవసిష్ఠాత్రేయమనుపౌలస్త్యరోమశమారీచ నారదశౌనక భృగుచ్యవనగార్గ్య పారాశరంబు లను జ్యౌతిష సంహితల లక్షణంబును, పౌరజ, రోమకవసిష్ఠ సోమసూర్య సిద్ధాంతంబు లను పంచ సిద్ధాంత జ్యౌతిష శాస్త్రరహస్యంబుల నెఱింగిన మహాజ్యౌతిషికుల నరసి రక్షించుచు, నసి ముసల ముద్గర రోహణ కణయ కంపణ శిల్లు భల్లాతక, భిండివాల కరవాల కుంత కోదండ కఠారతోమర పరశు త్రిశూల వజ్రముష్టి గదా తౌది లాంగూలంబులు నతళము పంకిణి, చక్రము సబళయీఁటె యినుపకోల సెల కట్టె పట్టెసము, ప్రకూర్మము, నఖమయూరము, దండనాసంబు లను బత్తీసాయుధంబులనుం బ్రవీణుండై, లారి ప్లువ లక్షణ శుద్ధ చిత్ర దృఢత్వ దూరా పాతంబులు మెఱయ నేర్చి మఱియు మంజరీ పళమంజరీ భూపాల శ్రీరాగ బంగాళ హిందోళ భైరవీ గౌళలను పురుషరాగంబు లెనిమిదియును, గుజ్జరి నారాయణి

గుండక్రియ లలిత దేసితోఁడి మలహరి బవుళి వేళావతి ఆందోళి ఆహిరి భల్లాతకి కన్నడగౌళి ధన్యాసి ఛాయాగౌళ రామక్రియ వరాళి మంగళ కౌశిక వరప్రియ ఖురండి దేవగాంధారి సాళంగ నాట దేశాక్షి పూర్వగౌళయు నను నిరువదినాల్గు స్త్రీరాగంబుల నెఱింగి, మాళవి గౌళరీతి గౌళనారాయణ గౌళభేతాళ గౌళస్త్రీ వరాళి వసంతవరాళి శోకవరాళి నాగవరాళి పంతువరాళి తోటవరాళి బవుళి రామక్రియ మేళరామక్రియ నాదనామక్రియ సామంత మల హారి చెంచుమలహరి కాంభోది గుమ్మకాంభోది మధ్యమావతిగుజ్జరి సామంత వసంత శుద్ధవసంత మేఘరంజని దేశాలనాట హంవీరనాట ముఖారి శంకరాభరణ హేజిజి పాతికురంజి నీలాంబరియనియెడు ముప్పదిరెండు నపుంసక రాగంబుల నెఱింగి, మాళవి శ్రీదేవగుప్తి సావేరి కొండమలహరి కోనమలహరి శ్వేతకాంభోది దీపకంబు పంతులాదిగాఁగల మిశ్రంబులను, వేళలు, మైత్రియు, శ్రుతి జాతివర్ణంబులును శుద్ధసాళగసంకీర్ణంబులను స్థానప్రపంచ విస్తారంబులును, తతా వనద్ధ ఘన సుషిరంబులను గీతవాద్యంబులను మంద్ర మధ్యమతారంబులను స్వర భేదంబులను సకల మోహన సంగీత విద్యా విశేషంబుల నెఱింగి చర్చరి, చారణి బహురూపలక్షణ చాగుడంబు శుద్ధపద్ధతి ప్రేంఖణపద్ధతి కుండలి నృత్యంబు దండలాసకంబు బాడికంబు రోసకాఖ్యంబు పాపరాశికంబు కందుక కోలాట కంబు లను షోడశ విధ నృత్య ప్రకారంబుల నెఱింగి చప్పన్న దేశభాషాప్రవీణుండై యక్షరలక్షణ వేద శాస్త్ర పురాణేతిహాస శిక్షావ్యాకరణ నిరుక్తచ్ఛందో జ్యౌతి షాలంకార వశ్యా కర్షణ స్తంభనోచ్చాటనమారణ విద్వేషణా దృశ్య సంచు పరకాయప్రవేశ గణిత లిఖిత గాంధర్వ వీణా వేణు మృదంగతాళ నృత్య కవిత్వశూరత్వో దారత్వ సంగ్రామలక్షణ మల్లయుద్ధ భేతాళమత చిత్రకర్మ ముష్టిమోహనేంద్రజాల మహేంద్రజాల రథగజాశ్వజనరత్న భూపరీక్షా యోగశాస్త్ర మంత్రశాస్త్ర శకునశాస్త్ర శిల్పిశాస్త్ర వైద్యశాస్త్ర మదనశాస్త్రాగ్ని స్తంభన జల స్తంభన ఖడ్గస్తంభన దృష్టిస్తంభన జిహ్వాస్తంభన శుక్లస్తంభన రసవాద పీలువాద కాష్ఠావాద ధాతువాద గారుడంబు లనియెడు చౌష్షష్టివిద్య లందుఁ బ్రవీణుండై, మఱియు మహాప్రధాన మాండలిక సామంత సేనాధిపతి ద్వారపాలకావసర ఘటీకార



పణిహార రాయబార గణక విజిర పురోహిత పౌరాణిక జ్యౌతిషిక కావ్యక విద్వద్దేవార్చక మాల్యకార పరిమళకరండాధికార గోష్ఠాధికార గజాధికారాశ్వాధికార వస్త్రాధికార ధాన్యాధికారోగ్రాణి కాంగరక్షక సూద సువ్వారిక చాణూర వేతాళ తాంబూలికాల వట్టిక నరవాహన ఛత్రక చామరక కాళాంజిక కఠారిక పాపుడక నాట్యక హింకారిక కట్టిక భట్ట పాఠక పరిహాసక క్షౌరక రజక వస్త్రచ్ఛేదక చర్మకర్మ కాడియాళక పురపాలక వనపాలక నరవైద్య గజవైద్యాశ్వ వైద్య పశువైద్య కాహళక, భేరిక, మృతాపక కారుక, సువర్ణకారక కుంభకారక చిత్రక వ్యావహారిక కొట్టిక మృగయాత్రక పక్షియాత్రకులనియెడు (కొన్ని తప్పులు?) బాహత్తరినియోగంబులం గలిగి వ్రీహి యవ మాష తిల ముద్గ కుళుత్థ గోధూమ ప్రియంగు మసూరశ్యామాక నీవార వైణవము లను ద్వాదశధాన్యసంగ్రహణుండై, తులా పురుష హిరణ్యగర్భ బ్రహ్మాండ కల్పవృక్ష సహస్రధేను హిరణ్య కామధేను సువర్ణరథ హేమ హస్తి కనకలాంగూల పంచమహాగ్రహ విశ్వచక్ర రక్తధేను భూతఘంటదానంబులను (?) షోడశమహాదానధురంధరుండై ధ్యానావాహనాసనార్ఘ్య పాద్యాచమనీయ స్నానవస్త్ర యజ్ఞోపవీత గంధాక్షత పుష్పధూపదీప నైవేద్యతాంబూలంబులను షోడశోపచార పూజావిధానుండై యార్యధర్మంబు దప్పక వర్తించు వాఁడు సభాపతి యనంబరగు.

## రామాయణ చాటువులు

సీ॥ శ్రీమత్సకల గుణశ్రేయోఽ ర్థసంపన్ను
లయిన శ్రీరాజ్యాభ్యుదయసమృద్ధి
మన్మహామేరు సమానధీరులయిన
దశరథేశ్వరులకుఁదాల్మితోడ
జనకమహారాజు సాష్టాంగములు చేసి
వేడ్కఁజేయంగల విన్నపములు–
ఇక్కడ శుభము మీయొక్క సంతోషంబు
వ్రాయించి పంపించవలయు సుండి

తరువాత: శ్రీరామధాత్రీశునకుఁజైత్ర
శుద్ధపంచమినాఁడు సొంపుమీఱ
మాపటిలగ్నాన మా పట్టి సౌభాగ్య
వతి సీత నిచ్చి వివాహమహము
ఇక్కడ మిథిలలోనే చేయఁబెద్దలు
నిశ్చయించిరిగాన నిందువేడ్క

గీ॥ సహకుటుంబము పరివారసహితముగను
విభవమున వచ్చి మీర లీ శుభముహూర్త
మెలమిఁ జేయించి ప్రమదంబుకొలువవలయు
వెలయఁగా నివె పదివేల విన్నపములు. 847

సీ॥ ఎవరయా మీరు చక్కని (?) రాజు లిద్దఱు
నర్కవంశ్యుల మయోధ్యాపురంబు
మీ పేరు లెవరయా? ఓ పుణ్యనిధులార!
రాఘవుం డతఁడు నే లక్ష్మణుండ
దండంబు దండంబు దశరథసుతులార!
వర్ధిల్లు వర్ధిల్లు వానరేంద్ర
ఎందు వేంచేస్తిరో యినకులోత్తములార!
యిచ్చోటఁగార్యంబు నెఱుఁగవస్తి

గీ॥ వాయుపుత్త్రుండ హనుమను వచ్చినాను
భానుపుత్త్రుండు సుగ్రీవు బంట నేను
చెలిమి మీకును మీకును జేయఁగాను
అతఁడు మీరున్నచోటికి నంపగాను. 848



## భారతకథ

సీ॥ గర్వితద్విట్క్రౌంచ గాంగేయుగాంగేయు
ఘనవైరిభేకదృక్కర్ణుఁగర్ణు
నిష్ఠురశాత్రవానీకనిష్కృపుఁగృపుఁ
త్రుటితారి తనుకృతద్రోణు ద్రోణు
భయరహితారాతి భయదత్తు భగదత్తుఁ
జండపరామిష శకుని శకుని
లక్షజితేంద్రజిల్లక్షణు లక్షణు
సకుటిలరిపుమనశ్శల్యు శల్యు

ఆ॥ అహితధూమకేతు నహికేతు నాత్మీయ
విశిఖవృష్టిచేత బెగడుపఱిచి
పసులఁగ్రమ్మఱించెఁ బ్రతిభసహస్రబా
హార్జునుండు నైన యర్జునుండు. 849

సీ॥ ఖండితవైరి శిఖండి ఖండించెను
రిపుజీవజీవనగ్రీష్ము భీష్ము
పాంచాలతనయుండు మించిమర్దించెను
శత్రుపురాసురస్థాణు ద్రోణు
చండమదోద్వృత్తిఁ జెండాడె గాండీవి
పరరాజసర్పసుపర్ణుఁ గర్ణు
విమతాగహరి హేతి యమసూతి శిక్షించె
సమదరాజన్య దృక్శల్యు శల్యు

గీ॥ పొడిచి గెల్చిరి మాద్రేయు లడరికదిసి
సమదగర్విత శత్రునాశకుని శకుని

భీమబలుండై న భీముఁడు పీఁచమడఁచె
రాజ్యబలగర్వితుల ధృతరాష్ట్రసుతుల. 850

శా॥ ఎట్రాశేషుఁడు పోసరించె సభ నిన్నెగ్గాడఁగా రత్న మీ
దట్రా వాసుకితక్షకాహిధృతరాష్ట్రా మాత్యకర్కోటకుల్
చుట్రా నిల్తురు గాక నిన్ను సమరక్షోణిన్ విజృంభించి యా
గట్రాచూలివిభుం డెదిర్చిన నహంకారంబు వారించెదన్. 851

## భారతకథను గూర్చి మఱికొన్ని చాటువులు

ఉ॥ ధీరతతోడ నీ రథము దీవ్రగతిన్ గురురాజు సేనపై
శూరతఁబోవనిమ్ము ననుఁజూడుము యుత్తర వీరయోధులన్
బేరడఁగించి యాపసులఁ బెంపెసలార మరల్పకున్న నా
పేరు కిరీటియే నినదభీషణశంఖము దేవదత్తమే! 852

ఉ॥ సారథిగమ్మి యుత్తరుఁడ! చాలు జయించెద నింద్రునైన నా
బారికి నడ్డమైన ముసు బ్రహ్మలిఖించినవ్రాలు తప్పునే
ధీరత శంఖనాదమున దిగ్విజయంబును జేయకున్న నా
పేరు కిరీటియే నినదభీషణశంఖము దేవదత్తమే! 853

ఉ॥ నీరజనాభ! నీవు చని నెయ్యముతో మనపాలు వేఁడఁగాఁ
గౌరవు లీకతక్కినను గాఢనిరంతరచండమండితో
దారదురంతదంతురశితాస్త్రపరంపర లేయకున్న నా
పేరు కిరీటియే నినదభీషణశంఖము దేవదత్తమే! 854

ఉ॥ వారిజనాభ! యెల్లి చని వాసవుఁ డడ్డము వచ్చి కాచినన్
వారిజబాంధవుం డపరవారిధిఁ గ్రుంకకమున్న సైంధవో
దార శిరంబు ద్రుంచి వసుధాస్థలికిం బలిసేయకున్న నా
పేరు కిరీటియే నినదభీషణశంఖము దేవదత్తమే! 855



ఉ॥ పాతెడుభీముఁ బట్టుకొని పట్టి శరంబున నూని నిల్చి ని
ష్ఠూరము (?) లాడినట్టి రవిసూనుని ధర్మజ! నీవు చూడఁగా
ఘోరరణంబులో నెదిరి గుండెలు వ్రక్కలు సేయకున్న నా
పేరు కిరీటియే నినదభీషణశంఖము దేవదత్తమే! 856

ఉ॥ పా లడుగంగఁ గౌరవులపాలికిఁబోవ నతండు లోభియై
పా లది యేడదో యనినఁబాలుతెఱం గెఱుఁగంగ భీమభూ
పాలుని పాలు తాను తనపాలిటి రాజ్యము నన్నపాలు నా
పాలు సమస్తసైన్యమని పల్కుము పంకజనాభ! యచ్చుటన్. 857

సీ॥ చరణారవిందము ల్సమ్మతి మది నెంచి
ముమ్మాఱు రాజుకు మ్రొక్కిరనుము
వచ్చిన వైరంబు వారింప నూహించి
మా భూము లిమ్మను మనుజవిభుని
ఆ రీతి నృపతికి హర్షమ్ము గాకున్న
నేవురి కై దూళ్ళ నీయు మనుము
పుడమీశుఁడామాట కొడఁబడకుండెనా
నడవడి యెఱిఁగించి నడుపుమనుము

గీ॥ పనులు సేయంగ నేదేనిఁ బంపు మనుము
పంపు పనిసేయ సేవకభటుల ననుము
ధర్మమార్గంబు వినబుద్ధి దనర దేని
కదలిరమ్మను కలనికిఁ గమలనాభ! 858

మ॥ పదరుల్ పల్కక ధర్మశాస్త్రగతి భూభాగమ్ము మా రాజ్యసం
పద మా కిమ్మను మీయకుండిన మహాబాహాబలస్ఫూర్తి మై
యెదు రై రమ్మను వచ్చి మద్బలము దా నేపారఁగాఁ జూచుచో
గదఘాతంబుల నూరువుల్ దెగిపడున్ గంజాక్ష! యింతేటికిన్? 859

మ॥ కలహం బేటికి వద్దువద్దను మిటుల్ గర్వాంధుఁడై మమ్ముఁదా
జులకం జూచుట నీతి గాదనుమ యీ క్షోణీతలంబందునన్
నిలువన్నేరఁడధర్మవృత్తి ననుమా నీ విన్నియుం బల్కినన్
బలవద్వైరమె కోర దుర్మరణముల్ ప్రాపించునంచాడుమా!. 860

ఉ॥ పాండవులన్న దైవమును బౌరుషముం గలవారు వారికిం
గొండొక కీడుచేసి నిలఁగూడదు కూడనిలోభ మూని వీ
రిండితనంబునన్ ధర హరింపనె చూచెదవేని వారు నిన్
బిండలివం దొనర్తు రని పేర్చి యథార్థ మెరుంగఁ జెప్పుమా! 861

ఉ॥ మచ్చరమేల కర్ణ! విను మానవు లర్జునితోడివారలా?
రచ్చల మెచ్చు లాడెదవు రాజును దమ్ములు నిచ్చ మెచ్చఁగా
వచ్చినవాఁడు ఫల్గునుఁడు వాని నెదుర్కొను యోధఁ జూడుమా
చెచ్చెర నూర జోగులకు శేషునికంతము లంటవచ్చునే! 862

క॥ వరమునఁ గుంతికి సుతుఁడై
వెరవెఱుఁగక యేటివరద విడిచినపిదపన్
ధరయెల్ల నేలెఁగర్ణుఁడు
దరిఁజేర్పను గూడువెట్ట దైవముగాదే! 863

గోలకొండ, మాలముండ, పూలదండ, కొత్తకుండ, అను పదములతో భారత కథకు సంబంధించునట్లు చెప్పఁబడిన పద్యము.

గీ॥ ఓయి కురురాజ! నీకొడు కుత్తగోల
కొండవలెనుండు క్షణ మాల ముండ దిఁకను
భండనంబున గెల్తురు పాండుసుతులు
ఉదరమునఁ బూలదండ రేకొత్తకుండ. 864



## పాండవుల వర్తనము

సీ॥ ఇభపట్టణంబున కేగునాఁటికి ధర్మ
రాజు పదాఱువర్షములవాఁడు
వాయుజుండు పదేను వత్సరంబులవాఁడు
పదునాలుగేండ్లు వివ్వచ్చునకును
పరికింపఁ గవలకుఁ బదుమూఁడు వర్షముల్
జననీసమేతులై సౌఖ్యముండి
విద్యలునేర్చిరి వెసఁ బదమూఁడేండ్లు
లక్కయింటాఱు నెలలు వసించి
రిరవుగా నార్నెల లేకచక్రమునందు
నేఁడాది ద్రుపదుని యింటనున్కి
ఐదువత్సరములు యౌవరాజ్యంబున
నిరువదిమూఁడేండ్లు నింద్రపురిని
వనము నజ్ఞాతంబు చనెఁబదుమూఁడేండ్ల
నటమీఁద ముప్పదియాఱునేండ్లు
రాజ్యాభిషేకంబు రాజు లెల్లను గొల్వ
ధర్మంబుతో మించి ధాత్రిప్రోవు
శ్రీ కృష్ణకృపకల్మి సిద్ధసంకల్పత
నష్టోత్తరశతహాయనము లుర్విఁ

గీ॥ జెలఁగి పట్టణంబు తుదఁ బరీక్షితున కొసఁగి
సోదరులు సతి జతగూడి సొరిది దివికి
నరిగి వేడుక స్వర్గసౌఖ్యంబు గనిరి
పాండవులు వారి యశముర్వి నిండి వెలసె. 865

## ఈశ్వరాజ్ఞ

గీ॥ కర్మ మెవరికైనఁగడఁద్రోవఁగారాదు
ధర్మరాజుఁ దెచ్చి తగనిచోటఁ
గంకుభట్టుఁజేసెఁగటకటా! దైవంబు
ఏమి చేయవచ్చు నీశ్వరాజ్ఞ 866

గీ॥ కష్టవేళలందుఁ గమలాసనునకైన
ననుభవింపవలయు ననిలసుతుని
వంటపూటివానివలెఁ జేసె దైవంబు
ఏమి చేయవచ్చు నీశ్వరాజ్ఞ!. 867

గీ॥ పాటు తప్పదు సుమి బ్రహ్మాదులకునైన
నీడుగానిచోట నింద్రతనయుఁ
బేడివానిఁ జేసి పెట్టఁడా దైవంబు
ఏమి చేయవచ్చు నీశ్వరాజ్ఞ!. 868

గీ॥ అనువు గానివేళ నధికుల మనరాదు
కాల మెఱిఁగి రీతిఁ గడపవలయు
విశ్వమేలు నకులుఁ డశ్వశిక్షకుఁడాయె
నేమి సేయవచ్చు నీశ్వరాజ్ఞ! 869

గీ॥ పూర్వజన్మకృతము పోవ దెవరికైన
మాన్పరాదు దైవమాయచేత
ద్రౌపది యొకయేఁడు తగనిబాములఁ బడె
నేమిసేయవచ్చు నీశ్వరాజ్ఞ! 870



## తెలుఁగుభారతము

సీ॥ ఆదిపర్వము వసు, వరయంగ సభ నేత్ర
మారణ్య మద్రి, విరాట శరము
నుద్యోగ వారిధి, యొనరంగ భీష్మాగ్ని
శరద్రోణ, కర్ణాగ్ని, శల్య నేత్ర
సౌప్తిక మిథునంబు, సతిబాహు, ఋతుశాంతి
యానుశాసనిక మే, నశ్వమేధ
ముని నాల్గు, యాశ్రమంబును యుగళంబునొఁ
పరఁగ మౌసల మొందు, ప్రస్థ మొకటి

గీ॥ స్వర్గగమనంబు చంద్రుతో సాటివచ్చు
వెలయ నీ రీతి సర్వంబు వెరసిసేయ
వరుస నర్వదిమూఁట నాశ్వాసములను
దెలుఁగుభారత మలరు విస్తీర్ణ మగుచు. 871

## భాగవతచాటువులు

సీ॥ భావింప దేవకీదేవి మా యత్తమ్మ
మా మామ వసుదేవ మాన్యుఁడమ్మ!
బలభద్రమూర్తి మా బావ గావలెనమ్మ
కొమ్మరేవతి తోడికోడలమ్మ
సకియ రుక్మిణి మాకు సవతియేర్పడెనమ్మ
తగఁ బంచశరుఁడె మా తనయుఁడమ్మ
మగువరో సాత్యకి మఱఁది గావలెనమ్మ
యల సుభద్రయు మాకు నాఁడుబిడ్డ

గీ॥ ఇంద ఉన్నారు నున్నందుకేమి ఫలము?
కలిమి బలంగము సకలభోగ్యములు గలవు,
ఎన్నియున్నను నింతుల కెందుకమ్మ?
ప్రాణనాథుండు తన్నెడఁబాయుచున్న! 872

సీ॥ నల్లనికస్తూరి నామంబుక్రిందను
దిలకంబు కొనగోర దిద్దినాఁడు
రంగైన పదివన్నె బంగారుతాయెతుల్
పట్టునన్నెల సిగం జుట్టినాఁడు
మెఱుఁగుదేరెడి నీలమేఘవర్ణపు మేన
మంచిగంద మలంకరించినాఁడు
ఘననవరత్న సంఘటితమై వెలిఁగెడు
కడియముల్ సందిటఁగట్టినాఁడు

గీ॥ తొడరి దంతపుఁబావలు తొడిగినాఁడు
వెలఁది చెంగల్వ పూదండ వేసినాఁడు
సుందరాంగుండు దేవకీనందనుండు
చెలఁగి మేనత్తతోఁ బొందుచేసినాఁడు. 873

# పరిశిష్టము

(ఈ కూర్పున జారిపోయిన పద్యాలివికొన్ని ఇక్కడ చేర్చినాము. ఇవికాక శ్రీప్రభాకరుల నోట్సులలో పరిశిష్టమున చేర్చదగిన పద్యములు పెక్కులున్నవి. పరిశోధకుల కిబ్బంది కలుగని విధమున, ఇట్లే తక్కినవాని నన్నిటిని చాటుపద్య మణిమంజరి సంపుటముల కూర్పుచివర చేర్చగలము. శ్రీశాస్త్రిగారే కూర్చి యుంచుకొన్న వానిని, వారి సూచనల మేరకు ప్రధాన గ్రంథమునను, తక్కిన వానిని, నోట్సులనుండి ఉద్ధరించిన వానిని, పరిశిష్ట గ్రంథమునను అధస్సూచిక లందును జేర్చు టుచితమని తలచితిమి – సం॥)



## నమశ్శివాయరగడ

శ్రీ మదాత్మనే గుణై కసింధవే నమశ్శివాయ
దామలేశదూత లోకబంధవే నమశ్శివాయ
నామశోషితాద్భు...వాంధవే నమశ్శివాయ
పామరేతర ప్రధానబంధవే నమశ్శివాయ 874

కాలభీత విప్రబాల పాల తే నమశ్శివాయ
శూలభిన్నదండదారపాల తే నమశ్శివాయ
పాలయాధునా దయాలవాల తే నమశ్శివాయ
మూల కారణాయ కాలకాల తే నమశ్శివాయ 875

యిష్ట వస్తుదాన ముఖ్యహేతవే నమశ్శివాయ
దుష్టదైత్య వంశధూమకేతవే నమశ్శివాయ
అష్టమూర్తయే వృషేంద్రకేతవే నమశ్శివాయ
సృష్టికారణాయ ధర్మ సేతవే నమశ్శివాయ 876

ఆపదద్రిభేదటంక హస్త తే నమశ్శివాయ
పాపహార దివ్యసింధుమ స్త తే నమశ్శివాయ
కోపహారిణే లసన్నమస్త తే నమశ్శివాయ
శాపదోష ఖండన ప్రశస్త తే నమశ్శివాయ 877

యక్షరాజబంధవే దయాళవే నమశ్శివాయ
దక్షపాణి శోభికాంచనాలవే నమశ్శివాయ
అక్షపాదవి....పూతతాలవే నమశ్శివాయ
పక్షిరాజవాహ హృత్కపాలవే నమశ్శివాయ 878

యక్షరాజ యాయినే సవేధసే నమశ్శివాయ
దక్ష హస్త నిష్ఠ జాతవేద సే నమశ్శివాయ

అక్షరాత్మనే సశుద్ధిబౌజసే నమశ్శివాయ
దీక్షిత ప్రకాశితాత్మ తేజసే నమశ్శివాయ 879

రాజమాననిత్య మందహాసినే నమశ్శివాయ
రాజతాచలేంద్ర సానువాసినే నమశ్శివాయ
రాజరాజ మిత్ర తా వికాసినే నమశ్శివాయ
రాజకోరకావతంసి భాసినే నమశ్శివాయ 880

దీనమానవాసి కామధేనవే నమశ్శివాయ
దానవాంధకార చండభానవే నమశ్శివాయ
సూన బాణ దాహదృ (?) ప్యేశానవే నమశ్శివాయ
సానురాగ భక్త రత్న సానవే నమశ్శివాయ 881

సర్వ మంగళాకుచాగ్రశాయినే నమశ్శివాయ
సర్వదేవతా గణార్తి శాయినే నమశ్శివాయ
సర్వదేహనాశసంవిధాయినే నమశ్శివాయ
సర్వవిన్మనోజభంగదాయినే నమశ్శివాయ 882

స్తోక భక్తిదాస తోషి పోషిణే నమశ్శివాయ
మాకరంద నారవర్షి భాషిణే నమశ్శివాయ
ఏకబిల్వదానతోషి పోషిణే నమశ్శివాయ
నైక జన్మ పాపజాల శోషిణే నమశ్శివాయ 883

సర్వ జీవరక్షణైకశాలినే నమశ్శివాయ
శర్వరీశధారిణే కపాలినే నమశ్శివాయ
దుర్విదగ్ధ దైత్య సైన్య దాహినే నమశ్శివాయ
పార్వతీ ప్రియాయ భక్తపాలినే నమశ్శివాయ 884



వ్యోమకేశ దివ్య భవ్యరూపతే నమశ్శివాయ
హేమ మేదినీధరేంద్రచాప తే నమశ్శివాయ
నామమాత్ర దగ్ధ సర్వపాప తే నమశ్శివాయ
కో.................... 885

## భీమనమీఁద నన్నయ్యభట్టుగారు చెప్పిన చాటుధార

చ॥ మతి భ్రమ నీగి పేర్మి సిరి మానిత బ్రెగ్గడభీమునిన్ బృహ
స్పతి రవిఁగర్ణు నర్జునుఁ గపర్ది సుయోధనుఁ బోల్పఁబూన వా
రుతగరు దుష్ట తీవ్ర...నట భిక్ష ఖలాత్ములంచు వా
క్పతిపు, శశిన్, శిబిన్, గొమరుసామిని మేరువు వజ్రిఁబోల్చెదన్. 886
(నోట్సు-24)

## భీ మ న

చ॥ మనసిజు మామమామ యభిమాన మడంచిన మేటిమామ నం
దనుని విరోధి నందనుని నందను సుందరి మేనమామ ద్రుం
చిన జెగజెట్టిపట్టి పొడిచేసిన శూరుని తండ్రి (మామ?) సూ
నుని నిజనాథుపొక్కిలి తనూభవు నాయువు మీకు నెయ్యెడున్. 887

## బడబానలభట్టు

బడబానలభట్టు ఏడవచోట దకారం బిడి త్రిపురాంతకము నుండి శ్రీశైలమునకుఁ బోయేతెరువునఁ దెలుంగు రాయఁడు కట్టించిన చెఱువు నీళ్లన్నియు నాలుగు గడియలకు నింకి పోవునటుల దిట్టిన చాటుధార

క॥ బడబానల భట్టారకు
కుడిచే యుంగరము రవికి గొబ్బున నర్ఘ్యం
బిడువేళ నూడినీలోఁ
బడియె తటాకంబ! నీటి బాయుము వేగన్. 888

సాళువ పెద తిమ్మ మహీ
పాలవరుఁడు వీఁడె వచ్చె బద్యము వ్రాయన్
గేలను లే దాకొకటియుఁ
దాళమ తుత్తునియలగుచు ధరపై బడుమీ. 889
( నోట్సు 26) (-మేధావి భట్టు)

## సోముఁడు

కII ఆపాదశిరోలంకా
రాపాదిత చారుతాభిరామాత్మీయ (త్మీయకా)
రూపాలోకనతుష్టా
కూపారకుమారికాముకురమణిరాజా! 890

కII కవితా కన్యకకెందును
గవి జనకుడు, బట్టు దాది, గణుతింపంగా
నవరస రసికుఁడె పెనిమిటి,
యవివేకియె తోడబుట్టు, వనవేమనృపా! 891

## శ్రీనాథుఁడు

బూడిద బ్రుంగివై యొడలుపోడిమిదక్కి మొగంబు వెల్ల నై
వాడలవాడలం దిరిగి వారును వీరును చొచ్చొచో యనన్
గోడల గొందులం దొదిగి కూయుచునుండెదు కొండవీటిలో
గాడిద నీవునుం గవివి కాదుగదా యనుమాన మయ్యెడిన్. 892
(నోట్సు-26)

## అభవా! మహాభవా!

చII కరులు, హరుల్ చమూవరులు గాటపు మేల్నగరుల్ కడానిబం
గరులు సరుల్ తలోదరులు గంధమిలన్మృగనాభిచందనా



గరులు విరుల్ జగాసిరలు గల్గి సుఖింత్రు త్వదీయులౌ నరుల్
చిరవిభవా! భవా! విజితచిత్తభవా! యభవా! మహాభవా! 893
(ధూర్జటిగారి శతకము)

## రుద్రకవి

కII ఆకుల మీఁదన యాకులు
..........రాజగుణము మానవపతికిన్
ఆకుల మీఁదన యాకులు
మాకా మారాకు లిడఁగ మల్కిభరామా! 894

చII కలిగిన సొమ్ములన్నియును గానుక లిచ్చిన నీవ యీవలెన్
వలచి సురేంద్రు బొంది మునివల్లభు శాపముచే నహల్య తా
శిలయయి దు:ఖమొందె మిముఁజేకొని కొల్చిరి గోపికల్ యశం
బలరఁగ అంకుపోయిన బలాఢ్యుని తోడనె పోవగావలెన్
బలవదరీ దరీ కుహర భాస్వదరీయ దరీ దరీ హరీ! 895

చII ధళధళదిక్ఛదచ్ఛదమదభ్రమదభ్ర వినిర్గళచ్ఛలా
ఘులఘుల ఘోషభీషణ నగచ్ఛదవిచ్ఛద వర్ష హర్ష ని
హ్వల హలహస్త ముఖ్య పృథుగాకుల గోకుల రక్షణజ్ఞయో
బలవదరీ దరీకుహర భాస్వ దరీయ దరీదరీ హరీ! 896
(నోట్సు-27)

## రామకృష్ణుని యితరచాటువులు

గీII అతివ కచ నాభి జఘన దేహాననము త
మీనదరసాలతారాజపానిరాక
రణ మనంత మనాది నేత్ర గళ భుజ న
ఖోష్ఠ కుచ వచో దండము లుభయగతుల. 897

గీ॥ అధరముఖవర్ణ శూన్యంబు లతివకుచము
లాన నాకార రహిత మబ్జాక్షిమేను
అజజఘనమండలము లంచయానకురులు
చరమబాధితకరములు చామతొడలు 898

గీ॥ ఆననాధరగళ మూర్తు లతివ కజుఁడు
చంద్రకురువిందశంఖచంచలలఁ జేసి
చెలఁగి తచ్చిహ్న కాఠిన్యసితచలతలు
సొరిదిఁగచ కుచ హాస దృష్టులుగఁ జేసె. 899

సీ॥ నడచెనా గంధగండక బంధధుర్యవే
దండతండము నటుండుండు మనును
పలికెనా వల్లకీకలకంఠకలరవ
మండితధ్వని నటుండుండు మనును
నవ్వెనా మల్లికానవహీరచంద్రికా
డిండీరముల నటుండుండు మనును
చూచెనా పుష్పనారాచజాతస్ఫుర
త్కాండద్యుతుల నటుండుండు మనును

గీ॥ ఏమి చెప్పుదు నా యింతి కెవ్వ రీడు?
అహహ! రతివలె నది నీకు నబ్బెఁగాక
పరమభాగ్యైకశాలి యో పాండురంగ
విట్ఠలేశ! యనంతరవిప్రకాశ!. 900

చ॥ అల ఘనచంద్రబింబసమమై తనరారెడు వక్త్ర మందులోఁ
గలిగిన నామభేదములకై వడి నొప్పెడిఁ గప్పుకొప్పు చె
క్కులు రదనాంశుకంబు లవి గుబ్బలకున్ సరిరాకపోయెఁ జే
తులు సరులయ్యె దానివలె నున్నది పొంకపుటారు బోటికిన్. 901



చ॥ ధర భుజగైణసింహములఁ దద్గతవేణ్యవలోకనద్వయో
దరముల కోడి వారిధిపదంబులఁ బుట్టలఁ బూరులన్ గుహాం
తరములఁ భూన నిక్కఁదిన డాఁగ స్రవింపఁగ నూర్పులూర్పు స
త్వరముగ నేఁగి నీడగని తత్తఱమందఁగ జేసి తౌ చెలీ! 902

మ॥ వరబింబాధరమున్ బయోధరములున్ వక్రాలకంబుల్ మనో
హరలోలాక్షులుఁ జూప కవ్వలిమొగం బై నంత నేమాయె నీ
గురుభాస్వజ్జఘనంబుఁ గ్రొమ్ముడియు మాకుం జాలవే? గంగ క
ద్దరి మే లిద్దరి కీడునుం గలవె యుద్యద్రాజబింబాననా!. 903

క॥ చిన్నన్న ద్విపద కెఱఁగు
పన్నుగఁబెద తిరుమలయ్య పదమున కొఱఁగున్
మిన్నంది మొరసె నరసిం
గన్న కవిత్వంబు పద్యగద్య శ్రేణిన్. (వ్రాతప్రతి) 904

కం॥ వానైన మంచు గురిసిన
భూనుత పదనైన యాకు పొసఁగకయున్నన్
దా నలసిన మతి చెదరిన
గానేరదు వ్రాత కసరు గంటంబైనన్. (నోట్సు 26) 905

చ ॥ నగతనయన్ ధరన్ సిరిని నాలుగు వర్ణములన్ లిఖించి పొం
దుగ నొక యక్షరంబు తుదఁ దూకొని నిల్పిన యంతలోననే
యగును గజాననుండు మతి యందొక యొక్కొక యక్షరంబు డిం
చగను జతుర్ముఖుండు శరజన్ముడు పంచశరుండు వహ్నియున్.
(నోట్సు-27) - (ఉమాకుమార). 906

సీ ॥ పదము కీర్తనలు జాపానముల్ మొదలైన
మేలుకొల్పులు మంగళాలు దరువు

హొరతుల్ నివ్వాళి యక్షగానము మంజ
రీ లాలి కురవంజి జోలి లాలి
సువ్వాల సంవాది సూళాది కట్నా? ది
గా గల్గు సంగీత కవనమునకు
పదపదాలును యతుల్ ప్రాసములే కాని
క్రమముగా గణ నియమములు లేవు

గీ॥ ఆది యక్షర మద్వితీయాక్షరంబు
ప్రాస మీ లక్షణంబులఁ బరగు చుండు
జానకీనాథ పదభక్త జనవిధేయ
భంజితాసుర సముదాయ ఆంజనేయ! 907

ఇప్పుడు దొరకని ప్రాచీన గ్రంథములలోని పద్యములు

క॥ దరవికచవకుళ కురవక
పరిమళ సంభారలోల బంభరమాలా
పరిషఙ్ఝంకారధ్వని
తెరువరులకు మన్మథప్రదీపము లొసగున్. 908

ముక్కుతిమ్మన గిరిజాకళ్యాణములోని పద్యము.

క॥ వాలికలై జలజంబుల
జాలికలై గండుమీల సంతతులకుఁదా
రేలికలై క్రొమ్మెఱుఁగుల
పోలికలై యొప్పునట్టె పుత్రిక కన్నుల్. 909

శివపురాణము.

క॥ మౌని హృదయాబ్జ భృంగా
మానిత గంగాతరంగమస్తకసంగా



వాణీశమదవిభంగా
భూనుత విమలాంగ శోణభూధరలింగా. 910

వామనపురాణము

క॥ వెడవెడ నడుకులు నడుకుచు
నెడనెడనడు గిడఁగ నదరి యిల దిగఁ బడఁగన్
బుడి బుడి నొడువులు నొడువుచు
చిడిముడి తడఁబడఁగ వటువు చేరెన్ రాజున్. 911

## (ఈ గ్రంథంలోని కొన్ని సంస్కృతశ్లోకాలకు తెలుగు వివరణ)

### ఆచార్య పుల్లెల శ్రీరామచంద్రుడు

పద్య సంఖ్య 159 (పుట–72)

